సింగరేణి సాహిత్యం - శ్రమశక్తుల జీవనం



డా॥ జె. కనకదుర్గ

Blank Page

సింగరేణి సాహిత్యం - శ్రమశక్తుల జీవనం

Dr. J. KANAKA DURGA
M.A., M.Phil., Ph.D.,
Principal (Retired)
Singereni Collieries Women's Degree College
Kothagudem-507 101 (Khammam Dt)
Res: H.No:5-35-18, 3/18 Brodipet,
GUNTUR-522002., A.P., India.
☎:0863-2279990, Cell:9491140290

డా॥ జె. కనకదుర్గ

ముద్రణ : 2005

ప్రతులు : 500

వెల : 50-00

రచయిత
డా॥ జె. కనకదుర్గ,
సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం

ప్రతులకు :

డా॥ జె. కనకదుర్గ,
యన్. బి. 273,
రైటర్స్ బస్తీ, కొత్తగూడెం.

ముద్రణ :

తాహెర్ గ్రాఫిక్స్, కొత్తగూడెం.

వందనాల చందనాలు

నిరాడంబరతా, నిండు కుండ వ్యక్తిత్వం
బండరాళ్ళలో చైతన్యం కలిగించే మూర్తిమత్వం
మానవ యంత్రాలు పలికే తారక మంత్ర దివ్యత్వం
కష్టపడే కర్మ జీవులు యిష్టపడే కర్మయోగత్వం

అగాధపు ఆర్థికమాంద్యంలో పడిన అప్పుల గనులకు
బంగారపు భవితవ్యపు రక్షణ కంకణసూత్రంగా
సంస్కరణలకు అంకురార్పణ చేసిన సంకల్పం
సింగరేణి సిరులకు విరుల బాట వేసిన ఆదర్శం

యాజమాన్యం కార్మికులనే విభేదాలను మరిపించి
సింగరేణి సిబ్బందికి నల్లబంగారపు కుదురొక్కటేనని
అవినీతికి భరతం పడుతూ అలసత్వాన్ని ఆవలకు నెడుతూ
పని సంస్కృతికి పట్టం కట్టిన పరంధాములు

కష్ట జీవుల ఘర్మజల ఫలాల విలువలకై
విఫణి వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాల పోటీనెదుర్కొని
రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలలో సహ భాగస్వాములై
వడ్డీల వడ్డింపును అడ్డుకొన్న చాణక్య చాకచక్యం

ఇంటింటా వెలుగులు పూయించే నల్లబంగారపు సంపదలకై
క్రమ శిక్షణ పెట్టుబడిగా కార్మిక రక్షణ ధ్యేయంగా
ఉత్పాదకతకు పెద్ద పీట వేస్తూ ఉత్పత్తి శక్తులకు అగ్రతాంబూలమిచ్చి
సన్మానించిన సహృదయం సజ్జనస్తవమానవీయం

అలుపెరుగని ఆలోచనలకు కార్యరూపం కల్పిస్తూ
యంత్రాలకు ఏడురోజులరోజుల పని మంత్రం ఉపదేశించి
వ్యయ క్రయాలకు అర్థం సమకూర్చిన సమర్థతతో
నష్టాల కష్టాలలో చిక్కుకొన్న సింగరేణి సంస్థని
లాభాల బాటలో నడిపించిన నరసింహం
అవని లోతులలో చితికే బతుకులకు భరతవాక్యం పలుకుతూ

గని ప్రమాదాల నివారణకై భూగర్భ రక్షణ సూత్రాల అమలుకై
శిక్షణతో కూడిన ప్రమను పెంచిన కార్మిక రక్షరేకు

సమ్మెల సమ్మెట పోటులకు చలింపక
ఎన్నికల్లో వన్నెనెక్కిన కార్మిక వీరులతో చర్చలు చేసి
ప్రభువుల సమక్షంలో పరిష్కార దిశగా
ప్రభుతను చెల్లించుకొన్న విక్రమార్కులు

శ్రమైక జీవన సౌందర్యానికి సంక్షేమమే సత్య రూపమని
విద్యా ఆరోగ్య ప్రమాణాల పెంపుదల శాశ్వత ఆదాయమని
ఇంటింటా కనుల గనులలో వెలుగులనందించే
సమాచార సంబంధాలను సమకూర్చి
మాతృభాషలో మనసులతో మాట్లాడుతూ
సేవలో తరించాలంటూ తరలిన రాకాసుధాకరులు
ఉత్పత్తి శక్తులను సృష్టించటంతోపాటు
సైరన్ మ్రోతకు ముందే నాస్తా పెట్టి అన్నం అమర్చి
సంపదల దృష్టిలో పరోక్ష భాగస్వాములైన
కార్మిక జీవిత భాగస్వాముల సంక్షేమమే
కార్మిక క్షేమమనీ అదే సంస్థ శ్రేయస్సనీ
సజావుగా సంక్షేమ పథకాల అమలుకై
నిరంతరం కాంక్షించిన సంక్షేమ నిధి

కార్మిక జీవనానికి మంచి సేవలనందించిన శర్మాజీ!
సింగరేణి గుండెలకు శక్తినిచ్చిన వర్మాజీ!
కార్మిక కుటుంబాలను రక్షించగలిగే కార్ముక హస్తాజీ!
సంస్థ ప్రగతిని కోరుకున్న విశ్వకర్మాజీ!

ఉనికికీ ఉత్పత్తికి ఉన్న సంబంధం
పండుగల సంబరాల పలకరింపుగా
సమాచార లేఖల రూపపు కార్మిక బంధువు
కాలుష్యపుబారి నుండి కార్మిక సంరక్షణ నారాయణులై
వాడవాడలా వన సంరక్షణకై వనరులనందించిన ఆర్తావని

ధ్యానమే జీవన జ్ఞానమని
శ్రమయే సింగరేణికి సమిధయని
పొదుపుయే కుటుంబానికి పెన్నిధియని
సంపదల మదుపే సంక్షేమానికి సన్నిధియని
నల్లబంగారానికి నిగనిగలద్దిన
నిగర్వి సింగరేణి నాయకుడు
శ్రీ ఎ.పి.వి.యన్. శర్మ గార్మ అధ్యక్ష పాలన
సింగరేణి చరిత్రలో స్వర్ణయుగం

మంచితనానికి మారు రూపంగా
సంస్థతో మీ సంబంధం
కార్మిక సంక్షేమ బంధమని
ఈ అనుబంధం శాశ్వతమని
అభినందనలతో అభివందనలతో

సింగరేణి బండరాళ్ళు కూడ ఎండలోకి వచ్చి
జీవన యాన మానవత్వాన్ని
ఎలుగెత్తి చాటుతూ నినదిస్తుంటే
సింగరేణి సిబ్బంది మానస్సాక్షిగా అందిస్తున్న
అక్షరాల చందన మాలను అందిస్తూ

సింగరేణి లాభాల బాటలో
సహభాగమైన మీకృషికి
సమర్పనంగా సమర్పిస్తే,
గ్రంథస్థ విషయానికి
విలువ కలుగుతుందనే
రచయిత భావనను
స్వీకరిస్తారని ఆశిస్తూ....

డా॥ జె. కనకదుర్గ

సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం

కర్పూర నీరాజనాలు

సింగరేణి కార్మికుడా నీకిదే సింహరాణి కరదీపిక
బొగ్గు పొరల చీకటి గుహలు
కార్మిక శక్తుల జీవన పుటలు
కాలగర్భాన పొరలుగా పొర్లాడుతున్న
భూగర్భపు బొగ్గును వెలుగులోకి తెచ్చి
వేన వేల వెలుగులకు మూల ఇంధనాన్ని కూర్చి
చిమ్మచీకట్లలో కొండంత వెలుగు నిచ్చేవాడా
మండుతున్న రైళ్ళలో మానవుల గమనానికి
మూల శక్తి నిధులను నింపే నీలి జాడల వృత్తివాడా
ఇంటింటా వెలుగుల ఇంధనానికై
కౌటంబిక బంధనాలను బలిపెట్టే సాహసికుడా
తట్టా చెమ్మాస్ సాక్షిగా
ప్రమాదాల అంచున పనిచేస్తూ
శక్తిని పణంగా పెట్టిన వ్యక్తిగా
బొగ్గు తీసిన యంత్రాన్ని తిప్పిన
భూగర్భపు కొవ్వత్తివై
భూచక్రానికి వెలుగునిచ్చే
సింగరేణి సూర్యుడువోయీ నీవు.
కర్మాగారాలలో ముడిసరుకుకు
మూలశక్తివి నీవు, కూపముక్తివి నీవు.
నీవు లేనిదే బొగ్గు రాశులు లేవు.
నీవు లేనిదే విఫణి వీధిలేదు.
నీవులేనిదే సింగరేణికి వాసిలేదు.
నీవులేనిదే నిశికి వెలుగులేదు.
ఆంధ్రదేశపు సిరుల కల్పతరువా
నీ జీవితానికి భద్రత కరువైనా
నీ జీవనానికి నూరేళ్ళాయుస్సు.

సింగరేణి కార్మికుడా! సిరుల సాధకుడా!
కరణమే వరణమని, కర్మమే ధర్మమనీ
ఘర్మమే చర్మవర్మమనీ శ్రమయే జీవన మర్మమనీ
సింగరేణి సిరులనిచ్చే మేటి కరముల వాడా
నిద్రలేమితో నైట్‌షిఫ్టు చేసి నల్లగా వచ్చే నిన్నుచూసి
చీకటి సిగ్గుపడి తెల్లబోయి పారిపోతుంది.
మొదటి బదిలీకి బయలుదేరిన నిన్నుచూసి
వెలుగుకు మూలవిరాట్టువు నీవేనంటూ
సప్తాశ్వ రథారూఢుడైన రవి నిన్ను స్వాగతిస్తాడు.
సాయంకాలపు షిఫ్టుకు వెడుతున్న నిన్నుచూసి వెలుగుపులుగు
రాత్రిపూట విద్యుద్దీపాల వెలుగును నేనివ్వనంటూ
వెలవెలపోయి సంధ్రాన ముఖాన్ని చాటేస్తాడు.
దినదినగండం నూరేళ్ళాయుస్సుగా
చీకటి గుహలలోని బండక్రింద బతుకులు నీవి.
గాలివెలుతురులేని చోట కళ్ళ వెలుగును వెదజల్లి
పళ్ళ కాంతులలో పట్టిపెట్టి నిట్టూర్పులనుపరుస్తూ
కాలికస్పృహ కల్గిన కవితా పత్రాన్ని చేపట్టి
చిరంజీవివై విల్లసిల్లే సింగరేణి కార్మికుడా
సింగరేణి కార్మికుడా ! శ్రమ శక్తుల సంపూర్ణుడా
చీకటి పాదలో వెలుగువాకిళ్ళకు వారధి వంటివాడా
నల్లబంగారపు నిగనిగలకు వన్నెచిన్నెలనిచ్చే కార్మికుడా
నీ చరితం ధన్యం, నీ జీవన గమ్యం గణనీయం.

జంకతా

(డా॥ జె. కనకదుర్గ)

ముందుగా....

సింగరేణి బొగ్గు గనుల సంస్థ నష్టాల పాలవడానికి కారణంగా, ఉత్పాదకతా సామర్థ్యాలపై ప్రభావం చూపించగల పారిశ్రామిక సత్సంబంధాలు క్షీణించటమేనని పత్రికాముఖమైన అభిప్రాయాలు వెల్లడి చేస్తున్నాయి. ఆంధ్రరాష్ట్ర ఆర్థిక వ్యవస్థకి ప్రధానమైన ఉత్పత్తి రంగంగా ఉన్న గని సిరుల పాదులు ఈ సింగరేణి బొగ్గు గనులు. బొగ్గు గనులలో ఉత్పత్తి శక్తులు కార్మికులు. గని కార్మికుల వృత్తిపరమైన జీవన సమస్యలకు, కౌటుంబిక సామాజిక సమస్యలకు దర్పణము వంటిది ఈ సింగరేణి సాహిత్యం. సింగరేణి బొగ్గు గనుల ప్రాంత వాసిగా నిరంతరం నిత్య సత్య పారిశ్రామిక విషయాల వివేచనయే వ్యక్తి గత అర్హతగా ఈ సాహిత్యాన్ని పరిశీలించడం జరిగింది. సామాన్యంగా సాహిత్యాన్ని ప్రాచీనమనీ, ఆధునికమని కాలిక స్పృహతో చెప్పుకోవడం జరుగుతుంది. అయితే ఇక్కడ కార్మిక స్పృహతో సింగరేణి సంస్థకు సంబంధించిన విషయాలను వ్యక్తం చేసినందుకు 'సింగరేణి' పదాన్ని విశేషణంగా చేసుకొని దీనికి "సింగరేణి సాహిత్యం" అని పేరును ఇవ్వడం జరిగింది.

పరిశోధన అనేది సాంఘీక, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణమైన విజ్ఞానాన్వేషణ లక్ష్యంగా ఉండాలనీ, పరిశ్రమలతో సంబంధం కలిగియున్న విద్యా విషయంగానూ, దేశానికుపయుక్తంగా ఉండాలనే యు.జి.సి ఆశయాలకనుగుణ సాధనాక్రమంలో భాగంగా ఈ పరిశోధన చేపట్టడం జరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయం ఫిబ్రవరి 1998లో నిర్వహించి తెలంగాణా సాహిత్య సదస్సులోనూ, మార్చి 1998లో పద్మావతి మహిళా యూనివర్సిటీ, తిరుపతిలో నిర్వహించిన ప్రాంతీయ సాహిత్య విభాగపు సదస్సులోనూ, సింగరేణి సాహిత్యంపై పత్ర సమర్పణ చేయడం జరిగింది. రాష్ట్ర దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడే ప్రత్యేక ప్రయోజనం కలిగిన ఈ సింగరేణి సాహిత్యం ఎంతో విలువైనదిగా భావించడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో గల కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి గనుల పరిసర ప్రాంత వాసిగా గత 25 ఏళ్ల నుండి బొగ్గుగనులలోని పారిశ్రామిక సంబంధాలను గురించిన అవగాహన – ఆలోచనలను అర్హతగా చేసుకొని సింగరేణి సాహిత్యాన్ని పరిశీలించడం జరిగింది. యు.జి.సి సూచలన

మేరకు పరిశ్రమలకు విద్యా సంస్థలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సింగరేణి పారిశ్రామిక సంబంధాల సమాలోచనం చేయడం జరిగింది. జీవన పోరాటంలో భాగంగా వృత్తిని చేపట్టి ఆటుపోట్లకు గురి అవుతూ అటుపారిశ్రామిక సంబంధాలలోనే కాక ఇటు కుటుంబ సంబంధాలలోను జీవనం సజావుగా సాగక సమస్యల నుండి పలాయనం చిత్తగించాలనుకుంటూ కొంతమంది కార్మికులు వ్యసనాల బారిన పడటానికి లోపభూయిష్టమైన సామాజిక మానవసంబంధాలు కారణంగా కనబడ్డాయి. అయితే ఆ సమస్యలన్నింటిని మనోవిజ్ఞానశాస్త్రాంశ కోణంలో నుండి చూస్తే పోరాటం కోసం జీవితం కాకుండా, జీవితం కోసం పోరాటం చేసే క్రమంలో కొన్ని సమస్యలు పరిష్కారం కాగలిగినవిగా అర్థం అవుతాయి. ముఖ్యంగా యాజమాన్యము - కార్మికుల మధ్య సదవగాహన పెరిగితే పారిశ్రామిక సత్సంబంధాలు ఏర్పడే ప్రధాన పరిష్కారంగా భావించవచ్చు. సింగరేణి సాహిత్యాన్ని విశ్లేషించి విమర్శకు పెట్టి సమస్యల పరిష్కారాల పట్ల నిర్మాణాత్మక దృష్టిని పెంపొందింప చేయవచ్చని భావిస్తూ, సింగరేణి సాహిత్యం-గని కార్మిక జీవన చిత్రణ-కార్మిక కుటుంబ స్త్రీల స్థితిగతులపై ప్రత్యేక అధ్యయనంగా ఈ ప్రాజెక్టుని 2002 లో పూర్తిచేసి ఇప్పుడు ఇలా గ్రంథంగా రూపొందింపచేసి "సింగరేణిలో సాహిత్యం - శ్రమ శక్తుల జీవనం" అనే పేరు పెట్టడం జరిగింది. సాహిత్యంలో ప్రతిఫలించిన కార్మికుల అసంతృప్తులను విశ్లేషించి విమర్శకు పెట్టిన ఈ సాహసప్రయత్నాన్ని సహృదయులు ఆమోదిస్తారని భావిస్తున్నాను. ఈసాహితి సృజనానంతరం సింగరేణిసంస్థలో పారిశ్రామిక సత్సంబంధాలు అభివృద్ధి చెందాయని చెప్పటానికి సంతోషిస్తున్నాను.

ఈ నా కృషికి అనుమతిని తగినంత అవకాశాన్ని ఇచ్చి మైనర్ రిసెర్చ్ ప్రాజెక్ట్ స్కీం క్రింద ఆర్థిక సహాయాన్ని అందించిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేసుకోవడం నా విధి. ఈ పరిశోధనను అచ్చులోకి తేవటానికి అక్షరాల ఆర్థిక సహాయాన్ని అందించటానికి ముందుకు వచ్చిన శ్రీ పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం వారికి నా హార్థిక కృతజ్ఞతలు. ఈ పరిశోధన చేయడానికి మార్గం సుగమం చేసిన కాకతీయ యూనివర్సిటీ అధికార్లకు, సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల యాజమాన్యానికిని పరిశోధనలో భాగంగా మహానది కోల్‌ఫీల్డ్స్ వెల్లడానికి తగిన పరిచయవాఖ్యలు వ్రాసి ఇచ్చిన శ్రీ ఎమ్. గంగిరెడ్డి, జనరల్ మేనేజర్ పర్సనల్ గారికి తోటి అధ్యాపక వర్గానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. సింగరేణి సాహిత్యంలో అటు కార్మికులు వ్రాసిన

సాహిత్యంతో పాటు గనుల చుట్టప్రక్కల ఉన్న రచయితలు కార్మికుల అనుభవాలను తమ అనుభవం లోనికి తెచ్చుకొని వ్రాసిన సాహిత్యాన్ని ఇటు యాజమాన్యం తరపున విడుదలయిన లేఖలను పరిశీలించటం జరిగింది కొన్నిచోట్ల వారి అభిప్రాయాలను యథాతథంగా తీసుకోవటం జరిగింది. తమ అమూల్యాభి ప్రాయాలను వెల్లడించిన శ్రీ ఎ.పి.వి.ఎన్ శర్మ గారికి, శ్రీ నాగేశ్వరరావు గారికి, ఆచార్య చేకూరి రామారావు గారికి శ్రీ తుమ్మేటి రఘోత్తమరెడ్డి గారికి హృదయపూర్వక అభివందనాలు తెలుపుకుంటున్నాను. పరిశోధనా రంగంలో ముందుకెళ్ళటానికి నిరంతర ప్రోత్సాహాన్ని అందించే ప్రొఫెసర్ కె. కాత్యాయనీ విద్మహే గారికి గౌరవ వందనాలను తెలుపుకోకుండా ఉండలేను.

అందుబాటులో ఉండి లభించిన సింగరేణి సాహిత్యాన్ని పరిశీలించటం జరిగింది అలభ్యమైన మిగిలిన సాహిత్యం కూడ ఇందులోకి చేరగలిగితేనే దీనికి సంపూర్ణత్వం కలుగుతుంది. రచయితలందరు ఈ విషయాన్ని అర్ధంచేసుకోగలరని భావిస్తున్నాను.పవన్ కుమార్, బండి శేరాలు, కార్మిక అనే కలం పేర్లతో రచన చేసిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి గారిని త్రిమూర్తిమత్వం కలిగిన స్రష్టగా పేర్కొన తప్పదు.అల్లం రాజయ్యగారు తుమ్మేటి రఘోత్తమరెడ్డి కలిసి పెట్టుకున్న కలం పేరు కైతికాల పోసెట్టి. అజ్ఞాతరచయితలు కొంతమంది "కార్మిక" అనేపేరుతో కూడ రచనలు చేసినట్లు తుమ్మేటి రఘోత్తమరెడ్డిగారు చెప్పగా తెలిసింది. మిగిలిన రచయతలపేర్లు కథలను పరిచయం చేస్తున్న సందర్భంలో కథలపేర్ల ప్రక్కన పేర్కొనటం జరిగింది. ఈ రచయతలందరు లేకపోతే సింగరేణి సాహిత్యం వుండేది కాదు ఈ పుస్తకం ఇలావచ్చేదికాదు. నాఈ పుస్తకానికి మూలవిరాట్టులయిన రచయతలందరికి జేజేలతో కూడిన నమస్సులు.

"సింగరేణి సాహిత్యం - గనికార్మిక జీవనచిత్రణ - కార్మికుటుంబస్త్రీలపై ప్రత్యేక అధ్యయనంగా" కొనసాగిన యు.జి.సి. ప్రాజెక్టును పూర్తి చేసిన తర్వాత చదివి బాగుందని ప్రోత్సహించిన జీవన సహచరలు శ్రీ ఎమ్.వి.శాస్త్రికి ఎప్పుడూ అండగా నిలబడ్డ అమ్మకు, నాన్నకు, సోదరులకు ఆత్మిక అనుబంధపు కృతజ్ఞతలు.

ఈ యు.జి.సి. ప్రాజెక్టును పుస్తకరూపంలోకి ముద్రించి పాఠకుల ముందుకు తీసుకొనివచ్చిన తాహెర్ గ్రాఫిక్స్ వారికి నా ప్రతేక కృతజ్ఞతలు.

డా॥ జె. కనకదుర్గ

అవగాహన

సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలైన డా॥ కనకదుర్గ, సింగరేణి సంస్థలోని కార్మికులు వ్రాసిన సాహిత్యాన్ని పరిశీలించి చేసిన పరిశోధన ఇలా పుస్తక రూపాన్ని సంతరించుకోవడం పారిశ్రామిక సంబంధాల పటిష్టతకు ఉపయోగకరమైన విషయంగా అభినందించతగినది. గని కార్మికుని జీవన విధానాన్ని అవగాహన చేసుకోవాలనుకోవడంతోపాటు కార్మిక కుటుంబ స్త్రీల పై ప్రత్యేకాధ్యయనం చేయాలనుకునే భావనతో ఆమె పరిశోధనావిశ్లేషణను నా ముందు పెట్టినప్పుడు దానినొక ప్రామాణిక విషయంగా భావించడం జరిగినది. సంస్థ యొక్క ఉత్పత్తి, ఉత్పాదకత అభివృద్ధి చెందాలంటే పారిశ్రామిక సంబంధాల సంక్లిష్టతలను అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. సంప్రదింపులు, చర్చల సందర్భాలలో యూనియన్ నాయకుల అభిప్రాయాలు మాత్రమే ప్రముఖంగా వుంటాయి. కార్మికుల వ్యక్తిగత అభిప్రాయాలైన అంతర్మధనాలకు, అంతరంగాల ఆవిష్కరణకు ఈ సింగరేణి సాహిత్యం వేదిక కాగలిగింది. సాహిత్యంలో ప్రతిఫలించిన సింగరేణి కార్మిక కుటుంబ స్త్రీల చైతన్యం పారిశ్రామిక సంబంధాలలోని కార్మిక కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలుకు కరదీపిక కాగలుగుతుంది. రచయిత కార్మిక స్పృహతో ఈ సాహిత్యానికి 'సింగరేణి సాహిత్యం' అని పేరు పెట్టి తెలుగు సాహిత్య పరిశోధనా చరిత్రలో 'నూతన స్థానాన్ని ఇవ్వడం జరిగింది. 1998లో నేను సింగరేణి సంస్థ అధ్యక్షులుగా ఉన్నప్పుడు గణాంక వివరాల సేకరణకు అనుమతి కోరడానికై వచ్చి పారిశ్రామిక సంబంధాలలో భాగంగా కార్మిక కుటుంబ స్త్రీలతో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయగలిగితే అవి ఉత్పత్తి, ఉత్పాదకతపై పరోక్ష ప్రభావాన్ని చూపించగలుగుతాయని ఆమె వ్యక్తం చేసిన భావనను అభినందించడం జరిగింది. కార్మిక కుటుంబ స్త్రీల ప్రగతికై అక్షరాస్యత, ఆరోగ్యం, ప్రకృతి వనరులను వుపయోగించుకునే విషయాలలో కార్మిక కుటుంబ స్త్రీలకు యిప్పించాల్సిన శిక్షణా కార్యక్రమాలను సూచిస్తూ కార్మిక సంక్షేమానికి అవి బాసట కాగలదనే ఉద్దేశ్యాన్ని తెలియజేస్తూ ఈ రచయితయే వ్రాసి కళాశాల ఆడిటోరియంలో 1999లో ప్రదర్శింపచేసిన “చీకటి కడుపున కాంతి” అనే నాటకము 2000లో 'సేవా' (సింగరేణి ఎంప్లాయిస్ వైవ్స్ అసోషియేషన్) అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుకు మూల కారణమయింది. 'సేవా' అనే పేరుతో ఉన్న ఈ సంస్థ సింగరేణి సంస్థ

యొక్క పారిశ్రామిక సంబంధాలలో ప్రముఖ పాత్ర వహిస్తోందనే విషయం పత్రికాముఖంగా తెలుస్తోంది. ఈ పుస్తక రచయిత సింగరేణి సాహిత్యాన్ని పారిశ్రామిక సంబంధాల దృక్కోణం నుండి పరిశీలించిన విధానాన్ని గమనిస్తే కళాశాలలోని పరిశోధనలు పరిశ్రమలకు అనుబంధంగా చేయగలగితేనే సత్ఫలితాల నివ్వగలుగుతాయని పరిశోధనా లక్ష్యాలు నెరవేరుతాయని అర్థమవుతుంది.

ఇటువంటి పరిశోధనలు పారిశ్రామిక సంబంధాలలోని అధికారులు - కార్మికుల మధ్య అవగాహనను మరింత పెంచగలిగే విధంగావుండి పారిశ్రామిక సత్సంబంధాలకు ప్రోత్సాహకరంగా ఉంటాయని భావిస్తూ "సింగరేణి సాహిత్యం శ్రమశక్తుల జీవనం" అనేపేరుతో పుస్తకాన్ని అందించిన రచయితకు అభినందలు తెలియజేస్తున్నాను.

ఇట్లు

(శ్రీ ఎ.పి.వి.యన్. శర్మ)

ప్రిన్సిపల్ సెక్రటరి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

భూమికగా ....

డా॥ జంధ్యాల కనకదుర్గ గారి పరిశోధనా గ్రంథం సింగరేణి సాహిత్యం-గని కార్మిక జీవిత చిత్రణ - కార్మిక స్త్రీల ప్రత్యేకాధ్యయం రచయిత్రి ఆశించిన పరిశోధనా ప్రయోజనంగా చెప్పిన సింగరేణి కార్మికుని జీవితం పట్ల అవగాహన పెంపొదించు కోవటానికి దోహదం చేసేటట్లు ఉంది. పెంపొందిన ఈ అవగాహన మంచి పారిశ్రామిక సంబంధాలకు భూమిక అవుతుంది.

సింగరేణి సాహిత్యం యిప్పటి వరకూ ముఖ్యంగా కార్మికుని దృక్కోణం నుంచే వచ్చింది. పనిలోనూ, సమాజంలోనూ, అధికారులతో, కుటుంబ సభ్యులతో, యూనియన్లతో కూడిన అనేక పార్శ్వాల కార్మిక జీవన చిత్రణలో కార్మికుడు ప్రోటగోనిష్టుగా కనపడతాడు. అధిక భాగం సింగరేణి సాహిత్యం రచయితల సొంత అనుభవాలతో రాయబడటం వల్ల నిజాయితీతో కూడిన సాధికారిత కనిపిస్తుంది.

యాజమాన్య కార్మిక సంబంధాల పరిశీలన కోసం, యాజమాన్యం వైపునుండి సాహిత్యరీత్యా చూసినట్లయితే అందుబాటులోనున్నవి సమాచార లేఖలు, టి.వి. కార్యక్రమాలు, సింగరేణి వార్తలు (సింగరేణీయులు సమాచారం) వంటివి మాత్రమే. జీవితావిష్కరణతో నిండి కార్మికుల ముఖతా చెప్పబడ్డ సాహిత్యంతో పోలిస్తే ఇవి చాలా యాంత్రికంగా కనపడతాయి.

సింగరేణి సాహిత్యంలో ప్రస్తావించబడ్డ అనేక సమస్యలు పని పరిస్థితులు, జీతభత్యాలు, భద్రత, యూనియన్ సంబంధాలు, కుటుంబిక సమస్యలు అన్నీ ఏదో విధంగా యాజమాన్య స్థాయిలో ప్రముఖంగా చర్చింపబడి, సమస్యా పరిష్కార దిశలో చర్యలు చేపట్టబడడం, అదీ సాహిత్యంలో అవిష్కృతమైనట్లు జరగటం, సాహిత్యం యొక్క ప్రధాన లక్ష్యం (సమాజ హితవు కోరటం) నెరవేరటంగా కనబడుతుంది.

అనేక వ్యయ ప్రయాసలకోర్చి చేసిన ఈ పరిశోధన, సింగరేణి యాజమాన్యానికి, సింగరేణిని అధ్యయనం చేసే వారికి, సాహితి అభిరుచి వున్నవారికి చాలా ఉపయుక్తంగా ఉంటుంది. సింగరేణి కుటుంబ సభ్యురాలిగా, అధ్యాపకురాలిగా ఈ పారిశ్రామిక ప్రాంతంలో ప్రత్యక్ష పరిచయం ఉండి గ్రంథ కర్త చేపట్టిన ఈ పరిశోధన ఒక అకడమిక్ సర్టిఫికేషన్ కోసం కాకుండా, ఒక తపనతో, ఆర్ద్రతతో చేసిన ప్రయత్నంగా కనిపిస్తుంది.

గు. నాగేశ్వరశర్మ

(గుడి నాగేశ్వరశర్మ)

రిటైర్డ్ డైరక్టర్ ప్లానింగ్ - సింగరేణి కాలరీస్ సంస్థ

సీనియర్ పరిశోధకుడి ఆహ్వానం

తెలుగులో స్త్రీవాద సాహిత్య విమర్శ గణనీయంగా చేసిన డా॥ జంధ్యాల కనకదుర్గ తెలుగు సాహిత్య లోకానికి చిరపరిచితురాలే! కొరవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశికను కథా కావ్యాలలో మేటిగా మనందరం చదువుకొని ఆనందించాం. కాని అందుల్లో అప్పటి సమాజ స్వభావానికి లోబడి అయినా సరే స్త్రీ చైతన్య ధోరణి ఎట్లా తొంగిచూస్తున్నదో కనిపెట్టటం కనకదుర్గకే చెల్లు. అయితే కనకదుర్గకు పేరు తెచ్చింది స్త్రీవాద సాహిత్య విమర్శే అయినా ఆమె దానికి మాత్రమే పరిమితం కాలేదు. సాహిత్యాన్ని అనేక సామాజిక దృక్కోణాల నుంచి పరిశీలించడం ఈమె విమర్శకు ప్రాణభూతమైన అంశం. అంత మాత్రమే అయితే అంత చెప్పుకోఅక్కర్లేదు. సమగ్రత ఈమె విమర్శకు సార్వత్రిక లక్షణం. ఈమె ఈపాటికే డజను పైగా విమర్శ వ్యాసాలు అరడజను పుస్తకాలు అచ్చువేసింది. ఇప్పుడు "సింగరేణి సాహిత్యం శ్రమశక్తుల జీవనం" అనే పుస్తకంతో బయటకి వస్తున్నది.

ఈ పుస్తకం మనకు అంతగా పరిచయం లేని మరో ప్రపంచపు ద్వారాలు తెరిచింది. ఈ పుస్తకం విషయ సూచిక చూస్తూనే తెలుస్తుంది. ఈమె విమర్శ ప్రత్యేకత. ఇంగ్లీషులో 'థరోనెస్' (Thoroughness) అనే పదానికి తగిన ఉదాహరణ. ఈమె సింగరేణి సాహిత్యం పై చేసిన పరిశోధన ఈ సాహిత్యాన్ని పరిశీలించడంతో పాటు, బొగ్గుగనులను, వాటి పరిసరాలను కూడా దర్శించింది. అంతేకాదు కార్మికుల క్షేమానికి సంబంధించిన చట్టాలను కూడా పరిశీలించింది.

ఈ సాహిత్యం పలు ప్రక్రియల్లో ఉంది. కవిత్వం, స్వగతాలు, కథలు, నవలలు వీటిలో ముఖ్యమైనవి. వచన ప్రక్రియలను సుష్ఠుగా అనేకాంశాలుగా విభజించి పరిశీలించింది. ఈ రచనల్లో కార్మికులే స్వయంగా రచించినవి కొన్ని అయితే ఇతరులు రచించినవి కొన్ని. ఇవి వేరువేరుగా పరిశీలిస్తే బాగుండేది. ఇప్పటికీ మించిపోయింది లేదు. ఇప్పుడు కూడా ఆ పని చేయ్యవచ్చు. కవిత్వం స్వగతాలలో చాలా భాగం కార్మికుల రచనలే అయి వుంటాయి. వేరుగా పరిశీలిస్తే వాటిలో నిజాయితీ, ఆర్తి ఎక్కువ మోతాదులో కనిపిస్తాయి.

ఈ పరిశీలనలో ఫ్యూడల్ నుంచి బూర్జువా వ్యవస్థకు సమాజం మారే క్రమం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. "పల్లెటూళ్లలో భూ సంబంధాలలో దోపిడికి

గురి అయిన వారు, పంటలు పండక బతుకీడ్చలేనివారు, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోరుకున్నవారు, యాంత్రీకరణలో ఖాయిలాపడ్డ చేనేతవారు....." సింగరేణి కార్మికులుగా వచ్చారు. నగరీకరణ సాధారణంగా జరిగే తీరులోనే ఇక్కడా జరిగింది.

ఈ రిపోర్టంతా ఒక సాహితీవేత్తకన్నా ఒక సాంఘిక శాస్త్రవేత్త రాసినట్లు వుంది. మరీ ముఖ్యంగా "పని పరిస్థితులు, వృత్తి రక్షణ, జీవన భద్రత" అనే అధ్యాయాల్లో ఈ నైశిత్యం కనిపిస్తుంది. "సాహిత్యాంశములు" అనే శీర్షిక కింద చర్చించిన వాటిలో శాంతరస చర్చలో కొంత కొత్తదనం ఉన్నా ఈ అధ్యాయమే కొంత అసంతృప్తికరంగా ఉంది. అయితే ఈమె పరిశోధనకు ఇది భరత వాక్యం కాదు గదా!

ఈమె పరిశోధన గురువు కాత్యాయనీ విద్మహే. ఆమె నుంచి నేర్చుకోవలసిందంతా కనకదుర్గ నేర్చుకున్నది. అక్కరలేని వాటిని కూడా నేర్చుకున్నదా అని నాకు కించిత్సంశయం. ఎందుకంటే ఈమె భాషలో కూడా పరిశోధన భాష కన్నా పత్రికా భాషా స్వభావం ఎక్కువగా కనిపిస్తున్నది.

అద్దం పట్టటం, చోటుచేసుకోవడం వంటి క్రియలను పత్రికలే అలవాటు చేశాయి. ఈమె కొంత ముందుకు పోయి విశ్లేషణకు పెట్టటం, విమర్శకు పెట్టటం వంటి కొత్త క్రియా ప్రయోగాలు చేసింది. జరుగుడు వాక్యాల ప్రయోగం చాలా అధికమైంది. కావటానికి అంతా "వ్యావహారిక భాషే" అయినా అవసరాన్ని బట్టి అందులో స్థాయీ భేదాలుంటాయని గుర్తించాలి. ఇది ఒక్క కనకదుర్గ రచనలోనే కాదు, తెలుగు వచనమంతా ఈ ప్రభావంలో పడుతున్నదని నాభయం! దీనికి అడ్డుకట్ట వేయడం సాధ్యమా అని సంశయం.

ఈ సంశయాలకేంగాని, కనకదుర్గ చేసిన ఈ సింగరేణి సాహిత్యాధ్యయనం నేటి పరిశోధకులకు పరమ ప్రామాణికమైనది. భావి పరిశోధకులకు ఒజ్జబంతి కూడా సీనియర్ పరిశోధకుడిగా ఈ సింగరేణి సాహిత్యాధ్యయనాన్ని మనసారా ఆహ్వానిస్తున్నాను.

చేకూరి రామారావు
M.A., Tel Andhra, M.A. Ph.d. Cornell
Retd. Professor of Linguistics Road No : 7,
Habsigguda, HYDERABAD - 500 007.

తారణ దీపావళి
2004 నవంబరు 12

నిజాయితీగా....

తెలంగాణా నేలపై బొగ్గుగనులు ప్రారంభమైన నూరేండ్ల తరువాత కాని తెలుగులో బొగ్గు గని కార్మికుల సాహిత్యం రావడం ఆరంభం కాలేదు. కారణం! కార్మికులంతా దాదాపు గ్రామీణ ప్రాంతాల నుండి భూస్వామ్యపు చెరల్లోంచి వచ్చి చేరినవారే కావడం-వారంతా నిరక్షరాస్యులు. చదువుకున్నవారు క్లర్కులుగా – కింది నుంచి పైదాకా నానావిధ అధికారులుగా వేలసంఖ్యలోనే వున్నా, వారిలో అత్యధికులు కార్మికుల జీవితాలతో మమేకత్వం చెందలేకపోయారు. గ్రామీణ భూస్వామ్య మనస్తత్వంతోనే వుండిపోయారు. వాళ్లకు మానవీయ దృక్పథం లేదు.

అట్లా శతాబ్దికి పైగా చరిత్రవుండీ – లక్షల-కోట్లటన్నుల బొగ్గును వెలికితీస్తూ బొగ్గు పొరల్లో వందల వేల మంది సజీవ సమాధి అవుతూ-యావత్తు దక్షిణ భారత దేశాన్ని నిరంతరం వెలుగులో ముంచెతుతూవున్నా కూడా వాళ్ల జీవితాల్లోని చీకట్ల గురించి, రవ్వంత వెలుతురు కోసం వాళ్లు చేసే జీవన్మరణ పెనుగులాటలనుకాని ఎవరూ అక్షరబద్ధం చేయలేదు. అపారమైన బొగ్గు వుత్పత్తి జరిగింది కాని సాహిత్యోత్పత్తి జరుగ లేకపోయింది.

1970 ల తర్వాత తెలంగాణా జీవితంలో మరో కదలిక ఆరంభమైంది. నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధి విధించిన ఎమర్జెన్సీ ఎత్తివేత దరిమిలా ఆకదలిక జోరందుకుంది. దాదాపు ఉత్తర తెలంగాణా జిల్లాలన్నిటా నక్సలైట్ ఉద్యమం చొచ్చుకపోయింది. అట్టడుగు గ్రామీణులలో చైతన్యం కలుగసాగింది. సింగరేణి బొగ్గుగని కార్మికులకు, గ్రామాలతో సంబంధాలు వున్నాయి. కనుకా ఆ గ్రామీణ రైతు కూలీల సంఘటిత చైతన్యం గని కార్మికులపై పడసాగింది.

అప్పటికే బొగ్గుగనుల ప్రాంతాల్లో ఎక్కువ మంది ఆదరణ కోల్పోయిన జాతీయ కార్మిక సంఘాలను కాదని సరికొత్త సంఘాలతో సంఘటితం కావడం ఆరంభమైంది. ఆ సరికే గ్రామీణ ప్రాంతాలలో పెరిగిన ప్రభుత్వనిర్బంధం వల్ల కొందరు – చదువుకున్న రైతాంగ సెక్షన్ యువకులు కొందరు గని కార్మికులుగా వచ్చి చేరారు. అట్లా ఆ కాలపు అవసరాల కోసం చేసిన అనేక ఆలోచనల్లోంచి సాహిత్యసృష్టి కూడా ఆరంభమైంది. మొదట 'పాట'గా – పిదప కథగా- అటుపిమ్మట నవలగా అదొక పాయగా ప్రవాహం మొదలై ఆధునిక తెలుగు సాహిత్యంలోకి – నూరేండ్లు ఆలస్యంగా బొగ్గు గని కార్మికుడు ప్రవేశించాడు.

అట్లా ప్రారంభమైన సాహిత్యాన్ని అక్కడి రచయితలే ప్రచురించుకున్నారు. పంచుకున్నారు. భాష బాగలేదని, నక్సలైట్ల సాహిత్యమని 'శిష్ట' సాహిత్య

ప్రపంచంలోని కొందరు పెద్దలు, పత్రికా సంపాదకులు ఈ బొగ్గుగని కార్మికుల సాహిత్యాన్ని చూడ నిరాకరించాడు. తర్వాత కాలంలో అప్పటి ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకులు పురాణం సుబ్రామ్మణ్యశర్మ గారు-ప్రముఖ కథా రచయిత మధురాంతకం రాజారాం గారు-ప్రసిద్ధ తెలంగాణా సంస్కృతీ పరిశోధకులు జయధీర్ తిర్మల్ రావు వంటివారు సానుకూల ధృక్పదంతో ఈ బొగ్గు గని కార్మికుల సాహిత్యాన్ని పత్రికల్లో సమీక్షించారు. అంతకు మించితె ఇప్పటికీ బొగ్గు గని కార్మికుల సాహిత్యం దాదాపు అప్రకటిత నిషేద సాహిత్యం కిందే లెక్క!

బొగ్గు గని కార్మికుల సాహిత్యాన్ని పరిశీలించడమంటే మహాకీకారణ్యంలోకి ప్రవేశించడం లాంటిదే. గనుల్లోకి దిగి ఎక్కడమేకాదు. శతాబ్దికి పైచిలుకు చరిత్రను సేకరించాలి. చట్టుబండలైన చట్టాలను తిరగేయాలి. చనిపోయిన వారి లెక్కలు-సాధించిన ఉత్పత్తి-జరిగిన సమ్మెలు-చంపుకున్న ఉభయ వర్గాల లెక్కలు అనేక నివేదికలు ఇట్లా ఎన్నో బయటకు తీయాలి. అదీ ఇదివరకు ఎవరూ చేయని పని. అటువంటి పనికి కనకదుర్గగారు పూనుకోవడం నిజంగా సాహసోపేతమైనదే ఈ 'సింగరేణి సాహిత్యం-శ్రమ శక్తుల జీవనం'.

సాహిత్య పరిశోధనా రంగంలో నిష్ణాతులైన వారు దీని తీరుతెన్నుల గురించి ఎలాగూ రాస్తారు. నామట్టుకు ఈ పరిశీలన బాగా జరిగిందని అనిపిస్తోంది. నిజాయితీగా విస్పక్షపాతంగా నిర్వహించారు. అన్నింటికీ మించి కార్మికుల పట్ల మానవీయ దృక్పధంతో రచించారు. అందుకు వారికి అభినందనాలు తెలియచేయకుండా వుండలేకపోతున్నాను ఈ గ్రంథాన్ని సింగరేణిలోని కింద నుంచి పైదాకా వున్న అధికార వర్గం చేత బలవంతంగానైనా సరే చదివించి తీరవలసినదని నాకు అనిపిస్తోంది. అందుకు తప్పు నాది కాదని మనవి!

ఎవ్వరూ చేయ సాహసించని-అసలు చూడని ఇచ్చగించని 'అధోఃజగత్' సహోదరుల సాహిత్యంలోనికి దిగి పరిశోధన పూర్తి చేసి బయటి ప్రపంచానికి మొదటిసారిగా ఇది సింగరేణి బొగ్గు గని కార్యికుల సాహిత్యమని అందిస్తున్నందుకు కనకదుర్గ గారిని నిజంగానే మనసారా అభినందిస్తున్నాను. దీన్ని స్పూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మరింతమంది-మరిన్ని మంచి పరిశోధనలు సాగిస్తారని ఆశిస్తున్నాను.

(తుమ్మేటి రఘోత్తమ రెడ్డి)

Blank Page

విషయసూచిక

1.	సింగరేణి-శ్రమశక్తులు.	1
2.	సింగరేణి సాహిత్యం - పరిచయం.	10
3.	సింగరేణి సాహిత్యం - గని కార్మిక జీవనం.	43
4.	పారిశ్రామిక సంబంధాలు - కార్మికుల సమస్యలు.	48
4.1.	గని కార్మికుడు చారిత్రక నేపథ్యం.	52
4.2.	పని స్వభావం.	54
4.3.	పని యందు అభిరుచి	60
4.4.	పని పరిస్థితులు.	63
4.5.	జీత-భత్యాలు.	75
4.6.	వృత్తి రక్షణ-జీవిత భద్రత.	89
4.7.	యూనియన్లు - కార్మికుల సంబంధాలు.	98
4.8.	అధికారుల ప్రవర్తన.	107
4.9.	కౌటుంబిక-సామాజిక సమస్యలు.	115
5.	యాజమాన్యం-సమస్యలు.	129
5.1.	ప్రభుత్వ విధానం.	131
5.2.	వాణిజ్య విధానము.	139
5.3.	లైసెన్సుల జాప్యం.	140
5.4.	యాజమాన్యం-కార్మికులు.	141
5.5.	సంస్థ ఆర్థిక స్థితి-సాంకేతికత.	142
6.	పరోక్ష పారిశ్రామిక సంబంధాలలో కార్మిక కుటుంబ స్త్రీలు.	148
7.	సాహిత్యాంశాలు.	167
8.	పారిశ్రామిక పరోక్ష ప్రభావం.	170
9.	సింగరేణిసంస్థ - ఉద్యోగినులు.	172

పరిశోధన పద్ధతి - విశ్లేషణాత్మక చిత్రణ

ఉష్ణ, దేశ ఆర్థికాభివృద్ధి ← ఉత్పత్తి, ఉత్పాదకతల సామర్థ్యం ← పారిశ్రామిక సంబంధాల పునరుద్ధరణ ← సంఘర్షణల వివరణలు ← సంఘర్షణ కారణాలు ←

సాహిత్యం — కవిత్వం - గాయి వెంకటయ్య, పాటలు

కథలు - (1) పల్లెతల్లులు కథా సంపుటి

(2) బొందలగడ్డ బతుకులు

(3) బొగ్గు పొరలో

వ్యాసాలు (4) సింగరేణి బతుకులు

నవల — వల్లవత్రం, సింగరేణి మండుకొండ

:

రచయితలు: అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, పవన్‌కుమార్, పి. చంద్, బాసిని శంకర్

వ్యక్తి పారిశ్రామిక సంబంధాలలో గని కార్మికుడిగా చేరడానికి ముందున్న ఆతని చారిత్రక నేపథ్యం, ఆతని ఆశలు, ఆశయాలు

సాహిత్యం - కథలు ↓

సంఘర్షణల పట్ల మనోభావాల విశ్లేషణ

విశ్లేషణ దృక్కోణాలు → (1) మనోవిజ్ఞానశాస్త్ర దృక్కోణం

2) సామాజిక సంబంధాల దృక్కోణం

3) మానవ సంబంధాల దృక్కోణం

4) రాజకీయ ఆర్థికశాస్త్ర దృక్కోణం

5) న్యాయశాస్త్ర దృక్కోణం

6) సంస్థాగత కార్యకలాపాల విశ్లేషణ దృక్కోణం

భూదేవి, అంటర్రా, జీవితం, ప్రస్థానం, ప్రమాదం, నిర్ణయం, అంగివంటి కథలు, పురుడు ↓

ఉత్పత్తి తగ్గిన కార్మికుల సమస్యల కారణాంశాలు (యాజమాన్యమే పరిష్కరించగల[illegible]వి)+ ముఖ్యముగా గొప్ప అభిప్రాయ సేకరణ ↓

పని స్వభావం	పనియందు ఆభిరుచి	పని పరిస్థితులు	జీతభత్యాలు	వృత్తిరక్షణ జీవిత రక్షణ	యాజమాన్యం తోటి ఉద్యోగులతో గల సంబంధాలు	ఆధికార ప్రవర్తన విధానం	కొలువులోని సామాజిక సమస్యలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)
సాహిత్యం	సాహిత్యం	సాహిత్యం	సాహిత్యం	సాహిత్యం	సాహిత్యం	సాహిత్యం	సాహిత్యం
1. శత్రువు 2. ప్రమాదం 3. సింగరేణి మండుకొండ -నవల 4. సింగరేణి బతుకులు -కథా సంపుటి 5. వల్లవత్రం -నవల 6. బొగ్గుపొరల్లో కథా సంపుటి 7. పల్లెతల్లులు (కథాసంపుటి)	1. శత్రువు 2. పురుడు 3. సింగరేణి బతుకులు -కథాసంపుటి 4. వల్లవత్రం -నవల 5. బొగ్గు పొరల్లో -కథాసంపుటి 6. నిజాన్ని పల్లెతల్లుల కథాసంపుటి	1. శత్రువు 2. ప్రమాదం 3. రాత 4. బొగ్గు పొరల్లో -కథాసంపుటి 5. సింగరేణి మండుకొండ నవల 6. పల్లెతల్లులు కథాసంపుటి	1. బొందలగడ్డ బతుకులు కథాసంపుటి 2. జీతం-బాధ్యం 3. నిర్ణయం 4. [illegible] -[illegible] 5. [illegible] 6. [illegible] [illegible] పెద్దమ్మలు గుండాడు 7. [illegible] మొదలగునవి కథలు 8. నేనుగుమంగియ వెలుగ్యాయి-లోపస్ 9. కొండగాల్పులు మంట (అనినీయన్) 10. తప్పదేమ్యా గాలిదీపం 11. నిర్ణయం (అధ్యాయం)	1. ప్రమాదం 2. నిర్ణయం 3. శత్రువు 4. పురుడు 5. పెండ్లి 6. మొదలగు కథలు 7. ప్రస్థానం 8. బొందలగడ్డ బతుకులు -కథాసంపుటి 9. వల్లవత్రం 10. పెంపు 11. పల్లెతల్లుల 12. సింగరేణి మండుకొండ	1. [illegible] 2. [illegible] మనోభావాలతో తప్పదు 3. పిల్లికి రొయ్యల మొక్కలు 4. ధర్మ-యుద్ధం 5. గండుపిల్లి మొదలగు కథలు 6. పనిముద్ర 7. సింగరేణి మండుకొండ 8. పల్లెతల్లుల	1. సింగరేణి మండుకొండ -నవల 2. పెళ్లి 3. శత్రువు 4. వల్లవత్రం 5. వేగం 6. పల్లెతల్లుల	1. శత్రువు 2. రాక్షసులు 3. ప్రమాదం 4. పెళ్లి-పండి పల్లెతల్లుల -కథాసంపుటి 5. దిక్కులేని 6. అగ్గి 7. పురుడు (విద్య, ఆరోగ్యం, మంచినీరు, గృహవసతి కల్పన, విద్యుచ్ఛక్తి, మొదలైనవి) వంటి సంక్షేమ కార్యక్రమాల అమలుపై స్పందనలు విరసం సింగరేణి మండుకొండ -నవల

యాజమాన్య సమస్యలకు కారణాంశాలు

1. ప్రభుత్వ నిర్ణయాలు అమలులో పద్ధతి

2. మార్కెట్ వ్యవస్థ

3. వాణిజ్య విధానంలో మార్పు

4. లైసెన్స్ విధానంలో జాప్యం

5. సంస్థ ఆర్థికస్థితి - ఉత్పత్తి

(మొదటి నాలుగు సంస్థేతరంగా పరిష్కరించవలసిన విషయాలు) 5వ దైవం యాజమాన్యానికి కార్మికుల సహాయంగానే పరిష్కరించుకుంటారు)

↓

సాహిత్యం

↓

1. శత్రువు

2. మారుతున్నలుమారుతోంది

3. ప్రమాదం

కార్మిక కుటుంబ స్త్రీల అధ్యయనం - సాహిత్యం

↓

(1) పిల్ల (బ్రతుకు), (2) శత్రువు, బాలశ్రీ, సింగరేణి మండుకొండ నవల

ముఖ్యముగా గొప్ప అభిప్రాయ సేకరణ

←

ఊపిరి + సాహిత్యం

సినిమాలు - (1) కన్నెగన్న

(2) ఎర్రటి సూర్యుడు

1. సింగరేణి సాహిత్యం - శ్రమశక్తులు

సింగరేణి గనులు తెలంగాణా యందలి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించినట్లే సాహిత్యం కూడా వివిధ సాహితీ ప్రక్రియలలో చోటు చేసుకుంది. సంపద సృష్టికారులే సాహిత్య సృష్టికారులుగా రచయితలలో కొంతమంది గని కార్మికులే ఉండడం, మరి కొంతమంది గని ప్రాంతాలలో ఉండి ఆ కార్మికులతో సంబంధాలు కలిగి యుండి రచనలు చేయుటంతో ఈ సాహిత్యం వాస్తవికతకు అద్దం పడుతుంది. కార్మికులు రోజూ తాము వృత్తి యందు, కుటుంబ సామాజిక సంబంధాల యందు కూడా సమస్యలనెదుర్కొంటూ సంఘర్షణలకు లోనవడం, తమ శరీరాలు పరాయీకరణ చెందినవిగా భావించడం, శక్తి అంతా ఖర్చు కాగా, మిగిలిన అస్థిపంజరాల వంటి తమ శరీరాన్ని గురించిన వివేచనతో పాటు తమను అశాంతికి గురిచేసిన శక్తుల్ని గుర్తించడం, వాటి నుండి విముక్తికై కర్తవ్యాన్ని స్ఫురింప జేసుకోవడంగా కార్మికుల చైతన్యం సింగరేణి సాహిత్యం అంతటా ప్రతిఫలిస్తుంది.

“నల్ల కలువలు లేదా కోల్ బెల్ట్ కథలు, సింగరేణి బతుకులు, (కథలు) బండకింది బతుకులు, బొగ్గు పొరల్లో” వంటి కథా సంపుటాలుగానూ, “నల్ల వజ్రం, సింగరేణి మండుతోంది” వంటి నవలలు గాను సింగరేణి కవిత్వం పాటల రూపంలోనూ, ‘అరుణతార సృజన’ మొదలైన పత్రికలలోనూ సంపుటాలుగానూ సాహిత్యం వెలుగులోకి వచ్చింది. రచయిత ఆత్మీయతా ముద్ర అధికంగా ప్రతిబింబించిన ఈ గని సాహిత్యంలో కార్మిక జీవితాన్ని విశ్లేషించి విమర్శకు పెట్టి విలువల్ని నిర్ధారించడంలోద్రష్ట పాక్షికతకు లోను కాకూడదు. గని కార్మికుడిగా వ్యక్తి గుర్తించబడడం అంటేనే అతని జీవితానికి పారిశ్రామిక సంబంధాలతో అనుబంధం ఉన్నదనేదాన్ని భావించడం జరుగుతుంది. కాబట్టి అతని జీవితాన్ని పారిశ్రామిక సంబంధాల ఆధారంగా విమర్శ చేయగలిగితేనే విలువలను సరిగా అంచనా వేయడానికి వీలు అవుతుంది. వ్యక్తి గని కార్మికుడిగా మారడానికి కారకమైననేపథ్యపు శక్తుల్ని గుర్తించడం కార్మికుడిగా అతడు వృత్తి యందు ఎదుర్కొన్న సమస్యలు, సంక్లిష్టతలు, సంఘర్షణలు, తత్ఫలితంగా ఏర్పడిన అశాంతినీ, అది అతని కుటుంబ సామాజిక జీవితం మీద చూపించిన ప్రభావాన్ని అవగాహన చేసుకుంటేనే సింగరేణి గని కార్మిక జీవితం సమగ్రంగా అర్థం అవుతుంది.

దాదాపు మూడు దశాబ్దాల నుండి అనుశ్రుతంగా వెలుడుతూ ఇతర రచయితల అనుభవాలతో పాటు సింగరేణిలో సంసాగత్ధ కార్మికులు స్వీయభావాల్ని

వ్యక్తం చేసుకోవటానికి వేదిక అయింది సింగరేణి సాహిత్యం. సింగరేణి సాహిత్య రచయితలుగా కవులుగా సంపద సృష్టికర్తలైన కార్మికులే సృష్టికారులుగా ఉండటం ఈ సాహిత్యపు ప్రత్యేకత. పారిశ్రామిక సంబంధాలలో కార్మికులు తమ సమస్యల పట్ల చైతన్యాన్ని వ్యక్తం చేస్తూ తోటి కార్మికులను కూడా తమ రచనలతో చైతన్యవంతులను చేయడానికి ప్రయత్నించడం లక్ష్యంగా చేసుకోవటంతో సింగరేణి సాహిత్యం వాస్తవికతకు అద్దం పడుతోంది.

సింగరేణి సాహిత్యం వివిధ ప్రక్రియా రూపాలల్లో ఆవిష్కరింపబడింది. 1977లో బంగారయ్య పాటతో ప్రారంభమై సింగరేణి బతుకులు, నల్ల కలువలు, బొగ్గు పొరల్లో వంటి కథా సంకలనాల రూపములోనూ, నల్లవజ్రం, సింగరేణి మండుతోంది, శేషగిరి వంటి నవలా ప్రక్రియలలోనూ సింగరేణి కవిత్వం అనే కవితాసంపుటి రూపాలతోనూ వెలువడింది. బండక్రింద బతుకులు వంటి స్వగతాలుగానూ, 'సృజన', 'అరుణతార' వంటి పత్రికలలో ఎన్నో కథలు ప్రచురించబడ్డాయి. చిన్న చిన్న ఏకాంకికలు, టెలిఫిల్ములు, సింగరేణి తరంగాలు వంటి టి.వి. ప్రోగ్రాములు తోపాటు నిప్పురవ్వ సినిమాలు, వార్త ఉదయం, దర్శిని, చర్చ వంటి పత్రికలలోనూ కోల్‌బెల్ట్ కథలు వంటి వ్యాసాలలోను సింగరేణి సాహిత్యం వెలువడింది. కొంత అముద్రిత సాహిత్యం కూడా ఉంది.

అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, పవన్‌కుమార్, పి. చంద్, మూట శంకర్, వేల్పుల నారాయణ, రఘోత్తమరెడ్డి, జాతశ్రీ మొదలగువారు వ్రాసిన కథలు, నవలలు, జయరాజు, వెంకటయ్య, సామేలు మొదలగు వంటివారు వ్రాసిన కవిత్వం వచ్చింది. హుసేన్, సూర్యం మొదలగు వారు వ్రాసిన పాటలు వచ్చాయి. సింగరేణి సాహిత్య పరిశీలనలో భాగంగా లభ్యమైన కథలు, నవలలు, కవిత్వం మొదలగునవన్నీ పరిశీలించడం జరిగింది. వృత్తి యందే కాక ఇంటా, బయటా అనేక సమస్యలకు, సంఘర్షణలకు లోనవుతున్న కార్మికుల యొక్క జీవితాల ప్రతిబింబమే ఈ సాహిత్యం. ఒక వ్యక్తి సింగరేణి గనులలో కార్మికుడిగా ప్రవేశించి జీవితం మొదలుపెట్టటం అంటే అతడు పారిశ్రామిక సంబంధాలలో ప్రవేశించటమే అతని జీవితాన్ని దర్శించగలిగితే కార్మిక జీవితాన్ని సమగ్రంగా విశ్లేషించగలటానికి వీలు కలుగుతుంది. యాజమాన్యము వైపున్న ఆలోచనలు, ఆచరణలు, ఆకాంక్షలను తెలియజేసిన సింగరేణి పత్రిక, మరియూ సంస్థ ఛైర్మన్ నుండి లేఖలను సింగరేణి తరంగాలు వంటి సమాచార శాఖ టి.వి.కార్యక్రమాలను కూడా పరిశీలించడం జరిగింది. వీటితో బాటు కార్మికులతోనూ, కార్మిక కుటుంబీకులతోను చేసిన చర్చలు కేస్ స్టడీల రూపంలోనూ సింగరేణి పారిశ్రామిక సంబంధాలను యధాతథ రూపంలో అవగాహన చేసుకోవడం జరిగింది.

చారిత్రక, ఆర్థిక, సాంఘీక, మానసిక, వసతి, సాంకేతికత, వృత్తులు, రాజకీయ విధివిధానాల పద్ధతి విషయాల సమాహార పరిశీలనలోనే పారిశ్రామిక సంబంధాలు అర్ధం అవుతాయి. ఇవి మానవ సంబంధాలతో మిళితమై ఉంటాయి. కార్మికుల సమగ్ర జీవితంపై ప్రభావం చూపించేవి కూడా ఇవే. కాబట్టి ముందుగా పారిశ్రామిక సంబంధాలను గురించిన అవగాహన అవసరం.

మానవ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్న పారిశ్రామీకరణంలో ఉత్పత్తికి ధ్యేయం మానవుడు కాగా, నేడు మానవునికి ధ్యేయం ఉత్పత్తిగా మిగిలిపోయింది. ఈ ధ్యేయం సంపదలకు మూలమై, అధికారాన్ని కలుగచేసి, వర్గ స్వభావాన్ని పెంచి అణచివేతగా మారడంతో పారిశ్రామిక సంబంధాలలో యాజమాన్యానికి, కార్మికులకు మధ్య అంతరం ఏర్పడుతుంది. దానితో అవగాహన లోపం ఏర్పడే ప్రమాదం ఉంది. తద్వారా కార్మికులకు సమస్యలు ఏర్పడతాయి. ఫలితంగా యాజమాన్యం కొన్ని ఇబ్బందులకు గురి కాక తప్పదు. ముందుగా ఆర్థిక దుస్థితి నేపథ్యంగా గనిలో ప్రవేశించిన కార్మికునికి వేతనాల విషయంలో కొన్ని ఆలోచనలు-ఆశయాలు, జీవిత రక్షణ, ఉద్యోగ భద్రత, పని పరిస్థితులు, తోటి కార్మికులతోనూ, యూనియన్లతోనూ, యాజమాన్యంతోనూ గల సంబంధాలతోపాటు సాంఘిక జీవితం, కుటుంబ సౌఖ్యం ఉండాలని కోరుకుంటాడు. యాజమాన్యానికి ప్రభుత్వం పారిశ్రామిక విధానపు మార్పు, మార్కెట్ వ్యవస్థ, ఉత్పత్తి విషయమైన సమస్యలు ఉంటాయి. ఐతే యాజమాన్యానికి వున్న సమస్యలు మాత్రం కార్మికునితో ఒక ఉత్పత్తి విషయంలో తప్ప మిగిలినవన్నీ ప్రభుత్వాలతో, జాతీయ స్థాయిలో పరిష్కరించుకోదగ్గవిగా ఉంటాయి. కార్మికుల సమస్యలన్నీ యాజమాన్యంతో ముడిపడి ఉంటాయి. కాబట్టి కార్మికుని పట్ల యాజమాన్యపు వైఖరి ప్రాధాన్యతను పొందుతుంది. కార్మికుడు అటు వృత్తి సంబంధాలతోనూ, ఇటు సామాజిక, కౌటుంబిక, మానవ సంబంధాలలోనూ సమస్యలనెదుర్కొంటూ, సంక్లిష్టతకు గురి అయి, ఆవేదనతో అసంతృప్తి భావనతో పారిశ్రామిక సంబంధాలలో కష్టనష్టాలను అనుభవిస్తున్నట్లుగా సింగరేణి సాహిత్యంలో స్పష్టమవుతుంది. 1953లో బిల్లుగా రూపొందింపబడిన పారిశ్రామిక సంబంధాల విధానంలో ప్రధానంగా కార్మిక-యాజమాన్యాల మధ్య మానవ సంబంధాలు మెరుగు పడితేనే ఉత్పత్తి లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వం భావించింది. వృత్తి యందు పనిచేసే చోట ముఖ్యంగా బొగ్గు గనులలో కార్మిక జీవిత రక్షణకై 1952లో మైన్స్ (సేఫ్టీ) యాక్ట్ వచ్చింది. దానిలో భాగంగా కార్మికులు పనిచేసే సంస్థలలోనూ, కార్మిక కుటుంబ వాడలలో సంక్షేమ కార్యక్రమాల అమలును 1926 లో వచ్చిన ట్రేడ్ యూనియన్ యాక్ట్, 1947లో

వచ్చిన ఇండస్ట్రీయల్ డిస్ప్యూట్ యాక్ట్ (పారిశ్రామిక వివాదాలు) మొదలైనవి ఎన్ని వచ్చినా వీటిలోని లోపాలు ప్రతినిధులలో నిజాయితీ లేని తనం కలసి వెరసి కార్మికుల మానవ హక్కులనే కాలరాస్తున్నాయి. కార్మికుని అదనపు శ్రమ పరిశ్రమకు లాభాల్ని కల్గిస్తుంటే కార్మికుడి విలువ పడిపోయినట్లుగా అయి అనారోగ్య పీడితుడవుతున్నప్పుడు అతని శ్రమ నష్టం అతడిని ధీరుడిగా చేస్తుంది. అందుకే కార్మికులు పోరాట యోధులుగా కూడా మారిన విషయం సాహిత్యంలో స్పష్టమవుతుంది.

పారిశ్రామిక సంబంధాలలో కార్మికుల-యాజమాన్యపు సంబంధాలను ముఖ్యంగా మనోవిజ్ఞాన శాస్త్రానుగుణ విశ్లేషణతోనూ మానవ సంబంధాలతోను, ఆర్థిక రాజకీయ, న్యాయశాస్త్ర యంత్రాంగ విధానపు దృక్కోణాలతోనూ పరిశీలించి అర్థం చేసుకోవాలి. ఉత్పత్తి విషయంలో యాజమాన్యానికి కార్మికులతో ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. కాబట్టి దానికోసం కార్మికునిపై వత్తిడిని పెంచితే కార్మికుడు ఆందోళనకు గురియై, పోరాటాన్ని అయుధంగా చేసుకోవడం అర్థం అవుతుంది.

1889 ప్రాంతాలలో బ్రిటిష్ వాళ్ళ హయాంలో సింగరేణి ప్రాంతంలో వంటకోసమై భద్రాచల యాత్రికులు అక్కడున్న రాళ్ళను పొయ్యిగా ఏర్పాటు చేసుకుంటే ఆ రాళ్ళు కూడా మండుతున్న విషయం వారి గ్రహింపుకు వచ్చింది. దానిని అక్కడున్న మిషనరీలకు తెలియచేస్తే అది బ్రిటీష్ ప్రభుత్వానికి తెలిసి, బొగ్గు నిక్షేపాల అన్వేషణ దిశగా సాగి, పరిశ్రమ ప్రారంభమైంది. పరిశ్రమ ప్రారంభంలో జీతాలు ఎర చూపించడంతో చుట్టు ప్రక్కల పల్లెలలో వాళ్ళు ఆకర్షితులయ్యారు. ఇలా ఆకర్షితులయిన వారి కార్మికుల నేపధ్యంలోకి తొంగి చూస్తే, వారు పల్లెటూళ్లలో భూసంబంధాలలో దోపిడీకి గురి అయినవారు, పంటలు పండక బతుకీడ్చలేని వారు, వెట్టిచాకిరీ నుండి విముక్తి కోరుకున్నవారు, నిరుద్యోగ యువతయైన కార్మికుల పిల్లలు, సింగరేణి కార్మికులుగా పారిశ్రామిక సంబంధాలలోకి అడుగుపెట్టినవారు. ఆర్థిక దుస్థితి కారణంగా హెచ్చు జీతాల దృష్ట్యా కార్మికులుగా మారిన వారికి వృత్తియందు సమస్యలు ఎదురౌతాయి. ఈ విధమైన కార్మికుని నేపథ్యం అర్థం చేసుకోవడానికి భూదేవి, ప్రస్థానం, పురుడు వంటి కథలలోను కైతికాల పోశెట్టి స్వగతా కథనాలతోనూ స్పష్టం అవుతుంది. భూదేవి కథలో పంటలు పండక పోవడంతో అప్పులపాలు బడి అవి తీర్చలేక, బతుకీడ్చలేక కష్టపడితే జీతం దొరుకుతుందనే గంపెడంత ఆశతో మొగిలు అనే వ్యక్తి కార్మికుడిగా మారుతాడు. మిగిలిన కథలలో రాఘవయ్య. మాధవయ్య, రాజలింగం, ఇత్యాదివారే, ఓదెలు అనే వ్యక్తి చేనేత పనిమాని కార్మికుడిగా మారతాడు. శత్రువు కథలో లింగయ్య కూడా అలాంటి వాడే. కైతికాల పోశెట్టి

వంటి వారు నేపథ్యంలోని ఆర్థిక, సామాజిక శక్తులు నెట్టగా వచ్చి గనిలో కార్మికుడిగా రూపం దాలుస్తారు.

ఇక్కడ గనిలోకి ప్రవేశిస్తూనే అతనికి జీవితం ఎంత ప్రమాదాల అంచున ఉన్నదో అర్థం అవుతుంది. ఇక్కడ భూమి పంట తీస్తూ బొగ్గును ఉత్పత్తి చేసే చోట, రూఫ్, గోఫ్‌ని సరిగా చెక్ చేయకపోతే బండ పడి శరీరం నుజ్జు నుజ్జయే ప్రమాదం ఏర్పడే చోటు కూడా అది. అసలు ఆ ప్రదేశంలో బ్లాస్ట్ చేయగానే కొన్ని భూగర్భపు విషవాయువులు వస్తాయి. కాబట్టి వాటి శాతం గుర్తించేందుకై ముందుగా పిట్టల్ని పంపించడం రక్షణలో ఒక భాగం. కప్పు కూలిపోకుండా సహాయక స్థంభాలు (సపోర్టు పిల్లర్స్) తగినన్ని పెట్టటానికి, ఏర్పరచిన ఉళ్లను చెక్ చేయడానికి అధికార యంత్రాంగం, సేఫ్టీ ఆఫీసర్స్ ఉంటారు. కాని సూపర్‌వైజర్లకు, అధికారులకు పనియందు శ్రద్ధ లేకపోవడంతోపాటు పట్టించుకోనితనం వినిపించుకోనితనం. కలిసి కార్మికుని ప్రాణాలు బలితీసుకోవడంగా ప్రమాదం కథలోనూ, పెండ్లి కథలోనూ పురుడు కథలోనూ కనపడటమే కాక సాహిత్యం అంతటా స్పష్టమయ్యే విషయం. కాబట్టి ఇక్కడ మనసంటూఉంటే మంచి మనసుతో ఆలోచించి, అధికారుల నిర్లక్ష్యాన్ని శిక్షించి కార్మికుని కాపాడడం పారిశ్రామిక సంబంధాలలో ముఖ్యమైనది. ఇలా జరుగక పోతే వాళ్లు సమ్మెలోకి దిగడం, ప్రతిచర్యగా మిగులుతోంది. లాకౌట్, నాగాలు, ఉత్పత్తి నష్టం వంటి దుష్ఫలితాలను అడ్డుకోవడానికి ఇక్కడ చక్కని మానవ సంబంధాల దృష్టితో వీక్షించి కార్మికుడికి వృత్తి యందు జీవిత రక్షణను కల్పించడం చేయాలి, పనిచేసే స్థలాలు బాగుండకపోతే ఆ పనియందు అదనంగా వారు శ్రమ పడవలసిరావడం యిత్యాది విషయాలు మనకు శత్రువు కథలో స్పష్టం. శ్రమకు అలసిపోయి శారీరక బాధలకు గురి కావటం మరియు దాని నుండి ఉపశమనానికై తాగుడుకు బానిస అవటం, సాహిత్యం అంతటా కనబడుతుంది. అందుకే అసలు కార్మికుడిగా ఉద్యోగంలోకి రావాలంటే ఇంటర్వ్యూలో శరీర దారుఢ్యాన్ని చూడడం, ఇంటర్వ్యూ కథలో స్పష్టం అవుతుంది. ఇలాంటి వారు మరి అస్థిపంజరంగా తయారవుతున్నారు. అంటే అతని శక్తి వినియోగతా విలువల్ని అంచనా వేస్తే కార్మికునికి ఎంత కష్టంగా ఉంటుందో పెండ్లి వంటి కథలలో అర్థం అవుతుంది.

కార్మికుడికి రక్షణ తరువాత జీతం ముఖ్యమైనది. జీతాన్ని మిగుల్చుకోవచ్చనే ఆశతో ఉన్న అతనికి ధరలకు తగ్గ జీతం పెరగక, నిరాశా నిస్పృహలకు గురి అవుతాడు. జీతాల రోజున అప్పులు తీర్చి పప్పు బెల్లం కొనేసరికి జీతం అయిపోతుంది. ఒకవేళ ఆరోగ్యం సరిగా లేక నాగా పెడతే

జీతం నష్టం ఏర్పడుతుంది. జీతాల పెంపుకై వేతనాలను బోర్డు నిర్ణయిస్తుంది. అది సరిపోక పోవడం. లేదా అసలు పెంచక పోవడం, ఇవన్నీ కైతాల పోలిశెట్టి స్వగతాలలో వినిపిస్తాయి. ఏనుగు తిన్న వెలక్కాయ చిల్లిపైసా పెంచుడూ పెద్ద సైజు గుంజుడు అంటు జీతాలను గరించిన విశ్లేషణ చేస్తాడు. వేతనాలు నాలుగు పైసలు పెంచితే ధరలు 14 పైసలు పెరుగుతున్నాయి అంటాడు. కాబట్టి వాళ్ల జీవనావనరాలకు తగినట్లుగా జీతాలు పెంచాలి. 25 శాతము మిగుల్చుకోగలిగేటట్లు ఉంటే కార్మికుడికి పని యందు అభిరుచి కలిగి, ఉత్పాదకతా సామర్థ్యం పెరిగి ఉత్పత్తి పెరుగుతుంది.

జీతం-లాభం కథలో ఉత్పత్తి లాభాలలో భాగస్వామ్యం వస్తేగాని కార్మికుడి కష్టాలు తీరవంటారు. సామూహిక సంప్రదింపుల ఫలితంగా యూనియన్‌లు పోరాడి తెచ్చినది జీతాల పెరుగుదల. కాని జీతాలు సరిపోక వేతానాల పెంపుదలకు ఆలస్యం చేస్తూ యాజమాన్యం యూనియన్ ప్రతినిధులతో చేరి ఏకమై మీటింగ్‌లతో కాలక్షేపం చేస్తే కార్మికుడికి ఓపిక ఓర్పు తగ్గి సమ్మెలు చేసే స్థితి వస్తుంది. సమ్మెలు చేస్తే లాకౌటులు డిస్‌మిస్‌లు వంటి చర్యలు చేపట్టే యాజమాన్యపు ధోరణి సమస్యకు పరిష్కారం కాకపోగ ఉత్పత్తికి నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుంది. ఉత్పత్తి సంపదలకు కారకమైన మానవాళికి ఇంధనం, మూలధనం కూడా కార్మిక శక్తియే అని ఎప్పటూ మర్చిపోకూడదు. రక్షణ కరువైనా, జీతాలు పెంచకపోయినా సమ్మెలు అనివార్యం అవుతుందనేది 'సమ్మె' కథలోనూ తప్పుచేయని గాడిద ఎవరు అనే స్వగతములోనూ కార్మికుని ప్రతి ఘటనా స్ఫూర్తి కన్నడుతుంది. "ఎస్మా" చట్టం తెచ్చి పెడితే నూరు కత్తులు నూరుకోనీ అనే స్వగతంలోనూ కార్మికుల ధోరణితోపాటు సమ్మెలు వద్దనే అధికారులను పట్టించుకోనితనం కూడా కన్పడుతుంది.

కార్మికులు చేసే స్ట్రైకుని ఆపటంలో యాజమాన్యం త్రాడు తెగేదాకా లాగకుండా సున్నితమైన సంబంధాలను ఆర్థిక రాజకీయ ధోరణితోను పరిశీలించి సమస్యలను పరిష్కరించుకోవాలి. పారిశ్రామిక వివాదాల చట్టం ఐ. డి. యాక్టు 1947 అమలులోకి వచ్చిన తరువాత ఏవైన సమస్యలు ఉంటే వీలయినంత వరకు మైన్స్ కమిటీలో చర్చించుకోవటం చేయాలి. అయితే సఖ్యభావనతో సమాధాన పరచటంగా ఉండాలి. వీనిలో కార్మిక పక్షంవైపుగాని యాజమాన్యంవైపు గాని ప్రతినిధులుగా ఉన్నవారు నిజాయితీతో ఉంటేనే పరిశ్రామిక సంబంధాలలో కార్మికుల సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. 1926లో వచ్చిన ట్రేడ్ యూనియన్ యాక్ట్ ప్రకారం యూనియన్స్ కార్మికుల హక్కులను కాపాడగలిగే స్థితిలో ఉంటే బాగుంటుంది. కాని కార్మికుల్లోనే పని దొంగలుగా ఉన్న వారు

కొంతమంది లీడర్లుగా యూనియన్ నాయకులుగా మారి, యాజమాన్యంతో కుమ్మక్కయితే కార్మిక న్యాయం నిలబడదు. ఈ నాయకులకు చందాలు కట్టించుకోవడంలో ఉన్న శ్రద్ధ కార్మికుల కష్టాలు తీర్చడంలో ఉండదు. అలాంటి యూనియన్ నాయకులకు బుద్ధి చెప్పటం 'నిర్ణయం' అనే కథలోనూ 'నవ్వుల పాలైన వోడు నాభిలో తన్నాడు' అనే స్వగతంలోను ఇదే విషయం స్పష్టం అవుతుంది.

యూనియన్ నాయకులపై అపనమ్మకం రావడంతో సమైక్య పోరాటపు స్ఫూర్తి రావాలని 'ఐక్యత-ఘర్షణ' కథలో అర్థం అయి, 'మేడే స్ఫూర్తి' కథలో సమస్యలు తీరని వ్యక్తి చివరికి పోరాటాన్ని ఆయుధంగా చేసుకుంటాడు కాబట్టి ఇటువంటి విషయాలలో యాజమాన్యం మానసిక, ఆర్థిక, రాజకీయ న్యాయ, సామాజిక, మానవ సంబంధాల ధోరణితోనూ, విధానాల సమన్వయ దృక్కోణంతో సునిశితంగా పరిశీలించి పరిష్కరించదగ్గ అంశంగా కనపడుతుంది. చచ్చీ చెడి కష్టపడ్డ కార్మికుడు వృత్తి నుండి ఇంటికి చేరుకోగానే అతని జీవితంలో ఎంత శూన్యత నిర్వీర్యత చోటు చేసుకుంటుందో తెలియజేసే 'శత్రువు' కథ ఒక పరమోదాహరణ. లింగయ్య డ్యూటీ నుండి ఇంటికొచ్చి భార్యతో కూడా మాట్లాడలేనంతగా నిస్సత్తువతో పడుకుంటాడు. అప్పటి వరకు లింగయ్య కోసం గుమ్మం దగ్గర ఎదురు చూసిన అతని భార్య మంచు గడ్డలా మారి దగ్గరికి చేరినా ఆతని యొక్క పట్టించుకోనితనం ఆమెను అశాంతికి గురి చేస్తున్నది. ఆ కారణంగా భార్యా, భర్త సంబంధాలు శత్రుపూరిత సంబంధాలుగా మారుతాయి. అంతేగాక కార్మికుడు వృత్తి నుండి బొగ్గు బావి నుండి పైకివస్తూనే కాయ కష్టపు బాధల విముక్తికై తాగుడుకు బానిసయితే అతనికి సాంఘిక మర్యాద తగ్గడమే కాక కుటుంబంలో కూడా అతని భార్య బిడ్డలు అతడిని రాక్షసుడిగా భావించటం 'రాక్షసుడు' కథలోనూ వ్యక్తం అవుతుంది. 'పెండ్లి' అనే కథలో గని ప్రమాదంలో కాళ్ళు విరిగిన పిచ్చయ్యను వదిలి అతని భార్య మరొకడితో వెళ్లిపోయే స్థితి కూడా స్పష్టం అవుతుంది.

అతనికి వృత్తి యందుండే జీవిత రక్షణ, ఉద్యోగ భద్రత, అతని ఆరోగ్య పరిస్థితులు, అతని అలవాట్లు అతని కుటుంబంపై ప్రభావం చూపుతాయి. కాబట్టి ఒకదానికొకటి కారకాలుగా మారిన వాటిని అధికార సంబంధాలతో కాక మనోవిజ్ఞాన శాస్త్రాంశ పద్ధతిలోనూ, మానవ సంబంధాల దృక్కోణంలోనూ అర్థం చేసుకుని కార్మికుడి కుటుంబంలో ఉన్న వెలితిని పూడిస్తేనే పారిశ్రామిక సంబంధాలు చక్కబడి ఉత్పత్తి పెరగడం ఖాయము అనేది గ్రహించాలి.

1952లో వచ్చిన మైన్స్ (సేఫ్టీ) యాక్ట్‌కు అనుబంధంగా కార్మికులకు వివిధ సంక్షేమ పథకాలు అమలులోకి వచ్చాయి. ఒప్పందపు పత్రాలలో బడ్జెటు కేటాయింపు కూడా నిర్ణయమైనా అమలు చేయడం జరగకపోతే కార్మికులు అసంతృప్తులకు లోనవుతారు. ముఖ్యంగా కార్మిక వాడలో కార్మికులకు ఇళ్ళు, పంపు, ఫ్యాన్, ఉచిత కరెంట్, బొగ్గు, వైద్య వసతి, పారిశుద్ధ్యము, పిల్లలకు విద్యా సౌకర్యములు కల్పించాలి. పనిచేసే చోట క్యాంటిన్, స్నానాల గది నీటి వసతి, బొగ్గు బావుల దగ్గర కల్పించాలి. కాని ఈ సంక్షేమ పథకాలు పూర్తిగా సంతృప్తికర స్థాయిలో అమలు చేయబడకపోతే పారిశ్రామిక అశాంతి ఏర్పడుతుంది.

'అగ్గి' నీళ్ళ క్రతువు, నిర్ణయం ఇత్యాది కథలలోను సంక్షేమ పథకాల అమలులోని లోపాల వల్ల కార్మికుని కౌటుంబిక జీవితం ఎంత బాధపడితే అది అంతగా ఉత్పత్తి ఉత్పాదకతలపై ప్రభావం చూపుతుంది అనే విషయం స్పష్టం అవుతుంది. సంక్షేమ పథకాలు సరిగ అమలు కాక కార్మికుని గుండెల్లో 'అగ్గి' రాజుకుందని 'అగ్గి' కథలోను ఆ మంటలు ఆపాలంటే ఎంతో కష్టం అవుతుందనేది 'నిర్ణయం' అనే కథలో అర్థం అవుతుంది. 'అగ్గి' అనే కథలో ఆస్పత్రులలో కార్మికులను, కార్మిక కుటుంబ వ్యక్తుల ఆరోగ్యం గురించి పట్టించుకోని వర్గ స్వభావ పోకడ గల డాక్టర్లు ప్రత్యక్షమవుతారు. నీళ్ళు వసతి లేదనీ, మురికి వాడలో పందులు, కుక్కలు తిరుగుతున్నాయనీ, డ్రైనేజి వసతి లేదనీ ఈ కథలోనే స్పష్టమవుతుంది. నీళ్ల వసతి లేకపోతే దాని ఇబ్బంది ఏమిటో బాగా తెలిసిన కార్మికుల భార్యలు సమైక్య పోరాటం జరిపి, యాజమాన్యపు వైఖరిని మార్చి వెంటనే ఏర్పాట్లు చేయించేటట్లు చేసిందనే విషయం 'నీళ్ల క్రతువు'లో స్పష్టం అవుతుంది. క్యాంటీన్లో వడలను కష్టించి పనిచేసే కార్మికులకు కాక దొరలకు అందచేస్తుంటారని చెప్పి సంక్షేమ పథకాల అమలులోని లోపం " సింగరేణి మండుతోంది" అనే నవలలో స్పష్టం అవుతుంది. మానవ సంబంధాలకు అఘాతం ఏర్పడితే పారిశ్రామిక సంబంధాలలో యాజమాన్యానికి సమ్మెల, బంద్‌ల రణగొణ ధ్వని తప్పదు కాబట్టి మానవ సంబంధాల పటిష్ఠతకై జాగ్రత్త వహించాల్సినది ముందుగా యాజమాన్యమే అని ఈ నవలలో స్పష్టం చేయడం జరిగింది.

కోల్‌ఫిల్లర్ కొడుకు సింగరేణి బడిలో సీటురాక ప్రభుత్వం బడిలో వేస్తే ఆగం ఆగం అయి బడి మానేస్తే కోల్ ఫిల్లర్ వారసత్వం పుచ్చుకున్నాడంటూ బాధపడ్డ ఓదెలు 'పురుడు' కథలో దర్శనమిస్తాడు. సింగరేణి బడిలో వర్గ స్వభావానికి ఆస్కారం ఉందనీ దానితో కార్మికుల పిల్లలు బడికి బదులు కూలికి

పోతామంటున్నారు అనీ పురుడు కథలో తెలుస్తుంది. కాబట్టి అన్నిచోట్ల మానవ సంబంధాలను చక్కగా పటిష్టం చేసుకునే దిశగా యాజమాన్యం ఎప్పటికప్పుడు ప్రయత్నం చెయ్యాలి.

ఇలా ఈ సాహిత్యం కార్మిక సమస్యలకు అద్దం పడుతూ మమేకం అయిన పాఠకుడ్ని కూడా అశాంతికి గురి చేయగలుగుతుంది కూడా. ఈ కథలలో కొన్ని అల్పాక్షరాల అనల్పార్థ రచనయే కాక 'అగ్గి' వంటి కథలలోని కథా శిల్పం గమనించదగినది. కైతికాల పోశెట్టి స్వగతాల కథనాల మానవ హృదయానికి హత్తుకునేటట్టుగా ఉన్న నూతన సామెతలు తెలంగాణ మాండలిక భాషలో చెప్పబడ్డాయి. ప్రత్యేకంగా బండ కింద బతుకులలో శీర్షికలన్నింటికీ పాత సామెతలు వాడటం కథనాలలోని సంభాషణల స్వగతాలు మరీ మరీ చదివింపచేస్తూ అచ్చమైన తెలంగాణ సాహిత్యాన్ని ఆస్వాదింప చేస్తాయి.

'పెండ్లి' కథలో యాజమాన్యపు వైఖరి పితృస్వామ్యం కంటే ప్రమాదకరమైనది అని రచయిత చెప్పడం గమనార్హం. సింగరేణి గని కార్మికుడు అంటే సూర్యుడు దర్శించలేని చీకటి భూగర్భంలో బొగ్గు తొలుచు విగ్రహం అనీ, అవిశ్రాంత యోధుడని. అనారోగ్య పీడితుడనీ, నిరంతర ప్రమాదాల అంచున శ్రమకోర్చిన భూదేవి బిడ్డడుగా బయటపడి నీలి పంట నందించేవాడనీ అర్థం అవుతాడు. ఈ కార్మిక శక్తియే రైళ్లు నడవడానికి, ఫ్యాక్టరీలు పని చేయుటకు, విద్యుచ్ఛక్తిని పొందడానికి, తద్వారా మానవ జీవన ప్రమాణ స్థాయిని పెంచగలిగేదిగా, దేశ సౌభాగ్యానికి మూల ఇంధనమైనదిగాను, అర్థం చేసుకోవడానికి సింగరేణి సాహిత్యం అద్దం పడుతుంది.

2. సింగరేణి సాహిత్యం - పరిచయం

1978లో ప్రచురితమై మొట్టమొదటి కథగా గుర్తింపబడిన "రాజీ"తో ప్రారంభమవుతోంది ఈ సింగరేణి సాహిత్యం. 'బొగ్గుపొరల్లో' అనే కథా సంపుటిలో 'రాజీ' కథతో ప్రారంభమై గొలుసు కట్టువంటి 8 కథలు కథా క్రమానుగతంగా అర్థం అవుతాయి. "రాజీ" అనే కథలో బొగ్గుగని కార్మికుడైన సాయిలు "తుచ్ఛమైన దోపిడి సమాజంలో రాజీపడి కుక్కలాగా విశ్వాసంగా బ్రతకలేను" అంటూ తన కొడుకు యింటి నుండి వెళ్ళిపోయాడని తోటి కార్మికుడైన కొండన్నకు చెప్పి శ్రామిక జీవితాలకు భద్రత కరువైందనీ, దేశం నిండా సమస్యలు ఎండుటాకులు పరుచుకున్నప్పుడు నిరసన జ్వాల ఎక్కడో అక్కడ అంటుకుంటుందని చెప్తాడు. ఇరవై నాలుగు గంటలూ కూడా కష్టపడినా తమ కనీసావసరాలైన కూడు-గుడ్డకు నోచుకోక దినదిన గండంగా బ్రతుకు తయారయ్యే సరికి ఆ జీవితమే పోరాటం నేర్పుతుందని భావిస్తాడు. అలాంటి పరిస్థితులలో చాలా మంది రాజీ పడుతూ శతవిధాల ప్రయత్నిస్తూ చివరికి రాజీపడలేకపోతారని కొండన్నకు అర్థం అవుతుంది. పార్టీలు, ప్రభుత్వాలు మారినా, ప్రణాళికలో వేలకోట్లు పెట్టుబడి పెట్టినా కూడా కార్మికుల జీవితాలలో మౌళికమైన మార్పులంటూ రాలేదనీ, బొక్కటోపీ, మసి గుడ్డలు, పీక్కుపోయిన దవడలు,ఎరుపెక్కిన కళ్ళు, .గవర్నమెంటు నల్లసారా, పందులు తిరిగే గుడిసెల్లో ఆవాసం, భార్యాబిడ్డల్ని వదిలి పెట్టి తట్టలు నెత్తినపెట్టుకొని, నైటు షిఫ్టు చేసి ఉత్పత్తిని పెంచినా జీవితాల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయనీ భావిస్తాడు. అందరి జీవితాలను అంత దుఃఖకరంగా చేస్తున్నది దోపిడీ శక్తి అనీ, అది వర్గ స్వభావాన్ని పెంచి పోషిస్తున్నదనీ, కార్మికుల జీవితాలన్నీ ఒక్కటిగానే ఉన్నాయనీ, అందరి మొహాలు రగులుకొనే రాక్షసి బొగ్గు లాగానే ఉన్నాయని భావిస్తాడు.

బొగ్గు కంపెనీల జాతీయాకరణ తరువాతనే బొగ్గు నింపే టబ్బులు కూడా పెద్దవైనాయనీ, బొగ్గు గనిలో ఉద్యోగాలు కావాలన్నా ట్రాన్స్‌ఫర్‌లు కావాలన్నా రాజకీయ నాయకులకు ముడుపులు చెల్లించాల్సి వస్తోందనీ రాజీ అనేకథ పరంగా అర్థం అవుతుంది. కాలే కాళ్ళతో తట్ట మోసి అలసి దప్పిగొన్న వారుగా సర్ఫేసు పనిచేసే టెంపరరీ మజ్దూరీలు నీడన కూర్చొని టిఫిన్ తినడానికి గానీ, మంచినీళ్ళు తాగడానికి నల్లా లేకపోయినందుకు సమ్మె చేసినట్లుగా అర్థం అవుతుంది. కథలో గులాయిలు (బొగ్గు తవ్వుతున్న ఏరియా) లాంగ్‌వాల్ (ప్రమాద స్థితిలో గులాయిలు

మూసివేయుట)గా అయ్యే స్థితిలో ఉన్నా కూడా ఉత్పత్తికై ఆ గులాయి నుండి బొగ్గు తీయమనేసరికి, షార్ట్ ఫైరర్ పేలుడు మందును దట్టించినప్పుడు బొగ్గు బండ కూలి (గోఫ్) అక్కడ పని చేస్తున్న శాయన్న శరీరం నుజ్జు నుజ్జు అయిందనీ కొండన్నకు కాళ్ళు విరిగినాయనీ అర్థం అవుతుంది. అపుడు సాయిలు కొడుకు రాజీ పడలేదని చెప్పిన మాటల్లోని అంతరార్థం కొండన్నకు అర్థమయి దోపిడీ దారుల సమాజంలో రాజీపడలేమని, తప్పని పరిస్థితుల్లోనే పోరాటం చేయ్యాలనిపిస్తుందని భావించినట్టు కొండన్న మాటల వల్ల అర్థం అవుతుంది.

సింగరేణి సంస్థలోని పారిశ్రామిక సంబంధాలలోని సంక్లిష్టతలను అర్థంచేసుకోవటానికి సింగరేణి సాహిత్య పఠనం తప్పనిసరి. అందుకే సింగరేణి సాహిత్యసారాంశ విషయాలను పరిచయం చేయటం జరుగుతోంది.

'రాజీ' - (అల్లం రాజయ్య): డిగ్రీ పాసయిన కొండన్నకు ఉద్యోగం రాక ఉన్న ఊళ్ళోనే తమ బర్రెలను అమ్మి దళారులకు డబ్బులు ఇచ్చి అవినీతి పరులయిన మంత్రుల చుట్టూ తిరిగి ఎట్టకేలకు కొండన్న కాలరీ ఉద్యోగంలో చేరాడు. అతనికి గని పని కష్టంగా అనిపిస్తుంది. రెండు టబ్బుల బొగ్గు ఎత్తేసరికి తాతలు దిగి వచ్చినట్లుండి నల్లని మొఖంతో నీరసంగా ఇంటి ముఖం పడతాడు. వస్తున్న దారిలో సీనియర్ కార్మికులు మేనేజర్‌లను ముఖదమ్‌లను సర్దార్‌లను తిట్టుకుంటూ నడుస్తుంటారు. ఇంతలో సాయన్న కొండన్నను గుర్తించి పాతాళలోకాల పనికి ఎప్పుడు వచ్చావు అంటూ పలకరిస్తారు. కొండన్న సిఫారసుకై మంత్రిగారి దగ్గరకు వెళ్ళినపుడు సాయన్న కూడా తన తల్లికి, భార్యకు రోగం వచ్చింది కాబట్టి హాస్పటల్‌కు ఉన్న కొత్తగూడేనికి ట్రాన్స్‌ఫర్ అడగటానికి మంత్రిగారి దగ్గరకు రావటంతో ఇద్దరికి పరిచయం ఏర్పడుతుంది. ఇద్దరు కలిసి యూనియన్ నాయకుల అవినీతిని వ్యవస్థ యొక్క దోపిడీ స్వభావాన్ని దారిలో చర్చించుకుంటూ వచ్చినపుడు సాయన్న పిలవగా కొండన్న సాయన్న ఇంటికి వెళతాడు. గనులలో అడపా దడపా పెళ్ళలు కూలి ఇద్దరు ముగ్గురు చనిపోవడంతో కార్మికుల భార్యలకు భర్తలు డ్యూటీనుండి తిరిగి వచ్చేంతవరకు గుండెలు పీచు పీచు మంటూనే ఉంటాయని తన భార్య అయిన లక్ష్మి కూడా ఆ విధంగానే తన కోసం ఎదురు చూస్తుంటుందని కొండన్న భావిస్తాడు. సాయన్న తన తల్లి, భార్య కూడా అనారోగ్యంతో పోయారని తనకు కొత్తగూడెం ట్రాన్స్‌ఫర్ అయి ఉంటే వైద్యం చేయించ గలిగేవాడినని అప్పుడు తన తల్లి, భార్య చనిపోయేవాళ్ళు కాదని చెపుతూ వారిని చంపింది దొరలే భావించి వాళ్ళని తిడతాడు. వ్యవస్థలో జరిగే అన్యాయానికి

దోపిడీకి రాజీ పడలేనంటు తన కొడుకు ఊరు వదిలిపెట్టి వెళ్ళి చైతన్య పరుస్తుంటే అతని నక్సలైట్ అంటూ ప్రచారం చేస్తున్నారని చెపుతాడు. దీనికి తగ్గట్టుగానే ఒకరోజు సాయన్న కొండన్న లింగయ్యలు పనిచేసే చోట గోఫ్ పడుతుందని చెప్పినా ఓవర్‌మెన్ విననందుకు బాధపడుతూ గని పనిని కొనసాగిస్తున్న సమయంలో సాయన్న చమ్మాస్‌తో బొగ్గుపొరలను కొల్లబొడిచినపుడు పెద్ద బండ పడి దానికింద నలిగి సాయన్న చచ్చిపోతాడు. కొండన్నకు కాలు విరిగింది. చివరికి బావి లాంగ్‌బార్ అయిందని చెప్పి పర్మినెంట్ కార్మికులను అందరిని ట్రాన్స్‌ఫర్ చేసి బదిలీలను ఉద్యోగం నుండి తొలగిస్తారు. కొండన్నకు కాలు విరగటమే కాక ఉద్యోగం కూడా పోతుంది.

జీవితంలో రాజీపడలేమని సమాజంలో దోపిడీ దారులు రాజీపడనీయరని బ్రతుకును దినదిన గండంగా మారుస్తారని తప్పనిసరి పరిస్థితులలోనే పోరాటం చేయాల్సి వస్తుందని సాయన్న కొడుకు చెప్పిన మాటలు కొండన్నకు గుర్తుకు వచ్చి జీవితంలో రాజీ పడలేమని పోరాటం చేయక తప్పదని తెలుసుకుంటాడు.

పారిశ్రామిక సంబంధాలలో పని పరిస్థితులు బాగాలేకపోతే అవి ప్రమాదాలకు దారితీయటంతో పాటు విధి నిర్వహణనుండి తొలగించేటట్లు చేసేసరికి వారు వ్యవస్థలో రాజీపడలేకపోవటం అర్థమవుతుంది. గనిలో పని పరిస్థితులు బాగాలేక ప్రమాదాలకు దారి తీయటానికి కారణంగా ఇక్కడ గని రూఫ్ బాగాలేకపోవటంతో కార్మికులు పని పరిస్థితులతో రాజీపడలేకపోయారు. అంతేకాక సూపర్‌వైజరీ సిబ్బంది యొక్క నిర్లక్ష్యపు అంచెలంచల వారి అధికార ధోరణి ప్రధాన కారణంగా కనపడి అది కార్మికులలో పోరాటపటిమను కలిగిస్తుందని కూడా అర్థమవుతుంది.

బొగ్గు పొరల్లో : -(కార్మిక) అర్నెల్ల క్రితమే వివాహమయిన లింగయ్య , తోటి కార్మికుడైన ఎల్లారెడ్డి నర్సయ్యలతో కలిసి బొగ్గుబావి పనికి వెడుతూ పని పరిస్థితులు, జీవిత రక్షణ, ఉద్యోగ భద్రత వంటి విషయాలను గురించి చెప్పుకుంటూ డ్యూటీకి బయలుదేరారు. ఎల్లారెడ్డి భార్య గర్భవతి, ఎల్లారెడ్డి అర్నెల్ల క్రితమే పల్లెను వదిలిపెట్టి కాలరీ ఉద్యోగంలో చేరినట్టును, రోజు ఫిల్లింగ్ పని (టబ్బులో బొగ్గు నింపుట) దొరకదు గనుక, రోజూ మస్టరు రాగల డిపిల్లరింగ్ (బొగ్గు పొరల మధ్య దాట్లు పెట్టుట) పనికి ఒప్పుకున్నట్టు అర్థం అవుతుంది. లింగయ్య ఒక కార్మికుడుగా ఆ రోజు నుండియే పనికి వస్తున్నట్లు అర్థమవుతుంది.

డిపిల్లరింగ్ పనికి మజ్దూరుగా యాక్టింగ్ కడితే ఎక్కువ జీతం వస్తుంది. కాని ఆ పని బదిలీగా పర్మినెంట్ అయితే గాని ఇవ్వరు. చట్టం ప్రకారం 190 మస్టర్లు ఉంటే పర్మినెంట్ చేయవచ్చు. కానీ ఎప్పటికప్పుడు యాజమాన్యం టర్మినేషన్ ఆర్డర్ చేతిలో పెట్టడం చేత అతడికా అవకాశం తగ్గుతుంది. మస్టరు కోసం ప్రమాదభరితమైన డిపిల్లరింగ్ పనులే చేయాల్సి ఉంటుంది.

ఆ ముగ్గురు బావి దగ్గరికి వెళ్ళేసరికి ముందు షిఫ్టు కార్మికులు 'గోఫ్' (బొగ్గు బండ) చప్పుడు చేస్తోందని చెప్పేసరికి పనిస్థలం దగ్గరకు వెళ్ళాలంటే భయపడతారు. అధికారులు దాట్లు కూడా సరిపోయినన్ని ఇవ్వకపోగా ఆ రూఫ్ కింద పనిచేయమనే సరికి భయపడతారు. కాని అధికారులు ఉత్పత్తిని చూపాలంటూ ఓవర్‌మెన్‌కి వత్తిడి కలిగించి పనిలోకి దింపుతారు. రాత్రి యింటి దగ్గర గాలిలేకపోగా, మురుగు కాల్వల పైని దోమలు కుట్టుతుంటే నిద్రలేమితో ఉండి పనిచేస్తున్న ఎల్లారెడ్డికి "బాజు" కేక (గోఫ్ పడుతుంటే చేసే హెచ్చరిక) వినపడకపోయేసరికి దాటును వదిలి వేయటం, బండ కూలటం, లింగయ్య చనిపోవడం జరుగుతుంది. ఎల్లారెడ్డి కాలు విరిగి ఉద్యోగానికి పనికి రాకపోవడంగా పరిణామాల పరంపర అర్థం అవుతుంది.

ఈ కథలో కార్మికులకు వర్కింగ్ ప్లేసులో రక్షణ లేదనీ పరికరాలు కూడా చాలినంతగా అందుబాటులో ఉండవనీ, తమకు అధికారుల మధ్య వర్గ దృక్పథం వుందనే భావన కార్మికులకు ఉన్నట్టు తెలుస్తుంది. కార్మికులు పని పరిస్థితుల యందు పొంచియున్న ప్రమాదాలకు భయపడినా అయిష్టంతో మస్టరు కోసం, ఆ పని చేస్తున్నట్లు అర్థం అవుతుంది. ప్రమాదాలు జరిగినపుడు వారిలోని అసంతృప్తికి ఆజ్యం పోసినట్లుయి నిరసన జ్వాలలు భగ్గుమంటే అది సమ్మెగా రూపాంతరీకరణ చెందుతుందని అర్థం అవుతుంది. ఎల్లారెడ్డి భార్యకు ప్రథమ గర్భం. పునరుత్పత్తి ప్రక్రియలో మొదటి ప్రసవం పునర్జన్మగా భావింపబడ్డ ప్రమాదపు అంచున ఆమె ఉంటే ఇటు ఎల్లారెడ్డి ఉత్పత్తి ప్రక్రియలో చావు బతుకుల ప్రమాదపు అంచున పనిచేయటం, ప్రమాదానికి గురి అవడం, వారి భావి జీవితం వారి బిడ్డల జీవితం, ఎలా ఉంటుందోనని పాఠక హృదయాలను పట్టి బాధించే సమస్యగా కథ అర్థం అవుతుంది.

లీడరు - (తాల్మికి):- ఈ కథలో కాలరీలో ఉద్యోగం వేయిస్తానంటూ లంచావతారులైన యూనియన్ లీడర్లు లాంగ్‌టర్మినేషను చేయబడ్డ కార్మికులను ఏ విధంగా దోపిడీ చేస్తూ అధికారుల దగ్గర తమ పబ్బం గడుపుకుంటూ ఉంటారో అర్థం అవుతుంది.

యూనియన్ ఆఫీసులకెళ్లిన కార్మికులను ఆఫీసుకు వచ్చి కలుసుకోమని తిప్పుకుంటూ ఉంటారని అర్థం అవుతుంది.

జీతాల రోజు 20 మంది బదిలీలకు, చట్టబద్ధంగా రావలసిన ఏడురోజుల జీతం కోత పెట్టినపుడు యూనియన్ లీడరును అడిగినా ప్రయోజనం లేకపోయేసరికి కార్మికులు పోరాటాన్ని ఆయుధంగా చేసుకొని సమ్మెలోకి దిగుతారు. దానితోపాటుగా టర్మినేషన్ చేసుకుంటూ పోతూ ఎప్పటికపుడు బదిలీ వర్కలను పర్మినెంటు చేయనందుకును, క్యాటగిరీ యాక్టింగ్ కట్టనందుకు కార్మికులందరూ ఏకమై సమ్మెను తీవ్రతరం చేస్తారు. ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చినా అమలు చేయనందుకు యాజమాన్యం మీద కోపం వచ్చి కార్మికులు సమ్మెలోకి దిగుతారు. మూడు రోజుల తర్వాత ఆ సమ్మె మిగిలిన గనులకు కూడా విస్తరిస్తుంది. అప్పుడు యాజమాన్యం వచ్చి కన్సిలియేషన్ చేసుకుని వారి సమస్యలను వెంటనే పరిష్కరించటానికి ఒప్పందం కుదుర్చుకుంటుంది.

సమ్మె- (కార్మిక) :- డ్యూటీ చేస్తున్నపుడు కాలుకు ప్రమాదం జరిగేసరికి హాస్పిటల్‌కి వెళ్లిన వెంకటయ్య అనే కార్మికుడికి మూడు రోజులకే 'ఫిట్' చేసి డాక్టర్లు వెళ్లమంటాడు. కాని వెంకటయ్యకు కాలు వాపు బాగా వుండి, అప్పుడు 'ఫిట్' చేసినందుకు డాక్టరును ప్రశ్నిస్తాడు. దానికి ఆ డాక్టరు వెంకటయ్యను బయటకు తోసేసరికి ఘర్షణ ఏర్పడుతుంది. డాక్టరు పోలీసులను పిలిపించేసరికి వాళ్లొచ్చి వెంకటయ్యను అరెస్టు చేసి తీసుకెడతారు. ఆ విషయం తెలుసుకున్న కార్మికులు వెంకటయ్యను వదిలేవరకు డ్యూటీకి వెళ్లమని కార్మికులు సమ్మెలోకి దిగుతారు.

కంపెనీ హాస్పిటల్‌లో ధర్నా చేయడానికి బయలుదేరిన కార్మికులు దారిలో కంపెనీ స్కూలు కనపడేసరికి, కంపెనీ స్కూళ్ళలో వాళ్ళ పిల్లలకు సీటు రానందుకు బాధపడి తమ వ్యక్తిగత బాధను కూడా వెంకటయ్య బాధకు కలిపి చూసి సమ్మె చేస్తారు. వెంకటయ్యను వదలి పెట్టకపోయేసరికి 14 రోజుల ముందు నోటీసును ఇవ్వకుండా చట్టబద్ధంగాని సమ్మె చేసినందుకు ఎనిమిది రోజుల జీతం కోతను మేనేజ్‌మెంట్ విధించేసరికి దాన్ని విరమించుకోవాలంటూ కార్మికులు మళ్ళీ సమ్మెకు దిగుతారు. ఒక సమస్య మరో సమస్యకు దారి తీస్తుంటే ఒక సమ్మె మరో సమ్మెకు ప్రోద్బలం కావడం అనేది సహజ పరిణామంగా ఈ కథ అర్థం అవుతుంది.

నిర్బంధం -(కార్మిక): సమ్మె సమయంలో సాయుధ భటులు బొగ్గుబావి మీద కాపలా కాస్తున్నారు. బావి ప్రాంతమంతా నిశ్శబ్దంగా ఉంది. సైరన్ కూత కూసినా కార్మిక వాడల్లో చైతన్యం రాలేదు. కార్మిక వాడల్లో రాడికలోల్లు అంటించిన నోటీసులో "పోలీసు జులుంను ఖండించండి" అని ఉంది. కార్మికులను పోలీసుల అరెస్టు చేసినందుకు బాధపడుతూ కార్మికులు యూనియన్ వాళ్ళు రాడికల్ వాళ్ల రాజకీయాలు తమకు అర్థం కావడం లేదని భావిస్తారు. యూనియన్ వాళ్ళు వచ్చి యాజమాన్యం పోలీసులను అండగా పెట్టుకొని బాయిలు నడిపిస్తున్నారని ప్రచారం చేస్తారు. 'సమ్మె' చేయాలో లేదో అని అర్థం కాని గందరగోళంలో కార్మికులు ఉన్నారు. ఇంతలో ఒక పేపర్‌బాయ్ వచ్చి దినపత్రిక తెచ్చాడు. దాన్ని చదవమనగానే దానిలోని విషయాలను చెబుతూ, సింగరేణి సమ్మె వల్ల రైళ్లు కొన్ని రద్దు చేయబడ్డాయనీ, అనేక ఫ్యాక్టరీలు మూతపడే అవకాశం ఉందనీ, వ్రాయడంతో పాటు, రాడికల్స్ రెచ్చగొట్టటంతో సమస్యలు ఏమీ లేకుండానే కార్మికులు సమ్మె చేస్తున్నారని ఆ దిన పత్రికలో వ్రాయడం జరిగింది. ప్రభుత్వం కలకత్తా నుండి బొగ్గును తెప్పించే ప్రయత్నంలో ఉందని వ్రాశారు. 300 మంది రాడికల్ కార్మికులను అరెస్టు చేస్తే సమ్మె అగుతుందని జనరల్ మేనేజర్‌కు యూనియన్లు సలహా యివ్వడంతో పోలీసులు ఆ పని చేయడానికి కార్మికుల వాడకు వచ్చి రంగయ్య యింటికి వచ్చి, చూసి యింట్లో రంగన్న లేకపోయేసరికి ప్రతి యింట్లో ఉన్న కార్మికుడ్ని అరెస్ట్ చేశారు. ఆ విధంగా సమ్మెను అణచటంలో భాగంగా 20 మంది కార్మికులను అరెస్ట్ చేశారు.

విస్తరణ - (కార్మిక):- వెంకటయ్యకు దెబ్బ తగ్గకుండానే ఫిట్ చేసినందుకు ప్రశ్నించిన వెంకటయ్యను డాక్టరు పోలీసులను పిలిపించి అరెస్టు చేయించినందుకు నిరసిస్తూ కార్మికులు వెంకటయ్యను విడిపించాలనీ సమ్మెకు దిగారు. అయితే ఆ తర్వాత కార్మికులు (నోటీసు లేకుండా) చట్ట విరుద్ధమైన సమ్మె చేసినందుకు కార్మికుల జీతం నుండి 8 మస్టర్ల కోత పెట్టారు. దానితో కార్మికులు తాము ఊరుకుంటే ఆ తర్వాత మేనేజ్‌మెంట్ డిస్మిస్ కూడా చేస్తుంది అని భావించి, జీతం కోత విషయంలో కార్మికులు ఊరుకోకుండా సమ్మెను కొనసాగించాలని నిర్ణయించారు.

మస్టర్ల కోతకు వ్యతిరేకంగా ప్రారంభమయిన సమ్మె అన్ని ప్రాంతాలకు విస్తరించే సరికి రాజయ్యకు సమ్మె కొనసాగింపు యిష్టం లేకపోయినప్పటికీ చంద్రయ్య వచ్చి సమ్మెకు దారి తీసిన పరిస్థితులను వివరించే సరికి రాజయ్య సమ్మె చేయాలనుకుంటాడు. లీడర్లు వచ్చి కోత చట్టం లేదనీ, షిఫ్టులు

నడుస్తున్నాయనీ ప్రచారానికి దిగారు. అయినా చంద్రయ్య బొగ్గు బావి దగ్గరికి వెళ్లగా అక్కడా నోటీసు బోర్డు మీద మస్లరు కోత ఉండగల కార్మికుల పేర్లు ఉన్నాయి. అంతేగాక ఇద్దరు లాడీసోళ్ళకు ఒక మజ్దూరుకు డిస్మిస్ లెటర్ కూడా యిచ్చినట్లు తెలుస్తుంది. ఎర్రజెండా యూనియన్ లీడరు వచ్చి మీటింగ్ పెట్టి రాడికోళ్ళ మాటలు విని సమ్మె చేయకండి అంటూ చెపుతున్నపుడు ఆ లీడరును కార్మికులు ప్రశ్నించే సరికి, లీడరు మనుషులకు సమ్మె చేస్తున్న వారికి వాగ్వివాదం జరిగింది. ఒక కార్మికుడు ముందుకు వచ్చి 'యాజమాన్యం కార్మికులకు లేనిపోని సమస్యలు సృష్టించి మొండితనం అవలంబిస్తోందని కార్మికులను సమ్మె చేసే స్థితికి రెచ్చగొట్టిందని' చెప్పాడు. అప్పుడు లీడరు మాట్లాడుతూ యూనియన్ లేకుండా కార్మికులు సమ్మె చేస్తే ఎలా విజయం సాధిస్తారని సవాల్ విసిరి వెళ్ళిపోతారు. కాని సమ్మె కొనసాగింది. ఈకథలో సమ్మె అన్ని విభాగాలకు ఎలా విస్తరిస్తోందో తెలియటమే గాక, వివిధ యూనియన్ల మధ్య ఉన్న భేదాలు, యూనియన్ లీడర్ల ఆధిపత్యం అర్థం అవుతుంది.

విజయం మనదే - (కార్మిక):- సి.కా.స. (సింగరేణి కార్మిక సమాఖ్య) వాళ్లు 'విజయం మనదే' అనే పోస్టర్లు కరపత్రాలు వేయించారు. ఎన్ని రకాల నిర్బంధం చేసినా సమ్మెను విఫలం చేయలేక పోయినందుకు పోలీసులకు చిరాకు కలిగి కరపత్రాలను పంచిపెట్టే పిల్లవాడైన సత్యాన్ని పట్టుకుని ప్రశ్నిస్తూ కొడతారు. స్టేషను తీసుకొనిపోవాలనుకున్న సమయంలో కార్మికులు వచ్చి ఆ పిల్లవాడిని వదిలిపెట్టమని అడిగే సరికి వదిలిపెడ్తారు.

అయితే యాజమాన్యం కార్మికుల నమన్యలను తీర్చడానికి యూనియన్‌తో ఒప్పందం చేసుకునేసరికి కార్మికులలో గందరగోళం ఏర్పడింది. మేనేజ్‌మెంట్, యూనియన్ వాళ్లు కలిసి చేసుకున్న ఒప్పందంలోని కుట్రను, వాస్తవాలను కార్మికులకు తెలియచెయ్యాలని అనుకుంటారు. అందుకని ఎక్కడికక్కడ గుడిసెల్లో మీటింగ్‌లు పెట్టి తెలియజెయ్యాలని అనుకుంటారు.

రెండు నెలల పాటు కామ్రేడ్స్ సమ్మెను కొనసాగించి విజయం సాధించారు. బ్రిటిష్ కాలంనాటి కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన సాహస విజయం అని భావిస్తారు. ఈ కథలో అసలు సమ్మె చేయడానికి మూల కారణంగా మురికి కూపాల్లాంటి గుడిసెల్లో ఉండడం, తాగేందుకు మంచినీళ్లు లేకపోవడమే గాక, మంచి గాలి పీల్చే వీలు కూడా లేకపోవడం అనీ, ఒక్కపూటే తింటూ దూరంగా ఉన్న బావుల్లో పనికై కార్మికులు చీకట్లోనే

బయలుదేరి వెడుతూ మనసుల్లో మళ్ళీ పెళ్ళాంబిడ్డలను చూడగలమో ఏదో అన్న భయంతో కార్మికులు ఉంటారనీ, చీకటి గుహల్లాంటి బొగ్గు బావుల్లో దినదిన గండంగా బ్రతికే కార్మికులు ఎంత కష్టపడ్డా కూడా వాళ్ళ బతుకుల్లో ఎదుగూ బొదుగూ లేదనీ కార్మికులు బాధపడటం అర్థం అవుతుంది. విద్యా, వైద్య సౌకర్యాలు లేవని, చివరకు పొయ్యి రాజేసుకోవడానికి బొగ్గు కూడా దొరకదనీ, మంచి నీళ్ళు దొరకవనీ, యూనియన్ వాళ్ళు కార్మికుల్ని అడ్డుగా పెట్టుకుని మేనేజ్‌మెంట్‌తో వ్యాపారం చేస్తున్నారని కార్మికులు పలు రకాలుగా భావిస్తారు. పల్లెటూర్లలో పస్తులు పడలేక అప్పు చేసి యూనియన్ వాళ్ళు అడిగిన లంచాలిచ్చి బాయి పనిలో జేరి, బాగుపడాలనుకున్న వారికి నిరాశే మిగిలిందని కూడా అనుకుంటారు. కార్మిక వాడల్లో వసతులు సరిగ్గా లేవని, గనుల దగ్గర పని పరిస్థితులు కూడా సరిగా లేవనీ, భూగర్భ పొరల్లోకి వెళ్ళి రక్తం అంతా నీళ్ళు చేసుకుని బొగ్గు బయటకు తీసే చోట మంచినీరు లేదనీ, గాలి లేక గరిమికి ఊపిరాడక ఆయాసమొచ్చి, కూర్చుంటే పని ఎందుకు ఆపావని కార్మికుల్ని అధికారులు తిడుతారనీ,ఒక్కొక్కప్పుడు కొంత మంది కార్మికులలో బాయికాడ మస్టర్లు వేయించి అధికార్ల యింటి దగ్గర పనిచేయడానికి పంపిస్తారని వారి పని భారాన్ని తామే వహించాలనీ కూడా కార్మికులు బాధపడ్తారు.

కంపెనీ దొరల బ్రతుకులు సకల సౌకర్యాలతో బాగా సాగుతున్నాయని, బొగ్గు ఉత్పత్తికై పనిచేసేందుకు అవసరమైన తట్టా, చెమ్మాస్‌కు కూడా లేక సమ్మె చేసే అధ్వాన్న స్థితికి కార్మికులను నెట్టి దొరలు లంచాలతో బాగా డబ్బు సంపాదిస్తున్నారని అంటారు. కార్మికులను అడ్డుగా పెట్టుకుని యూనియన్ నాయకులు యాజమాన్యంతో చేతులు కలిపి క్వార్టర్లు కేటాయింపుచేసుకోవడం, బంగ్లాల వంటి ఇళ్ళను కట్టుకోవడాన్ని విమర్శిస్తారు. జీతాలు, బోనస్‌లు వచ్చినప్పుడు కూడా చందాలు వసూలు చేస్తారనీ, కార్మికులకు వారి హక్కులను బాధ్యతలను తెలియనీయకుండా చేస్తారనీ గ్రహిస్తారు. అసలు మొత్తం దేశంలోని బొగ్గుగని కార్మికుల స్థితి అదేవిధంగా ఉందనీ, జాతీయ స్థాయిలో ఉన్న యూనియన్‌లు, ఎ.ఐ.టి.యు.సి., ట్రేడ్ యూనియన్ నాయకులు రెండు సంవత్సరాల వరకు సమ్మె చేయమని మేనేజ్‌మెంట్‌తో ఒప్పందం చేసుకున్నామని అంటుంటే కార్మికుల పై యూనియన్‌లు చేసే విద్రోహం అర్థం అవుతుంది. మేనేజ్‌మెంట్ కె.కె.2 బావిలోని వెంకటయ్యను మెడికల్ ఫిట్ చేయించటానికై చేసిన ఒక్కరోజు సమ్మెకు మస్టరు కోత పెట్టడం, దానికి మళ్ళీ సమ్మెను కొనసాగింపచేసే పరిస్థితి రావడం జరిగిందని కార్మికులు భావించారు. మస్టరు

కోత చట్టాన్ని ఒక బావిలో ప్రవేశపెట్టినా గాని రీజియన్‌లోని కార్మికులందరూ కలిసి సమ్మె చేయడం చేత విజయం సాధించామని భావిస్తారు. నల్ల చట్టాన్ని రద్దు చేయడానికి కార్మికులు పార్లమెంట్‌లో ఉండాలనీ, కార్మికుల అవసరం అయితే సుప్రీంకోర్టుకు కూడా వెళ్ళాలని భావిస్తారు. రైళ్ళు నడవకపోయేసరికి యూనియన్లు ముందుకు వచ్చి కల్లబొల్లి మాటలతో సమ్మెను నీరు గార్చాలని చూసినా, లొంగక తాము సమ్మె చేసినందుకే విజయం వచ్చిందని, సమ్మె నిషేధ చట్టం తయారు కాక మనుపే కార్మికులు పోరాటంలో తర్ఫీదు పొందారని భావిస్తారు.

ఇంధనం (కార్మిక) : ఎర్రజెండా యూనియన్ వాళ్ళు రాడికలోళ్ల కంటే తాము వెనుకబడి ఉన్నిరని భావిస్తూ కార్మికులు యూనియన్‌కి చందాలు కూడా కట్టరేమో అని భయపడ్డారు. కార్మికులల్లో రాడికలోల్లకు మిగతా వారికి తేడా గుర్తించడానికి కిటుకు లాగా అతని దగ్గరకు వెడితే "దండాలు దొరా" అన్నటువంటి వాడు రాడికల్ కాదనీ, కాంగ్రెస్‌వాడనీ, గుర్తించవచ్చని, అనుకుంటారు. కార్మికులు తమ ఇండ్ల మీదకు ఎప్పుడు ఏ పోలీస్ వస్తాడో, తుపాకీ గుండు తగులుతుందో అని ఎప్పటికప్పుడు భయపడుతూ ఉంటారు. 5ఇంక్లైన్, 6నెంబరు బావిలో సమ్మె మొదలయిందనీ తమకు తెలుసునని, లీడరు ఏదో చెప్పబోతున్నా వినకుండా కార్మికులు సిక్సింక్లైన్‌లో 'సారయ్య'ను డ్యూటీ నుండి తీసేసారని అతన్ని మళ్ళీ పన్లోకి తీసుకోవాలనీ యూనియన్ లీడరు ఆ విధంగా మేనేజ్‌మెంట్‌ను ఒప్పించితేనే సమ్మె ఆపేస్తారని అంటారు. మేనేజ్‌మెంట్ వారు ఈ లీడర్లను పంపించి వారు గనుక సమ్మెను బంద్ చేయిస్తే ఆ యూనియన్ వారికి ప్రతిఫలం కూడా ముట్ట చెప్పే అవకాశం ఉంది అని అందరు ఊరేగింపుగా సిక్సింక్లైన్‌కు బయలుదేరారు. అక్కడ కార్మికులు ప్రశ్నించగానే, లీడరు వచ్చి మాట్లాడబోతే వినకపోయే సరికి పోలీసులను పిలిపించారు. సారయ్య ముందుకు వచ్చి మాట్లాడుతున్నప్పుడు పోలీసులు వచ్చి జులం ప్రదర్శించేసరికి డ్యూటీకి వెడదామనుకున్న కార్మికులు కూడా మిగిలిన వారితో కలిసి పోలీసు జులుంను ఎదుర్కోవాలనుకుంటారు. అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులపై తిరగబడాలనుకుంటూ కార్మికులు బొగ్గు పెళ్ళలు చేతిల్లోకి తీసుకోవడాన్ని బట్టి కార్మికుల పోరాటానికి సిద్ధ పడ్డట్టుగా స్పష్టం చేస్తుంది ఈ కథ.

పోరుబాటల్లో - (కార్మిక) : కార్మికులకు జామ్‌లు సప్లయి చేయాల్సిన బాధ్యత యాజమాన్యానిదే వాటిని సప్లయి చేయనందుకు చంద్రయ్య డ్యూటీలో భాగంగా

అక్కడక్కడ తుంటలు ఏరుకొని తెచ్చి పరిచేస్తుంటే ఆలస్యం అయిందని అధికారి చార్జిషీటు ఇవ్వడానికి సిద్ధపడితే తన తప్పులేదని చంద్రయ్య తీసుకోటానికి నిరాకరిస్తారు. అయితే మేనేజర్ పోలీసు వాళ్ళను పక్కన పెట్టుకొని తీసుకోమని బలవంతం చేస్తే తాను ఎందుకు చార్జిషీటు తీసుకోవాలని చంద్రయ్య ప్రశ్నించినందుకు పోలీసులు చంద్రయ్యను 'నక్సలైట్‌వి అంటూ' అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళతారు. అదే రోజు రామలింగం అనే మరో కార్మికుడు సెకండ్‌షిఫ్టులో బొగ్గు తీస్తున్నపుడు ట్రాక్‌లు సరిగాలేక టబ్బులు దొర్లితే మళ్ళీ బొగ్గును ఆ టబ్బుల్లో నింపి ఆలస్యంగా ఇంటికి వస్తుంటే 'అర్ధరాత్రి తిరుగుతున్నావు, నక్సలైట్‌వా' అంటూ పోలీసులు రామలింగాన్ని కూడా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళతారు. అక్కడ రామలింగం చంద్రయ్యను చూసి మేనేజర్ సమక్షంలోనే పోలీసులు చంద్రయ్యను తీవ్రవాదివంటూ అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తెచ్చిన విషయం తెలుసుకొని రామలింగం బాధపడ్డాడు. రామలింగాన్ని పోలీసోళ్ళు కొట్టిన దెబ్బలకు అతని ఒళ్ళంతా పచ్చి పుండుగా మారింది.

సెకండ్‌షిఫ్ట్ అయినా భర్త పని ముగించుకొని తెల్లవారినా ఇంటికి తిరిగి రానందుకు రామలింగ భార్య రాజక్క గనిలో ప్రమాదమేమైనా జరిగిందేమోనని భయపడి పక్కింటి మల్లయ్యను లేపి తన భర్త జాడ గురించి అడుగుతుంది. మల్లయ్య గనిలో ఎటువంటి ప్రమాదము జరగలేదని చెప్పి తోటి కార్మికుడైన వెంకటస్వామితో విచారణచేయగా రామలింగాన్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళారని తెలుస్తుంది. ఉట్టి పుణ్యానికి రామలింగాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్ళిన విషయం గ్రహించి కార్మికులుగా తాము నేరుగా పోలీస్ వాళ్ళను కలిసే పరిస్థితి లేక ఒక డాక్టర్ సహాయంతో పోలీసులకు డబ్బిచ్చి రామలింగాన్ని విడుపించుకొని వస్తారు. ఆ డబ్బుకోసం రాజక్క తన పెళ్ళినాడు తన పుట్టింటి వాళ్ళు పెట్టిన కడియాలను అమ్మగా వచ్చిన డబ్బులను తీసుకువెళ్ళి భర్తను పోలీసు వాళ్ళనుండి విడిపించమని అడుగుతుంది. అలాగే విడుపించుకొని వస్తారు. అయితే మరో కార్మికుడైన చంద్రయ్యను పోలీసులు విడిచి పెట్టనందుకు అందరు బాధపడుతారు. సి.కా.స. వాళ్ళ మీటింగ్‌కు వెడితే అక్కడ వారు కార్మికులముందు రెండు ప్రశ్నలు పెడతారు. అధికారుల జులుం క్రింద కార్మికులు అణిచివేయబడటమా? లేక అధికారులను వ్యతిరేకించి పోలీసుల చేతిలో నలిగిపోవటమా అన ఆలోచించమంటూ వారు చెప్పారు. ఏ రకంగా చూసినా తమకు కష్టాలు తప్పవని భావించిన కార్మికులు ఆ కష్టాల నుండి విముక్తి చెందడానికి పోరాటం చేయాలనకుంటారు. అయితే ఆ పోరాటం ఏ నల్లురో

కలిసి చేస్తే వాళ్ళని పోలీసులు అణిచి వేస్తారు కాబట్టి కార్మికులందరు కలిసి సామూహిక పోరాటంలో భాగంగా అధికారుల అణిచివేతను, పోలీసుల జులుంను ఎదుర్కోవటానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ చంద్రయ్యను విడిపించటానికి సమ్మె చేయాలని భావిస్తారు.

ఇక్కడ పారిశ్రామిక సంబంధాలలో జామ్‌లను సప్తై చేయలేని తనం చిలికి చిలికి గాలివాన అయి కార్మికుల చార్జిషీటు వరకు వెళితే అది కార్మికులలో నిప్పు రగిలించక మానదు. రాజ్య వ్యవస్థలో అధికారులైన పోలీసుల జోక్యాన్ని మేనేజ్‌మెంట్ ప్రోత్సహిస్తే అది మరింత వ్యతిరేకతను పెంచి సామూహికంగా కార్మికులందరు బలోపైతమై సమ్మెలు చేసే స్థితికి చేరుకుంటుంది. అప్పుడు ఉత్పత్తి జరుగక సంస్థకు నష్టం వస్తుంది. పారిశ్రామిక సంబందాలలో పారిశ్రామిక వివాదాల చట్టంద్వారా అటు యాజమాన్యం ఇటు కార్మికులు సమస్యలను పరిష్కరించుకోగల సందర్భంలో పోలీసుల జోక్యం అనవసరం అని భావిస్తారు. యాజమాన్యం తమ సంస్థ పరిధి వరకు తమ అణచివేత శక్తిని పెంచుకోటానికి అత్యుత్సాహం అని ప్రదర్శిస్తూ రాజ్యాధికారంలో అణిచివేతయే ప్రధాన అధికారం గల పోలీసుల అణచివేతను సహాయం చేసుకోవాలనుకుంటారు. అప్పుడు పారిశ్రామిక సంబంధాలకు విఘాతం కలిగి ఉత్పత్తికి నష్టం జరిగి సంస్థకూడా నష్టాల బాటలోకి వెళ్ళక తప్పదు. 1980 నుండి 1985 వరకు సింగరేణి చరిత్రలో ఇటువంటి సంఘటనలు పెరిగి సమ్మెలకు దారితీసి సంస్థ నష్టాల బాటలో పడటానికి కారణమయిందని కూడా గ్రహించాలి.

నల్ల కలువలు : వివిధ రచయితలు వ్రాసిన "నల్లకలువలు" అనే కథా సంపుటిలో 17 కథలు ఉన్నాయి. అవి 1. భూదేవి, 2. ఇంటర్వ్యూ, 3. జీతం, 4. ప్రస్థానం, 5. ప్రమాదం, 6. నిరసన, 7. అగ్గి, 8. బ్రతకనేర్చినవారు, 9. శత్రువు, 10. పురుడు, 11. రాక్షసులు, 12. అంతర్మధనం, 13. పెండ్లి, 14. దారులు, 15. తనకు తాకితే, 16. ఆయువు పట్టు, 17. ధీరుడు.

ప్రచురణకర్తల మాటల్లోనే ఈ కథలలో కొన్ని కనుల ముందు కనిపించే కార్మికుల జీవితాన్ని యథాతధంగా చిత్రించినవి, కొన్ని బాహిర జీవితం యొక్క అంతర్మధనాన్ని, కొన్ని కథలలో తోచిన పద్ధతిలో పెనుగులాడేవిగాను ఉన్నాయని చెప్పడం గమనార్హం.

కార్మికులు కాలరీ ఉద్యోగాలకు వచ్చి పారిశ్రామిక సంబంధాలలో ప్రవేశించడానికి ముందు ఆయా కార్మికుల జీవిత నేపథ్యంలోని కారక శక్తులను

గుర్తించే కథలుగా భూదేవి, ఇంటర్వ్యూ వంటి కథలు, గని పనిలోని ప్రమాదాల అంచున తమ జీవితాలకు భద్రత లేనితనాన్ని గుర్తించి తెలియచేసే 'ప్రమాదం' 'పురుడు' వంటి కథలు, కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు అందుబాటులో లేనితనాన్ని 'అగ్గి' వంటి కథలు, జీతం సరిపోకపోవడం వంటి వాటికి అద్దం పట్టే విధంగా 'జీతం' వంటి కథలు స్పష్టమవుతాయి

పారిశ్రామిక సంబంధాలలోని సంక్లిష్టతలు కార్మికుల కుటుంబ జీవితాలపై ప్రభావం చూపిస్తూ అవి పితృస్వామ్య చట్రంలో ఎలా బిగుసుకుపోయి కార్మిక కుటుంబ స్త్రీలకు సమస్యలుగా పరిణమించాయో తెలియచేసే విధంగా 'శత్రువు' కథ అద్దం పడుతుంది. 'పెండ్లి' వంటి కథ ఆర్థిక శక్తులకు తోడుగా పితృస్వామ్యం ఎలా బాధ పెడుతుందో తెలియచేస్తున్నది.

కార్మికుడు శ్రమ లేని కష్టాన్ని మరచిపోవడానికి 'తాగుడు'కు బానిసై చివరకు పిల్లల దృష్టిలో రాక్షసుడుగా మారిన "రాక్షసుడు" అనే కథ, ఒక కార్మికుడు వ్యసనపరుడుగా మారటానికి గల కారణాల అన్వేషణలో భాగంగా "అంతర్మథనం" వంటి కథలు స్పష్టమవుతాయి.

భూదేవి-(అల్లం రాజయ్య): భూదేవి కోడలైన సుక్కమ్మకున్న పట్నం మీది మోజు, కాలరీ ఉద్యోగం చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చనే కొడుకు మొగిలికి ఉన్న ఆలోచన కలిసి వాళ్ళు కాలరీ ఉద్యోగానికి ముడుపులు చెల్లించుకోవడానికి పల్లెలో తమకున్న భూములను అమ్మకానికి పెట్టడం జరుగుతుంది. దానికి మొగిలి తల్లి భూదేవి తల్లడిల్లుతుంది. ఆ మట్టిలో పుట్టి, ఆ మట్టిలో పెరిగి ఆ మట్టి వాసన కల ఆతని తల్లి ఆ మట్టిని కరుచుకొని చనిపోతుంది. కార్మికుడు కాలరీ ఉద్యోగంలోకి ప్రవేశించడానికి ముందున్న నేపథ్యంలో ఆర్థిక శక్తుల పీడన తల్లీ బిడ్డల సంబంధంపై ఎలా ప్రభావం చూపించగలిగిందో ఈ కథలో అర్థం అవుతుంది.

ఇంటర్వ్యూ-(రవి): గని పనికి ఏమాత్రం సంబంధం లేకపోయినా పరుగుల పందేలు పెట్టి ఉద్యోగం ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించేసరికి ఆ పరుగుడు పందాలలో పాల్గొని ఉరకలేక నేలకొరిగిన ఒక అభాగ్యుడికి బి.ఎ.డిగ్రీ ఉన్నా కూడా ఉద్యోగం వచ్చి బ్రతికే హక్కులేదని తెలియచేసే కథ ఇది.

జీతం - (మేరు రవీందర్): కార్మికుని కష్టానికి, అతని ఘర్మజలానికి ఖరీదు కట్టిన జీతాల జాతర రోజు జీతం అందుకొన్న ఒక కార్మికుడు ఇంటికి వస్తు దారిలో

కనబడిన సారాకొట్టు దగ్గర ఆగి, ఖాతా చెల్లించి, బాగా తాగి యింటికి వచ్చే సరికి 'జీతం' అంతా ఖర్చుచేసినందుకు భార్య దృష్టిలో దోషిగా నిలబడతాడు. 'బియ్యం, పప్పులు ఇచ్చే నెల జీతం అయిపోయేసరికి కార్మికుని జీవితంలో శూన్యం చోటుచేసుకుంటుందన్న సత్యాన్ని తెలిపే కథ.

ప్రస్థానం-(కాలువ మల్లయ్య): మాధవయ్య, రాజలింగం, ఓదెలు వంటి కార్మికులు తాము గనిపనిలోకి రావడానికి గల నేపథ్యాన్ని చర్చించుకుంటారు. పొలాలు పండక అప్పుల పాలై బతుకు బరువు కాగా కాలరీ ఉద్యోగానికి వచ్చి బతుకుదామని వచ్చినవారు మాధవయ్య, రాఘవయ్యలు, సాలెపని చేసుకునే ఓదెలు కూడా బట్టలు నేసి షావుకార్లకమ్మినా, ఖర్చులు కూడా గిట్టుబాటు కాక వ్యాపారం వదలి గనిపనికి వచ్చానని చెబుతాడు. మాధవయ్య తమ్ముడు కిష్టడు బి.ఎ.పాసై ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాడు. పేద మధ్య తరగతి రైతాంగ కుటుంబాల నుండి వచ్చిన ఆ కార్మికులు ఈ యాంత్రిక జీవితానికి అలవాటు పడలేకపోవడం, నాగలి పట్టి దున్నగల వాళ్ళైకూడా వర్షాలు లేక పంటలు పండకపోయే సరికి గని పనికి వచ్చి తట్టలు మోసేందుకు సిద్ధపడతారు. గాలి లేని మృత్యు కూపాల్లోకి పోవాల్సింరావడం వంటి వారి యొక్క అసంతృప్తులను పరస్పరం తెలియచేసుకుంటారు. మాధవయ్య భార్య సుగుణ కూడా గని ప్రాంతానికి వచ్చి నీళ్ళకోసం గంటల తరబడి కష్టపడడం, బొగ్గు కొట్టుకుని పొయ్యి అంటించడం వంటి గృహ కృత్యాల విషయంలో కూడా పల్లెటూళ్ళ కంటే యిక్కడ కష్టపడుతున్నట్లు వ్యక్తం చేసుకుంటుంది. వీళ్ళ మాటలు వింటున్న కృష్ణయ్యకు ప్రజల దుర్భర జీవితాలకు 'ప్రస్థానంతో' గాని పరిష్కారం లేదని భావిస్తాడు.

ప్రమాదం - (గోపిచంద్): ఈకథలో భాగంగా కార్మికులు ఐదవ ఇంక్లైన్ పని పరిస్థితులను గురించి ప్రమాదభరితమైన గోఫ్ గురించి రెండు రోజుల నుండి పై అధికారులకు చెప్పినా కూడా పట్టించుకొనకపోతుంటే రూఫ్ నుంచి బండ కూలి ఇద్దరు కార్మికులు మరణిస్తారు. వరుసగా జరుగుతున్న ప్రమాదాల కారణంగా కార్మికులలో అసంతృప్తి పెరిగిపోయింది. ఆగష్టు నెలలోనే 3వ ఇంక్లైన్‌లో 4 గురు చనిపోవడం, వంటి ప్రమాదాలు జరగడంతో కార్మికులు మేనేజ్‌మెంటుకు ఉత్పత్తి మీదనున్న శ్రద్ధ కార్మికుల ప్రాణాల మీద లేదనీ టన్ను బొగ్గు కంటే కుడా కార్మికుల ప్రాణమే చులకనైందనీ భావిస్తారు.

అయితే మేనేజిమెంటు బొగ్గు బావుల్లో ప్రమాదాలు చాలా సహజమనీ

ప్రమాదాలు ఒక్క సింగరేణి లోనే జరగటం లేదనీ, ఇతర పరిశ్రమలలో కూడా జరుగుతున్నాయని ప్రచారం చేయటంతో కార్మికుల ఆందోళన తీవ్రమవుతుంది. రక్షణగా పోలీసులను పిలుస్తారు. మల్లయ్య యొక్క బావ పోషం రెండేండ్ల క్రింద బాయి ప్రమాదంలో చనిపోతే అక్క తల్లిదండ్రుల పోషణలో భాగంగా గనిపనికి వచ్చిన మల్లయ్య ఆర్నెల్లు తిరగకుండానే గని ప్రమాదంలో చనిపోతారు. బాయిలో ప్రమాదం జరిగి ఎవరైనా కార్మికుడు చనిపోతే బాయి బందు పెట్టకుండా మిగతా కార్మికులు ఆరోజు పనిచేసి వచ్చిన జీతం నుండి ఐదో, పదో యిచ్చే సత్‌సంప్రదాయాన్ని మేనేజంమెంట్ ప్రోత్సహిస్తున్నట్టుగా కార్మికులు భావించటం ఈ కథలో అర్థం అవుతుంది.

నిరసన -(ఆకిరెడ్డి శ్రీనివాస రావు) : గనుల ప్రాంతాలలో ఉన్న భూములను కంపెనీ తన ఆధీనంలోకి తీసుకుంటే నష్టపరిహారంగా డబ్బులు యిస్తుందనీ, కంపెనీ ఉద్యోగం కూడా ఇస్తుందనీ ఆశించిన లచ్చాలుకు తన భూమి అంతకు మునుపే పల్లె దొరల చేతిలో పడిందనీ, దొర యొక్క పెత్తందారీతనానికి లొంగి దొర యిచ్చిన డబ్బులకే ఆ పొలాన్ని దొరలకు అమ్మాల్సిరావడంగా ఈ కథ అర్థం అవుతుంది.

అగ్గి- (వేల్పుల నారాయణ) : తెల్లవారుఝామునే లేచిన రాజయ్య భార్య మల్లమ్మ తన భర్త గనిపనికి పోవడానికి వీలుగా అన్నం వండి పెట్టి, మంచినీళ్ళ తేవడానికి బయలుదేరుతుంది. దూరంగా ఉండి కొంచెము సేపు మాత్రమే నీళ్ళ సరఫరా ఉంటే పంపు దగ్గరకు నీళ్ళ కోసం పరుగులు పెట్టింది. ఈ లోపునే గుడిసెకున్న తడిక తోసుకుని కుక్కలు వచ్చి అక్కడ వండి పెట్టిన అన్నం తినడం జరుగుతుంది. ఆమె వచ్చి మళ్ళీ అన్నం వండి భర్తను లేపి రెండో బిందె కై నీళ్ళను తీసుకుని వచ్చేటప్పుడు మురుగు కాలువ మధ్యన ఉండే పందులు అడ్డం పడటంతో ఆమె పడిపోయి కాలు విరుగుతుంది.

ఆమె భర్త డ్యూటీకి సెలవు పెట్టాలనుకున్నా జీతం కోత ఉంటుందని భావించి డ్యూటీకి వెళ్ళి మస్టరు వేయించుకొని వస్తాడు. హాస్పిటల్‌కి తీసుకుని వెడితే అక్కడ హాస్పిటల్‌లో డాక్టరు ఈమెను పరీక్షిస్తూ ఉండగానే ఒక అధికారి రావడంతో ఈమెను వదలి వెళ్తాడు. దానితో రాజయ్య బాధపడతాడు. ఈ కథ కార్మిక వాడల్లోని సంక్షేమ కార్యక్రమాల అమలుకు అద్దం పట్టడమే కాక దానిలోని వర్గ స్వభావాన్ని కూడా ఎత్తిచూపిస్తుంది. కథలో భాగంగా బ్లాస్టింగ్ చేసినపుడు అధికార్లు రూఫ్ తనిఖీ సరిగ్గా చేయకపోవడంతో బండకూలి కార్మికులు తీవ్రంగా

గాయపడి హాస్పిటల్‌కు వస్తారు. దాన్ని చూసిన రాజయ్యకు తమ ఉద్యోగం ఎంత ప్రమాదభరితమో ఊహించుకొని తాము కష్టపడి బొగ్గు తీసి కోట్లాది లాభాలు తెచ్చి పెడుతుంటే, సౌకర్యాలు మాత్రం అనుభవించేది అధికార్లు అని గ్రహింపుకు వచ్చి రాజయ్యలో అగ్గి రాజుకుంటుంది.

బతకనేర్చినవాడు - (పి.రాజేశ్వరరావు) : గనుల ప్రాంతాలలో లక్కీ స్కీముల పేరిట కార్మికులను దోచుకున్న వారు లాభాలు గడించి ఎలా బతుకుతున్నారో తెలిపే కథ యిది.

శత్రువు- (ఎస్.ఆర్. ప్రసన్నకుమార్) : ఒక్కరోజు కూడా పనిచేయడం కష్టంగా ఉండేటటువంటి, ఎత్తు తక్కువగా గల త్రీ సీములో వంగినడవడం, తట్ట ఎత్తడం కష్టమైన పని. అప్పటికే చాలా రోజుల నుండి అక్కడ పనిచేస్తున్న శారన్న, మల్లయ్యలు అక్కడ పని చేయమని మొండికేస్తారు. కాని మేనేజర్ వేరే బదిలీ ఫిల్లర్స్‌ను ఒక నాల్రోజుల పాటు పంపమని చెప్పాడు. ఓవర్‌మెన్ ఆ బదిలీల దగ్గరకు వెళ్ళి త్రీస్కీములో చేయమంటూ లింగయ్య వంటి కొంత మంది కార్మికులను అడిగాడు. అయితే క్రితం రోజు వరకు రెండు లెవెల్స్ చేసి అలిసిపోయిన ఆ బదిలీ ఫిల్లర్స్ దానికి యిష్టపడలేదు. చివరికి లింగయ్య రాజీపడి ఫైలును (జంట కార్మికులు : ఒకరు బొగ్గు తవ్వి తట్టలో వేస్తే మరొకరు టబ్బులో పోస్తారు) ఒప్పింపజేశాడు. మిగతా బదిలీలు కలిసి రెండో బదిలి (షిఫ్టు)కు బావి లోపలికి దిగారు. త్రీ సిములో పనిచేస్తు వంగుతట్ట (వంగి వీపు మీద పెట్టుకునే తట్ట) లోకి బొగ్గు ఎత్తి, మెట్లు దిగి, మెట్లు ఎక్కి టబ్బులో పోసేసరికి చాలా అలిసిపోయారు. పైగా లోపల దుమ్ము, పొగ కూడా. దానికి తోడు సర్దార్ వచ్చి మనిషికి రెండు చొప్పున రెండ్రెండు టబ్బులు ఫైలు నింపాలనీ అజ్ఞాపిస్తాడు. రాత్రి షిఫ్టుకు గంట ముందు చూసుకుంటే ఒక్కొక్కరు ఒక్క టబ్బు చొప్పున పదిమంది (ఒక గ్యాంగ్) ఒక స్పాట్‌లో పది టబ్బులు నింపగలిగారు. ట్రాక్ సరిగా లేక రెండు టబ్బులు దొర్లిపోయాయి. మళ్ళీ వాటిల్లో బొగ్గు నింపాల్సి వచ్చింది. అలా కష్టపడి యింటికి వచ్చే సరికి లింగయ్య భార్య సుగుణ లింగయ్య రాకకోసం గంట ముందు నుండియే ఎదురుచూస్తూటుంది. బిక్కుబిక్కుమంటూ ఆ గుడిసెలో గుడ్డి దీపం ముందు ఒంటరిగా కూర్చుని బాధపడుతూ కనీసం ఇరుగుపొరుగు స్త్రీలు కూడా కలిసి మెలిసి తోడుగా ఉండరని తనలోతాను అనుకుంటుంది. దానికి కారణంగా భర్త తాగొచ్చినా భరిస్తూ భర్త ఆంక్షలతో గడప దాటి రాకుండా తలుపేసుకుని ఇంట్లోనే మగ్గే కార్మికుని భార్య

ఒకరైతే, మరొక భార్య తాగొచ్చిన భర్త చేతిలో తన్నులు తినే స్థితిలో ఉందని భావించి చలిస్తుంది. కొంత మంది కార్మికులు తమ భార్యలను గ్రామాల్లోనే ఉంచారు. లింగయ్య వచ్చి రెండు చెంబుల నీళ్ళు పోసుకుంటుంటే సుగుణ తన భర్తకు వీపు తోమటానికని వెళ్ళి ముట్టుకోగానే లింగయ్య తట్ట మోసిన కారణంగా వీపుకు రాపిడి కలిగి మంటపుట్టే సరికి భార్య మీద మండిపడతాడు. ఆ తర్వాత భార్య ఒకతున్నదనీ పట్టించుకునే స్థితి కూడ లేక మంచం మీద గుర్రుపెట్టి నిద్రపోతాడు. దానితో మంచు ముద్దగా మారిన సుగుణ నిద్రరాక చల్లగాలికై వాకిట్లోకి వచ్చి వెన్నెల్లో కూర్చుంటుంది. గాలి లేక నిద్ర నుండి లేచిన భర్త సుగుణ కూర్చున్న విషయం గ్రహించి ఆమెను అనుమానాస్పద మాటలతో రెచ్చగొట్టి ఆమెను కొట్టుకుంటూ ఇంట్లోకి లాక్కుపోతాడు. పల్లెటూళ్లలో భార్యతో కలిసి పొలం పనులు చేసుకుంటూ ఇంట్లో అన్యోన్యంగా ఉన్న లింగయ్యకు ఇప్పుడు తాను గని పనిలో పడ్డ కష్టాలకు తన భార్య సుగుణయే కారణము అని అనిపిస్తుంది. భర్త కొట్టినందుకు సుగుణ కూడా భర్తను ఒక శత్రువుగా చూస్తుంది. అసలు శత్రువును గుర్తించలేని వారి కుటుంబ సంబంధాలు శత్రు పూరితంగా మారుతాయి.

పురుడు - (బండిశేరాలు) : చంద్రయ్య తనకు కొడుకు పుట్టినందుకు బారసాల చేస్తూ మిత్రులైన కొంతమంది కార్మికులను పిలుస్తారు. అయితే అందులో ఓదెలు అనే కార్మికుడ్ని తన కొడుకు పేరును సూచించమని చంద్రయ్య అడిగే సరికి ఓదెలుకు తన కొడుకుకు రాజు అనే పేరు పెట్టిన సందర్భం గుర్తుకు వస్తుంది. పాలేరుగా దొర క్రింద పనిచేయలేక కాలేరుపనికి వచ్చి తన కొడుకు దొర బిడ్డలాగా చదువుకోవాలని కలలు కంటూ కంపెనీ స్కూల్లో చేర్పించాలని వస్తే సీటు రాలేదనీ, ప్రభుత్వ పాఠశాలలో వేస్తే చెడు తిరుగుడు తిరిగి చివరికి బదిలీ ఫిల్లర్‌గా గనిలోని ఉద్యోగంలోకి చేరాడని గుర్తు చేసుకుంటాడు. అందుకని కోల్ ఫిల్లర్ కొడుకు బదిలీ ఫిల్లర్ అవుతాడు కాబట్టి ఏ పేరు పెట్టినా ఒకటేనని భావిస్తాడు. కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలలో ఒకటైన విద్యా వసతి కార్మికులందరికి అందుబాటులో లేదనీ దానితో కార్మికులు అసంతృప్తులకు లోనవుతారని అర్థం అవుతోంది.

రాక్షసులు - (యం. ప్రదీప్): రాజేశం తండ్రి రాజేశాన్ని కాలరీ ఉద్యోగంలో పెడతాడు. ఆ ఉద్యోగం అంటే యిష్టంలేని రాజేశానికి తండ్రి యెడల ద్వేషం కలుగుతుంది. ఇద్దరూ బద్ధ శత్రువుల్లా మాట్లాడుకుంటుంటే వచ్చిన రాజేశం యొక్క స్నేహితుడైన

శంకరం విని ఆలోచిస్తాడు. ఆలోచించి 30ఏండ్లు బాయి పని చేసి అలసిపోయిన దాన్నుండి ఉపశమనానికై అలా కార్మికులు తాగుతున్నారనీ, అసలు బాయి పని చేయడం చేతనే మనుషులు రాక్షసులైపోయారని చెబుతాడు. రాజేశానికి తమ కార్మిక వీధుల్లో భార్యాభర్తలు, తండ్రికొడుకులు అలా బద్ధ శత్రువుల్లా మాట్లాడుకోవడానికి కారణం గని పనియే అని నిర్ధారణకు వచ్చి తండ్రిని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తాడు.

అంతర్మథనం - (రామశంకర్) : చదువైపోయి ఖాళీగా తిరుగుతుంటే తన తండ్రికి కోపం వచ్చి తిడుతున్నాడనీ, తల్లిని కూడా తిడుతున్నాడనీ భావించి తండ్రి అలా అవడానికి 25 ఏళ్ళ నుండి చేస్తున్న గనిపని అని గ్రహింపుకు వచ్చి అంతవరకు తండ్రిని ద్వేషించిన కొడుకు మిత్రుని లేఖతో అంతర్మథనం చెందుతాడు. బొగ్గు బావి పనిలో బొక్కగా మారిన తండ్రి శరీరం యొక్క అనుభవం వెనుకగల మనసుని ప్రేమించాలనీ, తాను కూడా తిరుగుళ్ళు తగ్గించి శ్రమించాలని భావిస్తాడు.

పెండ్లి - (తుమ్మేటి రఘోత్తమరెడ్డి) : రాజం యింట్లో కూతురు పెళ్ళికి వచ్చిన వియ్యాల వారు దొరతనం చూపిస్తూ కట్నకానుకల కోసం పీక్కుతింటారు. పల్లెటూళ్ళో గొడ్లు కాసి ఆ తర్వాత బాయి పనికి వచ్చి 20 ఏండ్లు కష్టపడి పనిచేసి మెడికల్ అన్‌ఫిట్ అయి వచ్చిన రిటైర్‌మెంట్ డబ్బులన్నీ కూతురు పెళ్ళికి ఖర్చు అయిపోతాయి. బొగ్గుగని పనితో శరీరపు సత్తువ పోతే చివరికి వచ్చిన రిటైర్‌మెంట్ సొమ్ము కూడా వియ్యాలవారు ఎత్తుకుపోయి జీవితంలో శూన్యాన్ని మిగిల్చారని భావిస్తాడు. మనిషి జీవితంలో ఒక కార్మికుడుగానే గాక, ఆడపిల్ల తండ్రిగా కూడా రాజం దోపిడికి గురి అయినట్లు అర్థం అవుతుంది.

దారులు - (మొగరం గట్టయ్య) : కార్మికుడిగా రిటైరైన ఒక తండ్రి తన కొడుకును కాలరీ ఉద్యోగంలో పెట్టినందుకు బాధపడుతుంటే, లచ్చు మామ వచ్చి మళ్ళీ కొడుకులకు కూడా ఈ కష్టమైన గనిపని ఎందుకని తాను తన కొడుకుల్ని ఎక్కడైనా ఉద్యోగం చేసుకోమని పంపిన విషయాన్ని చెప్పి కొడుకులను కూడా మళ్ళీ ఆ కాలరీ ఉద్యోగంలో పెట్టి కష్టపెట్టటం అనవసరమని అంటారు.

తనకు తాకితే - (ఆకుల సమ్మయ్య) : ఓదేలు, రాజీరు గని కార్మికులు. బదిలీ టైముకి బాయి దగ్గరికి పోయిన ఓదేలు సమ్మె జరుగుతుండడంతో డ్యూటీకి వెళ్ళక కల్లు పాక దగ్గరకు వెళతాడు. ఓదేలు రాజీరుతో గనిలో సమ్మె జరగడానికి కారణాలు చెబుతూ ఫాల్‌బ్యాక్ మస్టర్ కావాలని సమ్మె చేసినందుకు లచ్చన్నకు

చార్జిషీటు యిచ్చారనీ, పోయిన సారి సమ్మె చేసిన కారణంగా యిపుడు లచ్చన్నను డిస్మిస్ చేసినందుకు కార్మికులు సమ్మె చేస్తున్నట్లుగా అర్థం అవుతుంది. అవులావుల కొట్లాటల మధ్య లేగ లాగ కంపెనీ వాళ్ల గొడవలకు, యూనియన్ వాళ్ల గొడవలకు మధ్య లచ్చుమయ్య డిస్మిస్ అయినాడని చెబుతాడు. సమ్మె చెయ్యకపోతే మనకు కూడా ఇలాంటి డిస్మిస్ వస్తే మనకు కూడా ఆ కష్టం అంటే ఏమిటో అని అర్థం అవుతుందనీ చెబుతాడు.

ఆయువు పట్టు - (బి. విజయ చందర్) : 190 మస్టర్లు ఉన్న బదిలీ వర్కర్లను పర్మినెంటు చేయ్యాలని చేసిన సమ్మె గురించి ఐదుగురు కార్మికులు మాట్లాడుకుంటూ కంపెనీ యాజమాన్యం సమ్మె చేయవద్దని అంటుంటే యూనియన్లు చేయండని అంటారని కార్మికులు భావించటంగా అర్థం అవుతుంది. కనుక అలాగే కార్మికులు కూడా కంపెనీ యూనియన్ వాళ్ళ ఆయువుపట్టును ఎక్కడుందో తెలుసుకోవాలని భావిస్తారు.

ధీరుడు - (ఎ. చైతన్య): రైలు పెట్టెలో పేకాడుకుంటూ కూర్చున్న నలుగురు యువకుల్ని తోసి ఒక మూగవాడు తెగింపుతో అక్కడ నిలబడ్డ ముసలి అవ్వని కూర్చోబెడతాడు. అతని చూపులు చాలా తీక్షణంగా ఉంటాయి. ఆ చూపుల శక్తిని గుర్తుకు తెచ్చుకున్న మరొక వ్యక్తి మళ్ళీ అదే రైలు స్టేషన్‌లో ఆతని కర స్పర్శలోని గరుకుదనం వల్ల అతడు చేసే పనిలోని కష్టం కూడా అర్థమై అతడి యొక్క తెగింపుకు కారణం అర్థం అవుతుంది. కష్టపడే వ్యక్తి తెగింపుకు రావడం సహజమేనని అలానే కష్టించే కార్మికుల్లో కూడా తెగింపు వస్తుందని అనుకోవడంగా ఈ కథ అర్థం అవుతుంది.

సింగరేణి బతుకులు-(మూట శంకర్): దీనిలో (1) 'మేడే', (2) లీడరు, (3) జీతం – లాభం అన్న మూడు కథలు ఉన్నాయి. 'మేడే' స్ఫూర్తిని గురించి 'మేడే' కథలోను, యూనియన్ లీడర్ల మోసాలను గురించి 'లీడరు' కథలో చెప్పడం జరిగింది. 'జీతం – లాభం' కథలో ఉత్పత్తి శక్తులు కార్మికులేనని, కార్మికుల వల్ల సంపదలు ఏర్పడుతున్నాయి. కాబట్టి ఉత్పత్తి లాభాలలో కార్మికులు భాగస్వామ్యాన్ని కోరుకోవడంగా కథ అర్థమవుతుంది. కంపెనీ ఖర్చులు పోగా అధిక లాభాలు రావడానికి కార్మికులు కారణం కాబట్టి కార్మికుని అదనపు శ్రమ దోపిడియే కంపెనీ కి లాభం అని దానిలోని అంతర్ కథ ద్వారా స్పష్టం చేయగం జరిగింది.

నీడకోసం - (తుమ్మేటి రఘోత్తమ రెడ్డి) :

వీరయ్య అనే కోల్‌ఫిల్లర్ కొడుకు నారాయణ. నారాయణ కూడా బదిలీ ఫిల్లర్‌గా పనిచేస్తూ ఉంటాడు. అయితే నారాయణకు అదే వీధిలో చివరింటి అమ్మాయితో పెళ్ళి జరిగినా భార్యను కాపురానికి తీసుకురాలేకపోతున్నాడు. దానితో భార్యాభర్తలిద్దరు తిట్టుకోవడం కొట్టుకోవడం రివాజుగా మారింది. భార్యను కాపురానికి తెచ్చుకోలేని అశక్తతను చింతిస్తూ రాత్రిపూట వీధుల్లో తిరుగుతూ గడుపుతుంటాడు. 'పాన్'ని అలవాటు చేసుకుంటాడు. ఒకరోజు కొడుకు కోసం వీరయ్య ఆ 'పాన్' షాప్ దగ్గకు వెళ్ళి అక్కడకు వచ్చిన మరొక కార్మికునితో తన సమస్యను చెప్పేసరికి, ఇళ్ళు లేని కార్మికులందరూ కలిసి తెల్లార లైల్వే ట్రాక్ పక్కన, కంపెనీ భూమిలో గుడిసెలు వేసుకుంటూ నారాయణ భార్యను కాపురానికి తెచ్చుకుంటారు. వియ్యపురాళ్ళిద్దరూ మళ్ళీ స్నేహితులవుతారు. అయితే కంపెనీ వాళ్లు పోలీసులకు చెప్పేసరికి పోలీసువాళ్ళొచ్చి గుడిసెలు పీకేసి, అడ్డువచ్చిన అందరినీ అరెస్టు చేస్తారు. వారిలో రాజలింగాన్ని పోలీసులకు డబ్బుయిచ్చి విడిపించుకుంటారు, గానీ మిగిలిన వారిని వదలనందుకు అందరూ కలిసి కంపెనీ వాళ్ళ, పోలీసువాళ్ళ జులుంని అణచివేయాలనుకొని సి.కా.స. లో చేరి వారిని ఎదుర్కోవాలనుకుంటాం.

నివురుగప్పిన నిప్పు (సముద్రుడు): 'సముద్రుడు' బోనస్ పెంచటానికి మస్టరు కోతను రద్దు చేయడానికి కార్మికులు సమ్మె చేస్తారు అయితే యాజమాన్యం కనుసన్నలలో ఉండే యూనియన్ సమ్మెకు 'బంద్' పెట్టమని అడిగితే కార్మికులు యూనియన్‌లు ప్రశ్నిస్తారు. యూనియన& పోలీసువాళ్ళతో కలిసి కార్మికుల్ని అరెస్టు చేయించేసరికి గుండెలోని నిప్పు నివురుగప్పినట్లు ఉంటుందనీ, మళ్ళీ ఇంకొక పోరాటానికి తోడు అవుతుందని అంటాడు.

గొడుగు (మురళీధర్): కృష్ణయ్య అనే ఎలక్ట్రీషియన్ భార్య శ్యామల. శ్యామల అన్న డబ్బును వడ్డీలు తిప్పుతూ పిల్లలను ఇంగ్లీషుమీడియం చదువులు చదివిస్తుంటాడు. శ్యామల తన అన్నతో భర్తను పోల్చుకొని తన భర్త తెలివితక్కువ వాడని భావించినది. శ్యామల వానలో తడిచిన సాక్సులతో పిల్లలు స్కూలుకు వెడితే టీచర్లు తిడతారనీ, పాతగొడుగా చినిగిపోయిందనీ, ఇంకొక గొడుగును తెమ్మని భర్తకు చెబుతుంది. తన భర్త కొత్త గొడుగు కొననందుకు భర్త మీద అలిగి తన నిరసనను తెలియచేస్తున్నది. డ్యూటీ నుండి అలసిపోయి వచ్చిన కృష్ణయ్య ఇంటివారెవరినీ పట్టించుకోలేదని తిడుతూ ఆ కోపాన్ని పిల్లల మీద చూపిస్తూ

పిల్లల్ని కొడుతుంది. అయితే స్త్రీ-పురుషులు సమానమనే భావన కలిగిన కృష్ణయ్య తానే కాఫీ చేసుకొనివచ్చి ఇంటికి వచ్చిన తన మిత్రులకు కూడా ఇస్తారు. ఇంటికి గొడుగులు బాగుచేసేవాడు వచ్చి తన పిల్లలను ఖర్చుపెట్టి ఇంగ్లీషుమీడియం చదువులు చదివించినా ఉద్యోగాలు రాలేదనీ, కాఫీ కప్పులు కడుగుతూ జీవిస్తున్నారనీ చెప్తాడు నిజాయితీగల తన భర్త పాత గొడుగును బాగుచేయించమని చెప్పేసరికి శ్యామల తన కలల ఆకాశం కూలిపోయినట్లు భావించి నేలమీద పడుతుంది. తనుపడుతుంటే తన భర్త గొడుగుపట్టి ఆపుతున్నట్లు భావిస్తుంది.

నా పాత స్నేహితుడు (శశిధర్): కార్మికుడిగా గనిలో పరిస్థితులు బాగాలేక పోయినప్పటికీ అన్ని ఇబ్బందులూ ఎదుర్కొని గనిపనిలో నిలదొక్కుకుంటారు. గాలిసప్లయి ఉండి, తట్టా, చెమ్మాలు, బూట్లుఇస్తే, గనిపని అంతకష్టంగా ఉండదని భావిస్తూ, సమస్త భూగోళాన్ని గోళికాయలా చేసి దాని అణువణువుని పరిశోధించి శ్రమకున్న విలువలు తెలుసుకుంటాడు. కాని తన పాత స్నేహితుడైన నిరంజన్ శ్రమ విలువ తెలుకోకుండా డబ్బులు ఇవ్వలేదంటూ పాలేరును ఈడ్చుకు తీసుకువెడుతుంటే ఆ ఊరివాళ్ళు నిరంజన్‌ని కొడతారు. అదిచూచిన ఈ గని కార్మికుడు నిరంజన్ తత్వానికి బాధపడతాడు.

కొత్త ఎత్తు (కార్మిక): దొరల యిష్టారాజ్యాన్ని ఎదుర్కొన్న చంద్రయ్య గనిలో దాట్లు పెట్టటానికై 'జామ్'ల కోసం తిరుగుతూ ఇంకా పనిమొదలుపెట్టలేదంటు చంద్రయ్యను డిస్మిస్ చేసారు. దానికి కార్మికులు సమ్మె చేస్తుంటే పోలీసులు వచ్చి చంద్రయ్యను అరెస్టుచేసి 14 రోజులైనా విడిచిపెట్టలేదు. అంతకు ముందు కూడా 1981లో 56 రోజులపాటు సమ్మెచేస్తే మస్టర్ల కోత పెట్టారు ఆ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సమ్మెచేస్తే ఇదే యూనియన్ వ్యతిరేకించిందనీ, ఇప్పుడుమాత్రం యూనియన్ వాళ్ళు లేబరోళ్ళలో పడిపోతున్న తమ పలుకుబడిని నిలబెట్టుకోవటానికి సమ్మె చేయమని చెబుతున్నారనీ కార్మికులు భావిస్తారు.

కొత్త యమ్.డి. గారు కార్మికులు సమ్మెను చేయకుండా యూనియన్ చూడనందుకుగాను యూనియన్ లకు కావలసిన పనిని చేసిపెట్టలేమని అన్నారు. అందుకు యూనియన్‌లు సమ్మె చేయమంటున్నారు. అయితే పోలీసులు నిలబడి కార్మికుల్ని బలవంతంగా బావిలోకి దింపుతున్నారని, పాతతరం వాళ్ళు డ్యూటి చేస్తున్న కొత్తతరం కార్మికులు తమ కార్మికుల హక్కుల గురించి మరియు లీడర్లు చేస్తున్న మోసాన్ని కంపెనీవాళ్ళు చేసే కుట్రలను గురించి ఆలోచించటం

మొదలుపెట్టేసరికి పోలీసుల తుపాకులతో భయపెట్టి పనిచేయించాలనుకొనే 'కొత్త ఎత్తు' ను కంపెనీ కనిపెట్టిందని భావిస్తారు.

నీళ్ళ తగవు (తుమ్మేటి రఘోత్తమ రెడ్డి) : కార్మికుని భార్యయైన సమ్మక్క "మాదిగోనికి నిప్పు కరువైనట్లు, బాయి పనోడికి నీళ్ళ కరువు" అనుకుంటూ తెల్లారి లేస్తూనే కుండలు పట్టుకొని బయల్దేరింది. కార్మికులు ఉన్నచోట నీళ్ళ పంపు లేదు. కార్మికుల భార్యలు ఎదురుగా వున్న కంపెనీ క్వార్టర్‌లోకి వెళ్ళి నీళ్ళు తెచ్చుకొని పబ్బం గడుపుకుంటారు. అయితే ఒక రోజు ఒక అధికారి ఇంట్లో పంపుకు ట్యూబ్ పెట్టి పూలతోటకి నీటిని వదిలిపెట్టటంచూచి ఆ ట్యూబును తీసి కార్మికుని భార్య మంచినీళ్ళు పట్టుకుంటే ఆ ఇంటి కుర్రాడు వచ్చి పంపు క్రింద పెట్టిన కుండలను పగలకొట్టాడు. దానితో సమ్మక్కకు కోపం వచ్చి కుర్రాడిని తిట్టింది. తిట్టినందుకు అతని తల్లి వచ్చి వకాల్తా పుచ్చుకొని నోటి దురదతో మాట్లాడేసరికి అది చిలికి చిలికి గాలివానగా మారి అటు అధికారవర్గం మధ్య ఇటు కార్మిక వర్గం మధ్య ఘర్షణగా పరిణమించింది. అప్పటినుండి అధికారుల క్వార్టర్స్‌లో కార్మికులను నీళ్ళు పట్టుకోనీయకపోయేసరికి కార్మికుల భార్యలు బొగ్గుబావి దగ్గరున్న పంపు దగ్గరకు వెళ్ళి నీళ్ళు తెచ్చుకుంటారు. కార్మిక స్త్రీలందరూ కలిసి గుడిసెల దగ్గర పంపులు వేయమని భర్తల చేత దరఖాస్తులు పెట్టించినా ఫలితం లేకపోయేసరికి కార్మిక కుటుంబ స్త్రీలు ఏజెంటు వెళ్ళే దారిలో బైఠాయించేసరికి ఏజెంటు పంపులు పెట్టిస్తానని హామీ ఇస్తాడు. 300 మంది కార్మికుల భార్యలు పంపునీళ్ళవసతిని సాధించుకున్న వైనం వేలాది కార్మిక కుటుంబస్త్రీలలో ఉత్తేజం తెప్పించిందని అక్కడివారు భావించటం జరిగింది. తెల్లవారిన తరువాత పంపు నీటి చప్పుడు విని కార్మిక కుటుంబస్త్రీలు విజయ గర్వంతో కళ్ళు ప్రకాశించాయి.

నెలవు (తుమ్మేటి రఘోత్తమ రెడ్డి) : రాయమల్లు భార్య రాజేశ్వరి పెద్దయింటిని ఏర్పరుచుకోవాలని, భూములను కొని అనుభవించాలనే కలలు కని భర్తను కాలరీ ఉద్యోగం చేయాలని పట్టుపడుతుంది. పల్లెటూరునిండి వారిద్దరు బొగ్గు బావి ప్రాంతానికి వస్తారు. తన కలలు ఫలించేందుకు రాజేశ్వరి డబ్బును చాలా జాగ్రత్తగా కూడపెడుతుంది. అయితే గని పని లోని అలసటతో భర్త వచ్చి ఆమె మీద చిరాకు పడడం, తిట్టడం చేస్తాడు. అయితే రాజేశ్వరి భర్త తాగిరావటాన్ని సహించలేకపోయింది అంతేకాక వరుసగా కాన్పులలో కూడబెట్టిన సొమ్ముకూడ అయిపోవటంతో. చెప్పులు కొనుక్కోవాలనుకున్న ఆమె కోరిక తీరలేదు. గనిలో కుప్పకూలిన 'గోఫ్' చప్పుడును విన్న రాజేశ్వరిభర్త భయపడి ఆందోళన చెందటం

అతని స్వభావంగా మారింది. అతనిని పల్లెటూరికి తీసుకువెడితే అక్కడ అతని ఆందోళన నయమవుతుంది. కాని అక్కడ స్నానానికి సబ్బుకూడా లేదనీ లోటుగా భావించిన రాజేశ్వరి తిరిగి కాలరీ ఉద్యోగానికి వెడదామని భర్తను పోరుపెడుతుంది. అందుకు రాయమల్లు ఒప్పుకోడు. అతనితల్లికి కోడలు మీద కోపం వచ్చింది. అత్తా, కోడళ్ళు తిట్టుకుంటారు. అయితే రాయమల్లుకు కాలరీపని యిష్టం లేక చివరికి తాగి చచ్చిపోతాడు.

భూ నిర్వాసితులు - (పి. చంద్) : ఈ కథలో బొగ్గుగనులు రావడం వల్ల ఆ ప్రదేశంలో ఉండే వారి అగచాట్లు, వారిపై పరోక్ష పారిశ్రామిక సంబంధాల ప్రభావం గురించి తెలియచేయడం జరిగింది. ఏడవ ఇంక్లైన్ బావిని మూసి యిప్పుడు అధునాతన విదేశీ యంత్రాలతో, సాంకేతికత్వంగా గోదావరిఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు - 3 ప్రారంభమైన తరువాత అక్కడ వాతవరణమే మారిపోయింది. భూమిని తొలిచి పోసిన మట్టి కుప్పలు, భారీ యంత్రాలు తిరుగుతూ కనబడతాయి. గనికి పోయే రోడ్డు ప్రక్కన టీ స్టాలు నడిపే మల్లయ్య, అక్కడకు వచ్చిన రంగయ్యకు చూపిస్తూ కనపడే మట్టి కుప్పల క్రింద తన రెండకరాల భూమి పోయిన విషయాన్ని చెప్తాడు. మనవడు రాజు రాగా యింటికెడుతూ దారిలో కనపడ్డ పోషవ్వకు తమ ఊరికి బొగ్గు బావుల కింద నష్టపోయిన భూములకు నష్టపరిహారం ఇచ్చే విషయంలో కేసును పైసలు చేయడానికి కలక్టరు వస్తున్నారని చెబుతాడు. మల్లయ్యకు తన కొడుకు రాజేశం చెప్పిన "బొగ్గు బాయిలు వచ్చి మన బతుకులను మంట్లె కలుసాయని" అన్న మాటలు గుర్తుకు వస్తాయి.

రాజేశం చచ్చిపోయాడు. రాయమల్లు వచ్చి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు ఆఫీసరు యొక్క అవినీతిని గురించి చెబుతాడు. యూనియన్ నాయకులు కూడా యాజమాన్యంతో చేతులు కలుపుతున్నారని భావించినా కలెక్టరు వస్తున్న విషయాన్ని తనలాగే బాధితుడైన తోటి గ్రామస్తుడుగా ఉన్న పాపయ్యకు జెప్పినా పాపయ్య కూడ తమ సమస్య తీరుతుందని నమ్మలేకపోతాడు. రాజేశం బతికున్న రోజుల్లో ఆనాటి సర్పంచి వచ్చి భూములు కోల్పోయినందుకు, ఇండ్లు ఖాళీచేసినందుకు ప్రభుత్వం వచ్చి నష్టపరిహారం చెల్లిస్తుందని బొగ్గు ఉత్పత్తికై ప్రభుత్వం ఎక్కడంటే అక్కడ తవ్వుతుంది కాబట్టి గ్రామ ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని చెబుతాడు. అయితే రాజేశం భూములు కోల్పోయిన వారికి వేరొక చోట ముందుగా భూములు చూపించాలని అంటాడు. దానికి వారు నష్టపరిహారంగా డబ్బును, ఇంటికో మనిషికి ఉద్యోగం యిప్పిస్తామంటారు. కాని

నష్టపరిహారంగా యిస్తామన్న డబ్బులు గాని, ఉద్యోగం గాని రాకపోయేసరికి రాజేశం ముందుకొచ్చి భూములను ఖాళీ చేయలేమంటారు. న్యాయం కోసం కోర్టుకు వెళదామనుకున్న సమయంలో పోలీసులు రంగప్రవేశం చేస్తారు. ఒక ముసలామె ముందుకొచ్చి ప్రశ్నించేసరికి ఆమేమీద చెయ్యెత్తిన పోలీసును అడ్డుకున్న రాజేశంను పోలీసులు ఎత్తుకెళ్లారు. స్టేషన్‌లో రాజేశాన్ని కొట్టిన దెబ్బలకు రాజేశం కోలుకోలేకపోయాడు. అయినా మళ్ళీ పోలీసులు వచ్చి రాజేశాన్ని కొట్టి ఎత్తుకొని తీసుకుని వెళ్తారు. రాజేశం అడ్రసు ఇంకా తెలియటంలేదు అని ఆనాటి నుండి ఉన్న ఆ విషయాలన్నీ గుర్తుకు వచ్చి మల్లయ్య బాధపడతాడు. కలెక్టరు వచ్చి మీటింగ్ పెట్టి భూనిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాల్సిన విషయం కంపెనీ అధికారులదనీ, తాము కేవలం నష్ట పరిహారంగా ఎకరానికి ఇరవై, ముప్పైవేలు చొప్పున యిస్తామని అంటారు. మల్లయ్యకు బాధ కలిగి కలెక్టరు సమస్య పరిష్కారానికిరాలేదనీ భావించి, ఆ భూములు కోల్పోయిన వారు చచ్చారో, బ్రతికారో చూడడానికి వచ్చావా అని మల్లయ్య కలెక్టరును అడుగుతాడు. పోలీసులు మల్లయ్యను చావబాదుతారు. మల్లయ్య కుప్పకూలిపోయాడు. మనవడైన రాజు లేచి వచ్చి ఓపెన్‌కాస్ట్ మట్టి కుప్పల దగ్గరకు రాగా అక్కడున్న డంపర్ ఆపరేటర్ డంపర్‌లోని డీజిల్‌ను దొంగతనం చేసి ఆ డీజిల్ క్యాన్‌ను ఎడ్ల బండీలో పెట్టమని రాజుకిస్తాడు. అయితే రాజు ఆ క్యాన్‌ని ఎడ్ల బండిలో పెట్టలేదు. టీ తాగొద్దామని ఆ డంపర్ ఆపరేటర్ వెళ్ళిన సమయం చూసుకుని రాజు ఆ డీజిల్‌ని డంపర్ మీద పోసి అంటించి తృప్తిగా చూస్తాడు.

ఆ విధంగా నష్టపోయిన ఎంతో మంది భూనిర్వాసితుల నిశ్వాసపు జ్వాలలను ప్రతిఫలించడం ఈ కథ యొక్క లక్ష్యంగా అర్థం అవుతుంది.

నీళ్ళకోసం(పి. చంద్): మంగళంపల్లి గ్రామంలో ఓపెన్ కాస్ట బావులు వచ్చాయి. తరువాత ఊటబావులనీ ఎండిపోయాయి. తాగునీటికి కరువు వచ్చి నీళ్ళ కోసం పోయిన శ్యామల రాకపోయేసరికి రాజం వస్తారు. రాజంకు బొగ్గు బాయిలో పని వచ్చింది. కాని వెంకటి కొడుకు సాయిలు మాత్రం బొగ్గు బావిలో చేరనంటారు. అయితే 2 లక్షల ముడుపులు ఇచ్చుకుంటేనే రాజంకు కాలరీ ఉద్యోగం వచ్చింది. ఆటల్లో భాగంగా వీధిలో పిల్లలు కంపెనీ మేనేజర్ లాగా అధికార స్వరంతో మాట్లాడుతూ బొగ్గుబావి నష్టంలో నడుస్తోందని, బావిని మూసేయాల్సి వస్తుందని ఉద్యోగాలనుండి కార్మికులను తీసేస్తారనే విషయాల్ని వివరిస్తూ చెప్పటంతో అందరు పిల్లలు బావులు మూసేస్తారు, మనుషుల్ని

తీసేస్తారనీ మాటలో అనుకరిస్తారు. దాన్ని గమనించిన రాజం తిట్టుకుంటూ కార్మికులు ఉత్పత్తిని రెట్టింపు చేసినా నష్టాలు రెట్టింపుగా ఎందుకుంటున్నాయని, లాభాలు లేకపోవటానికి కారణంగా ఎవరికి అందినది వాడు దోచుకుపోతున్నడనీ కమీషన్లకు అధికార్లు ఆశపడుతున్నారనీ, రాయల్టీలను, వడ్డీలరూపంలోను ప్రభుత్వం వందల కోట్లు మింగుతోందని భావిస్తారు. పనికి రాని యంత్రాలను పంపిన విదేశీయులును బొగ్గుకొన్న ప్రైవేటువారు కూడ బాగుపడుతునారని. కంపెనీకి మాత్రం నష్టాలు వస్తున్నాయని అనుకుంటాడు. కంపెనీ వారు బహుళజాతి సంస్థలు ఇచ్చే ముడుపులకు ఆశపడి పనికిరాని యంత్రాలతో పని జరిపించమంటున్నారని, దీనిలో కార్మికుల పాత్ర లేదని భావిస్తాడు. శాసనసభా సంఘం ఇంక్వైరీ చేసి 200 కోట్లు పెట్టేచోట 800 కోట్లు ఖర్చు చేసి సింగరేణి సంస్థలో యంత్రాలు కొన్నారని పేర్కొన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటాడు. గ్రామ ప్రజలు తమ భూములను బొగ్గు కంపెనీ తీసుకుంటే ఒప్పందంలో భాగంగా ఇంటికొకరికి, ఉద్యోగం, ఇస్తామని, పొలాలకింద నష్టపరిహారం ఇస్తామని చెప్పిన విషయాన్ని సంస్థ పట్టించుకోవటం లేదని బాధపడుతుంటే ఇప్పుడు కలెక్టర్ ఆవిషయాన్ని పరిశీలించాటానికివస్తున్న శుభవార్త విన్పడింది. కలెక్టర్ వచ్చి ఉద్యోగాలను సింగరేణి కంపెనీ ఇవ్వాలని అది తన పరిధిలోనిది కాదని చెప్పి, భూముల క్రింద నష్టపరిహారంగా చాల తక్కువ వెలనుకట్టి పంపిస్తామని చెప్పి వెళ్లిపోయాడు. దానితో కోపంవచ్చి వారు కంపెనీ నీటిపైపులు పగులకొట్టి నీళ్ళు పెట్టుకుంటారు దానికి పోలీసువాళ్ళు ఆఊరివాళ్ళను అరెస్ట్ చేసి చిత్రహింసలు పెడ్తారు ఆతరువాత విడిచిపెట్ట బడిన వారిలో రాజంవచ్చి ప్రతీకారంగా గనిప్రాంతంలోవున్న డంపర్‌ను తగులబెట్టి కంపెనీమీదా కసితీర్చుకుంటాడు.

భూ నిర్వాసితులు, దొంగ, పునరావాసం వంటి కథలలో కంపెనీ కింద తమ భూములు పోగొటుకున్న వారు అటు నష్టపరిహారం అందక ఇటు కంపెనీలో ఉద్యోగం రాక నష్టపోయామంటూ కంపెనీ పట్ల వ్యతిరేక ధోరణి ఏర్పర్చుకున్న వైనాన్ని తెలియజేస్తాయి. మానవసంభంధాలమధ్య చెలరేగిన మంటను ఆర్థిక వ్యవస్థను చిచ్చుపెడుతున్నాయని అర్థం అవుతుంది.

దొంగ (పి. చంద్) : సలీం, శంకర్ ఇద్దరూ వర్కషాప్‌లో 'స్రాప్' కింద పడేసిన ఇనుమును దొంగతనం చేసి అమ్ముకుంటున్నారని తెలిసి ఒక రోజు వారిని ప్రశ్నించేసరికి కోట్లకు కోట్లు స్వాహాచేసిన రాజకీయనాయకులు, మామూళ్ళు తీసుకుంటున్న పోలీసువాళ్ళు దొంగలేనని చిన్నగా చేస్తే దొంగతనంఅని పెద్దగా

చేస్తే దొరతనంఅని వారు అంటారు. భూములు కోల్పోయిన చోట వ్యవస్థీకృత అరాచకత్వం వేలాది కుటుంబాల చావుకు కారణం ఎందుకుఅవుతుందని శంకర్ ప్రశ్నిస్తాడు. కమీషన్లకు ఆశపడి వందలకోట్లతో పనికిరాని యంత్రాలను కొనటం దొంగతనం కాదా అని ఆరోపణలు చేస్తూ శంకర్ ఫెన్సింగ్ దాటుతూంటే ముళ్ళకంచె శంకర్ పొట్టలో గుచ్చుకుంటుంది. సలీం తప్పించుకున్నాడు.

పునరావాసం (పి. చంద్): మనసులో అసంతృప్తి పేరుకున్న 'స్వామీ' అనే క్లర్క్ యూనియన్‌లో చేరుతాడు గ్రామస్థులు నష్టపరిహారం చెల్లించనందుకు బాధపడుతారు. యూనియన్ డిపెండ్‌మెంట్ ఎంప్లాయ్‌మెంట్ గురించి పట్టించుకోవటం లేదనీ, స్త్రీలకు డిపెండ్‌మెంట్ ఉద్యోగ అవకాశాలను కంపెనీ తీసివేసినపుడు యూనియన్‌లు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని యూనియన్ నాయకులే గోల్డెన్ ఫారెస్ట్ స్కీము కింద కార్మికులడబ్బు స్వాహాచేస్తున్నారని భావిస్తారు. రోజూ గెస్ట్‌హౌస్‌లో 12 గంటలు పనిచేసే సాయిలు ఒక రోజు ఉద్యోగానికి వెళ్ళనందుకు అతనిది టెంపరరీ ఉద్యోగం కావటంతో అతనిని పనిలోనుండి తీసేసినప్పుడు యూనియన్ ముందుకు రాలేదని యూనియన్లకు కార్మికుల సమస్యలు పట్టడంలేదని భావిస్తారు. ఆమట్టితో అనుబంధంతో సాయిలు తోపాటు మల్లయ్య కూడ అక్కడే పనిచేసి తృప్తి పడాలనుకోవటంతో వాళ్ళను తిరిగి పనిలో పెట్టుకోవాలని ప్రాధేయపడటం జరుగుతుంది.

జడ్తి - (పి. చంద్) : కథలో కంపెనీక్రింద ఊరినితీసుకుంటే ఇండ్ల వ్యాల్యుయేషన్ ఎక్కువని ఊరిచుట్టువున్న భూముల్ని కంపెని స్వాధీనం చేసుకోవటంతో నిరంతర బ్లాస్టింగులతో ఇండ్లు కూలిపోతున్నీయని వాళ్ళభూముల్లో సంపదవుండటం తప్పయిందని ఊరివాళ్ళు భావిస్తారు. గొంతు తడుపుకోవాటానికి ఒక్కచుక్కనీళ్ళు రావటంలేదనీ, పోచమ్మకు బలిఇచ్చే మేకకు చివరి క్షణంలో జడ్తి జల్లుతారు కాని తమకు ఆ బొట్టునీళ్ళుకూడ కరువయ్యాయని భావిస్తారు.

పునరావాసం - (పి. చంద్) : మనస్సులో అసంతృప్తి పేరుకున్న 'స్వామీ' అనే క్లర్క్ యూనియన్‌లో చేరుతాడు గ్రామంలో నష్టపరిహారం చెల్లించనందుకు బాధపడతాడు యూనియన్ డిపెండ్‌మెంట్ ఎంప్లాయ్‌మెంట్ గురించి పట్టించుకోవటం లేదని ఉద్యోగ అవకాశాలను కంపెనీ తీసివేసినపుడు యూనియన్‌లు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని, నాయకులే గోల్డెన్ ఫారెస్ట్ స్కీము కింద కార్మికుల డబ్బును స్వాహా చేస్తున్నారని భావిస్తారు. రోజూ గెస్ట్‌హౌస్‌లో 12 గంటలు పనిచేసే సాయిలు ఒక రోజు ఉద్యోగానికి వెళ్ళనందుకు అతనిది

టెంపరరీ ఉద్యోగం కావటంతో అతనిని పనినుండి తీసేస్తారు. అప్పుడు యూనియన్ ముందుకు రాలేదు యూనియన్లకు కార్మికుల సమస్యలు పట్టడం లేదని ఆ మట్టితోవున్న అనుబంధంతో మల్లయ్య సాయిలు అక్కడే పనిచేసి తృప్తి పడాలనుకుంటూ వాళ్ళనితిరిగి పనిలో పెట్టుకోవాలని ప్రాధేయపడటం కనబడుతుంది.

భూ నిర్వాసితులు, దొంగ, పునరావాసం వంటి కథలలో కంపెనీ కింద తమ భూములు పోగొట్టుకున్న వారు అటు నష్ట పరిహారం అందక, ఇటు కంపెనీలో ఉద్యోగం రాక నష్టపోయామంటూ కంపెనీ పట్ల వ్యతిరేక ధోరణి ఏర్పర్చుకున్న వైనం స్పష్టమై మానవసంబంధాల మధ్య చెలరేగిన మంటలు సంస్థ ఆర్థిక వ్యవస్థకు చిచ్చుపెడుతున్నాయని అర్థం అయింది.

"అతడు" - (అల్లం రాజయ్య) : ఈ కథలో గని ప్రమాదంలో కొమరయ్య అనే కార్మికుడు గని కప్పుకూలి చనిపోతే భూమయ్య పట్టించుకోనట్టుగా ఉండడం, మల్లికకు బాధ కలిగిస్తుంది. సాటి కార్మికుడి గురించి పట్టించుకోనితనంతో పాటు అలుగుడ్డలా పడుండే తనలో చైతన్యం వచ్చినందుకు తన మధ్య, తన భర్త మధ్య దూరాలు పెరుగుతున్నాయనీ గ్రహించింది. తనలో చైతన్యం రావడానికి కారణం 'అతడు'. ఆ మనిషి సమస్త బొగ్గు గనుల ప్రాంతంలో గల అన్ని శక్తులతో పోరాడేవాడు. అంతేగాదు భర్తలు తాగొచ్చి భార్యలను బాధ పెడితే 'అతని'తో చెబుదామని బెదిరించేవారు. మల్లిక తనకు చిన్నప్పుడే పెళ్లయి భర్త చనిపోగా భూమయ్యను చేసుకుని తానేదో తప్పు చేస్తునట్టు కుమిలి పోతున్నప్పుడు లోపల మనుషులందరూ అలాగే ఉంటారని చెప్పి ధైర్యం చెప్తాడు. సకల సంపదలు సృషించే ప్రపంచానికి శ్రమైక భాగస్వామ్యం లేకుండా ఉండే ప్రపంచానికి సంబంధం ఉండదు కాబట్టి కామ్రేడ్ల సంబంధంతో సంఘటితమై దొరల అణచివేతను ఎదుర్కోవాలని చెప్పాడు.

బొగ్గు గని ప్రాంతాలలో చిల్లర వ్యాపార వర్గాలలో సారా వ్యాపారం బాగా చోటు కేసుకుందని వ్యాపార సంస్థల మధ్య ఘర్షణలో పోలిసులు రాజకీయ పార్టీల వాళ్ళు చోటుచేసుకున్నారని భావించి 'అతడు' బొగ్గు గనులలోని చట్టాలను, ఉత్పత్తిని, కార్మికులను, అధికారులను, వ్యాపారులను, చదరంగంలోని పావుల్లాగా కదుపుతున్నాడని అటువంటి ఆ మనిషికి యాజమాన్యం భయపడుతూ ఉంటుందని జరిగింది.

బదిలీ ఫిల్లర్గా చేరిన భూమయ్య అనేక సార్లు సమ్మెలో పాల్గొన్నాడు. కాని ఇప్పుడు 'అతన్ని' చూసి ఈర్ష్యపడే స్థితి వచ్చింది. మనుషుల్లో శ్రమ పడే

వర్గం ఉందనీ, రెండవ వర్గం శ్రమ పడకుండా ఇతరులకు హాని కలిగించే కార్మిక వర్గ నియంతృత్వం ఉందని చెప్పాడు. గని రాకాసి కొమరయ్యను నమిలేస్తే అంతకన్నా పెద్ద రాకాసి ఏదో అతన్ని చంపేసిందని భావించి అతన్ని కాడేమీద వేసినప్పుడు చాలా మంది కార్మికులు వచ్చారు. అటు ప్రభుత్వం దృష్టిలో తీవ్రవాది అయినా కార్మికుల దృష్టిలో అన్న, అక్క, తండ్రి, భర్త అనే సంబంధం కంటే అతీతమైన ఉత్పత్తి సంబంధంలో మనోబంధం కల వ్యక్తి 'అతడు' అని కార్మికులు భావించటం ఈ కథలో కనబడుతుంది.

'అన్న' - (కాలువ మల్లయ్య) : రాజమల్లు అనే కార్మికుని భార్య లక్ష్మి బొగ్గుల కుంపటి మీద పొగలో వంట చేయడం కష్టంగా ఉండి గ్యాస్ స్టవ్ కొనుక్కుంటే బాగుంటుందని అనుకుంటుంది. ఆ వంట బొగ్గు కోసం ఎన్నో సమ్మెలు చేయాల్సి వచ్చింది. చీటికిమాటికి సమ్మెలు చేయాల్సి వచ్చింది. చీటికిమాటికి సమ్మెలు చేయడం మంచిది కాకపోయినా దొరల జులుం తగ్గాలంటే ఉద్యమాల అవసరమవుతాయనీ, కాని ఇప్పుడు ఎవరైనా ప్రశ్నిస్తే వారిని తీవ్రవాదులని భావించి ప్రభుత్వం ఎన్‌కౌంటర్ చేయిస్తోందని భావిస్తారు. అయితే కార్మికులు తమ హక్కులను అనుభవించ గలుగుతున్నారంటే "అన్న" వలననే అని అతడు కార్మికులను ట్రేడ్ యూనియన్లను అవగాహన చేసుకుని కార్మికుల శ్రేయస్సు కోసం పాటుపడుతున్నాడని భావిస్తారు. స్త్రీల సమస్యలు, కుటుంబాలలోని తగాదాలు తీర్చేవాడు, మంచి కార్మికుల కోసం కాంట్రాక్టర్ల దగ్గర డబ్బు తీసుకుని ఖర్చు పెట్టేవాడు. అయితే అతడు గని దగ్గరకు వెళ్లితే మరో కార్మికున్ని 'అతడే' అనుకుని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో వేరొక కార్మికుని చంపుతారు. "ఒక వేళ తనే చనిపోయినా కూడా ప్రజలలో మమేకమై పనిచేసే వాడికి చావులేదు" అంటూ 'అన్న' చీకట్లో కలుస్తాడు. భౌతికంగా లేకపోయినా, ప్రజల గుండెల్లో అతని ఉనికి శాశ్వతంగా ఉంటుందని భావిస్తారు.

జాడ - (తుమ్మేటి రఘోత్తమరెడ్డి) : తల్లీ, తండ్రి చనిపోయిన తరువాత తమ్ముడ్ని తన దగ్గర పెట్టుకున్న అతని అక్క ఆమె భర్త సహాయంతో తమ్ముడ్ని, కాలరీ ఉద్యోగంలో పెడుతుంది. అతడు గనులలో పనిచేస్తున్న కార్మికుల కష్టాలను తెలుసుకుని కార్మికుల్ని చైతన్య పరుస్తాడు. అతడ్ని తీవ్రవాది కింద భావించారు. బదిలీ ఫిల్లర్ల నుండి "ఓవర్‌మెన్" గా ఎదిగిన తరువాత తన భర్తకు కార్మికుల కష్టాలను అర్థం చేసుకునే స్థితి పోయిందని బాధ పడుతుంది. తమ్ముడిని గురించి పట్టించుకోవద్దనీ, మాట్లాడవద్దనీ, ఇంటికి రానీయవద్దని ఆమెను ఆంక్ష పెడతాడు. కార్మికుల కష్టాలను తెలుసుకునే ఆ తమ్ముడ్ని తీవ్రవాది అని ముద్ర వేసి

ఎన్‌కౌంటర్‌లో చంపుతారు. దానితో ఆమెకు భర్త అంటే అసహ్యం కలిగి అతనితో చెప్పకుండా తమ్ముడి శవం చూడడానికి వెళ్లి ఆ తరువాత హరిజన వాడల్లోనే ఉండడానికి నిర్ణయించుకుంటుంది.

హంతకులు - (తుమ్మేటి రఘోత్తమరెడ్డి) : ఈ కథలో నర్సయ్య భార్య శారద ఆత్మహత్య చేసుకుంటుంది. కారణం ఎవరికీ అర్ధం కావడం లేదు. ఈ మధ్యనే నర్సయ్యకు ఓవర్‌మెన్ ప్రమోషన్ వచ్చింది. మేనేజర్‌తో అనుకూల సంబంధాలలో ఉన్నాడు. అతని భార్య శారద యొక్క మానసిక స్థితిలో మార్పు వచ్చింది. ఒకానొకప్పుడు నర్సయ్య సమ్మెలు - అరెస్టులు - చిత్ర హింసలు - కాల్పుల మధ్య సాగిన కార్మికోద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించాడు. మొదట్లో బదిలీ ఫిల్లర్‌గా గనిలో చేరిన నర్సయ్య ఇప్పుడు ఓవర్‌మెన్‌గా ప్రమోషన్ వచ్చేసరికి అతని మనస్తత్వంలో మార్పు వచ్చిందని శారద గ్రహించింది. కొత్తగా వచ్చిన డైరెక్టరు ఉత్పత్తిని చూపించమనే సరికి యూనియన్‌లు, యాజమాన్యం, పోలీసులతో కలిసి కార్మికులను గుప్పిట్లో పెట్టుకుని ఉత్పత్తి పెంచేటట్లు చేస్తోంది. కాని, కార్మికుల సమస్యలను మాత్రం తీర్చటంలేదని భావిస్తారు. ఆ సందర్భంలోనే వంగుతట్ట కార్మికులు 17 రోజుల సమ్మె చేయటం జరిగింది. దానిలో నర్సయ్య కీలక పాత్ర వహించారు. అత్తగారింటి నుండి భార్య వాటాను అమ్మించి డబ్బు తెచ్చి యిక్కడ భూములు కొనేసరికి ఆమెకు, ఆమె సోదరికి మధ్య మాటలు లేకుండా పోయాయి. ఆ సందర్భంలో ఆమె మనసు గాయపడింది. అధికార పరమపద సోపానంలో పైకి ఎగబాకిన నర్సయ్య బాగా వున్నా, అతని భార్యకి మాత్రం అంతకంతకూ మానసిక ఒత్తిడి ఎక్కువయి బాధ పడుతుంటే, ఆమెకు పిచ్చి పట్టిందనీ భర్త నర్సయ్య ప్రచారం చేస్తాడు. తమ మధ్య భార్యాభర్త సంబంధాలు సరిగలేవని శారద ఆ యింటికి వస్తుండే ఒకానొకప్పటి భర్త యొక్క స్నేహితునితో తన యింటికి వచ్చినప్పుడు చెప్పుకుని దుఃఖిస్తుంది. చావుకు, బతుక్కి మధ్య ఊగిసలాడే అననుకూల పరిస్థితుల మధ్య ఉన్న అసంబద్ధ దాంపత్యాల వికృత పరాకాష్ట స్థితులలో మనుషులు ముక్కలు ముక్కలుగా ఎట్లా తెగిపోతున్నారో ఆమె భర్త యొక్క స్నేహితుడైన ప్రభాకరానికి అర్థమవుతుంది. మనుషుల లోపలా బయట మానవ స్పర్శకు సంబంధించిన నులివెచ్చని వేడి ఏదో రగులుకుంటోందని గ్రహిస్తాడు.

"హంతకులు" కథలో అధికార సంబంధాలతో ఉన్న ఏ వ్యక్తిలో అయినా మానవ స్పర్శ తగ్గుతుందని ఉత్పత్తి సంబంధాలలో ప్రమోషన్ వచ్చి అధికారికంగా

వ్యవహరిస్తుండే భర్తలో వృత్తిపరంగా మానవ స్పర్శ తగ్గిందని భావించి అటువంటి భర్తతో కాపురం చేయలేనని అనుకుని అతనికి దూరమవడానికి శారద ఆత్మహత్య చేసుకుంటుంది. శారదలో వస్తున్న మార్పుని గుర్తించి తనను తాను కప్పిపుచ్చుకోవడానికి వీలుగా ఆమెకు లేని పిచ్చిని అంటగట్టి ఆమె పిచ్చిదని చెప్పి సమర్థించుకోవడాన్ని చూడగా వ్యక్తి యొక్క వృత్తి అధికార సంబంధాలతో కూడినదైతే ఆతని ప్రవృత్తిని కూడ మార్చగలిగి మానవ సంబంధాలనే కాక, కుటుంబ, సామాజిక సంబంధాలను కూడా ప్రభావితం చేయగలుగుతుందని అర్థం అవుతుంది. మానవీయ కోణం మానవ స్పర్శ లోపించిన వ్యక్తితో కాపురం చేయలేని స్థితికి శారద వెళ్ళ గలిగిందనటానికి కారణంగా ఆమె భర్త నర్సయ్య ఒకానొకపుడు బదిలీ ఫిల్లర్‌గా ఉన్నప్పుడు వాళ్ళ ఇంట్లో జరిగే ఉత్పత్తి సంబంధపు సమావేశాలకు ఆమె కూడా సహకరిస్తూ కార్మికుల బాధలను అవగాహన చేసుకున్న వ్యక్తి కావడమేనని అర్థం చేసుకోవచ్చు.

నల్ల వజ్రం - (పవన్‌కుమార్): ఈ నవలకు ముందు మాటలో చెప్పినట్లుగా "బొగ్గుగని కార్మికుని జీవన క్రమానికి, శ్రమ దోపిడికి ఒక క్రమం, ఒక యంత్రాంగం, ఒక పద్ధతి, ఒక రాజకీయం ఉన్నదని చెప్పటానికి ఈ నవల వ్రాయబడిందని" అర్థం అవుతుంది.

"నల్ల వజ్రం నవలలో కాళ్ళు గుంజే శంకరయ్య అనే కార్మికుడు తన కాళ్ళు గుంజడానికి తన యింటి నుండి బొగ్గుగని దూరంగా ఉండటమే కారణం అనుకుని తన యింటి దగ్గర ఉన్న బొగ్గుబావికి బదిలీ కావడం కోసం లీడర్లకు చెప్పుకొంటాడు. కాని ఫలితం దక్కకపోగా, అధికార వర్గపు వారి సూచనల ప్రకారం మేనేజరుకు తన రక్తం యిచ్చి బదిలీ చేయించేకోవాలనుకుంటాడు. అయినా కూడా పని కానందుకు నిస్సహాయ స్థితికి చేరుకుంటాడు. ఆ సమయంలోనే ఆ బాధిత వ్యక్తి కోసం కార్మికులందరూ సంఘటితం అయి బాసటగా నిలబడేసరికి శంకరయ్య పిడికిలి ఎత్తి పోరాటానికి దిగడమే ప్రారంభంగా బావిలో సమ్మె రూపాంతరం చెందుతుంది. నల్ల బంగారాన్ని ఉత్పత్తి చేసే గనులలో వజ్రసంకల్పం గల సంఘటిత కార్మిక శక్తికి ప్రతీకగా నల్లవజ్రంగా శంకరయ్య సింగరేణి నవలాప్రపంచంలో ఆద్యుడిగా నిలిచి, అనంతర కాలానికి కూడా కార్మికులు తాము అధికంగా శ్రమ దోపిడికి గురి అయ్యేటపుడు కారణాలు తెలుసుకుని చైతన్యాన్ని అందించే తెల్లని సూరీడుగా కూడా నిలబడినట్లు ఈ నవల తెలియజేస్తుంది.

శేషగిరి నవల - (పి. చంద్): నేటికి సింగరేణి ప్రాంతాలలో కార్మిక హృదయాలలో అమరజీవిగా నిలిచిన కార్మికోద్యమ నేత శేషగిరిని గురించి నవల వ్రాయడం చాల గొప్ప విషయం. నిజాం పాలనలోని ఫ్యూడల్ దోపిడీకి బ్రిటిష్ బావి దొరల లాభాపేక్షకు కాంట్రాక్టర్ల జులుంకు వ్యతిరేకంగా నిలిచాడు. శ్రమ దోపిడీకి గురి అయి ఆర్థికంగా అణచివేతకు గురి అయిన కార్మికులకు అండగా, అన్నగా నిలిచిన వ్యక్తి, శేషగిరి సింగరేణి బొగ్గు గనుల్లో మొట్ట మొదటి ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాత. కార్మికులలో సమిష్టి చైతన్యాన్ని కలిగించాడు. అస్తవ్యస్త అసమ సమాజంలో అసమాన పోరాట యోధుడుగా స్ఫూర్తినిచ్చే శేషగిరి జీవనయానాన్ని పాఠకులకు అందజేసిన నవల యిది. శేషగిరి అంటే చాలా సామాన్యమైన వ్యక్తి. "వ్యక్తిగా అతని వ్యక్తిగత జీవితం కంటే శక్తిగా కార్మికుల జీవితాలలో వెలుగు నింపిన అమర జ్యోతి శేషగిరి" అని నవల తెలియచేస్తుంది. శారీరకంగా, ఆర్థికంగా అణచివేతకు గురయిన అనాటి సింగరేణి స్త్రీ కార్మికుల కన్నీరు తుడిచి స్త్రీలలో చైతన్యాన్ని కలిగించిన బొగ్గు రేణువుల్లోని అగ్ని కణం శేషగిరి. యాజమాన్యం అతనిని అధికారిగా నియమిస్తామని ఆశ జూపించినా కూడా చదువుకున్న శేషగిరి తన సుఖాన్ని త్యాగం చేసి కార్మికుల కడగండ్లు తీర్చడానికి ఆర్థిక శక్తులతో తాను పోరాడి, పోరాటం నేర్పిన వ్యక్తి శేషగిరి అని నవల చదివితే అర్థం అవుతుంది. శ్రామికుల కష్టాలకు రాజ్యాధికార వ్యవస్థ కూడా కారణమని భావిస్తాడు శేషగిరి. చివరికి ఎన్‌కౌంటర్ మరణంతో శేషగిరి జీవితం ముగిసినా నేటికి చిరస్మరణీయుడైన శేషగిరి ఆధునిక కాలంలో చాలా మంది కార్మికులలో జీవిస్తున్నాడు.

జాతశ్రీ - "సింగరేణి మండుతోంది" : వృత్తి రీత్యా గనుల ప్రాంతంలో నివసిస్తూ తన పరిశీలన జ్ఞానంతోనూ, విన్న, కన్న కార్మికుల అసంతృప్తులను విస్తారంగా వివరించాలనుకుని వ్రాసిన నవల. దీనిలోని గని కార్మికుని జీవితాలలోని వృత్తి పరమైన అసంతృప్తిని సూక్ష్మ స్థాయిలో గల కార్మికుని యొక్క మానసిక ఆందోళనలకు అక్షరాకృతి కల్పించిన నవల, గనులలోని పని పరిస్థితులు, అధికారుల ప్రవర్తన, వారు మాట్లాడే భాష, కార్మికుల భాష మధ్యగల అవగాహనా రాహిత్యం యూనియన్ నాయకులు, జీతాలను గురించి, సెలవులను గురించి, సంక్షేమ పథకాల అమలును గురించి, తుర్పారబట్టిన నవల యిది.

ఈ నవలలో రచయిత ప్రక్రియాపరమైన శైలి కంటే కూడా కార్మికుని జీవన శైలికే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చినట్లు అర్థమవుతుంది.

సింగరేణి పాటలు, - కవిత్వం : (సంకలనాలు) కార్మికులు తమ అందోళనలకు అక్షరాకృతిని, ఏర్పరచి పాడుకున్న సింగరేణి పాటలు సింగరేణి కవిత్వం విస్తారంగా వచ్చింది. వీటన్నింటిలోనూ కార్మికుల వృత్తి యందు తాము ఎదుర్కొనే యిబ్బందులను, జీవిత రక్షణ, ఉద్యోగ భద్రతా రాహిత్యాన్ని గురించి, పని పరిస్థితులను గురించి, జీతాలను గురించి, ఆచరణలో లేని సంక్షేమ పథకాలను గురించి తమతమ అభిప్రాయములను వెల్లడి చేసుకుంటూ వ్రాసిన పాటలు, కవితలు కోకొల్లలు.

బండకింద బతుకులు - కైతికాల పోశెట్టి - స్వగతాల సంపుటి (అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి): అంతర్మథనం సాహిత్య సృజనకు అధారం అయితే అధికారాన్ని ఎదుర్కొని బతకలేనప్పుడు బహింగంగా బయటకు చెప్పలేని మనోభావాలకు వక్త-శ్రోత ఒక్కరుగా తనకు తానే ఉండి బహిర్గతమయ్యే అంతర్వేదనమే స్వగతాలు.

ఇందులో ఆత్మీయత, స్వీయానుభవాలకు ప్రాధాన్యత ఉంటుంది. కాబట్టి సృజనకారుని ప్రవృత్తి సహజసిద్ధంగా ఉంటుంది. ఆవేదన, అసంతృప్తులు వృత్తి పరమైనపుడు, తాను అవృత్తిలో మమేకమైనప్పుడు ఆ స్వగతాలు జాతీయతా ముద్రకు నోచుకుంటాయి. అందుకే తెలంగాణా మాండలిక భావజాలంతో బొగ్గు బావులలో బండకింద తమ బతుకులకు స్వగతాల తోరణాలతో సాహిత్య సృజనశక్తితో ఆత్మార్పణ చేసుకోవడం ఇందులో కనపడుతుంది. కైతికాల పోశెట్టి బొగ్గు బావి కార్మికుల మనోభావాలకు ప్రతినిధి. అందుకే ఏకత్వంలో-భిన్నత్వం కలిసిన ఈ స్వగతాలు సంఘర్షణలకు మూలాలు. బొగ్గును ఉత్పత్తి చేసే శ్రామికుల జీతాలు రకరకాలుగా వ్యాపార రూపంలో ఉండే పెత్తందారుల, ధనవంతుల చేతిల్లోకి వెళ్ళిపోవడమనే విధంగా కార్మికుల ఆర్ధిక స్థితిని అర్థం చేసేవి ఈ స్వగతాలు.

కైతికాల పోశెట్టి వంటి కార్మికులు బీదరికంలో పుట్టటం చేత అక్కడ కామందుల పొలంలో పని చేసినా ఇటు పెట్టుబడిదారీ పరిశ్రమలలో చేసినా శ్రమ దోపిడీయే జరుగుతూ ఉంటుందని భావిస్తాడు. ముందటేడు చేసిన సమ్మె తాలూకు బకాయిల కోసం పండగ అడ్వాన్సులు కంపెనీ క్యాన్సిల్ చేస్తే, ఆ అడ్వాన్స్ కోసం లీడరులు వచ్చి మళ్ళీ సమ్మె చేయమనటాన్ని గర్హిస్తూ "కొండనాలుకకు మందు పెట్టుమంటే.." అనే శీర్షిక కింద స్వగతం చెప్పడం జరుగుతుంది. వచ్చిన బోనస్‌నూ బాకీలవాళ్ళు, లీడర్స్ అందరూ తీసుకునేసరికి మిగిలేది శూన్యమనీ "పుసికల ఉచ్చ బోసుకున్నట్లాయె" అనే శీర్షిక క్రింద చెప్పడం

జరిగింది. లీడర్ల ఉపన్యాసాల పరంపర విన్న కార్మికుడు చివరకు తమ కోసం పనిచేసేవాడు కావాలంటే లీడరు "నాభిలో తగిలే మాటన్నాడని" భావిస్తాడు. వేజ్‌బోర్డులు జీతాలు పెంచినా, పెరిగిన ధరల వల్ల జీతం "ఏనుగు తిన్న వెలక్కాయ" అవుతోందని అంటారు. దీనినే "ఈతాకు చూపి తాటాకు దొబ్బుడు" అనే శీర్షికలో చెప్పాడు. "దున్నపోతు ఈనిందంట" అనే శీర్షికలో బొగ్గును ఉత్పత్తి చేసే కార్మికులు గృహావసరాలకు బొగ్గు పెళ్ళ తీసుకెళ్ళే హక్కు ఉంటుందని భావిస్తాడు. దానికై "దొంగ దొరికాడంటూ" అతనిని బాధించమని తీర్మానించ వద్దని అంటారు. వేజ్‌బోర్డు జీతాలు పెంచినపుడు అదే అదునుగా చేసుకొని టబ్బు సైజుని పెంచి ఉత్పత్తి పెంపుకై అదనపు శ్రమను వెచ్చించాల్సిన విషయాన్ని గుర్తించి "చిల్లి పైసా పెంచుడాయె - పెద్ద పైసా గుంజుడాయె" అంటారు. మరియు రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వచ్చి కార్మికులకు చీరెలు, దోవతులు పంచిపెట్టినపుడు "సచ్చినోడి పెండ్లికి వచ్చిందే కట్నంగా" కార్మికులు తీసుకున్నారు గాని గని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాల గురించి పట్టించుకోలేదని బాధపడతాడు.

కార్మికులు అతి కష్టమైన చోట పని చేయమంటూ లీడర్ల ముందు ఘర్షణ పడగా సేఫ్టీ ఆఫీసరు వచ్చి ఒక కార్మికుడిపై చెయ్యి చేసుకునేసరికి కార్మికులు బందు పెడ్తారు. సమ్మెకు కారణం "పేనుకు పెత్తనమివ్వడమే" అని భావిస్తాడు పోశెట్టి.

ఆర్నెల్ల పాటు సమ్మెలు చేయడానికి వీలు లేదని ఉత్తర్వులు యిస్తే దాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదంటూ "నూరు కత్తులు నూరుకోనీ" అంటాడు కైతికాల. కార్మికులు సంఘాలు పెట్టుకున్న దాన్ని ఆవిష్కరణలకు అధికారులను పిలవడం అంటే తిరిగి "పిల్లికి రొయ్యల మొల్తాడు కట్టడమే" అంటాడు.

వేజ్‌బోర్డు జీతాలను నిర్ణయించడం అంటే "పంచ పాండవులు, మంచం కోళ్ళవలె ముగ్గురని రెండువేళ్ళు చూపించడం లాంటిదని" అంటాడు. రాజకీయనాయకులు ఎన్నికల సమయంలో వచ్చి వాగ్దానాలు చేస్తారు. కొడుకుకు కనీసం బావి పని వస్తుందనుకుంటే ముదుపులకాశపడి మిషన్లు కొంటూ ప్రభుత్వం, అధికార్లు కలిసి "దొంగలు దొంగలు కూడి పంచుకోవడం లాంటిది" అంటారు.

కార్మికులు తమ పిల్లలకు పెళ్ళి చేద్దామనుకుంటే కళ్యాణ మంటపాలు లేవు గాని దేవుడి పెళ్ళిళ్ళకు కంపెనీ ఖర్చు పెట్టడాన్ని "పెద్దోడు పెండ్లి కేడిస్తే సిన్నోడు పిల్లలకేడ్చిండంట" అంటాడు.

ఇన్సెంటివ్ బోనస్‌కు ఆశపడి 75 ఉళ్ళు చేయడం (సహజమైన నిబంధన 50) చేసేసరికి యాజమాన్యం లాకవుట్ విధిస్తుంది. కోల్ కట్టర్స్ 75 ఉళ్ళు కోయడం తప్పు కదా అంటూ కార్మికుల తప్పును సమర్థిస్తూ "తప్పు చేయ్యని గాడిద ఎవరోయ్ చూపు?" అంటారు.

మేడే చేసుకోవడానికి బొంగులు కావాలంటే మేనేజరు లీడరుకి మాత్రమే ఇస్తామంటారు. మేడే అంటే కార్మికులందరిదీ అనీ ఎర్ర జెండా ఎగరేయటానికి బొంగుల కోసం పోరాటం చేస్తూ 'ఎర్రనిదీ జెండెన్నీయలో' అంటూ పాడుకుంటూ వెళ్ళటం జరుగుతుంది మేడే కార్మికులు కాగజ్‌నగర్ సరిసిల్కు ఫ్యాక్టరీని తెరవమని అడిగినందుకు పోలీసుల లాటీతో మంత్రి గారి స్పీచ్‌తో మీటింగ్ ముగిసినపు "చెప్పకపోతే పట్టుకొని తన్నిండు" అంటూ చెప్తాడు. నక్సలైట్‌గా అనుమానితుల్ని బాధపెట్టడాన్ని నిరసిస్తూ కార్మికులు కంపెనీని వదిలి వెళ్ళాలనుకునే సరికి బాధపడి పోలీసులు కొట్టడాన్ని "బెల్లం లేకుండా అరిసెలు చేయబట్టే" అని అంటాడు. ఆధునిక కాలంలో చదువులు మనుషుల్ని కార్మికుల నుండి విడదీయటానికి నేర్పుతారనీ 'సదువంటివి' అనే శీర్షిక క్రింద చెబుతాడు.

3. సింగరేణి సాహిత్యం - గని కార్మిక జీవనం

మానవ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్న పారిశ్రామికీకరణంలో భాగంగా పారిశ్రామిక సంబంధాలలో కార్మికులు కష్టనష్టాలకు గురి అవుతుండటం జరుగుతుంది. కార్మికుడు జీవితంలో అటు వృత్తి సంబంధాలలోనూ ఇటు సామాజిక సంబంధాలలోనూ సమస్యలనెదుర్కొంటూ సంఘర్షణలకు, సంక్లిష్టతలకు లోనవుతూ ఆవేదనతో, అసంతృప్తులతో సమస్యల నెదుర్కొంటున్నట్టుగా సింగరేణి సాహిత్యంలో దర్శనమిస్తాడు.

చారిత్రక, ఆర్థిక, సాంఘీక, మానసిక, వసతి, వర్తన విధి విధానాలు, సాంకేతికత, వృత్తులు, రాజకీయ, పరిపాలన, న్యాయ విషయాల సమాహార పరిశీలనలోనే పారిశ్రామిక సంబంధాలు అర్థం అవుతాయి. ఈ విషయాలన్నింటిలోనూ అంతస్సూత్రంగా మానవ సంబంధాలు మిళితమై ఉంటాయి. కార్మికుని జీవితంపై ప్రభావం చూపించేవి కూడా ఇవే కాబట్టి పారిశ్రామిక సంబంధాల దృక్కోణంలో కార్మిక జీవితాన్ని విశ్లేషణకు పెట్టి అవగాహన చేసుకోవాలి. ఈ అవగాహనయే పారిశ్రామిక సంబంధాలలో యాజమాన్య - కార్మిక సంబంధాలలో ఉన్న అంతరాన్ని (గ్యావ్‌ని) తగ్గించగలుగుతుందనీ ఉత్పాదకతను పెంచి తర్వాత ఉత్పత్తికి దోహదం చేయగలుగుతుందనీ, పారిశ్రామిక సంబంధాల పునురుద్ధరణకు కరదీపిక కాగలుగుతుందని కూడ అర్థమవుతుంది. ప్రపంచీకరణం, ప్రైవేటీకరణఅనీ పంజా విసురుతున్న ఈ రోజుల్లో విదేశీ పెట్టుబడుల అవసరం లేకుండానే అంతర్గత నిధులకై ఉత్పత్తిని పెంచుకొని లాభాల బాటలో సాగాల్సిన ఈ తరుణంలో పారిశ్రామిక సంబంధాల పటిష్టత ముఖ్యమైనది.

క్షీణిస్తున్న పారిశ్రామిక సంబంధాలు ఉత్పత్తి. ఉత్పాదకతపై ప్రభావితం చూపి నష్టాల బాటలో నడిచిన సింగరేణి సంస్థ బి.ఐ.ఎఫ్.ఆర్.లో వెళ్ళిన సూచన దినదిన గండంగా పరిణమిస్తూంటే, ప్రభుత్వ రంగ సంస్థయైన "సింగరేణి" సంస్థ ప్రయివేటీకరణకు గురి అవుతుందన్న ఆందోళన అధికమయింది. ఈ తరుణంలో సంస్థను సంరక్షించుకోవాలని కాంక్షిస్తున్న కార్మికులకును, సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికై ఉత్పత్తే ధ్యేయంగా పెట్టుకున్న యాజమాన్యానికి మధ్య పారిశ్రామిక సంబంధాలు సత్సంబంధాలుగా పునరుద్ధరింపబడాల్సిన అవసరం ఉంది. పారిశ్రామిక శాంతి గల

వాతావరణంలోనే పారిశ్రామిక సంబంధాలు చక్కగా కొనసాగుతాయి. అంటే సమ్మెలు ఆందోళనలు లేకుండా ఉండాలి. ప్రమాదాల అంచున పనిచేస్తున్న కార్మికుల యొక్క సమస్యల అసంతృప్తుల ఫలితమే సమ్మె కాబట్టి దాని యొక్క మౌలిక స్వభావాన్ని గురించి వివేచన చేయాల్సిన అవసరం ఉంటుంది. సంస్థాగత కార్మిక సమస్యలకు కార్మికుల మనోగత అభిప్రాయాలకును, ఈ సింగరేణి సాహిత్యం విస్తృత వేదిక కాగలిగింది. ఎక్సరే కూడా కనిపెట్టలేనిదైన సమ్మె స్వభావాన్ని మనో విజ్ఞాన శాస్త్ర దృక్కోణం నుండి కార్మికుల సమస్యలను, అసంతృప్తులను విశ్లేషించుకుంటూపోవటానికి, నేటి సమ్మెలకు పరిష్కార మార్గాలను సూచించడానికి గల చారిత్రక భూమికను అర్థం చేసుకోవటానికి కూడా ఈ సింగరేణి సాహిత్యం ప్రయోజనకారి కాగలుగుతుంది.

సింగరేణి సాహిత్య పరిశీలనలో భాగంగా పారిశ్రామిక సంబంధాలలోని సంక్లిష్టతలు ప్రతిఫలించిన సమ్మెలను, ప్రమాదాలను ఉత్పత్తిని, ఉత్పాదకతను సంస్థలోని గణాంక రికార్డులతో పోల్చిచూసి సాహిత్య విలువలను నిర్ధారించడం జరిగింది. గని కార్మిక జీవితాన్ని ఉత్పత్తి శక్తుల విలువలను అంచనా వేయగలగడానికి రచయిత పోటీ మార్కెట్ వ్యవస్థలో భాగంగా తదితర బొగ్గు గనులు గల ఒరిస్సాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ సందర్శన చేయడం జరిగింది. ఆయా సంస్థలోని కార్మిక జీవితాలు, సమ్మెల స్వభావాలు ప్రమాదాలు గణాంకాలను సేకరించి అర్థం చేసుకున్నప్పుడు సింగరేణి సంస్థ ఉత్పత్తి పై ఉత్పాదకాలపై ప్రభావం చూపించే పారిశ్రామిక సంబంధాలు మరింతగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. కార్మికుల జీత భత్యాల విషయములో రాజకీయార్థిక దృక్కోణం ద్వారా పరిశీలిస్తే వారి స్పందనలను బాగా అర్థం చేసుకోవచ్చనిపించింది. ఉత్పత్తి ఉత్పాదకతపై ప్రభావం చూపించగల కార్మికుల సమస్యలు పారిశ్రామిక వివాదాల స్థాయిలోనే పరిష్కరింపబడగలిగితేనే సమ్మెలు జరిగే అవకాశం ఉండదు. వాటిని అవసరమయితే న్యాయ వ్యవస్థ కనుగుణంగా విమర్శించాల్సి ఉంటుంది. సంస్థాగత విధి విధానాలను కార్యకలాపాల విభాగాలను సమీకరించుకుంటూ సమస్యలను, సమ్మెలనూ మానవ సంబంధాల దృక్కోణం నుండి సూక్ష్మ దృష్టితో వివేచన చేయగలిగితే నిర్మాణాత్మక స్థాయిలో పరిష్కారాలు స్పష్టమవుతాయి.

గని కార్మిక జీవిత విశ్లేషణలో భాగంగా సంస్థాగత సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై కార్మికుల స్పందనలను సింగరేణి సాహిత్యంలో స్పష్టంగా అవగాహన చేసుకోవచ్చు. గని కార్మికులతో ముఖాముఖి చర్చల ద్వారా

అభిప్రాయాల సేకరణ జరిగింది. గని కార్మిక కుటుంబ జీవితాన్ని పరిశీలించడంతో పాటు సామాజిక సంబంధాల దృక్కోణం నుండి కార్మిక కుటుంబ స్త్రీలను కూడా అర్థం చేసుకోవాలి. వివిధ సంస్థలలో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీ రూసిమోడి భావించినట్టుగా కార్మిక కుటుంబ స్త్రీల అభిప్రాయ సేకరణ, వారితో చర్చలు సంస్థ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర వహిస్తాయి. కనుక కార్మిక కుటుంబ స్త్రీలలో ఉన్న చైతన్య స్థాయిని సాహిత్యం ద్వారా అవగాహన చేసుకోవడమే గాక వారితో ముఖాముఖి చర్చలు చేయటం అభిప్రాయ సేకరణ ద్వారా కార్మికుల కౌటుంబిక సామాజిక జీవన సమస్యలు అర్థమవుతాయి.

సింగరేణి గని కార్మిక జీవనాన్ని అంచనా వేసే క్రమంలో భాగంగా ముందుగా ఏ సామాజిక సంబంధాలు, శక్తులు అతన్ని ఈ పారిశ్రామిక సబంధాలలోకి తీసుకువచ్చేటట్లు చేసాయో విశ్లేషించడం ప్రథమ కర్తవ్యం. కార్మిక జీవిత చారిత్రక నేపథ్యంలోకి తొంగిచూడగలిగితేనే అతడెటువంటి ఆశలు, ఆశయాలతో గని కార్మికుడిగా పారిశ్రామిక సంబంధాలలోకి ప్రవేశించాడో అర్థం అవుతుంది. దీనికి 'భూదేవి, ఇంటర్వ్యూ, జీవితం, ప్రస్థానం, ప్రమాదం, నిర్ణయం, అగ్గి' వంటి కథలు ఉదాహరణలు, 'భూదేవి' కథలో ఆర్థిక దుస్థితి నేపథ్యం ఒక వ్యక్తిని (కార్మికుడిని) తన సొంత వారి నుండి, ఆత్మీయుల నుండి పరాయీకరణ చెందేటట్టు చేసేసరికి అతని జీవితంలో శూన్యత్వం చోటు చేసుకున్న విషయం అర్థం అవుతుంది.

సాధారణ పారిశ్రామిక సంబంధాలలో కార్మికుడి వైపు ఉండే సమస్యలకు కారకమైన విషయాలుగా పని స్వభావం, ఆ పనియందు అభిరుచి, పనిచేసే చోటునందలి పరిస్థితులు, జీత భత్యాలు, వృత్తి రక్షణ, కార్మిక రక్షణ, అధికార ప్రవర్తన, మొదలైన అంశాలు సమ్మెలకు దారి తీస్తాయి. కాబట్టి వీటిని పారిశ్రామిక సంబంధాలలో ముఖ్యమైన మానవ సంబంధాల దృష్ట్యా పరిశీలించి, మనో విజ్ఞాన శాస్త్రానుగుణంగా విశ్లేషించుకుంటూ పోయి, సామాజిక సంబంధాల దృక్కోణం నుండి, రాజకీయ ఆర్థిక దృక్కోణం నుండి పరిష్కరించుకోవడంగా ఉండాలి. ఈ సమస్యలు అతనికి కౌటుంబిక సామాజిక సమస్యలుగా కూడా మారే అవకాశం ఉంది. కాబట్టి వీటన్నింటిని మానవ సంబంధాల దృక్కోణం నుండి కూడా క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలి. అయితే పారిశ్రామిక సంబంధాలలో కార్మిక సమస్యలన్నిటికి యాజమాన్యపు వైఖరిని బట్టి సమస్యలను పరిష్కరించడానికి వీలవుతుంది. యాజమాన్యానికి కార్మికులతో ప్రధానంగా ఒక ఉత్పత్తి

విషయములోనే సమస్య ఏర్పడుతుంది. మిగిలిన సమస్యలైన ప్రభుత్వ నిర్ణయాల వత్తిడి, మార్కెట్ వ్యవస్థ, పారిశ్రామిక విధానంలో మార్పు, లైసెన్సు విధానం వంటి విషయాలలో కార్మిక సహకారం యాజమాన్యానికి అవసరం అవుతుంది. యాజమాన్య సమస్యలు సంస్థేతరంగా పరిష్కరించుకో తగ్గవి. వ్యక్తి గని కార్మికుడైన తర్వాత అతడు జీత భత్యాల విషయంలోనే కాక ప్రమాదభరితమైన వృత్తి యందు సమస్యలకు, సంఘరషణలకు లోనయి, అతని జీవితమే పరాయీకరణ పొందినట్లుగా భావించడం జరుగుతుంది. అతనిలో చోటు చేసుకున్న శూన్యం మరింతగా పెరిగి నిరంతరం ఆందోళనకు గురి చేస్తుంటే నిరుత్సాహం పెరిగి అతనికి పనియందు అభిరుచి తగ్గి అనారోగ్యం పాలవుతాడు. ఒక్కొక్కసారి ఆ శూన్యంలో ప్రతిఘటన స్వభావం కూడా చోటు చేసుకుంటుంది. అలా కాకుండా ఉండేందుకు అతని సమస్యలను పరిష్కరించుకోవడానికి వీలుగానూ, తోటి కార్మికుల సమస్యలు విశ్లేషించుకోవడానికి, కార్మిక సంఘాల చట్టం (1926) పారిశ్రామిక వివాదాల చట్టం (1947) వచ్చాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని మేడే స్ఫూర్తి, ఐక్యత, పోరాటం ఇత్యాది కథలు వచ్చాయి.

వృత్తి యందు జీవితానికి రక్షణగా మైన్స్ (సేఫ్టీ) యాక్టు (1952) వచ్చింది. ఇది ప్రమాదాల నుండి రక్షణ ఇవ్వడమే గాక ఈ యాక్టులో భాగంగా ఒప్పందాల రూపంలో కొన్ని సంక్షేమ పథకాలను కూడా అమలులోనికి వచ్చేటట్లు చేసింది. ఈ సంక్షేమ పథకాల అమలుకై బడ్జెటులో కేటాయింపు జరుగుతుంది. పనిచేసే చోటు, వసతులు, కార్మిక కుటుంబ ఆవాసాలు, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, నీరు, విద్యుచ్ఛక్తి వంటి సంక్షేమ సదుపాయాలను కల్పించాల్సి ఉండగా అమలులోని లోపంతో అసంతృప్తి చెందిన కార్మికుల స్పందనలు "అగ్గి", "శత్రువు", "రాజీ" వంటి అనేక కథల్లోనూ, నవలల్లోనూ ప్రస్ఫుటం అయ్యాయి.

జీత భత్యాల విషయంలో 'జీతం', 'జీతం-లాభం', 'నిర్ణయం', పంచ పాండవులు', 'రాజీ', వంటి కథలలోను 'సమ్మె' అనే స్వగతాలలోనూ, వ్యక్తమయ్యే అసంతృప్తులు, బోనస్ గురించి ఏనుగు తిన్న వెలక్కాయ, ఇన్సెంటివ్‌లను గురించి 'కొండ నాలుక్కిమందు', వుసికల ఉచ్చబోసినట్లు, తప్పు చెయ్యని గాడిద ఎవ్వడు, అనే స్వగతాలలోనూ అడ్వాన్సును గురించి 'నిర్ణయం' ఇత్యాది కథలోనూ స్పందనలు అర్థమవుతాయి. పరిశ్రమలో కార్మికుడి జీవితానికి ధర తగ్గడం, సమాజంలో జీవనానికి ధరలు పెరగడం మధ్యనున్న కార్మికుడి సంఘర్షణ స్పష్టం చేసిన కథలూ ఉన్నాయి. వృత్తి యందు జీవిత రక్షణ లేని కథలుగా "ప్రమాదం,

నిర్ణయం, శత్రువు, పురుడు, పెండ్లి" ఇత్యాది కథలు కన్పడుతాయి. కార్మికుల అభిమానాన్ని కించపరిచే అధికారుల ప్రవర్తనను, నిర్లక్ష్యాన్ని జాతశ్రీ "సింగరేణి మండుతోంది" అనే నవలలో తెలియజేశారు. అయితే బోగస్ యూనియన్ నాయకులను గుర్తించి "తనకు తాకితే, నవ్వుల పాలైతే, నాభిలో తన్నాడు, పిల్లికి రొయ్యల మొల్తాడ" వంటి స్వగతాలు స్పష్టంజేస్తాయి.

వృత్తిలోని జీవన సమస్యలు కుటుంబ మీద ప్రభావం చూపించి కుటుంబ సమస్యలుగా మారి మానవ సంబంధాలను దూరం చేస్తాయని, కొన్ని సందర్భాలలో పితృస్వామ్యంకూడా తోడయి కుటుంబంలోని వ్యక్తులను శత్రు పూరిత సంబంధాలలోకి నెట్టబడడం కూడా జరుగుతోందని స్పష్టం చేసే కథలుగా శత్రువు, రాక్షసుడు, హరిసింగ్, ప్రమాదం, పెళ్ళి మొదలగు కథలు 'నల్ల కలువలు' అనే కథా సంపుటిలో ప్రత్యక్షమవుతాయి. జీవన సమస్యలు సామాజిక సమస్యలుగా పరిణమించిన విషయం, "దున్నపోతు ఈనిందంటే" అని స్వగతంలో తేటతెల్లమవుతుంది. ఉత్పత్తియే ధ్యేయంగా గల యాజమాన్యపు వైఖరికి అద్దం పట్టే కథలుగా "శత్రువు, నూరు కత్తులు నూరుకోనీ, ప్రమాదం" ఇత్యాది కథలు వ్యక్తమయ్యాయి.

"పెళ్ళి" కథలో గని ప్రమాదాల పట్ల యాజమాన్యపు వైఖరి అధికార్ల నిర్లక్ష్యం కంటే కూడా పితృస్వామ్యం భయంకరమైందనీ తెలియచేయడం జరిగింది. అయితే అధికార్ల నిర్లక్ష్యం వృత్తిలో ప్రమాదాలకు దారి తీస్తుందని 'శత్రువు' కథలో స్పష్టమవుతుంది.

సంక్షేమ కార్యక్రమాల అమలులోని లోపం కార్మిక కుటుంబ స్త్రీలలో చైతన్యాన్ని తీసుకు వచ్చిందనటానికి 'నీళ్ళ క్రతువు' కథలో స్పష్టమవుతుంది. అంతేగాక గని కార్మికుల్లో ప్రవేశించిన శూన్యం కార్మిక కుటుంబ స్త్రీల జీవితాలను కూడా శూన్యంగా మార్చడాన్ని 'శత్రువు' కథ అద్దం పడుతుంది. ఇలా కథలలోని కార్మిక కుటుంబ స్త్రీలను ప్రత్యేక అధ్యయన దృష్టితో చూడడమే గాక, అసంతృప్తులను కార్మిక కుటుంబ స్త్రీలతో చర్చలు జరిపి, వారి అభిప్రాయాలను సేకరించి తెలుసుకోవడం లో వాస్తవమని అర్థం అయింది. తద్వారా కూడా పారిశ్రామిక సంబంధాలు పునరుద్ధరింపబడగలవని భావించడం జరిగింది.

4. పారిశ్రామిక సంబంధాలు- కార్మికుల సమస్యలు

ఆధునిక యుగంలో కార్మికులకు ఆర్థిక భద్రతను కల్పించడంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధిని కల్గించడంలో కూడా పారిశ్రామిక సంబంధాలు ముఖ్య పాత్రను పోషిస్తాయి. కార్మిక-యాజమాన్యపు సత్సంబంధాలు ఉత్పత్తి, ఉత్పాదకతను అభివృద్ధి చేయడమే గాక, పారిశ్రామిక శాంతిని సాధించగలిగి ఆర్థికాభివృద్ధి వేగాన్ని అందుకోగలిగేటట్లు కూడా చేయగలుగుతాయి.

యాజమాన్యం సిబ్బంది మధ్య గలవి సంస్థాగత సామాజిక సంబంధాలు కాబట్టి ప్రభుత్వ విధానాల న్యాయ విధానములతోపాటు కార్మికులు-యాజమాన్యానికి సంబంధించిన పారిశ్రామిక సంబంధాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలి.

ద్రవ్యానికి-విలువలకు, ప్రోత్సాహాలకు-ఆర్థిక భద్రతకు, క్రమ శిక్షణకు-పారిశ్రామిక ప్రజాస్వామ్యానికి అధికారికతకు-స్వేచ్ఛకు, ఒప్పందాలకు-సహకారానికి మధ్య ఏర్పడే పోరాటాలకు సంక్లిష్టతలకు, ఆవరణ సాధ్యమైన పరిష్కారం ఈ పారిశ్రామిక సత్సంబంధాల రూపంలో ఉంటుంది. యాజమాన్యపు నియంత్రణాధికారం వేతనాల కొరకన్నట్లుగా శ్రమ యొక్క అమ్మకం ధ్యేయంగా ఉంటే మానవ సంబంధాలలో సమస్యలు ఏర్పడతాయి.

చారిత్రక, ఆర్థిక, సామాజిక, మానసిక, పరిస్తితులుతోపాటు యంత్రాంగ విధానం, సాంకేతిక పరమైన, వృత్తి పరమైన, రాజకీయ పరమైన, పాలనా పరమైన, న్యాయ పరిణామాల ఆవశ్యకత వంటి విషయాలతో కూడిన పరస్పర ఆధారితమైనవిగా పారిశ్రామిక సంబంధాలు ఉంటాయి.

పని పరిస్థితుల పరిశీలన, వేతనాలు, ఉద్యోగ భద్రత, మొదలైన ఆర్థిక విషయాలు, వాటి ప్రారంభ పరిణామాలను సూచించే చారిత్రకత, సామాజిక, సంక్లిష్టతల పోరాట పటిమ, ప్రభుత్వం, పత్రికలు, మనస్తత్వాలు, ప్రభుత్వం విధానాలు, న్యాయ విధానం, అంతర్జాతీయ సంబంధాలు, శ్రామిక విధానాల పరిపాలనా పద్ధతి, సాంకేతిక పరిజ్ఞానం వంటి విషయాలతోపాటు నష్టాల పట్టికను కూడా తెలుసుకోవాలి.

కార్మికుల నేపథ్యం, స్వభావాలు, శ్రమ, మార్కెట్ పరిస్థితులు, వేతనాలు, సేవలు, పని పరిస్థితులు జీవించే పరిస్థితులు, ట్రేడు యూనియన్ల ఏర్పాట్లు వాటి ఆదర్శాలు, ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగం, మూల ధన నిర్మాణం, సంస్థాగత ఏర్పాటు, శ్రామిక బలం మీదనున్న యాజమాన్యపు దృక్కోణంతోపాటు ప్రభుత్వపు న్యాయ విధానంతోనూ పారిశ్రామిక సంబంధాలు ముడిపడి ఉంటాయి.

సామాజిక, ఆర్థిక, రాజకీయ, మానసిక పారిశ్రామిక సంంధాలను ప్రభావితం చేస్తాయి కాబట్టి ఆయా పరిస్థితులకనుగుణమైన పద్ధతులతో ఆలోచించి, అవగాహన చేయాల్సిన అవసరం ఉంది.

సమస్యాత్మక పారిశ్రామిక సంబంధాలు, యాజమాన్యం కార్మికులు మధ్యన ఉండే పరిస్థితులలో విషయావగాహన చేసుకొనే విధానంలో ప్రారంభమవుతాయి. యాజమాన్యం కార్మికుల మధ్యనున్న విషయాలలో పరస్పర అవగాహన లోపాల వల్ల పారిశ్రామిక సంబంధాలు సంక్లిష్టతకు గురి అవుతున్నాయి.

ఒకే వ్యక్తి వర్కర్‌గా ఉన్నప్పుడు ఒక మనస్తత్వంతోనూ, అధికారిగా యాజమాన్యం వైపున్నపుడు ఒక రకంగా ప్రవర్తించడం, కనబడుతుంది. ఒకరికొకరు ప్రస్తుతించుకోకపోగా ఎవరికి వారే ఎదుటి వారు తమపై ఆధారపడి ఉన్నారనే భావనలతో కూడిన ఉద్రేకాల మధ్య వ్యక్తిగత స్వభావాలు కూడా కారణం అయి పారిశ్రామిక సంబంధాలు మరింతగా సంక్లిష్టతను సంతరించుకుంటాయి.

ఇరువురు తమ వైపు నుండి సమస్యను పెద్దదిగా చూడడం, లేదా సమస్యను అణచివేయడం, లేదా వక్రీకరించడం జరుగుతుంటుంది. ఆశలు, ఆశయాలు, ఆదాయం, అక్షరాస్యత, అనుభవం, సమాచారాన్ని అందుకునే సందర్భంలో ఉండే ప్రేరణ, వ్యక్తి గత ద్వేషం, నిరాశ నిస్పృహలు, కోపాలు, తాపాలు పారిశ్రామిక సంబంధాలను సజావుగా సాగనీయవు.

పని స్వభావం, పని అందలి అభిరుచి, పని పరిస్థితులు, జీత భత్యాలు, ఉద్యోగ భద్రత, యూనియన్లతోనూ, తోటి కార్మికులతోనూ ఉండే సంబంధాలు, అధికారుల ప్రవర్తన, కుటుంబం, సామాజిక జీవితం వంటి విషయాలు కార్మికులను ప్రభావితం చేస్తాయి.

ప్రభుత్వ విధానాలు, నిషేధాలు, మార్కెట్ పరిస్థితులు, వ్యాపార విధానాల యందలి మార్పులు, లైసెన్స్ పొందుడంలోని జాప్యం, సంస్థ యొక్క ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ విధానం కూడా యాజమాన్యాన్ని ప్రభావితం చేస్తాయి.

సమాజం నుండి పరిశ్రమను విడదీయలేము. భిన్నమైన వ్యక్తిత్వం చదువుల నేపథ్యం, కుటుంబం పెంపకం, స్వీయమైన ఇష్టాయిష్టాలు గల వ్యక్తుల సమూహానికి నిలయం పరిశ్రమ పారిశ్రామిక సంబంధాలు కల భిన్నమైన వ్యక్తుల మధ్య ఉండే వైవిధ్యమే వైరుధ్యాలకు కారణం అవుతుంది.

పారిశ్రామక సంబంధాలలో కీలకంగా భావింపబడే యాజమాన్యపు లక్ష్యాలు, కార్మికుల స్వభావం, పరిశ్రమల మార్పు వంటి విషయాలన్నింటిని సామాజిక సంస్కృతియే నిర్ణయిస్తుంది. సంస్థ యొక్క విలువల విధానపు సంస్కృతి, ఆచారపుటలవాట్లు, నిర్మాణపు మార్పు, సామాజిక స్థాయీ చిహ్నాలు, యుక్తి, చాతుర్యం మార్పునకు అనుగుణమైన సహనం మొదలైన విషయాలతో కూడా పారశ్రామిక సంబంధాలు ముడిపడి ఉంటాయి.

పారిశ్రామికీకరణలో భాగమైన పట్టణీకరణ, సమాజ సంబంధాలలోని మార్పు, ఇళ్ళు, రవాణా, కుటుంబ సబంధాలలో గల వనరుల వినియోగము, వత్తిడిల బాధ, నేరాలు, జూదము, త్రాగుడు, వ్యభిచారము మొదలైన విషయాలు పారిశ్రామిక సంబంధాలతో ఆటాడుకుంటాయి. ఇవన్నీ మనుష్యుల యొక్క సామాజిక శక్తి, సంస్థాగత ప్రవర్తనను నిర్ణయిస్తాయి. పరిశ్రమలో సామాజిక సంబంధాలలో గోచరమైన విషయాలు కూడా పట్టించుకోకపోతే పారిశ్రామిక సంబంధాలు సజావుగా ఉండవు.

మానవ సంబంధాలలో పారిశ్రామిక సంబంధాలను ఒక భాగంగా భావించాలి. ఇది మనస్తత్వం, సామాజికత, సామాజిక ఆవిర్భావం, పారిశ్రామిక మనస్తత్వం, పారిశ్రామిక సామాజికత, ఆర్థికత మొదలైన విషయాల అంతర్గత విషయాల పరస్పర ఆధారిత స్వభావం కలిగిన విధాన రూపంలో ఉంటాయి. ప్రధానంగా సంస్థలోని సిబ్బందిని మానవీయ దృష్టిలో చూడాల్సిన కోణం కూడా ఇది.

పని ప్రదేశాలలో సిబ్బంది యొక్క పని తీరులోని ప్రవర్తన యొక్క పరిణామాలకు సంబంధించిన విషయాలు సంతృప్తికర పారిశ్రామిక సంబంధాలలో భాగం అవుతాయి. పనిని ప్రభావితం చేసే నిర్ణయాలలో భాగస్వామ్యాన్ని కలిగించి కార్మికుని ఆవశ్యతకను నొక్కి వక్కాణించడంగా భావించవచ్చు. కార్మికుడు బాధ్యతాయుతమైన స్వేచ్చను అనుభవించే విధంగా ఆధికారిక నియంత్రణను సంస్థ రూపొందించుకోవాలి.

సామాజిక-వ్యక్తిగత అవసరాలలో సంతృప్తి కలిగేలా విధంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తూ, సిబ్బంది యొక్క సామాజిక బాధ్యతను పెంచగలగాలి. సామూహిక కార్మికుల అభిరుచులను ప్రభావితం చేయగల విషయాలలో నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని కల్గించాలి. ఇది లేకపోతే కార్మికుడు సంస్థలో పరాయీకరణకు లోనయి నిరాశా నిస్పృహలను పొందితే పారిశ్రామిక సంబంధాలు దెబ్బతింటాయి.

ఒక్కొక్కప్పుడు సామూహిక అభిరుచులతో ఏకగ్రీవంగా అవగాహనకు రాగలగడం పారిశ్రామిక సంబంధాలను ప్రభావితం చేస్తాయి. అయితే మానవ సబంధాలు వ్యక్తుల మధ్య గల తోటి కార్మికుల సంబంధాలుగా కూడా ఉంటాయి. సహ కార్మికుల సంబధాలుగాను, తమ పైన ఉన్న విచారణకర్తలతో (సూపర్‌వైజర్) ఉండడంతో మానవ సంబంధాలు పారిశ్రామిక సంబంధాలలో ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తాయి.

పారిశ్రామిక సంబంధాలలోని సంక్లిష్టతకు విరుగుడుగా ఉపయోగపడే ఔషధం న్యాయ దృక్కోణం. అయితే ప్రభుత్వం రూపొందించిన చట్టాలలోని పటిష్ఠతను బట్టి పారిశ్రామిక సంబంధాల పటిష్టత ఆధారపడి ఉంటుంది. ఏ పరిస్థితులలో ఆ చట్టాలను చేయవలసి వచ్చిందో తెలుసుకొని, ఆ చట్టాలు ఆచరణలోని లోపభూయిష్ఠతను చక్కగా అర్థం చేసుకోవాలి. పారిశ్రామిక విధానాలను సఖ్యతతో గూడిన వాతావరణంలో సకాలంలో చట్టాలు బలంగా రూపొందించబడితే న్యాయ దృక్కోణం ఉపయోగపడుతుంది. ఈ క్రమంలో వచ్చిన చట్టమే 1947 నాటి పారిశ్రామిక వివాదాల చట్టం.

పెట్టుబడిదారీ వర్గానికి, కార్మికులకు మధ్య ఉన్న వర్గ స్వభావానికి సంబంధించిన రాజకీయార్థిక విధానం పారిశ్రామిక సంబంధాలను ప్రభావితం చేస్తుంది. లాభాల ధ్యేయంగా శ్రమ దోపిడి యాజమాన్యం వైపు ఉంటే, కార్మికుల వైపు ఉత్పత్తి మీద శ్రామిక నియంతృత్వం ఏర్పడి, వర్గ రహిత సమాజానికై ప్రయత్నించడం జరుగుతుంది. రెండింటి మధ్య ఘర్షణ అనివార్యమౌతూ ఉంటుంది. పీడక పీడిత వర్గాల మధ్య అధికారంకల వర్గం, సామూహిక బలంకల వర్గాల మధ్య సంబంధాలుగా ఉంటుంది. ధనికుల, పేదల మధ్య వివాదంగా అసమ సంబంధాలలోకి ఇది పరిణమిస్తుంది.

యాజమాన్య సూత్రాలు, ఆచరణలు, సంస్థాగత నిర్మాణం, ఆర్థిక స్థితి, సాంకేతికత, కార్మిక శక్తి, కార్మిక యూనియన్లు, యజమానులు-కార్మికుల విలువల

విధానం వంటివి పారిశ్రామిక సంబంధాలలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. అనేక సంస్థాగత విధానాల యంత్రాగంలో పరస్పర ఆధారిత సంబంధాలలోని కార్మిక శక్తికి యిచ్చే విలువల విధానంలోని లోపాలు మొత్తం పారిశ్రామిక విధానాన్ని ప్రభావితం చేయగలుగుతారి.

ఇవన్నీ సంస్థాగతంగా ఉండేవి. అయితే ప్రభుత్వం, ప్రభుత్వ విధానాలు, యాంత్రికత, రాజకీయ పార్టీలు, మార్కెట్ శక్తులు ఆర్థిక సంస్థలు మొదలైన బాహిర శక్తులు సంస్థపై ప్రభావం చూపెడతాయి అనేది కూడా గమనించాల్సిన విషయ

4.1 గని కార్మికుడు - చారిత్రక నేపథ్యం

పల్లెల్లో క్రూరమైన నిజాం కాలం నాటి దొరల దోపిడీ, దుర్భర దారిద్ర్యం భరించలేక బతుకు తెరువుకోసం పొట్ట చేత పట్టుకొని గనుల ప్రాంతానికి భయం భయంగా పయనమయి వచ్చి సింగరేణి గనులలో కార్మికులుగా చేరినట్లు 'శేషగిరి' నవలలో అర్థం అవుతుంది. కరీంనగర్, అదిలాబాద్, వరంగల్ నుండి రైతు కూలీలు-గనుల ప్రాంతాలకు వచ్చి ఉండడానికి యిల్లు లేక, పని పరిస్థితులు బాగా లేక కాంట్రాక్టర్ల, యాజమాన్యము యొక్క దోపిడీ పీడనల మధ్య పెనం మీది నుండి పోయిలోకి పడ్డట్టుగా గిలగిలలాడేవారు. వెనక్కి తిరిగి పల్లెలోనికి పోలేక దుర్భర పరిస్థితిలో పనిచేయడానికి సిద్ధపడ్డారు. స్వాతంత్ర్యానికి పూర్వం గ్రామాల్లో భూస్వాముల దేశ్‌ముఖ్‌ల దోపిడీ పీడనకు తట్టుకోలేక పారిపోయి కాలరీలకు వచ్చిన వాళ్లు ఆ గరిమిలో, పొగలో, గాలిలేని చోట చేయలేక తిరిగి వెళ్లిపోదామనుకున్నా కూడా కాంట్రాక్టర్లు రైల్వేస్టేషన్స్‌లోనూ ఊరి పొలిమేరల్లో గుండాలను పెట్టి వాళ్లను ఊరు దాటి వెళ్ళనీయకుండా చేసి బలవంతంగా గనిలోనికి ఒప్పింపచేసేవారు. భార్యాభర్తల నిద్దరినీ గని పనిలో పెట్టుకుంటే ఊరు వదిలి వెళ్ళి పోకుండా ఉంటారని భావించేవారు.

'భూదేవి' కథలో మొగిలయ్య భూములకు ఎరువులు వేస్తే గాని పండటం లేదనీ, దానికై అప్పులు వడ్డీలకు తెచ్చి రెక్కలు ముక్కలు చేసికొని పండించినా అప్పు తీర్చడానికి సరిపోవడం లేదనే, భావనతోపాటు పట్టణ నాగరికతపై మోజుతో అతని భార్య పల్లె నుండి పట్నానికి పోదామనటం చేత ఆ ఊళ్లో ఉన్న భూమిని అమ్మి దళారులకు లంచం యిచ్చి కాలరీ ఉద్యోగాన్ని పొందుతాడు.

'పాత స్నేహితుడు' కథలోనూ ఒక తండ్రిగా ఆడపిల్లల పెళ్ళి కోసం

పొలం అమ్మగా వ్యవసాయం చేసుకోవడానికి భూమి లేక బ్రతుకు కష్టమై చివరికి కాలరీ ఉద్యోగానికి వచ్చినట్లుంటుంది.

'నెలవు' కథలో రాజేశ్వరి పెద్ద యింటిని కొనుక్కోవాలనీ, భూములను కొని అనుభవించాలనే కలలు పండడం కోసం భర్తను కాలరీ ఉద్యోగంలో చేరమంది. 'శత్రువు' కథలో పల్లెలో నీటి మోట వంటి పనులు చేసుకునే లింగయ్య కూడా గనిలో ఉద్యోగం చేసి కాసులు పోగు చేసి పొలం కొనుక్కొని వాళ్ల పల్లెకి వెళ్లిపోయే ఉద్దేశ్యంతో వచ్చినవాడు.

'ప్రస్థానం' కథలో మాధవయ్య పొలానికి శిస్తు కట్టడంతోపాటు, ఎరువులు, మందుల ఖర్చులకు పోను తనకు ఏమి మిగలడం లేదనీ బాధపడుతూ భూమిని అమ్ముకు తినే రోజు వచ్చే సరికి కాలరీ ఉద్యోగానికి వచ్చాడు. చేనేత మగ్గాలున్న ఓదెలు కూడా మగ్గం నేసుకొని బ్రతకలేక, మారు బేరాలకు చీరలమ్మినా పోటీ పెరిగి షావుకారుకు ఇవ్వగా ఏమీ మిగలడం లేదనీ భావించి కాలరీ ఉద్యోగంలో చేరాడు. పల్లెల్లో పంటతో పెనవేసుకున్న బాంధవ్యం ఉన్నా కూడా దొరల జులం నుండి తప్పించుకోవడానికి వచ్చినవారు , వ్యవసాయానికి తగిన పెట్టుబడి లేనివారు పల్లెల్లో బ్రతకీద్చలేని వారు, భార్యలకు పట్నవాసం పై ఉన్న మోజుతోనూ పొలం అమ్మగా వచ్చిన డబ్బు దళారులకిచ్చి కాలరీలో ఉద్యోగం చేరిన వారుగానూ కార్మికుల నేపథ్యం అర్థం అవుతుంది., వెలుతురు గల ప్రదేశం నుండి గాలి, వెలుతురు లేని గరిమిలగల గని ప్రదేశంలో బ్రతుకు పోరాటం నేపథ్యంగా ఉద్యోగానికి వచ్చిన వారు కావటంతో వైరుధ్యపు నేపథ్యంతోనే కార్మికులు పారిశ్రామిక సంబంధాలలో వచ్చినట్లు అర్థం అవుతోంది. ఈ మధ్య చదువుకున్న యువత కూడా పరుగుడు పందాలలో పాల్గొని నిరుద్యోగ సమస్య నుండి తప్పించుకోవడానికి గనిలో ఉద్యోగాలకు కుదిరారు.

'ప్రమాదం' కథలో మల్లన్న వాళ్ల బావ గని పనిలో చనిపోతే అక్క పిచ్చిదవుతుంది. బావ ఉద్యోగం తనకిస్తే మల్లన్న ఉద్యోగంలో చేర్తాడు.

'పురుడు' కథలో ఓదేలు కొడుకుకు కంపెనీ బడిలో సీటు రాక గవర్నమెంటు స్కూల్లో వేస్తే ఆగం ఆగం అయి 10వ తరగతి తప్పితే నాలుగు వేలు పైరవీకారులకిచ్చి కొడుకును బదిలీ ఫిల్లర్‌గా చేయించుకొంటాడు. ఓదెలు అని అర్థమవుతుంది.

'దారులు' కథలో పల్లెలో చెప్పులేసుకుని తిరిగినందుకు దొర తిట్టినందుకు ఒక వ్యక్తి కాలరీ ఉద్యోగంలోకి వస్తాడు.

'రాజీ' కథలో సాయిలు గేదెలను అమ్మి కాలరీ ఉద్యోగానికి వచ్చాడు.

'నల్లవజ్రం' నవలలో బొగ్గు గని కార్మికుని జీవనక్రమానికి శ్రమ దోపిడీకి ఒక క్రమం, ఒక యంత్రాంగ పద్ధతి ఒక రాజకీయం ఉంటుందనేది అవగాహనకు వస్తుంది. కార్మికుల జీవితాల చుట్టూ సమస్యలుంటే ఆ సమస్యల నుండి విముక్తికై పెనుగులాట ఉంటుంది. అదే జీవన పోరాటం అవుతుంది.

'అన్న' కథలో ఒక అధికారి పంట పండించిన వారికి ఆ పంటమీద అధికారం లేనట్లే కార్మికుడికీ బొగ్గు మీద అధికారం లేదంటాడు. ఆ సందర్భంలో వ్యవసాయదారుడికి పంట తనదన్న ఆత్మీయత అన్నా వుంటుంది. కాని కార్మికుడి శ్రమైతే మరీ పరాయిదైయిందని కార్మికులు బాధపడడం అర్థం అవుతుంది.

కాలరీ ఉద్యోగానికి ప్రయత్నించి భంగపడ్డ సందర్భాలు అర్థం అవుతాయి.

భూనిర్వాసితులకు గనులలో ఉద్యోగాలు యిస్తామని మభ్య పెట్టటం, దళారులు డబ్బు గుంజుకోవడం, లీడర్లు ఉద్యోగాలు ఇస్తామని తిప్పించుకోవడాలు, చివరికి ఉద్యోగం రాకపోగా, డబ్బులు పోయి, ఉన్న భూమి పోయి పరాయి ఊళ్లకు వలస వెళ్లే పరిస్థితులు 'భూ నిర్వాసితులు' కథలోనూ 'నిరసన' కథలోనూ కనబడుతాయి.

4.2 - పని స్వభావం :

పారిశ్రామిక సంబంధాలలో పని స్వభావం దాని వల్ల కలిగే శ్రమ నష్టాన్ని, అతని జీవితం పై చూపించే ప్రభావాన్ని అర్థం చేసుకుంటూ కార్మికులను యాజమాన్యం మానవీయ కోణం నుండి అర్థం చేసుకోగలగాలి.

'బొగ్గు పొరల్లో' అనే కథలో కార్మికులు మూడు రోజుల నుండి 'గోఫ్' చప్పుడు వినబడుతోంటే డీపిల్లరింగ్ పని ప్రమాదంతో కూడుకున్నదని భావిస్తారు. పైగా సపోర్టింగ్ దాట్లు తక్కువగా ఉండడంతో మరింతగా భయపడతారు. సేఫ్టీపట్టించుకోనందుకు బాధపడ్డారు. డీపిల్లరింగ్ పనికి అనుభవం లేని వాళ్ళను ఎందుకు తోలాలని భావిస్తున్న, టెంపరరీ వాళ్లకు డీపిల్లరింగ్ పనిని ఇవ్వగూడదని తెలిసినా అండర్ మేనేజరు ఇచ్చినందుకు కార్మికులు బాధపడుతారు.

'పోరుబాటల్లో' కథలో మస్టరు బుక్‌లో టైముకు హాజరు పడాలనీ, టైముకు బొగ్గు బావిలోకి దిగాలని సర్దారు, మేనేజర్లు అంటారు. కొత్త డైరెక్టరు స్ట్రిక్టుగా ఉండడంతో వారు లాడీసులనూ, ట్రామర్స్‌నూ, కమానోల్లనూ, డీపుల దగాయించమని, ఫేసులు వెడల్పు చేయొద్దంటూ హడావుడి పెడుతున్నారని

టబ్బులు సప్లయి లేక ఇబ్బంది పడి రెండున్నర టబ్బులు నింపడంతో ఫేసుల్లో పని ఒత్తిడి పెరిగిందనీ, యువకులు చేయగలుగుతున్నారు గానీ, ముసలి ముతక చేయలేక పోతున్నారనీ వారి మాటల్ని బట్టి, వారి బాధ అర్థం అవుతుంది.

'పోరు బాటల్లో' అనే కథలో ఓవర్మెన్లు- లంచాల కోసం ఇష్టమొచ్చిన వాళ్ళకు తేలిక పని ఇస్తారని భావిస్తారు.

'ప్రస్థానం' – అనే కథలో రాజలింగు సిక్కు చేస్తాడు. ఆ సిక్కు చేయడానికి కారణాన్ని వివరిస్తూ లోపలికి దిగితే మళ్ళీ తిరిగి వచ్చేంతవరకు నమ్మకం లేదంటాడు. లోపల గరిమి, మన్ను, మశానానికి తోడు రాత్రి 'బదిలీ' చేయాలంటే కండ్లు నిలేసుకుని మిటమిట చూసుకుంటూ ఉండాలనీ తెల్లవారి నిద్రపోయినా చాలదంటాడు. తన బతుకును రోజుకో కొత్త పుట్టువుగా భావిస్తాడు.

'శత్రువు' కథలో – త్రీ సీములో రెండవ షిప్టు కార్మికులు పది మంది కలిసి పదిటబ్బులను మాత్రమే నింపగలుగుతారు. అక్కడ పని పరిస్థితులు సరిగా లేక, పని స్వభావం ఇంకా కష్టపూరితంగా మారుతుంది. దానికి తగ్గట్టు ట్రాకు సరిగా లేక టబ్బులు పడిపోవడం లేక టబ్బులు బోర్లా పడితే, మళ్ళీ ఆ టబ్బులను నింపుకుంటూ కార్మికులు ఎక్కడెక్కడి కోపాలు గుర్తుకు తెచ్చుకొని ఒకళ్ళ నొకళ్ళను తిట్టుకుంటూ నింపుతారు. ఆ మర్రోజు పనిచేయడానికి శక్తి ఉంటుందో లేదో, పని చేయలేమేమో అని భావించి ముందుగానే సెలవు వ్రాయాలనుకుంటారు.

'సెలవు' కథలో రాజలింగం తన తోటి కార్మికుడు గనిలో బండకూలి మరణించిన సంఘటనను చూడడంతో ఆ చప్పుడు మాటి మాటికి మనస్సులో స్ఫురించడంతో ఒకానొక రకమైన మానసిక వ్యాధికి గురి అయినట్లు అర్థం అవుతుంది.

'నల్ల వజ్రం' కథలో కాళ్ళు గుంజుడు గల శంకరయ్య అక్కడ సీములో బొగ్గు ఎత్తలేక పోయాడనే దాన్ని అర్థం చేసుకోవచ్చు. సింగరేణి మండుతోంది, శేషగిరి అనే నవలల్లో కూడా గనిలో ఫిల్లింగ్, డీ పిల్లరింగ్ వర్క్ కష్టమైన పనిగా వర్ణింపబడింది.

"బండ కింద బతుకులు" అనే స్వగతాలలో గనిలో గల గరిమిని భరించలేని తనాన్ని వర్ణిస్తాడు. 'బొగ్గు పొరల్లో'! అనే కథలో అక్కడ పని పరిస్థితులు బాగా లేకపోవడంతో పాటు డీ పిల్లరింగ్ పని అనుభవం ఉన్నవాళ్ళకే

చేతనవుతుందనీ కార్మికులు భావించడం చేత తమకా అనుభవం లేకపోవడం చేత ఆ పని చేయాల్సిరావడాన్ని కార్మికులు ఒక పీడనగా భావిస్తాడు. అటువంటి మానసిక ప్రవృత్తితో ఆ పరిస్థితిలో పనిచేయాల్సిరావడం ఒక ఆందోళనతో కూడిన విషయం. ఆత్మ విశ్వాసంతో పని చేయగలగాలి కాని, ఆ పని చేయలేమేమో అనే అసమర్థతా మనస్తత్వంతో పాటు, ఆ పని పరాయివాళ్ళదనీ, మనది కాదనీ, బలవంతంగా మన చేత చేయిస్తురనే భావన, కలిసి వెరసి అవి అధికార-బానిస సంబంధాలుగా పరిణమిస్తాయి. మానవ సంబంధాల దృష్ట్యాను, సామాజిక సంబంధాల ద్వారానూ ఆలోచించగలిగితే, ఆయా సందర్భాలలో కార్మికుని మానసిక స్థాయి, ఆ పని స్వభావాన్ని గురించిన కార్మికుని ఆలోచనలు, అనుభవ రాహిత్యమనే అశక్తతాభావం వంటివి అన్నీ కలిసి కార్మికునికి ఆ పని భారంగా అనిపిస్తోందని అర్థం కాగలుగుతుంది..

'పోరుబాటల్లో' అనే కథలో ఒకటి లేదా ఒకటిన్నర టబ్బులు నింపేవాళ్ళు ఒక్కసారిగా రెండు లేదా రెండున్నర టబ్బులు నింపాల్సి వచ్చినప్పుడు పని భారం, పని ఒత్తిడి పెరిగిందనీ, దానికి తగ్గట్లుగా తమకు జీతాలు పెరగడం లేదనీ అసంతృప్తులకు లోనవుతారు. అలా టబ్బులు సైజు పెంచేటప్పుడు, జీతాలు పెరిగినప్పుడే వాటిని ప్రవేశపెట్టాలి అని కూడా భావిస్తారు. అంతేగాక పని స్వభావానికి అలవాటుపడేటట్టుగానూ బాధ్యతను పెంచే విధంగా యాజమాన్య నిర్ణయాలలో కార్మికులను భాగస్వాములుగా చేయగలగాలి.

'ప్రస్థానం' కథలో కార్మికుడు బొగ్గు బావిలోనికి వెళ్ళి ఆ గరిమిలో గాలి, వెలుతురు లేక దుమ్ము, ధూళి మాత్రం ఉండగల చోట 8 గంటలు పనిచేసి పైకి రావడం, దినదిన గండం నూరేళ్ళాయుష్షుగానూ, రోజూ తనదొక కొత్త పుట్టుకగానూ భావించడం జరిగింది. అంటే కార్మికులుకు జీవిత భద్రత లేదు. కాళోజి అన్నట్లుగా "పుట్టుక నీది, చావు నీది, బ్రతుకంతా దేశానిది" అన్నట్లుగా పరిశ్రమలో కార్మికుల జీవితం అర్థం అవుతుంది.

అయితే గని కార్మికులు చేసే ఫిల్లింగ్ వంటి ఉద్యోగం ఎటువంటి నైపుణ్యాలకు విలువనిచ్చేది కాదు. కాబట్టి ఆ పని యందు క్రొత్తదనం లేకపోవడంతో మనసులలో ఒక యాంత్రికత చోటు చేసుకుంటుంది. వైవిధ్యం గల పనుల మార్పిడి వల్ల దీన్ని కొంత మార్చవచ్చునుకుంటే దానికి తగిన శిక్షణా నైపుణ్యాలను కూడా కార్మికులకు కలుగచేయాలి.

'శత్రువు' కథలో త్రీ సీము, త్రిప సీములలో పనిచేయడం, కష్టంగా భావిస్తారు. అక్కడ పని చేయడం అదనపు శ్రమ వినియోగంతో ఉండటంతో పని భారంగా అనిపించి, ఒక రోజు పనిచేస్తే మర్రోజు సెలవు పెట్టాలని భావించడం జరుగుతుంది. అటువంటి త్రీ సీముల పనులకు ఉద్యోగ భద్రకై బదిలీ కార్మికులు తప్పని సరిగా పని చేస్తారని కేవలం వారికే పురమాయించక పర్మినెంటు ఫిల్లర్లకును బదిలీలకును సమానంగా మార్చి మార్చి షిఫ్టు పనులను కేటాయించగలిగితే ఇక్కడి సమస్య తీరుతుంది. దీనికోసం అధికారులు సూపర్‌వైజరీ సిబ్బంది తమ అధికార మనస్తత్వాన్ని విడనాడాలి. సామరస్య భావన పెంపొదించుకోవాలి.

'శత్రువు' కథలో, 'సెలవు' కథలో, 'బొగ్గుపొరల్లో' (కథా సంకలనం), 'పొరుబాటల్లో' అనే కథలో సింగరేణి కవిత్వంలో, పాటలలో పని ఒత్తిడిని తట్టుకోలేని పరిస్థితిలో కార్మికుని మనఃప్రవృత్తి ఎంతగా విసిగి వేసారి, మానవత్వం నశించే స్థితికి తీసుకొని వెళ్ళి కుటుంబ సంబంధాలను కూడా ప్రభావితం చేయగలుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అతని మానసిక స్థాయి మీద ఒత్తిడి ఎంతగా పెరుగుతుందో కూడా అర్థం అవుతుంది.

'సెలవు' కథలో, 'శత్రువు' కథలో పట్టణీకరణం, పారిశ్రామికీకరణం మానవ జీవితాల మీద ఎంత ఒత్తిడిని కలిగిస్తుందో అన్న విషయం అర్థం అవుతుంది. ఈ వత్తిడిని ఆరోగ్యపరంగా ఆలోచిస్తే పని పరిస్థితులలో మనిషి యొక్క శారీరక మానసిక స్పందనగా భావించవచ్చు. సమస్యా స్వభావం కంటే కూడా సమస్యకు తగినట్లుగా రాజీపడే విషయంలో శరీరం ఎదుర్కొనే స్థితిని వత్తిడిగా పేర్కొనవచ్చు. ఉద్యోగ విషయంలో మామూలుగా చేసే క్రియా కలాపాల కంటే భిన్నమై, మానవ సంబంధాలలోని వ్యక్తుల సాహచర్యంతో, శారీరకంగా, మానసిక ఆ వాతావరణానికి తగ్గట్టు తమని మలుచుకోవలసిన పరిస్థితులలో కార్మికులు ఒత్తిడికి గురి అయ్యే అవకాశం ఉంది.

ఆర్థిక భద్రతకై వ్యవసాయ నేపథ్యం నుండి వచ్చిన కార్మికులు పారిశ్రామిక సంబంధాలలో గల పూర్తిగా భిన్నమైన వాతావరణంలోకి వచ్చినప్పుడు గాలి వెలుతురు లేని పని పరిస్థితులకనుగుణంగా వారి శారీరక, మానసిక స్థాయిని మలుచుకొనే దిశలో తీవ్ర వత్తిడికి గురి అవడం సహజం. అధికారులు ఆశ్రిత పక్షపాతం గల పారిశ్రామిక సంబంధాలలో పని భారం వత్తిడిని కలుగచేయవచ్చు. వాళ్ళు పని చేయడానికి వీలయిన వసతులు కల్పించకపోతే, వత్తిడికి లోనవుతారు. ముఖ్యంగా గనులలో పని చేసే కార్మికుని మీద వత్తిడి

ప్రకృతి సహజంగానే వుంటుంది. దానికి తోడు ఉత్పత్తికై అధికారుల వత్తిడి అదనంగా వత్తిడికి గురిచేసి మనిషి యొక్క శారీరక, మానసిక స్థితులను పీల్చి పిప్పి చేసి, పిచ్చివాళ్ళను చేయగలుగుతుందనేది సింగరేణి సాహిత్యంలో స్పష్టం అవుతుంది. ఆ వత్తిడి నుండి విముక్తి కోసమై ప్రయత్నిస్తూ సామూహికత్వంలో ఆ వత్తిడిని పోగొట్టుకోవడానికి వీలుగా వుంటుందని భావిస్తాడు. దీనికై సామాజిక మద్దతు అవసరమనిపిస్తుంది. అంతేగాక సాధారణమైనవి సామాన్యమైన పని విషయాలు అయితే సమైక్యంగా ఎదుర్కోవడం కూడా కద్దు. సంస్థాగత విధానపు వత్తిడి, అధికారుల అవగాహనా రాహిత్యం, పాక్షిక నియంత్రణ, అసమగ్రమైన పని విధానం, సంపూర్ణంగా పరికరాలను అందుబాటులో ఉంచడంలోని లోపం అన్నీ కలిసి కార్మికులు తీవ్ర వత్తిడికి గురి చేసినట్లుగా సింగరేణి సాహిత్యం అంతా దర్పణం పడుతూనే ఉంది. ఈ వత్తిడి అధికమైతే మనుషులు ఆ వత్తిడి నుండి విముక్తికై పక్కదారులు పడుతూ దానిలో భాగంగా తాగుడు అలవాటు చేసుకొంటారు అని అనడానికి 'నెలవు' కథ ఒక నెలవు. దానికోసం తాగుడు, ధూమపానం అలవాటు చేసుకుంటారు. ఆ వత్తిడికి గురి అవడం కంటే ఆత్మహత్య నయం అనే పరిస్థితి రావడం 'నెలవు' కథలో కనబడుతుంది. పని స్వభావపు వత్తిడిని తట్టుకోలేక పిచ్చివాళ్ళయిన వాళ్ళను ఆ తర్వాత జరిగిన కార్మిక మరణాలు సంఘటనలు కూడా సింగరేణి పారిశ్రామిక వాడలో వాస్తవ విషయాలుగా అర్థమయ్యాయి.

ప్రకృతి సహజమైన భూగర్భ పరిస్థితులలోని బొగ్గు ఉత్పత్తికై గనులలో పని పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయం లేనప్పుడు శారీరక మానసిక వత్తిడి నుండి విముక్తి కావాలంటే ముఖ్యమైనది. ధ్యాన యోగ మార్గమొక్కటే. భారతీయ సంస్కృతిలో ధ్యాన యోగాలకు పెద్ద పీట వేయడం, మానవుడు ప్రశాంత మనస్కుడు కాగలగడం తరతరాల నుండి మనకొస్తున్న సంస్కృతి. కాని భౌతిక జీవనానికి సంబంధించిన ప్రాథమిక విషయాలలో సంతృప్తికరంగా ఉంటే యోగ సాధన సుసాధ్యమవుతుంది. ఈ వత్తిడి యొక్క ప్రభావం కుటుంబ సంబంధాలను ఎక్కువగా ప్రభావితం చేయగలుగుతుంది.

అంతర్మథనం, శత్రువు, నెలవు అనే కథలను ఈ మనో విజ్ఞాన శాస్త్ర దృష్టితో చూసినపుడు సామాజిక సంబంధాల విశ్లేషణ నుండి ఆలోచించినప్పుడు మానవ సంబంధాల దృష్ట్యా అవలోకించినప్పుడు ఈ వత్తిడి కుటుంబ సంబంధాలలోని వ్యక్తులను శత్రుపూరిత సంబంధాలలోకి నెడుతున్న విషయం అర్థం అవుతుంది.

'అంతర్మథనం' కథలో బొగ్గు గనిలో అతి నికృష్టమైన పరిస్థితులలో పని చేస్తూ బొగ్గు పొరల మధ్య దుమ్ము, ధూళి పొగలో ఎనిమిది గంటలు మృత్యువుతో పోరాడి చచ్చి బతికిన కార్మికుడిగా పనిచేసిన ఒక తండ్రి తన కొడుకును తిడితే, కొడుకు వాస్తవమైన, కర్కశమైన, క్రూరమైన జీవితాల నుండి పలాయనం చిత్తగించాలనుకుంటాడు. 'రాక్షసుడు' కథలో కొడుకు తండ్రి చేసే పని స్వభావమే ఆ తండ్రిని రాక్షసులుగా మారుస్తోందని అర్థం చేసుకుంటాడు.

పని ఒత్తిడి వల్ల 'శత్రువు' కథలో తాము చేసే పని పీడనతో కూడిన పని అనీ, అటువంటి పరిస్థితులలో పనియే ఒక శత్రువుగాను కనబడి ఆ పనిని పురమాయించిన అధికారులు కూడా శత్రువులుగానూ, కనబడతారు. ఆఖరికి ఆ మనస్తత్వంతోనే యింటికి వచ్చిన తరువాత కూడా భార్యని శత్రువు కింద భావించడం, చివరకు పితృస్వామ్య సంస్కృతితోడయి, భార్యా భర్తల సంబంధాలను విచ్ఛినం చేసి, కుటుంబ నిర్మాణంలో బోలుతనాన్ని తెచ్చే స్థితికి తేవటం, గనుల పని స్వభావపు ఒత్తిడి కుటుంబ నిర్మాణంలో బోలుతనాన్ని తెస్తుందని, అర్థం అయి కార్మిక వాడల్లో శత్రుసంబంధాలకు కారణం అవతుందనీ పితృస్వామ్యం మరింతగా రాజ్యమేలుతోందనీ గ్రహిస్తే పాఠక ప్రజలు ఆశ్చర్యపోక మానరు. కార్మిక సమస్యలను సామాజిక సమస్యలుగా భావించాలి. లేకపోతే గనిలో ప్రవేశపెట్టిన పెద్ద టబ్బుల విషయంలో యాజమాన్యం అధిక పని భారం మోపుతున్నదని, ఉక్కుపాదం మోపుతున్నదని, హక్కులను హరించేస్తున్నదని కార్మికులు అపోహ పడటం జరుగుతుంది ఇది వాస్తవమైన విషయం కూడ. ఆ పనిభారం సామాజిక సమస్యలకు కారణంగా సాహిత్యంలో స్పష్టమైంది.

చట్టపరంగా సంస్థలో ప్రతి ఒక్కరికీ సంక్రమించిన హక్కులను ఎవ్వరూ చట్ట విరుద్ధంగా హరించలేరు. హక్కులతో బాటు బాధ్యతలు కూడా ప్రతి ఒక్కరూ విధిగా గుర్తుంచుకుని నిర్వహించాలని యాజమాన్యం కోరుకుంటుంది.

పని భారం పెంచుతుందనే అపోహతో ఉన్న కార్మికులు దానిని చట్టపరంగా పరిష్కరించుకోవడం మంచిది. పని ప్రమాణాలను చట్ట పరిధిలోనే నిర్ణయించాల్సి వుంటుంది.

కుటుంబంలో అనేక కారణాల వల్ల ఏర్పడిన ఆర్థిక వత్తిడి కార్మికుని మనస్సును కుంగతీసినప్పుడు కూడా చేసే పని అదనపు భారంగా అనిపించవచ్చు.

కాబట్టి కార్మిక సంక్షేమం కూడా దీనికి పరిష్కారంగా భావించవచ్చు.

4.3 పని యందు అభిరుచి :

కార్మికులు తాము చేసే పని యందు అభిరుచి కల్గి వుంటేనే ఆ పనిని సమర్థతతోను సక్రమంగా చేయగలుగుతారు. పారిశ్రామిక సంబంధాలలో కార్మికునికి ఆ పని యందు ఉండే అభిరుచి ఉత్పత్తిపై ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి అధికార్లు మనో విజ్ఞానపు కోణం నుండి ఆలోచించి అతని యోగ్యతకు తగ్గట్టుగా శిక్షణను ఇచ్చి నైపుణ్యాన్ని పెంచి అతనికి తగిన పనులను కేటాయించిన అతనిలో ఉత్సాహాన్ని కల్గించడానికి వీలవుతుంది.

'రాజీ' కథలో కొత్తగూడెం నుండి గోదావరి ఖనికి ట్రాన్స్‌ఫర్ అయిన సాయిలు తన తల్లికి, భార్యకు, ఆ నీళ్ళు వాతావరణం పడక, ఆరోగ్యం బాగా లేకపోయేసరికి గోదావరి ఖని నుండి తిరిగి కొత్తగూడెంకు ట్రాన్సుఫరు అడుగుతాడు. టి.బి. వ్యాధి కలిగిన తల్లికి, భార్యకు కొత్తగూడెం ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని అడిగినా మానవతా దృష్టితో తిరిగి కొత్తగూడెం ట్రాన్స్‌ఫర్ చేయనందుకు బాధపడ్డాడు. అప్పటి నుండి అతడు ఆ పనిని మనస్ఫూర్తిగా చేయలేకపోతాడు.

'బొగ్గు పొరల్లో' అనే కథలలో ఫిల్లింగ్ అడిగితే డీ ఫిల్లరింగ్ పని ఇచ్చారని రెండు నెలలకొకసారి అయినా యాక్టింగ్ కట్టడం లేదని బాధపడ్తాడు. ఈ కథలోనే ఎల్లారెడ్డికి తను నివసించే గుడిసెలో దోమలు కుట్టడంతో రాత్రంతా నిద్ర లేకపోవడం వలన ఆ గోఫ్ క్రింద దాట్లు పెడుతుంటే నిద్ర వచ్చినట్లయింది. దాంతో సర్దార్ 'బాజు' అని అరచిన విషయం వినబడక వదలిపెట్టిన దాటు అప్పుడే పైకి లేచిన లింగయ్య మీద పడడం జరిగింది. అంతేగాక దాటు వదులయి రూఫ్ కూలటంతో అటు లింగయ్య చనిపోగా ఇటు ఎల్లారెడ్డి కాళ్ళు నుజ్జునుజ్జు అవుతాయి. ఇక్కడ పనియందు అభిరుచి లేకపోవటానికి అతనికి సరిఅయిన వసతి సౌకర్యం లేదని అర్థమయితే సంక్షేమ కార్యక్రమాల అమలు కార్మికులకు పనియిందు అభిరుచిని కలిగిస్తుందని తెలుస్తుంది.

'నల్ల వజ్రం' అనే నవలలో శంకరయ్య నైనింక్లయిను దగ్గర గుడిసె వేసుకుని ఉంటాడు. కాని అతనికి టెన్ ఇంక్లయిన్‌లో ఉద్యోగం. రోజూ నడిచి అంత దూరం వెళ్లాలి. అంటే కాళ్ళు గుంజుతుంటాయి. తీరా పని స్థలానికి వెళ్ళి కాళ్ళు గుంజుతుంటే పని చేయలేక నాగాలు పెడుతూఉంటాడు. అతడు

తనని నైనింక్లయిన్‌కు బదిలీ చేయమని అడిగినా లీడర్లు కాని, ఆఫీసర్లు కాని పట్టించుకోరు. పైగా జనరల్ మేనేజరుకు రక్తదానం చేస్తే బదిలీ చేస్తామని వెల్ఫేర్ ఆఫీసరు అంటే ఆ సహాయం కూడా చేస్తాడు. అయినా తనని బదిలీ చేయనందుకు బాధపడతాడు. అతనికి నైనింక్లయిన్‌లో పని చేయడం సౌకర్యంగా ఉంటుందనే అతని మనస్తత్వాన్ని గ్రహించాలి. మానసిక శక్తి, శారీరక శక్తికి తోడ్పడితే అతను బాగా బొగ్గు తీయగలడనేది సత్యము. చివరికి తనను పీల్చి పిప్పి చేస్తూ, సంపదలను హస్తగతం చేసుకుంటున్న శక్తులపై పిడికిలి బిగిస్తాడు.

'పోరుబాటల్లో' అనే కథలో పని ప్రదేశం దగ్గర చాటలో తవుడు పోసి కుక్కలను, కొట్లాడు కుంటుంన్నట్లుగా లోపల 'కానీయ్, కానీయ్' అని ఎవరికి వారే యింకొకళ్ళ మీద తమ విసుగును, కోపాన్ని చూపిస్తుంటారు. 'ఫిల్లరోళ్ళు, ట్రామరోళ్ళ మీద, ట్రామరోళ్ళు హాలర్ డ్రైవర్ల మీద, కమానోళ్ళు లాడీసోళ్ళ మీద కోపంగా ఉన్నారు. రామలింగం గ్యాంగుకు కాస్త, ఆలస్యమయితే అవుట్ మస్టర్ వేస్తారో లేదోనని భయం వేసింది. వాళ్ళ ఆలస్యానికి కారణం ట్రాక్ లైన్ సరిగా వేయకపోవడం తో టబ్బులు పల్టీలు కొడితే వాటిని లేపి తిరిగి నింపడంలో ఆలస్యం అయింది. రామలింగం, వెంకటస్వామి తమ చేత అధికార్లు ఎక్కువ పని చేయించుకుంటున్నారని బాధపడ్డారు.

'నెలవు' కథలో రాయమల్లుకు కాలరీ ఉద్యోగం ఇష్టం లేదు. భార్య రాజేశ్వరి బలవంతం మీద చేరుతాడు. కాని ఒకరోజు అతడు పనిచేస్తున్న చోట బండకూలి పడిన శబ్దానికి అతనిలో ఒక భయం మొదలైంది. అది ఎక్కువై అతనికి కాలరీ పని అంటే ఒక ఫోబియా ఏర్పడింది. ఎన్ని మందులకు ఆ మానసిక రోగం, డిప్రెషన్ తగ్గలేదు. అతడు పల్లెటూరికి వెడితే అక్కడ వాతావరణానికి మనసు హాయిగా ఉండేది. అతడికి కాలరీ ఉద్యోగం యిష్టం లేక ఆ భయం నుండి తప్పించుకోవడానికి తాగుడుకు బానిస అవుతాడు. భార్య తిరిగి కాలరీ ఉద్యోగానికి వెడదామంటే యిష్టం లేని రాయలింగు విపరీతంగా తాగి చచ్చిపోతాడు.

'శత్రువు' కథలో లింగయ్య త్రీ సీము. త్రీ 'ఎ' సీములో పని చేయడానికి అంతగా యిష్టం చూపించడు. అక్కడ పనిలో కష్టం ఎక్కువని, అదీకాక క్రితం రోజు వరకు రెండు లెవెల్లు ఎక్కి దిగి, బొగ్గు మోసేపని చేయడంతో మళ్ళీ ఆ త్రీ సీము పనిని తాను చేయలేనని భావిస్తాడు.

'నా పాత స్నేహితుడు' కథలో తెలంగాణ ఏజిటేషన్ వల్ల చదువు ఆపేసి వ్యవసాయం చేసుకోవడం కూడా కష్టమై చివరికి కాలరీ ఉద్యోగానికి వచ్చాడు. అక్కడ చేసే శ్రమ తన శరీరంలో మార్పులే కాక మనస్తత్వంలో కూడా మార్పు తెప్పించినదని గమనించాడు. అయితే బావిలో కొన్నాళ్ళు కష్టపడిన తరువాత పని అలవాటయిపోయింది. బూట్లు, తట్టలు ఇచ్చి మేనేజ్‌మెంట్ సరిగ్గా చూస్తే మిగిలిన యిబ్బందులు ఎదుర్కొని ఎలాగో ఒకలాగా పని చేయవచ్చనుకున్నాడు. మొదట్లో తట్టా చెమ్మాస్ ఉద్యోగం చేయడం అవమానమనిపించిన తోటి కార్మిక మిత్రుల నుండి తెలివిగా పొందిన అనుభవం వల్ల అతనిలో మార్పు వచ్చింది. గనిలోపలి పరిస్థితులు బాగుండాలనీ, వర్కింగ్ ప్లేసులో గాలి సప్లయి చేయాలని బూట్లు తట్టలు సరిగ్గా ఇవ్వాలని గొడవ పడ్డ సంఘటనలున్నాయి. కార్మికుడు తాగడానికి గనిలో అతడు చేసే పని స్వభావాన్ని కారణంగా భావిస్తాడు. గని పనిలోని అనుభవాల వల్ల సమస్త భూగోళాన్ని అణువణువు శోధించడం తాను నేర్చుకున్నానని అనుకుంటాడు.

అధికార్లు, కార్మికులు కలిసి పని చేస్తున్నపుడు, ఎక్కువ జీతాలు ఎక్కువ గౌరవం గల అధికారులకున్నటువంటి వృత్తిపర సంతృప్తి కార్మికులకు ఉండదు. అంతేగాక ఏ పని అయినా వ్యక్తి యందలి నిపుణత్వాన్ని వెలికితీసేవిధంగా ఉంటే పనియందు అభిరుచి పెరుగుతుంది. బొగ్గు గనులలో తట్టా చెమ్మాస్‌తో బొగ్గు ఫిల్లింగ్ చేసే పనిలో నైపుణ్యాన్ని పెంచుకునే అవకాశం తక్కువ.

పని పరిస్థితులకు అనుబంధంగా ఉండాల్సిన సౌకర్యాలు ఉండగలిగితే, పని చేసే చోట వస్తు సామాగ్రి సప్లయి సకాలంలో ఉండగలిగితే కూడా కార్మికులు ఉత్సాహంగా పని చేయగలుగుతారు. సూపర్‌వైజరీ సిబ్బంది యొక్క స్నేహ సహకారాలు ఆ పని యందు అభిరుచిని పెంపొందిస్తాయి. ప్రమోషన్లు వస్తాయనే ఊహ కూడా అభిరుచిని కల్గిస్తుంది. ఒక వ్యక్తిగా చేసే కన్నా గ్రూపుతో కలిసి ఒక టీమ్ వర్క్ కింద చేసినపుడు కూడా వృత్తి యందు సంతృప్తి కలుగుతుంది. వృత్తి యందు ఏర్పడే సంతృప్తి, ఆ వృత్తి యందు అభిరుచిని పెంపొందింపచేసి కార్మికుడు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతుడిగా ఉండేటట్లు చేయడమేగాక, తద్వారా ఉత్పత్తిని కూడా పెంచగలగడం, నాగాలు తగ్గడం వంటి సత్ఫలితాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

4.4 పని పరిస్థితులు :

పారిశ్రామిక సంబంధాలలో పని పరిస్థితులు ప్రధాన పాత్రను పోషిస్తాయి. ఆరోగ్యకరమైన వాతావరణం ప్రోత్సాహకరమైన పని పరిస్థితులు కార్మికుని సమర్థతను పెంచగలవు. అందుకని గాలి, వెలుతురు, పని ప్రదేశాలలో ఉండేటట్లు చూసుకోవాలి. గరిమి, దుమ్ము, ధూళి, జాగా, భద్రత మొదలగు విషయాలలో పని ప్రదేశాలు ఆరోగ్యంగా ఉండాలి. పనిముట్లు తగినంతగా లేకపోవడం, రక్షణ కరువు అవడం వంటి పని పరిస్థితుల ప్రభావం కార్మికుని సామర్థ్యం మీద, ఆరోగ్యం మీద, మానసిక పరస్థితుల మీద ప్రభావం చూపించగలుగుతాయి. దీనికోసం భారత ప్రభుత్వం 1948 ఫ్యాక్టరీ చట్టాన్ని తయారుచేసి ఆరోగ్యకర వాతావరణము, వృత్తిలో రక్షణను కల్పించాలని, కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవాలని నిర్ణయించింది.

పని పరిస్థితులను క్రమబద్ధీకరించుటకు 1952 మైన్స్ యాక్ట్‌ని రూపొందించబడింది. కార్మిక సంక్షేమ విషయాలను పేర్కొన్నది. త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటును, ప్రథమ చికిత్స సౌకర్యం ఏర్పాటు చేయమని చెప్పింది. రోజువారి పని ఎనిమిది గంటలకు మించకూడదనియు, ఐదు గంటల తరువాత ఒక అరగంట విరామాన్ని ఇవ్వమని పేర్కొనింది. భూగర్భ పని ప్రదేశంలో మహిళా ఉద్యోగాల ప్రవేశాన్ని నిషేదించింది. ఉదయం 6 గంటలు, సాయంత్రం 7 గంటల లోపు మాత్రమే మహిళల చేత బావి పైన అంటే ఉపరితల విభాగాలలో ఉన్న ఉద్యోగంలో నియమించవచ్చని చెప్పింది. 1957లో ప్రభుత్వం ప్రకటించిన బొగ్గు గనుల నిబంధనలలో దుమ్ము, ధూళి, వరద, మంటలను అడ్డుకునే విధానాలను తెలియచేస్తూ భూగర్భ గనులలో పనిచేసే వారి విషయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను నిబంధించినది.

'రాజీ' కథలో సర్ఫేసు వర్కు చేసే టెంపరరీ మజ్దూర్లు ఎండలో కాలే కాళ్ళతో తట్ట మోయ్యాలి. తెచ్చుకున్న టిఫిన్ తినాలన్నా ఎర్రటి ఎండే గతి. కనీసం మంచినీళ్ళ నల్లా కూడా లేదు. అందుకని మంచినీళ్ళ 'నల్లా' కోసం, రేకుల షెడ్డు కోసం సమ్మెలు మొదలయ్యాయి. అదే పరిస్థితులలో ఫిట్‌లో గులాయిలు లాంగ్‌బార్ పరిస్థితులు ఉన్నాయి. దాదాపు అన్ని గులాయిలలో అంచనా ఒకే విధంగావేస్తే కూలపోయే అవకాశం ఉంది. మూడో నెంబరు గులాయి కూలడానికి సిద్ధంగా ఉందనీ కార్మికులు అక్కడ పనిచేయమని ఓర్‌మెన్‌తో ఘర్షణపడ్డా కూడ అతడు ససేమిరా అనేసరికి అందరూ భయంగా

డ్యూటీలోకి వచ్చారు. కానీ సాయిలు చెమ్మాస్ ఎత్తి బొగ్గు తీసేసరికి పెళ్ళ కూలడంతో సాయన్న చచ్చిపోతాడు.

'బొగ్గు పొరల్లో' అనే కథలో నర్సయ్య గోఫ్ చప్పుడవుతుంటే అక్కడ పనిచేయమన్నందుకు వర్కింగ్ ప్లేస్‌లో సపోర్ట్ లేనందుకు బాధపడ్తాడు. కోల్ ఫిల్లర్ దుర్గయ్య ఇప్పుడో, అప్పుడో అని కూలబోయే గోఫ్ కింద పని చేయనంటే మస్టర్లు ఇవ్వడం కుదరదని వర్కింగ్ ప్లేస్‌ను చేసుకోవటానికి వచ్చిన ఆఫీసరు అనడం ఆ కార్మికునికి బాధ కలిగించింది. గోఫ్ చప్పుడైనప్పుడల్లా భయపడి పరుగెత్తి జంక్షన్ దగ్గర చేరుకోవడంతో ఆ ఇరుకు రాళ్ళలో బొగ్గురాళ్ళు తగిలిపడి గాయాలైన సంఘటనలు వర్ణించబడ్డాయి.

ఫోర్తు సీములో ఆ పొగ పడక రెండు తట్టలు ఎత్తేసరికి ఈరన్న ఫేసులోనే పడిపోవడం, ఫైలు (తోటి కార్మికుడు) తట్టెత్తుకుని డీపులో జారిపడడం జరిగింది. సర్దారు కేఫ్ బొగ్గు తీయాలని అనేసరికి ఎక్కడ వీలైతే అక్కడ షార్టు ఫైరరు వచ్చి మందుని దగాయించడం జరిగింది.

రూఫ్ బాగా లేదనే నెపంతో పని చూపించక బదిలీలను ఇంటికి పొమ్మని, పర్మినెంటు వాళ్ళని అక్కడ పనికి రమ్మని చెప్పారు. కింద వర్కింగ్ ప్లేసు కూలిపోయింది కాబట్టి యాబది ఏడవ డిప్‌కు వెళ్ళి పని చేయమన్నారు. ఇంక గంట ఉందనగా అంత వరకు గోఫ్ కోసం చూసి మస్టరు ఇవ్వాల్సి వస్తుందని చివరి గంటలో వేరొక డిప్‌కి వెళ్ళి రెండు టబ్బులు నింపమంటే కార్మికులకు కోపం వచ్చింది. అండర్ మేనేజర్ రూలు మాట్లాడేసరికి 'రూల్సు ప్రకారం బాయిని నడిపిస్తున్నారా' అని కార్మికులు అడిగారు. అధికారులు సేఫ్టీ గురించి పట్టించుకోరనీ, కార్మికుల బతుకు, చావుల గురించి పట్టించుకోరనీ, సేఫ్టీ వీకులు పెట్టి మురిపిస్తారు కానీ, పని పరిస్థితులలో మాత్రం సేఫ్టీ చూడరని బాధపడ్తారు. సేఫ్టీ కోసం బ్యాడ్ రూఫ్‌కి దాట్లు పెట్టడానికి వీలయినన్నీ దాట్ల సప్లై ఉండదని బాధపడుతూ దోపిడీ ప్రభుత్వం ఉన్నంత వరకు తమకు రక్షణ లేదని భావిస్తారు.

అండర్ మేనేజర్ గోఫ్ చూసి కూడా గోఫ్ సరిగా లేకపోయినా అక్కడ పని చేయ్యమని చెప్పినందుకు కార్మికులు చాలా బాధపడారు. సేఫ్టీ కోసం సమ్మె చేస్తే నాల్గు రోజులపాటు అన్ని ఏర్పాట్లు చేస్తారనీ, మళ్ళీ మామూలే అవుతుందనీ, కావలసిన కర్రలు, సపోర్టులు తెప్పించరని బాధపడ్తారు.

'నల్లవజ్రం' నవలలో శంకరయ్య గులాయి దగ్గరకు వెళ్ళేసరికి బ్లాస్టింగ్ జరగడంతో పొగ, బొగ్గు, దుమ్ము, పని చేసేచోట నిండా అలుముకునేసరికి కళ్ళు మంటలు పుట్టి నీళ్ళు కారుతుంటే ఆ గరిమికి శరీరం వుడుకు పట్టినట్టయిందని భావిస్తాడు. 12 అడుగుల వెడల్పుగల ఆ వర్కింగ్ ప్లేస్ లో ఐదుగురు బొగ్గు ఎత్తే వాళ్ళకు మాత్రమే జాగా సరిపోగా 'నువ్వు జరుగు, నువ్వు జరుగు' అనుకుంటూ 'నువ్వేం మనిషివని, నువ్వేం మనిషివని' ఒకళ్ళనొకళ్ళు తిట్టుకుంటారు. ఒక ప్రక్క నుండి 'ఎసీములో బ్లాస్టింగ్ జరిగింది. మరొకప్రక్క శంకరయ్య రైజ్ దిగుతుంటే కారు జర్రున జారింది. ఈ కథలో పని పరిస్థితులు, మానవ సంబంధాలపై ప్రభావం చూపుతాయని అర్థం అవుతుంది.

'శేషగిరి' నవలలో దోపిడీ పీడనకు గురైన కార్మికులు శేషగిరి నాయకత్వంలో సంఘటితమై పని పరిస్థితుల మెరుగు కోసం, అనేక పోరాటాలు చేసినట్లు అర్థం అవుతుంది.

'బండ కింద బతుకులు' స్వగతంలో పేనుకు పెత్తనం ఇస్తే అనే శీర్షికలో పనిచేసే చోటు బాగా లేదని కార్మికులు అంటే ఆఫీసర్లు పట్టించుకోలేదనీ అప్పుడు వారు సమ్మె చేసినట్లు అర్థం అవుతోంది. 'కంపెనీ' లాభం అనే స్వగతంలో వర్కింగ్ కండీషన్స్ బాగా లేక సమ్మె చేస్తే ఎస్మా చట్టాన్ని ప్రయోగించారని కార్మికులు బాధపడ్డారు. 'సింగరేణి రామాయణం' అనే నాటకంలో "టాపు తక్కువ సీములోన సారు, రూపు బాగా లేదయ్యా సూడు, బ్యాడ్ రూపు బండ కింద సారు బండ నోరు తెరిచింది సూడు, పడేటి బండ కింద సారు పని ఎట్లా చేసేది సూడు, దాట్ల దిమ్మెలు సరిగా లేవు, దడుసుకుంటూ చేస్తున్నాం - సూడు, రైజీలోని గర్మిలోన సారు రోజు రోజుకి చస్తున్నాం సూడు, బొగ్గు దుమ్ము పొగలోన సారు దగ్గి దగ్గి చస్తాన్నం సూడు, ట్రాకు లైను సరిగ లేక సారు టబ్బులు బోల్తా కొట్టే సూడు". అంటూ కార్మికులు తమ పని పరిస్థితుల గురించి చెప్పడం కనబడుతుంది.

'కొత్త ఎత్తు' కథలో లాడీసోళ్ళకు జాములు సప్లయి చేయకపోయేసరికి వాళ్ళు అక్కడ-ఇక్కడ తిరిగి ఏరుకొచ్చి పని చెయ్యాలనుకుంటుంటే అది చూసి ఇంకా పని మొదలు పెట్టలేదని అండర్ మేనేజర్ తిట్టినందుకు భాధపడతారు. కావాల్సిన సామాగ్రి ఇవ్వకపోగా ఆ రోజు మస్టరు కూడా ఇవ్వనందుకు అందరు సమ్మెకు దిగారు.

'ప్రమాదం' కథలో 5 ఇంక్లైన్‌లో మరో గంటలో షిఫ్ట్ అయిపోతుందనగా 14వ డిప్, 18వ లెవెల్ రైజ్‌లో రూఫ్ కూలిపోయి ఇద్దరు కార్మికులు మృతి జెందారు. అయితే ఆ ప్రమాదం ముందుగా ఊహించిందేనని రెండు రోజులుగా కార్మికులు అక్కడి పని పరిస్థితుల గురించి పై అధికారులకు తెలియచేస్తున్నా వాళ్ళు పట్టించుకోలేదని బాధపడ్డారు. సేఫ్టీ ఆఫీసరు వచ్చి భయమేస్తుందని తాము చెప్పినా పట్టించుకోకుండా ఇంకొక దాటు పెట్టండి అంటూ సేఫ్టీని పరిశీలించకుండా ఎంత తొందరగా వచ్చారో అంత తొందరగా ఆ అధికారులు వెళ్ళారని అనుకుంటారు. చివరకు బండ కూలి ఒకతనికి కాళ్ళు విరిగాయి. అలాగే వెంటవెంటనే నెలకో ప్రమాదంతో అదే బావిలో 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న బానెం ఓదెలు చనిపోయాడు. ఫస్ట్ షిఫ్ట్‌లో ప్రమాదం జరిగే సరికి రెండో షిఫ్ట్ వాళ్ళు సమ్మె చేశారు.

'శత్రువు' కథలో బదిలీ ఫిల్లరు లింగయ్యను ఆరోజు ఓవర్‌మెన్ త్రీసీము, త్రీ 'ఎ'సీములో పనికి వెళ్ళమంటాడు ఓవర్మన్. లింగయ్యకు తాను నిన్నటిదాకా రెండు లెవెల్లు ఎక్కి దిగి మోయడం చేత మళ్ళీ తనను వంగుతట్ట సీముకు పంపిస్తే ఎలాగా అని బాధపడతాడు. త్రీసీములో ఒక్కో మెట్టు మూరడేసి ఎత్తు చొప్పున నిచ్చెన తీరుగా వంద మెట్లు చూసేసరికి నోరు వెళ్ళబెట్టాడు లింగయ్య. కాని అతనికి తప్పలేదు. ఆ మెట్లు రోజు ఇన్నూరు తంతెలెక్కి ఇన్నూరు తంతెలు దిగి పనిచేస్తే ఇంక సంసారం చేసినట్లే అని అంటాడు. వర్కింగ్ ప్లేస్‌లో బ్లాస్ట్ చేసిన పొగతో కడుపులో పేగులు కదులుతుంటే పని చేసే ఫిల్లర్లు దగ్గుతున్నారు. ఐదు ఫీట్లకు మించని ఎత్తుగల త్రీసీము వర్కింగ్ ప్లేసులో కార్మికులు తట్ట ఎత్తుకొని మోసుకు రావడానికి నానా అగచాట్లు పడుతున్నారు. ఐదుగురు నించోని బొగ్గు తీస్తే ఐదుగురు వీపు మీద తట్ట మోస్తున్నారు. తల వంచుకొని నిలబడాలి. నడవాలి. దానికి తోడు విపరీతమైన వేడి. నాలుక పిడుచకట్టుకు పోతోందని, తానిక బొగ్గు తీయలేనని, తట్ట మోస్తానని చెమ్మాస్ రాజిరెడ్డికి ఇచ్చాడు. వేడికి తట్టుకోలేకపోతూ రూపుకు తగలకుండా వంగి వంగి నడుస్తున్నాడు. సర్దార్ వచ్చి రెండు టబ్బులు నింపాలన్నాడు. కాని కార్మికులు రెండోది పోయలేమని, వర్కింగ్ ప్లేసు బాగుంటే రెండు మూడు టబ్బులైనా నింపగలమని చెప్పారు. ఎలాగో అలాగ టబ్బు నింపి ట్రాక్ మీదకు ఎక్కిస్తే ట్రాక్ సరిగా లేక టబ్బు పడిపోతే మళ్ళీ టబ్బులోకి బొగ్గు ఎత్తేసరికి అదనంగా కష్టపడాల్సి వచ్చింది. పని పరిస్థితులలోని పని స్వభావాన్ని

బట్టి పని ప్రమాణాలను తగ్గించే నిర్ణయంచేయాలి.

'సింగరేణి మండుతోంది' నవలలో డీపిల్లరింగ్ కార్మికులు పనికంటే బతుకు రక్షణ గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. పని ప్రదేశంలో క్రాస్ బార్లుగానీ, తుంటలు గానీ సప్లయి లేకపోయినా గనిలో ప్రమాదాలు జరుగుతాయి. వీటిని గురించి అధికారులు పట్టించుకోరనీ, దొరలు పని స్థలానికి రావాలంటే ఉత్పత్తి తగ్గేవిధంగా చేయాలనీ దానికై బంద్ అనివార్యం అని భావించడం జరిగింది. పని పరిస్థితులలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వీటిని మానవ తప్పిదాల వల్ల ఏర్పడిన ప్రమాదాలని భావించడం జరుగుతుంది. గోఫ్ విషయంలో ప్రకృతిపరమైన ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

గోఫ్ గురించి సర్దార్‌లు, ముఖద్దాములు(గ్యాంగ్ లీడరు) ముందుగా గుర్తించినా ప్రమాదాన్ని గురించి అధికార్లతో చెప్పలేనితనం, చొరవలేనితనం కూడా కార్మికుల పని పరిస్థితులు బాగాలేకపోవడానికి కారణం అవుతోంది. తట్టలు పాడయిపోయినవి ఇస్తారనీ, గాలి కోత కారణంగా గానీ, గాలి దొర అజాగ్రత్తతో గానీ, ప్రమాదం సంభవించితే కార్మికులు రక్తం పులిమిన బొగ్గు రాయిలా అయిపోతారని రచయిత భావన.

కోల్ కట్టరుకు ఇచ్చిన మెషీన్ బాగా లేకపోతే కార్మికుడి శక్తి అదనంగా ఖర్చు అవుతుంది. పని చేసే చోట అధికారి భాష కార్మికులకు అర్థం కాదు. కార్మికులకు పరిచయమైన భాషలో చెప్పాలనుకుంటారు కార్మికులు. ఈ నవలలో సూక్ష్మాతి సూక్ష్మమైన కోణాల నుండి కార్మికుని వృత్తియందలి బాధలను విశ్లేషించడం జరిగింది.

'నా పాత స్నేహితుడు' కథలో బూట్లు, తట్టలు మేనేజ్‌మెంట్ సరిగా ఇస్తే మిగిలిన ఇబ్బందులన్నీ ఎదుర్కొని ఎలాగో ఒకలాగ పనిచేయవచ్చుని అనుకున్నాడు. గనిలో పరిస్థితులు బాగుండాలని. వర్కింగ్ ప్లేసులో గాలి సప్లయి ఉండాలని భావించారు.

'సింగరేణి బతుకు' అనే కథాసంకలనంలోని 'గుణపాఠం' కథలో గులాయి వెడల్పు లేని చోట 8 మందికి బదులు పది మందిని దింపి బొగ్గు తీయమంటే ఆ పని పరిస్థితులు బాగాలేకపోయేసరికి సమ్మె చేసి ఉత్పత్తికి నష్టం చేసి యామాన్యానికి గుణపాఠం నేర్పాలనుకుంటారు కార్మికులు.

'పోరుబాటల్లో' అనే కథలో టైముకు మస్టరు బుక్‌లో హాజరు

వేయించుకోవాలి. ఎం.డి. స్ట్రిక్టుగా ఉండడంతో మేనేజర్ స్థాయివాళ్ళు వెంటనే దిగుతారు. పొన్నుకర్ర ఆడించుకుంటూ లాడీసులనూ, ట్రామర్లనూ, కమానోల్లనూ అదిలిస్తూ, ఫేసులు వెడల్పు కానీయవద్దని అంటూ అధికార్లు హడావుడి పెడుతున్నారనీ, టబ్బులు సప్లయి బాగా ఉండేసరికి రెండు రెండున్నర టబ్బులు నింపేసరికి ఫేసుల్లో పని ఒత్తిడి పెరిగిందనీ, యువకులు చేయగలుగుతున్నారు గానీ, ముసలి ముతకకు చేయడం కష్టంగా ఉందని భావించారు. చాట్లో తవుడు పోసి కుక్కలకు కొట్లాట పెట్టినట్లుగా, లోపల 'కానీయ్ కానీయ్' అని ఎవరికి వారు ఇంకొకళ్ళ మీద తమ విసుగును, కోపాన్ని చూపిస్తున్నారు. ఫిల్లరోళ్ళు ట్రామరోళ్ళ మీద, ట్రామరోళ్ళు హోలర్ డ్రైవర్ల మీద కమానోళ్ళు లాడీసుల వారి మీద కోపంగా ఉన్నారు. అవుట్ మస్టరు ఆలస్యం అయితే కారణం అడుగుతారు. ట్రాక్ సరిగా లేక టబ్బులు పల్టీలు కొడితే మళ్ళీ నింపాల్సి రావటంతో ఆలస్యం కాగా డ్యూటీ నుండి వచ్చిన చంద్రయ్య బాధపడితే తోటి కార్మికులు క్రితం రోజు తనను కూడా మేనేజరు నిందించినాడని చెప్తాడు. పని పరిస్థితులు బాగా లేవని చెప్పి ఆనాడు అన్యాయాన్ని ఎదిరించినందుకే మేనేజరు ఆర్నెల్ల నాడు జరిగిన స్ట్రయికుకు చంద్రయ్య ప్రోత్సాహం ఉందంటూ నిన్న డిస్మిసల్ లెటర్ చేతిలో పెట్టాడనీ చంద్రయ్య చెపుతాడు. లెటర్ తీసుకోకపోతే పోలీసులు బెదిరించారని మేనేజ్‌మెంట్ వర్కర్స్‌కు సంబంధించిన విషయంలో పోలీసులు జోక్యం ఎందుకనీ పోలీసుల అండతో మేనేజరు కార్మికులతో ఆటలాడుతున్నాడని వారిద్దరూ భావించారు. లాభాలు తీసుకొని ఇష్టము వచ్చిన వారికి తేలిక పని ఇస్తున్న ఓవర్మెన్‌లనూ, సర్దార్‌లనూ, అన్నలు చితక్కొట్టేసరికి వారికి బుద్ధి వచ్చిందని భావించారు.

'రాజీ' కథలో కార్మికులు పని ప్రదేశంలో మంచి నీటి సౌకర్యం లేదనే సమస్యను వ్యక్తం చేస్తారు. 1952 గనుల చట్టాన్ని సరిగ్గా అమలు చేస్తే సమస్య రేకెత్తి సమ్మె జరిగేది కాదు. అదే విధంగా రక్షణ విషయంలో, వివిధ పని ప్రదేశాలలోని భూగర్భపు పొరల విషయంలో అన్ని గులాయిల పొరలను, పని పరిస్థితులను ఒకేరకంగా అంచనా వేయడం అక్కడి సూపర్‌వైజర్ల, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. అదే విధంగా కార్మికులు ఓవర్మెన్‌లతో ఘర్షణ పడినా సమస్యను పట్టించుకోకపోవడం అనేది ఆ ఓవర్మెన్‌లదే తప్పు అని భావించేటట్లుగా ఉంది. అయితే ఓవర్మెన్‌కూ, అండర్ మేనేజర్‌లకు ఉత్పత్తి ధ్యేయం కల వత్తిడి ఉండడం సహజం. కానీ కార్మిక శ్రేయస్సు, రక్షణ దృష్ట్యా సూపర్‌వైజరీ సిబ్బంది పని పరిస్థితుల విషయంలో రాజీ పడకూడదు.

'బొగ్గుపొరల్లో' అనే కథలో ఇప్పుడో అప్పుడో పడేటట్లుగా ఉన్న బ్యాడ్ రూఫ్ చప్పుడుకు అదిరిపడుతున్న కార్మికులు గోఫ్ ప్రదేశంలో పని చేసేవారితో సర్దార్ వచ్చి పని చేయకపోతే, మస్టర్లివ్వనని చెప్పడం, పైగా క్రింద వర్కింగ్ ప్లేసు కూలిందని చివరి గంటలో వేరే పని ప్రదేశాన్ని చూపించడం, కార్మికులకు బాధని కలిగించిన విషయాలు. అదే విధంగా ఫోర్తు సీములో పొగ ఎక్కువయి పని చేయలేక జారి పడడం కూడా జరిగింది. 'ప్రమాదం' కథలో కూడా బ్యాడ్ రూఫ్ దగ్గర పెట్టడానికి కావలసిన దాట్లు కూడా సరిగా ఇవ్వరని చెప్పడం జరిగింది. ఈ విషయంలో సూపర్‌వైజరీ సిబ్బందికి పై అధికారులతో చెప్పి దాట్లు తెప్పించాల్సిన బాధ్యత ఉంటుంది. అయితే వాటిని మంజూరు చేయించుకోవాలనీ, ఏమయినా ఇబ్బందులుంటే సూపర్‌వైజరీ సిబ్బంది ఆ విషయాలను నిర్భయంగా పారదర్శకతతో అధికారులకు చెప్పాలని సూపర్‌వైజరీ కాడర్ వాళ్ళు యూనియన్‌ల ద్వారాను, చర్చల ద్వారాను పరిష్కరించుకోగలిగితే బాగుంటుంది. 'బంద కింద బతుకుల'లో 'పేనుకు పెత్తనం ఇస్తే' అనే స్వగతంలో వర్కింగ్ ప్లేసు బాగా లేదని చెప్పినా ఆఫీసరు పట్టించుకోలేదని బాధ పడ్డట్టు కనబడుతుంది. 'కంపెనీ లాభాలు' అనే స్వగతంలో లాభాలే ధ్యేయంగా యాజమాన్యం ఉంటుందనీ, పని పరిస్థితులు సరిగా లేవని చెప్పినా పట్టించుకోనందుకు సమ్మె చేశారనీ, సమ్మె చేస్తే ఎస్మా చట్టాన్ని ప్రయోగించిందనీ కార్మికులు బాధపడ్డట్టు అర్థం అవుతుంది. నల్ల వజ్రం నవలలో, శత్రువు కథలో, సింగరేణి రామాయణం నాటకంలో ఐదు ఫీట్లని మించని ఎత్తుగల త్రీ సీములో, ఆ గరిమిలో, వంగొని వీపు మీద తట్ట పెట్టుకొని బొగ్గు నింపడం చాలా కష్టమైన పని అని భావిస్తారు. సర్దార్ వచ్చి అక్కడ కూడా రెండు తట్టలు నింపాలనే అంటాడు. కష్టమైన సీములో పని ప్రమాణాల సడలింపు ఐనా ఉండాలి. లేదా ఆ పనిని రోజుల వారిగా కార్మికులను మార్చి చేయించగలిగితే కొంత మంది కార్మికులు మాత్రమే ఆ కష్టమైన పనికి బలి కాకుండా ఉంటారు. సింగరేణి మండుతోంది' నవలలో పని పరిస్థితులు బాగా లేక కార్మికుల జీవితాలు బావిలోనే మసై పోయిన విషయాన్ని చెప్పడం జరిగింది. కోల్‌కట్టర్ తనకిచ్చిన మిషన్ బాగా పనిచేయకపోతే కార్మికుడు అదనపు శ్రమకు గురిఅవుతాడని బాధపడ్డాడు. 'బొగ్గుపొరల్లో' అనుభవం లేని వాళ్ళను డీ ఫిల్లరింగ్ వర్క్‌కు పెట్టడం చేతనే ప్రమాదం జరిగిందని కార్మికులు భావిస్తారు. బొగ్గు బావిలో గరిమిని, పొగ, దుమ్ము, ధూళిని తగ్గించడానికి వీలయినంత బ్లోయర్స్

వాడగలగడానికి కొంత శీతలత్వాన్ని ఇవ్వగల వసతిని ప్రత్యామ్నాయంగా ఏర్పాటుచేస్తే కార్మికునికి కొంత వెసలుబాటు వుంటుంది. 'నా పాత స్నేహితుడు' కథలో బూట్లు, తట్టలు సరిగా సప్లయి చేయగలిగితే మిగిలిన ఇబ్బందులను ఎదుర్కొని పని చేయవచ్చని కార్మికుడు అనుకోవడాన్ని పరిశీలించగా చాలా చిన్న చిన్న విషయాలే కార్మికుల పని సామర్థ్యానికి గొడ్డలిపెట్టు వంటి విషయాలుగా అవుతున్నాయని అర్థమవుతుంది.

యాజమాన్యం దృష్టిలో ఇది కేవలం యాజమాన్యపు స్థాయి బాధ్యతే కాదని, ఈ విషయంలో ఉద్యోగానుభవం వున్న కార్మికులు క్రింది స్థాయి కార్మికులకు అవగాహన కలిగించడంతో పాటు సూపర్‌వైజరీ సిబ్బంది మరింత బాధ్యతగా వ్యవహరించవలసిన అవసరం ఉన్నదని చెప్పడం జరుగుతుంది. సూపర్‌వైజరీ సిబ్బంది సూచనలు, సలహాల ప్రకారమే ఎక్కువగా పని ప్రదేశాలలో వివిధ ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. అయితే అధికారులకు కూడా బాధ్యత వుంది. సూపర్‌వైజర్లు పని స్థలాల అభివృద్ధి విషయంలో అధికారులతో కలిసిమెలసి వుంటూ, కార్మికులకు కావలసిన సదుపాయాలను కల్పించడంలో బాధ్యతగా ఉండాలి. అయితే సూపర్‌వైజర్లు పని ప్రదేశాలకు సంబంధించిన విషయాలను ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా నిర్భయంగా అధికారుల దృష్టిలోనికి తీసుకొని వెళ్లగలగాలి. యాజమాన్యం కూడా పని ప్రదేశాలను మెరుగుపరచడానికి అవసరమైన అన్ని చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలి. అలాజరగాలంటే కార్మికులు అధికారుల మధ్య సంబంధాలలో వర్గస్వభావంలేని మానవ సంబంధాలుండాలి.

కార్మిక సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలలో పని ప్రదేశానికి సంబంధించిన సమస్యలు వ్యక్తిగత ప్రయోజనాలకో, ప్రతిష్ఠ కోసమో వుపయోగించుకోవడం మంచిది కాదు. అధికారులు, కార్మికులు, కార్మిక సంఘాలు, కార్మిక శ్రేయస్సు దృష్ట్యా పని ప్రదేశాలకు సంబంధించిన సమస్యల విషయంలో నిర్లక్ష్యం చేయడం లేదా సమస్యలు తీవ్రతరం చేసే విధంగా కాకుండా పరిష్కరించే దిశగా దృష్టి పెట్టాలి. పని పరిస్థితుల అవగాహనలో అధికారులకు ప్రాంతీయ భాషా జ్ఞానంకూడా ముఖ్యమైనదిగా భావించాలని సింగరేణి మండుతోంది అనే నవల ద్వారా అర్థమవుతుంది.

ఏ పరిశ్రమలోనైనా ఉత్పత్తి జరగాలంటే బాయిలర్, యంత్రాలు, విద్యుచ్ఛక్తి వంటి వాటి వాడకం తప్పనిసరి. అవి యెంత వుపయోగపడతాయో అంత ప్రమాదకరమైనవని కూడా తెలుసు. అయితే అజాగ్రత్త వల్ల కాని పరికరాల

లోపభూయిష్టత వల్ల ప్రమాదాలు జరుగుతుంటాయి. గనులలో భూగర్భ పరిస్థితి వల్ల ప్రకృతి సహజమైన ప్రమాదాలు కూడా వుంటాయి. రోజువారి భూమిలో 14,000 ప్రకంపనాలు కలుగుతుంటాయి అని శాస్త్రజ్ఞులు నిర్వచిస్తున్నారు. మరి ఆ భూమి పొరలలో ఏ ప్రమాదకరం ఎటు పొంచి వుందా అని క్షణక్షణం అటు కార్మికులు, ఇటు సూపర్‌వైజరీ సిబ్బందితో పాటు అధికార యంత్రాంగం ప్రమతత్తతో వుండక తప్పదు. ఈ విషయాలను మనోవిజ్ఞాన కోణం నుండి, మానవ సంబంధాల కోణం నుండి అర్థం చేసుకోగలిగితేనే ఇటువంటి ప్రమాదాలు అడ్డుకోవడానికి వీలుంటుంది. ఇది కార్మికులు, యాజమాన్యం పరస్పరం సహకరించుకుంటూ అవగాహన చేసుకునే క్రమంలోనూ బాధ్యతాయుతమైన ప్రవర్తనతోను మాత్రమే సాధ్యం కాగలుగుతుంది.

'పోరుబాటల్లో', 'కొత్త ఎత్తు' కథలలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుంది. 'జాములు' ఇవ్వకపోగా కార్మికులు జాములను(దాట్లు) అక్కడిక్కడ ఏరి తీసుకొని రావడానికి వెళ్ళినందుకు వారిని కోపగించుకుంటారు. అధికారులు 'జాములను' తాము సప్లయి చేయకపోగా, కార్మికులు పనిచేయకుండా తిరుగుతున్నారని ఎదురు దాడి మొదలెట్టాలనుకున్నప్పుడు కార్మికులు కూడా ఎదురు తిరిగి మాట్లాడాలనుకోవడం సహజంగా జరిగే పరిణామ క్రియ. అటువంటి సున్నితమైనటువంటి విషయాలను అధికారులు అర్థం చేసుకోవాలనుకోవడం, చేసుకోకపోయినందుకు కార్మికులు బాధపడడం పారిశ్రామిక వివాదాలకు దారితీస్తుంది కాబట్టి ఇటువంటి చోట ముందుగా అధికారులు అవగాహన చేసుకునే క్రమంలో ముందు వుండాలి. ఆ తరువాత ఆయా విషయాలలో కార్మికులే అనవసరంగా గొడవకు దిగారనుకుంటే పిట్స్ కమిటికి తెలియచేసి రిడ్రసల్ కమిటి ముందు పెట్టాలి. అవగాహనతో శాంతియుతవాతావరణ చర్చలతో పరిష్కరించుకోదగినవిగా వాటిని భావించాలి. అధికారులు తామెక్కువని, ఏం చెప్పినా వినాలని, అధికారులకు ఉండకూడదు. అధికారులకు ఉత్పత్తి యందు తప్ప ఆ వుత్పత్తి పరికరాల సప్లయి విషయంలో శ్రద్ధ లేదని, కార్మికుల రక్షణను గురించి బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదని, కార్మికులు కూడ భావించకూడదు. ఒకరినొకరు తప్పు పట్టుకోవడం వంటివి పారదర్శకత విధానంలో ఉత్పత్తికి అవరోధంగా నిలిచి సమస్యలను సృష్టిస్తాయి. కాబట్టి సహకారంతోను, అవగాహనతోను ముఖ్యంగా మానవ సంబంధాల కోణంతోను మనస్తత్వ పరిశీలనా కోణం నుండి అధికారులు ముందుగా ఒక అడుగు వేసేటట్లుంటేను కార్మికులు రెండు అడుగులు వెనక్కి

వేయగలిగితేనే సామరస్య వాతావరణంలో ఘర్షణలను నివారించుకుని కుటుంబ సంస్కృతికి, పని సంస్కృతికి పట్టం కట్టగలుగుతారు.

గోదావరి ఖనిలో సింగరేణి యాజమాన్యం, కార్మికులు భూగర్భంలోని పని స్థలానికి చేరుకోవడానికి 'మ్యాన్‌రైడింగ్ సిస్టమ్'ని ప్రవేశపెట్టడం చేత కొంత వెసులుబాటు ఏర్పడి రవాణాలో వినియోగితమయ్యే శారీరక శ్రమ శక్తిని పని స్థలాలలో ఉత్పత్తికై వినియోగించగలుగుతున్నారు. ఈ 'మ్యాన్ రైడింగ్' వల్ల ఉత్పత్తిని పెంచగలిగేలా యాజమాన్యం చర్య తీసుకోవడమే గాక కార్మిక శ్రేయస్సుగా కూడా భావించడం గోదావరి ఖని యందలి కార్మికుల భావన అని అర్థమయ్యింది.

పని పరిస్థితులకు సంబంధించిన సమస్యలను వ్యక్తిగత మనస్తత్వ దృష్ట్యాను, సామూహిక మనస్తత్వపు కోణాల నుండి విశ్లేషించగలగాలి. అధికారులు కూడా తమ ఆధిపత్యపు భావనలను కాస్త తగ్గించుకుని ప్రజాస్వామ్య దృష్టితో ఆలోచించడమే గాక కార్మికులను మానవీయ కోణం నుండి అవగాహన చేసుకోగలిగితేనే సున్నితమైన కార్మికుల అసంతృప్తికి పరిష్కారం సులభం కావచ్చు. కార్మికులను వ్యక్తులుగా చూడడమేగాక వాళ్ళ అసహనానికి అక్కడి పరిస్థితులే కారణంగా వుంటాయని భావించాలి. వాళ్ళను అర్థం చేసుకునేటప్పుడు సామాజిక సంబంధాల దృష్ట్యా కూడా అర్థం చేసుకుంటే వారొక సామాజిక శక్తులుగాను, మానసిక వ్యక్తులుగాను అర్థమవుతారు. ముఖ్యంగా సూపర్‌వైజరీ సిబ్బంది స్నేహ సహకారాలనందించగలిగితే ఉత్పత్తికై పాటుపడాలని కార్మికులు భావించే స్థితి ఏర్పడుతుంది. 1948 ఫ్యాక్టరీ చట్టం ప్రకారం పని ప్రదేశాలలో కాళ్ళు, చేతులు కడుక్కోవడానికి వీలు, విశ్రాంతి తీసుకోవడానికి గది, ప్రథమ చికిత్స, క్యాంటిన్, భోజనం చేయడానికి షెల్టర్ వంటివి ఏర్పాటు చేయడం తప్పనిసరి. 1951 ప్లాంటేషన్ చట్టం 6 నుండి 12 సం॥లలోపు గల కార్మికుల పిల్లలకు విద్యావసతులు ఏర్పాటు చేయాలని, గృహ వసతిని కల్పించాలని, ఆరోగ్యానికై ఆస్పత్రిని కట్టించాలని తెలియచేస్తుంది.

1952 గనుల చట్టం పని స్థలాలలో స్నానాల గది, లెట్రీనులు వుండాలని పేర్కొన్నది. కార్మికుల సంక్షేమం చూడడానికి 500 కార్మికుల కంటే ఎక్కువ మంది వున్న పరిశ్రమలో వెల్ఫేర్ ఆఫీసర్లు వుండాలని వారు యాజమాన్యానికి, కార్మికులకు మధ్యవర్తిత్వం జరిపి కార్మికుల కష్టాలను, సమస్యలను పరిష్కరించగలిగేటట్లు చూడాలని తెలియచేసింది. వృత్తిపరంగా రక్షణకై కార్మికుల

అభిరుచికి తగ్గట్లుగా పని ప్రదేశాన్ని చూపించడంతోపాటు, యంత్రాలు, పరికరాల వినియోగత జీవిత భద్రతకు సంబంధించిన విషయాలను వెల్ఫేర్ ఆఫీసర్లు పట్టించుకోవాలి. కార్మికుల శారీరక బాధలను, మానసిక సమస్యలను పట్టించుకోవడం లేదని 'సింగరేణి మండుతోంది' నవలలో తెలియచేయడం జరిగింది. 1955 మైన్స్ రూల్స్‌లలో 50 మంది కార్మికులు పని చేసే చోట ఆరోగ్యం, పారిశుధ్య వసతులుండాలని మంచినీటి సౌకర్యం, లెట్రిన్‌లు, క్యాంటిన్ ఉండాలని చెప్పడం జరిగింది.

'రాజీ' కథలో కార్మికుని తల్లి యొక్క, భార్య యొక్క ఆరోగ్య విషయమై తను పెట్టుకున్న విన్నపాన్ని ఆదరించనందుకు తనను కొత్తగూడెం ట్రాన్స్‌ఫర్ చేయనందుకు మానసికంగా బాధపడ్డాడు. పని పరిస్థితులతో పాటు అతను పనిచేయడానికి అవసరమైన మానసిక ప్రశాంతతకు అనుబంధమైన పరిస్థితులను కూడా అధికారులు పట్టించుకోవలసిన అవసరం వుంటుంది. అయితే యాజమాన్యానికి అందరియెడల అన్ని చోట్ల బాధ్యత వహించడానికి వృత్తిపరమైన, విధానపరమైన అడ్డంకులు కూడా వుండవచ్చు అనేది కార్మికులు కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

'బొగ్గుపొరల్లో' ఫిల్లింగ్ అడిగితే డీపిల్లరింగ్ వర్క్ యిచ్చినప్పుడు అతడు ఆ పని యందు ఉత్సాహాన్ని చూపించలేడు. కష్టమైన పనులను ఆఫీసర్లు తమ యిష్టమైన వారికి అప్పగించడం లేదనే అపోహ కార్మికులకు రాకూడదు. అందరు కార్మికులు సమానమేనని సూపర్‌వైజరీ సిబ్బంది భావించాలి.

అదేవిధంగా 'నల్లవజ్రం' నవలలో శంకర్ పనిచేసే గనికి దూరంగా గుడిసె వుంటుంది. అతడికి సైకిల్ కొనుక్కునే శక్తిని, నేర్చుకునే యుక్తికి దాటిన వయస్సును మనస్సుతో ఆలోచించి అతనికి అదే పనిని అతని యింటికి దగ్గరలో వున్న 9వ ఇంక్లయిన్ దగ్గర బావిలో ఇచ్చినచో అతని గుండెల్లో అంత మంట రాజుకుని వుండకపోయేదే!

'పోరుబాటల్లో' అనే కథలో వ్యక్తుల మధ్య మానవ సంబంధాలు ముఖ్యమని తెలియచేస్తూ కథలోని అధికారులు తమపై పెత్తనం చెలాయిస్తూ ఎక్కువ పని చేయిస్తున్నారని కార్మికులు బాధపడడం కనబడుతుంది.

'నెలవు' కథలో గనిలోపల బండపడడంవల్ల వచ్చిన ఆ చప్పుడువిని దానికింద తోటి కార్మికుడు చనిపోవడాన్ని చూడడం చేత రాయమల్లుకు మతి

చలించింది. రాయమల్లు రోగం వైద్యానికి లొంగలేదు. అతడు గాలి, వెలుతురు బాగా వున్న పల్లెటూర్లలో పెరిగివచ్చి, గాలి వెలుతురు లేని దాంట్లో వుద్యోగం చేయాలంటే మనసు ససేమిరా అంది. ఈ రెండు కలిసి అతనికి కాలరీ వుద్యోగం అంటేనే గిట్టనిదిగా అవుతుంది. కాని అతడి కుటుంబం ఆ పనిమీదనే ఆధారపడి వుంది. దీనిని సామాజిక, మానవ సంబంధాల దృష్ట్యా, మనస్తత్వ పరిశీలనా దృక్కోణం నుండి ఆలోచించి, పరిష్కరించాలి. ఇటువంటి స్థితిలో వున్న కార్మికుల సంఖ్య తక్కువగా వుంటుంది కాబట్టి సర్ఫేసు వుద్యోగాలలో వేయగలిగితే బాగుంటుంది. అధికారులకు వంచనార్తులు చేసే బలిష్టమైన యువకుల వంటి వారిని సర్ఫేసు వుద్యోగాలలో నియమించేటప్పుడు ఇటువంటి వారిని దృష్టిలో పెట్టుకుంటే కార్మికుని యొక్క కుటుంబ సామాజిక, ఆర్థిక పరమైన సమస్యే గాక, పారిశ్రామిక సంబంధాలలో భాగంగా కూడా ఇది ఒక సమస్యగా వుండేది కాదు.

'నా పాత స్నేహితుడు' కథలో బూట్లు, తట్టలు యిచ్చి, మేనేజ్‌మెంట్ సరిగా చూస్తే పని పరిస్థితులలోని కష్టాలను అధిగమించవచ్చని భావన అర్థమవుతుంది. అంతేగాక మేనేజ్‌మెంట్ అధికారంగా గాక ఆప్యాయంగా, ఆదరణతో కార్మికులను చూడగలిగితే బొగ్గు బావిలో పని పరిస్థితులందలి కష్టాలను మానసిక స్థాయిలో తగ్గించడానికి వీలు అవుతుందని అర్థమవుతుంది.

అంతేగాక ఈ కథలో కార్మికులు చీటికి మాటికి సమ్మె చేస్తారు, తాగుతారు అని వారిని ఒకానొకప్పుడు తక్కువగా భావించినా, ఆ పని పరిస్థితులే అతనిని అలా తయారుచేస్తాయనే అవగాహనకు రావడం గమనించాల్సిన విషయం కాబట్టి కార్మికుల పని పరిస్థితులు, అక్కడ వారు ఎదుర్కొనే కష్టాలను అధిగమించేవిధంగా మేనేజ్‌మెంట్ వారిని కుటుంబ సభ్యులలో భాగంగా భావించి వారిని చూడగలిగితే వారి మానసిక స్థాయి బాగవుతుంది. వారటువంటి శారీరక మానసిక కష్టాల నుండి పలాయనం చిత్తగించాలనుకుని అలవాటు చేసుకున్న తాగుడుకు దూరం కాగలిగితే నాగాలు తగ్గి ఉత్పత్తి పెరుగుతుందనే వాస్తవాన్ని గ్రహించాలి.

అయితే పని యందు అభిరుచిని పెంపొందింపచేసే ప్రయత్నాలు చేయడంలో భాగంగా జీతభత్యాలు, ఉద్యోగ భద్రత, వారు చేసిన పనికి గుర్తింపు, సూపర్‌వైజరీ సిబ్బంది యొక్క సానుభూతి సహకారాలు, ప్రోత్సాహక బహుమతులు కూడా ఒక్కొక్కప్పుడు ఆ పని యందు అభిరుచిని కలిగిస్తాయి.

ముఖ్యంగా కార్మికులలో తాము చేస్తున్న ఉత్పత్తి, తమకు పరాయిదవుతున్న భావన కలగనీయని పరిస్థితులు కూడా ఉండాలి. కార్మికులు యాజమాన్యంలో భాగస్వామ్యం అన్న స్పృహను వారికి కలిగిస్తేనే వారు మరింత బాధ్యతాయుతంగా వుండగలుగుతారు.

కుటుంబ వ్యవస్థ గల సమాజ నిర్మాణం, వర్గ స్వభావం, శ్రామిక ఉత్సాహాన్ని ప్రభావితం చేస్తాయి.

4.5 జీత భత్యాలు :

కార్మికులకు జీతాలు ఇచ్చే రోజు ఒక జాతర లాంటిదని, 'జీతం' కథలో పేర్కొనడం జరిగింది. ఘర్మజలానికి ఖరీదు యిచ్చే రోజు. మల్లన్న జీతం తీసుకుని రాగానే నెలనెలా చిట్టీల వాళ్ళు, ఖాతాదారులు వచ్చి తీసుకుంటారు. యూనియన్ వాళ్ళు వచ్చి చందాలు కట్టించుకుంటారు. ఇన్స్యూరెన్స్ చేయండి అంటూ ఏజెంట్లు వెంబడి పడితే, వాళ్లను తప్పించుకుని రావాలి. మధ్యలో తోటి కార్మికులు కలిసి సారా దుకాణానికి వెళ్లాలనడంతో అక్కడికి వెళ్లి ఖాతా కట్టడం, ఇంట్లోకి కావలసిన కిరాణా వస్తువుల కొరకు దుకాణంలో తీసుకొని ఖాతాలు తీర్చేసరికి, పిల్లల బడి ఫీజులు కట్టేసరికి జీతం పూర్తిగా అయిపోవడంతో మల్లన్న తన బ్రతుకు అంతా శూన్యమయిపోయిందని బాధపడ్డాడు.

'రాక్షసులు' అనే కథలో జీతం ఇంట్లో ఇవ్వకపోతే తల్లీ, తండ్రీ, కొడుకుల మధ్య మమకారాలు తగ్గిపోతున్నాయనీ, ముఖ్యంగా కొడుకు జీతం ఇవ్వకపోతే ఆ కోపంతో తండ్రి తల్లిని తిట్టడం, అంతేగాక ఇరుగుపొరుగు అమ్మలక్కలు కూడా జీతాలు వచ్చిన రోజుల్లో ప్రతి ఇంట్లో భర్త తాగివస్తే గొడవ పడటం - కార్మిక వాడల్లో భార్యా భర్తల తగాదాలు మామూలేనని అనుకోవడం జరుగుతుంది. జీతాల రోజుల్లో కార్మికుల కుటుంబాలలో భార్యాభర్తలు బద్ధ శత్రువులుగా మారటాన్ని కార్మికులు తాగి రోడ్డు మీద దుమ్ములో పడి పొర్లుతూ భార్యల్ని తిట్టడాన్ని చూసిన రాజేశం అటువంటి రసానుభవం లేని జీవితం తనకు వస్తుందేమోననీ, తాను కూడా జీతాల రోజు అలా రాక్షసుడిగా మారతానేమోనని బాధపడడం అర్థం అవుతుంది.

'బొగ్గు పొరల్లో' అనే కథలో ఒక కార్మికుడు టబ్బు పూర్తిగా నింపనందుకు అండర్‌మేనేజర్ అతనిని ప్రశ్నించిన సందర్భంలో పొలం పనిలో కష్టానికి, బొగ్గు తీసిన కష్టానికి ఇచ్చే వేతనంలో తేడా ఉండాలనీ, పంట ధరకు, బొగ్గు

ధరకు ఉన్న తేడాని గుర్తించి వేతన నిర్ణయం చేయాలని అంటాడు. దాట్లను లేటుగా ఇవ్వడం టింబరు మాన్ లేటుగా రావడం, వర్కింగ్ ప్లేసు సరిగ్గా లేదనీ చివరి గంటలో ఇంకొక సీముకు పంపించి అక్కడ బొగ్గు తీయటం అలా తీస్తేనే మస్టరు వేస్తామనడం కార్మికులకు కోపం తెప్పిస్తుంది. మస్టర్ల (హాజరు) ప్రకారం జీతం లెక్క కట్టడం జరుగుతుంది.

'గొడుగు' కథలో శ్యామల తన భర్త కృష్ణయ్య నిజాయితీతో తెచ్చుకున్న జీతం తమ అవసరాలకు సరిపోవడం లేదనీ తన అన్నలు డబ్బులను వడ్డీలకు తిప్పుతూ గొప్పవాళ్ళుగా అవుతున్నారనీ, అసంతృప్తి చెంది తన భర్త తెలివితక్కువ వాడనేంత వరకు ఆలోచిస్తుంది.

'బొగ్గు పొరల్లో' కథాసంకలనంలోని 'లీడరు'అనే కథలో వేజ్‌బోర్డు వచ్చినప్పుడల్లా జీతాలు పెరిగితే దానికంటే ముందే ధరలు పెరుగుతున్నాయని జీతాలు పెంచడం కంటే ధరలను అదుపులో పెడితే బాగుండునని తన అభిప్రాయాన్ని కార్మికుడు వెల్లడి చేస్తాడు. రెండ్నెల్లకొకసారి యాక్టింగ్ కడితే బాగుండునని, బదిలీలతో ఆ పని చేయించుకున్న కూడా పనిచేసే కార్మికులకు మజ్దూర్ జీతమే ఇస్తున్నారని బాధపడ్డారు. యాక్టింగ్ అలవెన్సులు ఇవ్వడం అనేది ఒక్క సింగరేణి సంస్థలో ఉంది.

'ఆయువుపట్టు' కథలో సింగరేణిలో 190 మస్టర్లు పూర్తి చేసిన 12000 మంది బదిలీ ఫిల్లర్ల నిబంధనల ప్రకారం తమను పర్మినెంటు చేయలేదని బాధపడ్డారు. బదిలీ ఫిల్లర్లకు క్యాజువల్ లీవ్ కట్టకుండా జీతాలలో కోత కోసి ఇచ్చినందుకు కార్మికులు ఘర్షణకు దిగుతారు.

'సమ్మె' కథలో కరెంటు సప్లయి లేదనే నెపంతో లే ఆఫ్‌ను యాజమాన్యం ప్రకటించడం జరిగింది. దానికి కార్మికులు తమకు మస్టరు పడదని బాధపడ్డారు.

'విస్తరణ' కథలో పండుగ మస్టరు కట్టియ్యనందుకు కార్మికులు లొల్లిపెడితే కార్మికులమీద కేసు పెట్టడం జరుగుతుంది. ఇదే కథలో గని పనిలో కలిగిన గాయం నుండి కోలుకోని వెంకటయ్యను డాక్టరు ఫిట్ చేసేసరికి ప్రశ్నించిన వెంకటయ్యను అరెస్టు చేసేసరికి పోలీసుల నుండి విడిపించాలని కార్మికులు సమ్మె చేస్తారు. సమ్మె చేసినందుకు వారి జీతంలో ఎనిమిది రోజుల కోత పెట్టటంతో కార్మికులు సంఘటితమై పట్టుదలగా సమ్మెను కొనసాగిస్తారు. 2 నెలల వరకు కొనసాగించిన సమ్మె చివరికి బ్రిటీష్ వాళ్ల కాలం నాటి నుండి ఉన్న నల్ల చట్టాలను

ఎదుర్కోవటంగా ముగుస్తుంది అని భావించడం కనబడుతుంది.

'సింగరేణి బతుకులు' అనే కథా సంకలనంలోని జీతం-లాభం కథలో కార్మికుడి జీతం అతని కుటుంబాన్ని జీవన ప్రమాణ స్థితిలో ఉంచేలా జీతం పెరగాలని సూచిస్తాడు. దానికోసం మామా-అల్లుళ్లు అనే అంతర కథ ద్వారా కష్టం చేసేవారికి ఫలితం ఎక్కువ దక్కాలని సూచించడం జరిగింది.

దీని నమూనాలోనే లారీ కాంట్రాక్టరు అనే మరొక అంతర కథాపరంగా లాభాలలో పెట్టుబడి ఖర్చులు తీసి మిగిలిందాన్ని అందరూ పంచుకోవాలని చెప్పడం అర్థం అవుతుంది. పెట్టుబడిదారుని ఆస్తి పెరిగితే అధికారం, రాజ్యం వస్తుందనీ, కష్టపడే కార్మికులు జీతాలు అడిగితే పెంచనందుకు సమ్మె చేస్తే అది నేరం అవుతుందనీ, ఫ్యాక్టరీలో పని చేస్తే కార్మికుడిని కూలీగానే భావిస్తున్నారని, ఇది ఆర్థిక అసమానతను పెంచుతుందనీ, అదే ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టవుతుందని భావిస్తాడు. కార్మికుల అదనపు శక్తికున్న విలువలను పెట్టుబడిగా పెట్టగలిగినవారే ఫ్యాక్టరీ యజమాని అవగలుగుతాడని చెబుతాడు. ఫ్యాక్టరీలో కార్మికులకూ అధికారం రావాలి. ఈ రెండింటికీ మధ్య పోరాట వారసత్వం కార్మిక సంఘాల పెట్టుబడిగా మారుతుందని కూడా చెప్పడం జరిగింది.

'బండ కింద బతుకులు' అనే స్వగతాల సంపుటిలో కార్మికుల జీతాలను గుల్ల చేస్తున్నది వ్యాపార సంస్థలనీ ఎముకలు విరిగేటట్లు కష్టపడి సంపాదించిన డబ్బు జీతాల రోజునే అన్ని ఖర్చుల ఖాతాలకు పోను 'ఏనుగు తిన్న వెలక్కాయ చందంగా' అవుతుందనీ అంటాడు కైతికాల పోశెట్టి. ఉద్యోగం నుండి వెనక్కి చూసుకుంటే డబ్బు ఏమీ మిగలదు. సత్తువ ఉండదనీ భావిస్తాడు. కంపెనీ వాళ్ల వేలం పాటలో దుకాణాలను కిరాయికిస్తే వాళ్లు ధరలు పెంచేస్తారు. దానితో లేబరోళ్ళు ధర తగ్గిందని బాధపడ్డాడు. వేజ్‌బోర్డు వచ్చినా అతని జీవన స్థితి అంతకు ముందు ఎలా ఉందో అలాగే ఉందనీ, జీతం నిలువలకు వీలుగా లేదనీ, చావకుండా జీతాన్ని పెంచుతారనీ, వేజ్‌బోర్డులో ప్రభుత్వం నాల్గు పైసలు పెంచితే, బజార్లో ధరలు 14 పైసలు పెరిగాయనీ 'వేజ్‌బోర్డు అంటే పంచపాండవులు, మంచంకోళ్లలా ముగ్గురని రెండు వేళ్లు చూపించడం లాంటిదనీ' అంటారు. పెరిగే ధరలకు తగ్గట్టుగా జీతాలు పెరగడం లేదనీ, వేజ్‌బోర్డు నిర్ణయం పనికి రాకుండా పోతుందని బాధపడ్డారు. పైగా రోజురోజుకి పెరిగే ధరలకు తగ్గట్టుగా వేజ్‌బోర్డు నిర్ణయం ఎందుకు పనికి రాకుండా పోతుందని భావించి జీతాలు పెరగటానికి సమ్మె చేస్తారు. 'పంచపాండవులు' అనే స్వగతంలోనూ,

'నివురు గప్పిన నిప్పు అనే శీర్షిక గల స్వగతంలోనూ బోనస్ పెంపుదలకునూ మస్టర్ల కోతకు వ్యతిరేకంగానూ సమ్మె చేశారు. 'తనకి తాకితే' అనే స్వగతంలో కూడా ఫాల్ బ్యాక్ మస్టర్ కావాలని సమ్మె చేసేసరికి లచ్చన్నకు చార్జిషీటు ఇవ్వడం జరుగుతుంది.

'సింగరేణి మండుతోంది' నవలలో గని పని కష్టాన్ని మరచిపోవడం కోసం తాగటం, దానితో అనారోగ్య పరిస్థితులు ఏర్పడటం, నాగాలు పెట్టడం, జీతం కోతలు క్రమంగా చివరకు కార్మికుని ఉద్యోగం పోవడం వంటి విషయాలతో పాటు, దొరల అండతో పైరవీకారులతో ఉద్యోగాలకై ఎరపెట్టి గిరిజనులను దోచుకుంటున్నారని బాధపడడం కూడా జరిగింది. ఇప్పుడు కోయగూడెం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొంతమంది దళారులు గిరిజనులను మోసపుచ్చడం పత్రికాముఖంగా వెలువడుతున్న విషయమే.

ఆరవ వేజ్‌బోర్డు జీతాలను అమలు చేయడంలో దేశం మొత్తం మీద సింగరేణి సంస్థ ముందు నిలబడింది. ఏరియర్స్ కూడా అందరికంటే ముందు యిచ్చింది. అయితే కార్మికులు పొదుపు చేయాలనే దృష్టితో బాండుల రూపంలో ఏరియర్స్‌ని యివ్వాలనుకుంటే కార్మికులు సుముఖత్వం చూపలేదు. కార్మిక కుటుంబ స్త్రీలు యిష్టపడినా, కార్మికుల ఖర్చుల లిస్టుల ముందు యాజమాన్యపు సూచన నిలబడలేదు. కార్మికులు యాజమాన్యాన్ని ఎప్పుడూ వ్యతిరేక దృష్టితో చూడడం కూడా కార్మిక శ్రేయస్సుకు అవరోధం కాగలదనేది ఇక్కడ అవగాహనకు వచ్చింది.

ముఖ్యంగా ఓవర్‌టైమ్‌ల వంటివి ఇదివరకు ఉన్నా, వాటిని కొంతమంది అధికారులు కార్మికులు కలిసి దుర్వినియోగం చేస్తున్నారని, వ్యయ నియంత్రణలో భాగంగా వాటిని తగ్గించడం జరిగింది.

అయితే లాభాల బోనస్‌తో పాటు, పదిశాతం డివిడెంటును కూడా సంస్థ కార్మికులకు ఇవ్వడం ఒక వినూత్న పరిణామంగా పారిశ్రామిక సంబంధాలలో చోటు చేసుకుంది. దేశం మొత్తం మీద మరియే యితర ప్రభుత్వ రంగ సంస్థలలోను ఈ పద్ధతి లేదు. ఈ విషయం సింగరేణి కార్మికులు గుర్తించి యాజమాన్యం యెడల సానుకూల ధోరణిని ఏర్పరచుకోవాలి. ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగా అంతర్గత నిధులసమీకరణలో భాగంగా ఈ లాభాల డివిడెండ్‌ను కార్మికులు బాండులరూపంలో సింగరేణి సంస్థలోనే షేర్ల క్రింద

పెట్టి అనుమతి పొందితే ఇన్‌కమ్‌ట్యాక్స్ సరిధినుండి కాపాడబడటమేకాక కార్మికులు తప్పని సరి పొదుపు విధానాన్ని అవలంబించటం జరుగుతుంది.

'నల్ల వజ్రాలు' అనే పాటల సంకలనంలో "ప్రమాదాలు లెక్కచేయక ప్రాణాలు పణంగా పెట్టి గాలి నీరు లేకున్నా గండాలెన్ని ఎదురైనా టన్నుల కొద్ది బొగ్గును టబ్బులలో నింపిరి, బండ చాకిరి చేసిరి. బండ కింద కార్మికుల్ని నిత్యావసర సరుకులకు నిత్యం ధరలెక్కుతుంటే వేతనాలు పెరగాలని వేజ్‌బోర్డు రావాలని విసిగిన కార్మిక లోకం ఉద్యమాలు చేసినపుడు పని చేయని కాలానికి పైసలు ఎవరు కట్టిరా?" అని తాము న్యాయంగా సమ్మె చేస్తే జీతం ఇవ్వనందుకు బాధపడ్డారు.

బ్యాంకుల ద్వారా జీతాల చెల్లింపు ఒక అభివృద్ధికర పరిణామం. కౌంటర్ క్లర్కుల నుండి, యూనియన్ల నుండి వ్యాపారుల బారి నుండి తప్పుడు లెక్కల నుండి కాపాడటానికి బ్యాంకుల ద్వారా జీతాలివ్వడం అనేది చాలా ఉపయోగపడే విషయం. కార్మిక కుటుంబ స్త్రీలు బ్యాంకుకు వెళ్లి, భర్త జీతాన్ని డ్రాచేసి తీసుకు రాగలగడం కుటుంబంలో ఆర్థికాభివృద్ధికి అదొక సోపానంగా మారుతుంది. తద్వారా రాష్ట్ర, దేశాభివృద్ధి జరగడం తథ్యం. స్త్రీలు పొదుపును అలవాటు చేసుకోవడం ఆదా చేసిన డబ్బుతో స్వయం సహాయక గ్రూపులుగా మారి చిన్న చిన్న వస్తూత్పత్తులు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతేగాక కార్మికుల తాగుడుకై జీతాన్ని ఖర్చుపెట్టడం కూడా 35% తగ్గిందని గోదావరిఖని కార్మికుల విషయ పరిశీలన అర్థమయింది. అయితే బ్యాంకుద్వారా జీతాలను తీసుకునే పద్ధతిని కార్మికులు వ్యతిరేకించే టట్టుగా యూనియన్ చేయించటం కేవలం వారి ముడుపుల కోసమేనని అర్థంచేసుకోవాలి.

మినిమమ్ వేజెస్ చట్టం 1948లో వచ్చింది. యాజమాన్యం కార్మికులకు నిలదొక్కు కోవడానికి తగిన నిజవేతనం ఇద్దామనుకున్నా కూడా కార్మికులు మాత్రం జీవన ప్రమాణ స్థాయి జీతాలు ఇవ్వాలని కోరుకుంటారు. ప్రభుత్వం ఫెయిర్‌వేజెస్ ఇవ్వాలని నిర్ణయిస్తుంది. మినిమమ్ వేజెస్ కేవలం నిత్య జీవన భృతికై సరిపోతాయని కాస్త నిలువ చేసుకోవడానికి వీలుగా జీతాలు ఉండాలని కోరుకుంటారు. కానీ కార్మికులు తమ జీవన భృతి తమకు తమ కుటుంబ సభ్యుల సంక్షేమ కార్యక్రమాలకు, సామాజిక అవసరాలకు తగ్గట్టుగా ఉండాలని కోరుకుంటారు. మినిమమ్ వేజెస్‌తో పాటు ఉచిత కరెంటు, గృహ, వైద్య సౌకర్యాల

వంటి వాటిని కూడా జీతంలో కలుపుకుంటే కార్మికులకు జీతాలు సంతృప్తికరంగానే ఉంటాయి అనేది యాజమాన్యపు దృష్టిగా ఉంటుంది.

అయితే చట్టము నందలి పనుల ప్రామాణికతను, సాధారణీకరణను, సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని వేజ్‌బోర్డులు జీవన ప్రమాణానికి తగ్గట్టుగా జీతాల ప్రామాణికతను నిర్ణయించడం జరుగుతుంది. దాన్ని జె.బి.సి.సి.ఐ.లో పెట్టి ఆమోదం పొందిన తర్వాత అమలు చేయడం జరుగుతుంది. జె.బి.సి.సి.ఐ.లో యాజమాన్యంతో పాటు కార్మిక సంఘాల నాయకుల ఆమోదంతో కూడా ఒప్పందం కుదురుతుంది. అయితే అనంతమైన కోరికలు గల మానవునికి వర్గ స్వభావం గల సమాజంలో, సామాజిక ఆర్థిక భద్రత లేని వాతావరణంలో ప్రపంచీకరణం వల్ల, పారిశ్రామికీకరణం వల్ల, పెరిగిన అవసరాలు, వస్తూత్పత్తులపై మోజు మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అన్ని కలిసి జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తూంటే జీతభత్యాల కొరత చాలా సహజంగా ఉండే విషయమే. వీటన్నింటిపై ప్రభుత్వానికి నియంత్రణ ఉండాలి. కాని ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ, ఆర్థిక సరళీకరణ విధానాల ప్రభావాలు రోజురోజుకు ఎక్కువవుతున్న తరుణంలో జీతాలు జీవన ప్రమాణాలకు తగ్గట్లుగా ఉండాలనుకోవడం గగన కుసుమమే అవుతుంది.

సంస్థకే ఆర్థిక కొరత ఏర్పడుతుంటే కార్మిక కుటుంబాలకు ఆర్థిక వత్తిడి ఉండడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. సంస్థాగత వ్యయ నియంత్రీకరణ, దుబారా ఖర్చులు తగ్గించుకోవడం వంటి కార్యకలాపాలతో పాటు ఆర్థిక భద్రతకు సంస్థ యొక్క అంతర్గత ఆర్థిక వనరుల సమీకరణ చేస్తున్నట్లుగా కార్మికులు కూడా కుటుంబంలో తాగుడు వంటి దుబారా తగ్గించుకుని కోరికలను అదుపులో పెట్టుకుంటూ జీతాలను మదుపు చేసే పొదుపు కార్యక్రమాలను అవలంబించాలి. తాగుడు బదులు మజ్జిగ తాగితే అమృతప్రాయంగా వుంటుందనే దాన్ని కొంతమంది కార్మికులు చెప్పడం మహానది కోల్డ్‌ఫీల్డ్ సర్వేలోను, సింగరేణి కార్మికుల సర్వేలోను వెల్లడి అయిందనే దాన్ని కార్మికులు ఆలోచించాల్సిన విషయం.

కోల్ ఇండియా అనుబంధ సంస్థలలో లేని స్థాయి ఉద్యోగాలు జె.బి.సి.సి.ఐ. ఒప్పందానికంటే కూడా ప్రత్యేకమైన కేటగిరీలు సింగరేణి కార్మికులకు ఉన్న ప్రత్యేక సౌకర్యంగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతునే ఉంది. అటువంటి ప్రత్యేక ఏర్పాట్లకు కార్మికులు మేనేజ్‌మెంట్ యెడల కృతజ్ఞతతో ఉండాలి.

'జీతం' కథలో జీతం సరిపోకపోవడానికి చిట్టీల రూపంలో ఖాతాలను కట్టడంతోను యూనియన్లకు చందాలు కట్టడంతోనే అయిపోయిందని కార్మికులు బాధపడ్డారు. కార్మికుడు తన జీతానికి తగ్గట్టుగా ఖర్చును ప్రణాళికాబద్ధం చేసుకోవడం కార్మికుని చేతిలో పని వివిధ యూనియన్లు చందాలకు జీతం కట్టాల్సిరావడం యే యూనియన్‌కి కట్టకపోయినా ఏమంటారో అనే భయంతో వాళ్ళకు కట్టడం, పే కౌంటర్ దగ్గర యూనియన్లు రెడీగా వుండడం, నిజంగా బాధాకరమైన విషయం. అయితే యూనియన్లు లేకుండాను సామూహిక శక్తిని కూడా మనజాలరు. అందుకని అది తప్పనిసరి అవుతుంది. అయితే అది కార్మికులకు పీడాకారంగా ఉండకూడదు. అయితే ఈ విషయంలో మేనేజ్‌మెంట్ రహస్యబ్యాలెట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల ఎక్కువ ఓట్లు తెచ్చుకున్న గుర్తింపు పొందిన యూనియన్‌కి కార్మికుని అభీష్టం ప్రకారం చందాను పేషీట్లో రికవరీ చేసి ఇవ్వవచ్చు. కాబట్టి పేకౌంటర్ దగ్గర గొడవ వుండదు. అందుకే జీతానికి రక్షణ ఉంటుందని పే షీటు క్లర్కులకు ముడుపులు ఇవ్వవలసిన అవసరం లేకుండా లెక్కలు బరాబరిగా అందే అవకాశం ఉండే విధంగా బ్యాంకుల ద్వారా జీతాల చెల్లింపును యాజమాన్యం నిర్ణయించింది. కాని కొన్ని రాజకీయ శక్తుల పన్నాగంలో భాగంగా కార్మికులు కూడా దీన్ని వ్యతిరేకించాలనుకోవడం శోచనీయం.

జీతాల రోజున కార్మికులు సారా కొట్లకు వెళ్లడం, బాగా తాగి పడుండటం, ఆ తర్వాత పనికి నాగాలు పెట్టడం అనేది ఎక్కువగా జరిగేది. అది ఉత్పత్తి మీద కూడా ప్రభావం చూపించగలిగే విషయం. ఈ విషయంలో కార్మిక సంఘాలు కార్మిక శ్రేయస్సును పట్టించుకోవడంలేదు. ఆ వ్యాపార వర్గాలను అరికట్టలేని స్థితి వుండడంతోను కార్మికుడు తాను పడ్డ శ్రమను పోగొట్టుకోవడానికి అనువైన వాతావరణం లేనందుకు తాగుతాడనే సానుభూతితో అర్థం చేసుకోవడం కంటే కూడా కార్మికుడు గని పనిలో పడ్డ కష్టాన్ని తీర్చుకోవడానికి అనువైన ప్రత్యామ్నాయాన్ని ఆలోచించి ఆచరణలో పెడితే బాగుంటుంది. ఇది యూనియన్ చిత్తశుద్ధితో చేయాల్సిన ముఖ్యమైన పని. మహానది కోల్డ్‌ఫీల్డ్స్‌లో పనిచేసే వర్కర్స్‌లో తాగుడుశాతం తక్కువగా ఉందని అర్థమయింది. కొంత మంది తాము సారా బదులు ఇంటికి వచ్చి మజ్జిగ త్రాగితే శ్రమ బాధ తక్కువవుతుందని చెప్పారు. సింగరేణిలో కొంత మంది కార్మికులు కంపెనీ వాళ్ళు మంచి వసతి సౌకర్యం, డ్రైనేజీ వసతి కల్పించగలిగితే దోమల బెడద ఉండేది కాదని తద్వారా నిద్రపట్టే పరిస్థితి వుంటే కార్మికులు తాగరని చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే పెద్ద పెద్ద ఇళ్లల్లోను మంచి డ్రయినేజి వసతి ఉన్న యిళ్లల్లో కూడా ఏదోవిధంగా

దోమల బెడద ఉండే వాతావరణం ఉంటూనేవుంది. అయితే కార్మికులు వ్యక్తిగత శుభ్రతలు పాటించడంతో పాటు మేనేజ్‌మెంట్ వారు పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలు పాటించగలిగితే ఈ సమస్య కొంత వరకు తగ్గుముఖం పడుతుంది. అయితే ఏదో తాత్కాలిక పద్ధతులుగా ప్రచారం కాదు. శాశ్వతంగా డ్రయినేజి సౌకర్యం ఏర్పాటు చేయగలగాలి. అప్పుడు కార్మికుడికి ఇంటి వసతి సౌకర్యం ఏర్పడి అది తాగుడు వ్యసనాన్ని తగ్గించగలిగితే జీతంలో ఖర్చు తగ్గడమే గాక, నాగాలు కూడా తగ్గి జీతం పూర్తిగా వచ్చి, కార్మికుడిపై ఆర్థిక వత్తిడి తగ్గుతుంది. అంతేగాక ఉత్పత్తి పెరిగితే లాభాల రూపంలో అదనపు జీతాన్ని కార్మికుడు అందోకోగలుగుతాడు.

బ్యాంకు జీతాల వల్ల తాగుడు సగానికి సగం తగ్గిందని సర్వేలో అర్థమయింది. అంతేగాక ఇంట్లో కుటుంబ స్త్రీలు బ్యాంకుకు వెళ్లి జీతం తెచ్చుకుని జాగ్రత్తగా వాడుకోగల పరిస్థితులు ఏర్పడినాయి. బ్యాంకు జీతాల చెల్లింపు కుటుంబ సంక్షేమ కార్యక్రమంలో భాగమయింది.

'బొగ్గు పొరల్లో'ని సంపుటి నందలి లీడర్ కథలో 190 రోజులు మస్టర్లు (హాజరు) చేస్తే పర్మినెంట్ చేయాలని ఖానూన్ ఉండగా ఎందుకు చేయరని, బదిలీలను పర్మినెంట్ చేసేవరకు పనిలోకి దిగమని భీష్మించుకున్నారు. బదిలీలకు క్యాజువల్ లీవ్, లెక్క కట్టనందుకు సమ్మె చేస్తారు. చట్టం చేసినా అమలు చేయమని, ఆచట్టనియమము తమదగ్గరకు రాలేదని అంటూ మేనేజ్‌మెంట్ జాప్యం చేస్తుందని బావిస్తారు. దానితో బంద్‌చేసేసరికి 11 రోజులు క్యాజువల్ లీవ్ పెట్టుకునే అర్హతను బదిలీలకు కల్పించారు. ఇక్కడ అమలులోని నిర్లక్ష్యపుధోరణి లేదా అధికారుల అలసత్వం సమ్మెకు కారణమని స్పష్టమవుతుంది.

'విస్తరణ' కథలోని బదిలీల పర్మినెంట్ విషయంలో స్ట్రైకులు చేసిన వారికి డిస్మిస్ లెటర్ ఇచ్చే సరికి కార్మికులు సంఘటితం అయి 56 రోజుల పాటు సమ్మె చేస్తే ఉత్పత్తి నష్టం అయింది. జీతంకోత ఏర్పడుతుంది. కార్మికులకు కూడా చివరి జీతాన్ని, సర్వీసును దృష్టిలో పెట్టుకుని సింగరేణిలో ఇప్పుడు పెన్షన్ పొందే సౌకర్యం ఏర్పడింది. బేసిక్‌లో 1/4 వంతు పెన్షను క్రింద నిర్ణయించడం జరిగింది.

ఉన్నత వర్గం సృష్టించిన రాజ్యాంగం వల్ల క్షీణిస్తున్న ఆర్థిక వ్యవస్థ, తరుగుతున్న మానవ విలువలు, పెరుగుతున్న వ్యయం కలుషితమయ సాంఘిక జీవనం క్రమంగా బలహీనపడుతుంది. సాంఘిక భద్రతను మాటలకే పరిమితం

చేస్తున్నారనీ, జాతీయతా భావాల లేమితోపాటు, గౌరవం కోల్పోతున్న శ్రమను గురించిన వాస్తవికతను వర్ణించడం 'సింగరేణి మండుతోంది' నవలలో కనబడుతోంది. 190 మస్టర్లు పూర్తయినా కూడా పర్మినెంట్ కాకుండా తొలగించబడిన మాజీ కార్మికులు కష్టపడాల్సిన కాలంలో దొరల చుట్టు తిరుగుతున్నారని 'బొగ్గు పొరల్లో' అనే కథలో చెప్పడం జరిగింది. 'సింగరేణి మండుతోంది' అనే నవలలోను గనుల ప్రాంతాలలోని యువత ఎలా నిర్వీర్యం అవుతున్నారో చెప్పడం జరిగింది. కంపెనీ దొరల బుద్ధి 'కట్లపాము' వంటిదనీ , బందుల వల్ల జీతం లేక వడ్డీలు పెరిగి అప్పు పెరుగుతుందని, ఆ రకంగా కార్మికులు పాము కాటుకు గురి అవుతున్నారని చెప్పడం జరిగింది. కార్మికుల జీవితాలలో మురిపాలముచ్చట్లు కనబడవు గాని, నీరసాలు, నిట్టూర్పులు నిమిష నిముషానికి పలుకరిస్తాయని భావించడం జరిగింది. కార్మికులు అనవసరపు అదనపు వినియోగ శక్తిని ఉత్పత్తిలో వాడుకోవాలని సూచించడం కూడా జరిగింది.

'సింగరేణి మండుతోంది' అనే నవలలో చెప్పిన విషయాలను సూచనప్రాయంగా భావించి సంస్థలో పని ప్రదేశానికి వెళ్లేటప్పుడు నడక వల్ల కార్మికులు కోల్పోయే శక్తిని ఆదా చేయాలని దానిని మరికొంత బొగ్గుతీయడానికి ఉపయోగించాలనీ సింగరేణి సంస్థ ఇటీవల మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టడం హర్షదాయకమేకాక సాహిత్యప్రయోజనం నేరవేరింది అనేదానికి కూడ నిదర్శణం.

కార్మికుడిపై ముఖ్యంగా ఆర్థిక వత్తిడి తగ్గగలిగితే అతడు పనిలో చురుకుగా ఉండగలుగుతాడనేది విశ్వజనీన సత్యం.

'బొగ్గు పొరల్లో' అనే కథలో కార్మికుడు తను చేస్తున్న పని స్వభావాన్ని బట్టి జీతం ఇవ్వాలంటాడు. అక్కడ మేనేజరు పని స్వభావాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పొలం పనికి ఇచ్చే వేతనాన్ని పోల్చి చెప్పి పని చేయించుకోవాలని అనుకోవడం అసలు పొరపాటు. ఏ వ్యక్తి అయినా తన కష్టానికి తగ్గ విలువనివ్వాలని కోరుకుంటాడు. ఇక్కడ భూస్వామ్య వర్గ స్వభావపు పోకడలతో కార్మికులను చూడటం అధికార వర్గం యొక్క తప్పుగా బావించాల్సివుంటుంది.

అదే విధంగా దాట్లు సకాలంలో ఇవ్వకపోవడంతో పాటు పని ప్రదేశం సరిగ్గా లేకపోవడానికి మస్టరు కోత పెడతానని అనడంతో కార్మికులలో అసంతృప్తి చెలరేగటం సహజ పరిణామం.

ఇక్కడ సంస్థాగత విభాగాల విధానాల లోపాన్ని దృష్టిలో పెట్టుకుని సామాజిక సంబంధాలను ఆలోచించవలసిన విషయాన్ని అధికార దృష్టితో చూసేసరికి సంక్లిష్టత చోటు చేసుకుంది.

'లీడరు' కథలో వేజ్‌బోర్డు జీతాలను పెంచడానికి ముందే ధరలు పెరుగుతున్నాయని బాధపడడం కనబడుతుంది. అయితే ఇక్కడ మార్కెట్లో ధరలను పెంచడం యాజమాన్యపు పరిధిలోనిది కాదనే విషయాన్ని కార్మికులు గుర్తించాలి. ధరల సూచికలో 50 పాయింట్లు చేరుకోవడాన్ని బట్టి జీతాలను పెంచడం జరుగుతుందనేది కార్మికులు ఆలోచించాల్సిన విషయం. ధరల పెరుగుదలకు స్థానిక వ్యవసాయోత్పత్తులతో పాటు చాలా అంశాలు కారణభూతమవుతాయి. అది కేవలం కేంద్ర ప్రభుత్వం అదీనంలో ఉండే విషయం.

క్యాజువల్ లీవులు చట్టప్రకారం సంక్రమించినవి. వాటిని యథాతథంగా అమలు చేయాలి. అలా అమలు చేయకపోతే కార్మికులలో అసంతృప్తి నెలకొంటుంది. చిన్న చిన్న విషయాలలో చట్ట సమ్మతమైన విషయాల ఆచరణలో ఆలస్యం జరగడం అసంతృప్తికి కారణమై ఉత్పత్తి మీద ప్రభావం చూపగలుగుతుంది. కాబట్టి దానిని సిస్టమ్స్ అప్రోచ్‌తోనూ, పర్‌సెప్షన్ అప్రోచ్‌తోనూ ఆలోచించాల్సిన విషయం.' సమ్మె' అనే కథలో విద్యుత్ సరఫరా లేదనే నెపంతో లాకౌట్ ను ప్రకటించడాన్ని కార్మికులు అడ్డుకుంటారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే యాజమాన్యం లేఆఫ్‌ను ప్రకటించవచ్చని చట్టం చెబుతోంది. అయితే అటువంటి పరిస్థితులు లేనప్పుడు దొంగ సాకుగా అధికారులు లాకౌట్ ప్రకటిస్తే కార్మికులు తిరగబడతారనేది కూడా అంతే సత్యం.

జీతం – లాభం కథలో కార్మికుని కుటుంబం జీవన ప్రమాణ స్థితిలో ఉండేటట్లుగా జీతం పెరగాలని చెప్తాడు. ప్రభుత్వం మినిమమ్ వేజెస్‌ని నిర్ణయించినా అదనపు జీవన సౌకర్యాలను ఉచితంగా అందిస్తూ మొత్తం మీద కంపెనీ లాభాలను దృష్టిలో పెట్టుకుని సింగరేణి సంస్థ మెరుగైన జీతాలనందిస్తుంది. అయితే జీతాలు జీవన ప్రమాణ స్థితిలో ఉండేలా చూడాలంటే సంస్థ లాభాలను సమానంగా పంచగలిగితేనే వీలవుతుంది. కాని బంగారు గుడ్డును ఒకే రోజుకు పరిమితం చేయకూడదు. భవిష్యత్తు దృష్ట్యా సంస్థ విస్తరణ కార్యక్రమాలకు కేటాయింపులను ఎక్కువగా చేసుకుని సంస్థ పది కాలాలపాటు ఉండేలా చూసుకోవాలి కదా! అదనపు పెట్టుబడులు పెట్టుకోవలసిన స్థితిని దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి లాభాలలో కార్మికులను ప్రోత్సహిస్తూ కొంత శాతం డివిడెంట్‌గా

ఇవ్వడం జరిగుతుంది. బహుశ ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిలో ఒక్క సింగరేణిలో మాత్రం డివిడెంట్‌ని ఇవ్వటం ఆచరణలో పెట్టగలిగింది. బోనస్ పెంపుదల గురించి కార్మికులు అడిగేంతవరకు ఆగకుండా లాభాలను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యమే ముందుగా నిర్ణయించగలిగితే కార్మికులు మరింతగా సంతృప్తిని పొందగలరు.

'తనకు తాకితే' కథలో ఫాల్ బ్యాక్ మస్టరు కావాలని కార్మికులు సమ్మె చేస్తారు. అయితే దానిపై యాజమాన్యం సిస్టమ్స్ అప్రోచ్‌తో ముందు జాగ్రత్త చర్య చేపట్టాలి. గని పని చేయడం కష్టమనే మనస్తత్వంతో వీలయినంతగా పని నుండి పలాయనం చిత్తగించాలనే భావన కార్మికుడికి ఉంటుంది. అయితే కార్మికులు ఫాల్‌బ్యాక్ మస్టరు కోసం గొడవ పెట్టడం సమంజసమా కాదా అనేది వర్క్స కమిటీలో నిర్ణయించుకోగలిగి సమస్య పరిష్కారం చేసుకునే సామర్థ్యం ఇరు పక్షాల వారికి ఉండాలి. 1995-96 సం॥లో సమ్మెలవల్ల 276 కోట్లు నష్టం రావడంతో రోజుకు ఒక కోటి రూపాయలు నష్టంగా అంచనా వేయడంతోపాటు జీతాల చెల్లింపు కూడా కష్టమైంది.

ఉత్పత్తి వ్యయం పెరగడం, రాయల్టీ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి రావడంతో కేంద్ర ప్రభుత్వం ఋణాలపై వడ్డీ చెల్లింపులను నిలుపుదల చేయాల్సి వచ్చింది. దానికి కేంద్ర ప్రభుత్వం 2006 వరకు మారిటోరియమ్‌ను ప్రకటించి ఆదుకున్నది. కాని అప్పు అప్పే కదా! ఎప్పటికైనా తీర్చాలి కాబట్టి లాభాలను పొంది రుణాలను తెచ్చుకోవడానికి కొంత వెనుక వేయాల్సి వస్తుంది.

ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సరళీకృత విధానం వల్ల కొత్త ప్రాజెక్టులకు కావలసిన పెట్టుబడుల వనరులను తమంతట తామే బొగ్గు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలి. కాబట్టి ముందుగా ఉత్పత్తిని పెంచి లాభాలు తెచ్చుకోవాలి. లాభాలలో కొంత శాతం క్రొత్త ప్రాజెక్టుల పెట్టుబడికి కేటాయించాల్సి వస్తుంది. సింగరేణి సంస్థ కంటే కూడా లాభాలబాటలో పయనిస్తున్న బొగ్గుగనులలోని జీత భత్యాలను ప్రామాణికంగా తీసుకొని ముందుకు సాగకపోతేసంస్థకే నష్టం వస్తుంది. కాబట్టి లాభాల మొత్తాన్ని కార్మికులు పంచుకోవడానికి వీలుపడదు. వచ్చే లాభాలలో పెరుగుతున్న వేతనాల కొరకు 20 శాతం ఖర్చును పెట్టాల్సివస్తుంది.

కార్మికుడు చనిపోతే డిపెండెంట్లకు నెలసరి 3000 రూ॥ భృతితో పాటు స్వయం ఉపాధి పథకాలలో శిక్షణ ఇప్పించడం, ఉపాధి ఏర్పాటుకై

బ్యాంకుల ద్వారా ఋణ సదుపాయాన్ని కల్పించి సింగరేణి సంస్థ పూచికత్తుగా ఉండి సహాయ సహకారాలు అందచేయడం ఒక గుణాత్మక పరిణామం.

ఇంకా జీత భత్యాల చెల్లింపు ఓటీలు, బోనస్, ఎల్.టి.సి., ట్రాన్స్‌ఫర్, ప్రమోషను, ఇంక్రిమెంట్లు సీనియారిటీ, పని పంపకం, పని గంటలు, పని భారం, వృత్తిలో శిక్షణ, పదవీ విరమణ చెల్లింపులకు సంబంధించిన విషయాల్లో కార్మికులు ఏవైనా అసంతృప్తికి లోనైతే 'గ్రీవెన్సెస్ సేల్'కి తెలియచేసి పరిష్కరించుకోవచ్చు. లేదా అవసరమైతే లేబర్ కోర్టు ఉండనే ఉంది. ఈ విషయాలలో సమ్మె చేయాలనుకోవడం అంతిమ ఆయుధంగా మాత్రమే ఉండాలి. కాని చిన్న చిన్న విషయాలకై చీటికి-మాటికి సమ్మె చేయాలనుకుంటే ఎవరు కూర్చున్న కొమ్మను వారే నరుకుకోవడం వంటిదవుతుంది.

1999-2000 సంవత్సరంలో లాభాలలో 10 శాతం కార్మిక శక్తికి కానుకగా ఇచ్చి 2000-2001 లాభాలలో 10-12 శాతం ప్రత్యేక ప్రోత్సాహపు చెల్లింపులను సింగరేణి సంస్థ చేసింది.

అయితే కార్మికులకు జీత భత్యాల పెంపుదల గాని, అదనపు అలవెన్సులు ఇవ్వడానికి గాని సంస్థ యొక్క ఆర్థిక సామర్థ్యాన్ని ఆలోచించాల్సిన అవసరం ఏర్పడుతుంది. బొగ్గు అమ్మకపు ధర, ఉత్పత్తి, లాభాలు, నష్టాలు, సిబ్బంది సంఖ్య, మరియు దిగుమతుల సామర్థ్యాన్ని బట్టి మాత్రమే సంస్థలో జీతభత్యాల చెల్లింపు జరుగుతుందనేది కూడా దృష్టిలో పెట్టుకోవాలి. కాని కార్మికులు జీతాలు బాగా పెంచితే ఉత్పత్తి పెరగగలిగి కార్మికులు పని సామర్థ్యం పెరుగుతుందని, తద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గితే సంస్థకు జీతాలు ఇవ్వగల సామర్థ్యం పెరుగుతుందని అనుకోవడం సాపేక్షతా ప్రమాణాలననుసరించి పరిష్కరించబడే విషయంగా భావించడం జరుగుతుంది.

ఈ విషయాలన్నీ వేజ్‌బోర్డులో మెంబర్లుగా ఉన్న కార్మిక సంఘాలు, యాజమాన్యపు ప్రతినిధులు కలిసికట్టుగా కూలంకషంగా పరిశీలిస్తారనే అవగాహన కార్మికులలో కలగాలి. అయితే సంస్థ యొక్క నష్టాలకు కారణంగా పరికరాల కొనుగోళ్లలో అధికారుల అవినీతి హస్తాలు ఉండటమేనని కార్మికులు ఆరోపించుతారు. కాబట్టి ఆయా విషయాలలో యాజమాన్యం తగిన చర్యలు తీసుకుంటూ పారదర్శకతను ప్రదర్శించగలిగి కార్మికులలో నమ్మకాన్ని కల్గించాల్సిన బాధ్యత యాజమాన్యానికి ఉంది. ఉత్పత్తి లెక్కలు లాభ నష్టాల బేరీజుతో బొగ్గు ధరలను పెంచితే తత్ఫలితంగా ప్రపంచంలో మార్కెట్టును పోగొట్టుకునే

పరిస్థితులను కూడా కార్మికులకు సంస్థ తెలియచేయడం వలన కార్మికులలో అవగాహన పెరిగే అవకాశం ఉందనీ సింగరేణి యాజమాన్యం ఆ మార్గాన్ని అనుసరిస్తోందని సంస్థ ఎం.డి.గారి లేఖలవల్ల తెలుస్తోంది. కార్మికులు కూడా జీతభత్యాల స్టాండర్డైజేషన్ దిశగా కూడా ఆలోచించి ఒకేరకమైన పనికి ఇతర సంస్థలు ఇస్తున్న జీతభత్యాలతో పోల్చి చూసుకోవాలి. ఆయా విషయాలను కార్మికులందరికీ అర్థమయ్యే విధంగా చర్యలు చేపట్టగలగాలి. ఈ విషయాలలో యూనియన్ల సహకారం ఎంతో అవసరం.

1976 నాటి బోనస్ చట్టం ప్రకారం లాభాలు లేదా ఉత్పాదకత మీద 8.33 శాతం బోనస్ చెల్లింపు ఉంటుంది. కాబట్టి కార్మికులు ఉత్పత్తికై తమ ఉత్పాదకతా సామర్థ్యాన్ని పెంచుకోగలిగితే లాభాలు పెరగడంతో పాటు బోనస్ పెంపుదల కూడా ఉంటుందని ఆలోచించాలి. కార్మికులకు బోనస్ చెల్లించాలంటే వారు నాగాలు లేని నిర్దిష్ట పని దినాలను తప్పనిసరిగా చేసి ఉండాలి.

సింగరేణి సంస్థ లాభాలలో వాటాగా కార్మికులకు 10% చెల్లింపులు చేస్తూ అటు పారిశ్రామికవేత్తలకే కాక ఇటు కార్మికులలో కూడా సంస్థ యొక్క ఉత్పత్తితో తమ ఉనికికి సంబంధం ఉన్నదనే భావనను పెంచడంతోపాటు సమష్టి కృషి ఫలితం అనే భావనలను అభివృద్ధి చేయడం ఒక గుణాత్మక పరిణామం. దీనివల్ల ఉత్పత్తి పెరిగి పారిశ్రామిక శాంతి ఏర్పడగలదని నిపుణుల అంచనా, అంతే గాక ఉత్పత్తి వ్యయంలో పొదుపు పాటించగలిగేదిగా కూడా ఉంటుంది. దీనివల్ల కార్మికుల హక్కులతో పాటు వారి సహ భాగస్వామ్యపు బాధ్యత పెరుగుతుందని పారిశ్రామికవేత్తలు గుర్తించాలి. కార్మికులు కూడా అవగాహన చేసుకోవాలి. అంతేగాక ఈ లాభాలవాటా సంస్థ యొక్క యాజమాన్యపు నిర్వహణలో కార్మిక నియంత్రణ రూపంలో కూడా ఉంటుంది. 1948లో వేసిన నిపుణుల కమిటి తన నివేదికలో కార్మికులు సమ్మెలు ఎక్కువగా చేసిన సంవత్సరంలో లాభాల వాటాను నిలుపుదల చేయవచ్చని కూడా సూచించిందని కార్మికులు గుర్తుఉంచుకోవాలి. ఫెయిర్ వేజెస్ ఇస్తే కార్మికులకు సంతృప్తికరంగా ఉంటుంది. కాని, వానిని నిర్ణయించాలంటే ఉత్పత్తి, అదే పనికి ఇతర పరిశ్రమలలో నిర్ణయించిన జీత భత్యాలు, జాతీయాదాయం, దేశ ఆర్థిక వ్యవస్థలో సంస్థకున్న స్థానాన్ని బట్టి నిర్ణయించడం జరుగుతుంది. కాబట్టి ఈ విషయమై కార్మికులను అప్పుల బారినుండి, ఇతర స్కీముల నుండి రక్షించే ఉద్దేశ్యంతో ఇన్సెంటివ్ బోనస్‌ను సర్టిఫికేట్ల రూపంలో ఇవ్వాలనుకున్నారు. గాని పిల్లల

చదువులకు ఫీజులు కట్టాలంటు కార్మికులు డబ్బు రూపంలోనే ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం కుటుంబంలో పొదుపు రూపంలో ఉండి కుటుంబ సంక్షేమానికి ఉంటుందనీ, డబ్బు రూపంలో ఇస్తే భర్త తాగుడుకు ఖర్చు పెడతాడని భావించిన కార్మిక కుటుంబ స్త్రీలు ఈక్విటీ బాండులని ఇవ్వడానికి సంతోషాన్ని వ్యక్తం చేయగలిగినా దాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించి పట్టుబట్టేసరికి ఇన్సెంటివ్ బోనస్‌ను డబ్బు రూపంలో ఇవ్వాల్సివచ్చింది. ఎందుకుంటే కార్మిక సంఘాలకు దానితో కొంతశాతం డబ్బు రూపంలో ముడుతుంది. లాభాలబోనస్‌ను యాజమాన్యం కూడా సింగరేణి బాండులను పెట్టి ఆదాయపన్ను రాయితీలను కల్పించగలిగితే అటు ప్రభుత్వం దృష్టిలో భాధ్యతా యుతంగా కార్మికుడు నిలవటమేకాక, కంపెనీ పెట్టుబడులలో తమ భాగస్వామ్యం ఉందనే స్పృహ కలిగి లాభాలకై పాటు పడటానికి వీలుంటుంది. ప్రపంచీకరణ నేపద్యంలో అంతర్గత నిదుల అభివృద్ధికై అవకాశం ఏర్పడి మరిన్ని కొత్త ప్రాజెక్టులకు కూడా అభివృద్ధి చేయగల అవకాశం సంస్థకు ఏర్పడుతుంది. ఉపాది అవకాశాలు పెరుగుతూ ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగి దేశాభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుంది.

కార్మికులు కూడా యాజమాన్యం చేసే ప్రతి ఒక్క చర్యను కార్మిక వ్యతిరేకమనే ఆలోచనతో ఉండకూడదు. ఇన్సెంటివ్ బోనస్ వచ్చిన రోజులలో మద్యం బాగా తాగి చనిపోయిన కార్మికుల సంగతి పత్రికాముఖంగా రావడం సింగరేణి కార్మికులకు ఇచ్చిన జీత భత్యాల విలువలు తారుమారు అయినట్లు భావించక తప్పదు.

ఆర్థిక మోసాలను రక్షించాలనీ, పొదుపు చేయగలుగుతారనీ ఆశించి బ్యాంకుల ద్వారా జీతాలు ఇవ్వాలనుకోవడం, కార్మికుల వ్యక్తిగత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం చర్యలు చేపట్టినపుడు కార్మిక సంఘాల సహకారం ప్రోత్సాహం ఉంటే బాగుంటుంది. తాగుతున్న కార్మికుల గురించి వారు చేస్తున్న గని పని పరిస్థితుల కారణమనే ఒక్క సానుభూతిని చూపడమే గాక కార్మికులు త్రాగకుండా సేదతీరడానికి ప్రత్యామ్నాయ వనరులను పరిశీలించాల్సిన బాధ్యత తోటి కార్మికులకు, కార్మిక సంఘాలకు ఉందనేది మరచిపోవద్దు.

4.6 వృత్తి రక్షణ - జీవిత భద్రత :

భూగర్భాన వెలుతురు లేని పని ప్రదేశంలో భరించరాని వేడితో రక్త మాంసాలు కుతకుత ఉడికిపోతున్నా, శరీరాల నుండి జారిపడే చెమట బిందువులు కారుతుంటే రెక్కలు ముక్కలు చేసుకుని మృత్యువు కోరల్లో బొగ్గు తిని, బొగ్గు విసర్జిస్తూ తమ రక్త మాంసాల్ని టన్నుల కొద్ది బొగ్గు రూపేణా టబ్బులు నింపుతున్నామనే భావనలతో వున్న కార్మికులు తాము బండ క్రింద చచ్చిపోతే తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు కుమిలి కుమిలి ఏడవడం వంటి పరిమాణాలు జరగకుండా కార్మికులు తమకు వృత్తిలో రక్షణ ఉండాలనీ, జీవితానికి భద్రత ఉండాలి అని ఆశిస్తూ గని ప్రమాదాలను విశ్లేషణకు పెట్టి కారణాలను బహిరంగ పరచిన కథలు ఉన్నాయి.

'ప్రమాదం' కథలో ఫైవ్ ఇంక్లైన్‌లో మరో గంటలో షిఫ్ట్ అయిపోతుందనగా పదునాల్గవ డిప్, పెద్దినిమిదవ లెవెల్ రైజ్‌లో రూపు కూలిపోయి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పని పరిస్థితుల గురించి పై అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని బాధపడ్డారు. వరుస వరుసగా అంతకు ముందటి నెలల్లోనే మూడవ ఇంక్లైన్‌లో నలుగురు కార్మికులు చనిపోవడంతో ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాల మీద ఉండడంలేదని, టన్ను బొగ్గు కంటే కార్మికుల ప్రాణమే చులకనైపోయిందని భావించారు.

ప్రమాదాల నుండి శవాలను పైకి తీసినా ప్రమాదాన్ని చూసిన కార్మికులు రెండు రోజుల వరకు మామూలు మనుషులు కాలేకపోవడంగా కథాభాగం అర్థం అవుతుంది. నిత్యం జరిగే ప్రమాదాల మూలకంగా జరిగే చావుల గురించి విని విని జనం మొద్దు బారిపోయారనీ, రోడ్డుమీద లేచే దుమ్ములాగా ఈ చావు వంటి ప్రమాదం కూడా గని పనిలో సహజం అయిపోయిందని భావిస్తారు.

పెండ్లి కథలో బండకూలిన ప్రమాదంలో వీరయ్యకి రెండు కాళ్లు చితికిపోవడంతో అతని భార్య కుంటివాడిని వదిలి వెళ్లిపోవడం చేత అతడు పిచ్చివాడిగా మారిపోతాడు. ఇక్కడ గని ప్రమాదం కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపించగలుగుతుందని అర్థం అవుతుంది.

'రాజీ' కథలో గులాయిలో బొగ్గు త్రవ్వే చోట లాంగ్‌బార్ ప్రమాద స్థితిలో ఉన్నదనీ మూసివేసే స్థితిలో ఉన్నదని మూడో నెంబరు గులాయి

కూలడానికి సిద్ధంగా ఉన్నదని చెప్పినా పని చేయమనేసరికి కార్మికులకు అసహనం ఏర్పడుతుంది. ఘర్షణ పడ్డా కూడా ఓవర్‌మ్యాన్ ఒప్పుకోక కమాన్ కర్రతో అక్కడక్కడ పొడిచి బొగ్గు తీయమని ముఖద్దామ్‌కు పురమాయించేసరికి కార్మికుడైన సాయిలు చెమ్మాస్‌తో బొగ్గు తీసేసరికి పెళ్ల కూలిపడి అతడు మరణిస్తాడు. అతనితోపాటు అక్కడ ఉన్న పైలు (జంట కార్మికుడు) బొంద్యాలుకు కూడా కాళ్లు విరుగుతాయి. అన్ని భూగర్భపు పొరల్లో గులాయిల్లో ఒకరకమైన అంచనా ఒకటిగా ఉంటే కూలడం జరుగుతున్నదని ప్రమాదానికి కారణంగా కార్మికులు ఊహించారు. ఆ సందర్భంలో దుర్గయ్య అనే కార్మికుడు తోటి కార్మికులకు కొత్తగూడెంలో గోఫ్ కూలి ముగ్గురో నలుగురో బండకిందనే చిక్కుకుపోయి చచ్చిపోయిన విషయాన్ని గుర్తు చేస్తూ బొగ్గు పొరల్లో అధికార్లు సేఫ్టీ గురించి పట్టించుకోలేదనీ బాధపడ్డాడు.

'బొగ్గు పొరల్లో' అనే కథలో లాడీసోళ్ల దగ్గర సేఫ్టీ మొదట అని, ఆఫీసులో అవుట్‌పుట్ ఫస్టు అంటారని అధికారుల గురించి కార్మికులు భావిస్తారు. గర్భిణిగా ఉన్న భార్య కలిగిన ఎల్లారెడ్డి అనే కార్మికుడితో పాటు నెల రోజుల క్రితం పెళ్లి అయిన లింగయ్యలు జంటగా పనిచేస్తున్న సమయంలో టూసీము పిఫ్టీన్ డీబులో మూడురోజుల నుండి గోఫ్ చప్పుడు వినిపిస్తోందనీ, సపోర్టులు లేకపోవడంతో పాటు భయపడడం, అనుభవం లేని వాళ్లని డీపిల్లరింగ్ చేయమని అడగడంతో వారు పనిచేస్తూన్నా కూడా మాటిమాటికి భయపడుతూ జంక్షనుకు పరుగెత్తడం వంటివి జరుగుతాయి. కాని ఇవన్నీ పట్టించుకోకుండా అండర్ మేనేజర్ ఫిల్లింగ్ లేటవుతోందని, ఉత్పత్తిని చూపాలనే ధ్యేయంగా మాట్లాడడం, సూపర్‌వైజరీ స్టాఫ్ అయిన ఓవర్‌మ్యాన్ శంకరయ్య కూడా ప్రమాద పరిస్థితుల్లోనే డిఫిల్లరింగ్ పని చేయమని అనేసరికి ప్రమాదం జరిగి, చివరకు ఎల్లారెడ్డి, లింగయ్య అనే కార్మికుల మరణానికి దారితీసిన విషయం స్పష్టమవుతుంది. ఈరన్న ఫోర్తు సీములో రెండు తట్టలు ఎత్తేసరికి ఆ పొగ పడక ఫేసుల్లోనే జారిపడ్డాడని అర్థం అవుతోంది. కొంతమంది గోఫ్ చప్పుడుకు అదిరి పరిగెత్తుతూ పొరల్లోనే జారిపడి కాళ్లకు గాయాలయిన వారుగా కూడా అర్థం అవుతారు. 30 ఏండ్ల నుండి గనిలో ప్రమాదాలు జరుగుతున్నా ఆఫీసర్లు పట్టించుకోలేదని బాధపడ్డారు. తమ శ్రమను దోపిడీ చేస్తున్నారనీ దోపిడీ ప్రభుత్వం ఉన్నంత వరకు తమకు రక్షణ లేదని బాధపడ్డారు.

'సమ్మె' కథలో వెంకటయ్య కాలుమీద బొగ్గు పెళ్ల పడి వాని కాలు చితలు చితలు అయింది. అయినా డాక్టరు మూడు రోజులకే ఫిట్ ఇచ్చేసరికి

కోపం వచ్చి వెంకటయ్య అడిగినందుకు అతనిని పోలీసులకు పట్టించడం, తదనంతర పరిణామంగా కార్మికులందరూ కలిసి సమ్మె చేయడం అనేది సంస్థకే పెద్ద ప్రమాదాన్ని తెచ్చిపెట్టినదని గ్రహించాలి.

'బండ కింద బతుకులు' అనే స్వగతంలో ముఖ్యమంత్రి వచ్చి ఉత్పత్తిని పెంచిన వాళ్లకు ప్రోత్సాహక బహుమతులిచ్చాడు గాని, బండ క్రింద ప్రమాదంలో చనిపోయిన వాళ్లను తలచుకోలేదని బాధపడతాడు. పని చేసేచోట రక్షణ సదుపాయాల విషయమై ఆలోచించలేదని బాధపడతాడు. 'పేనుకు పెత్తనం ఇస్తే' అనే శీర్షిక క్రింద పని చేసే చోట పని పరిస్థితులు బాగా లేవని చెబితే సేఫ్టీ ఆఫీసరు పట్టించుకోలేదని బాధపపడతాడు.

సేఫ్టీ క్యాపులు, సేఫ్టీ ల్యాంపులు, పనిముట్లు సరిగా ఇవ్వాలని తద్వారా ప్రమాదాల గాయాలను తగ్గించవచ్చని కార్మికులు భావిస్తారు. డీ ఫిల్లరింగ్ కార్మికులు చేసే పని కంటే కూడా వారి బతుకు రక్షణ గురించే ఎక్కువగా ఆలోచించాలని సూచించడం జరిగింది. సంస్థలో జరిగే ప్రమాదాలన్నీ ఎక్కువగా ఈ కోవకు చెందినవిగా భావించడం స్థానికుల అభిప్రాయాలలో అర్థమవుతుంది.

'ప్రమాదం' కథలో కంపెనీ చైర్మెన్ మరియు ఎం.డి. మాట్లాడుతూ ప్రమాదాలతో కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టుకుని తీసుకునే ఉత్పత్తి అవసరం లేదని చెప్పడం జరిగింది. కాని కొత్త డైరెక్టరు వచ్చిన తరువాత ప్రమాదాలు బాగా పెరిగినా, మేనేజ్‌మెంట్ బొగ్గుబావుల్లో ప్రమాదాలు చాలా సహజమనీ, ప్రమాదాలు ఒక్క సింగరేణిలోనే జరగడం లేదనీ, ఇతర పరిశ్రమల్లోనూ ఉన్నాయనే ప్రచారంతో పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తోందని కార్మికులు ఆందోళన చెందడం కనబడుతుంది. ఇటువంటి ప్రకటనలు చేయడంలో స్వార్థపర రాజకీయ శక్తుల ఉంటారనీ, కార్మికులు భావించి నిజానిజాలను సరిగ్గా అవగాహన చేసుకోవాలి.

సాహిత్యంలో వర్ణించబడ్డ ప్రమాదాలు కదా అని సరిపెట్టుకోవడానికి వీల్లేకుండా ఈ మధ్య వాస్తవంగా జరిగిన ప్రమాదాల్ని ఈనాడు, వార్త, చర్చ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ వంటి పత్రికలలోనూ, గోదావరిఖనిలో సత్యనారాయణ అనే కార్మికుడు డోజర్‌తో సహా గోఫ్ కిందకు వెళ్ళిపోవడం, శరీరాన్ని కూడా తీయలేని పరిస్థితి రావడం వంటి సంఘటనలు కార్మికులను చాలా బాధకు గురిచేసిన విషయంగా దర్శిని పత్రికలో తట్టా-చెమ్మాస్ శీర్షిక క్రింద వ్యక్తమయింది.

బెల్లంపల్లి, మంద్రమర్రి రీజియన్లలో వరుస వరుసగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం మల్టీ డిపార్ట్మెంట్ డిసిప్లిన్ కమిటి తరుపున అధికారులను కార్మికులను పంపింది. తనిఖీలు చేయించడం జరిగింది. రక్షణ ప్రధానం అని రక్షణ వారోత్సవాలను జరపడం కమ్యూనికేషన్ సెల్ తరుపున, సింగరేణి తరంగాల వంటి టి.వి. ఫిల్ముల ద్వారా రక్షణ ప్రాధాన్యతను గురించి, రక్షణ విషయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తెలియచేయడం జరుగుతోంది. సింగరేణి సంస్థలోని హెచ్.ఆర్.డి. విభాగం బొగ్గు గనులు నిబంధనలు అనే పుస్తకాన్ని తెలుగు భాషలోకి తేవడం చేత కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేయడంతో వాటిని సూపర్వైజరీ సిబ్బందితో పాటు, కార్మికులు కూడా అర్థం చేసుకునే విధంగా ఉండడం చేత మానవ తప్పిదాల వంటి గనుల ప్రమాదాలను నివారించే దిశగా యాజమాన్యం దృష్టిని సారించిందనడానికి ఉదాహరణగా చెప్పుకోవడమే గాక, అభినందించదగ్గ విషయంగా భావించవచ్చు. ముఖ్యంగా నిబంధనలు తెలిపే పుస్తకాలు కార్మికులు చదువుకోతగ్గ తెలుగుభాషలో ఉండడమే అవగాహనకు సోపానమయింది. సమస్య పరిష్కారానికి సుగమ మైన మార్గం ఏర్పడిందని భావించారు.

ఇదివరకు ప్రమాదాలలో మరణించినా అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా కార్మికుడు దిగిపోతే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చేవారు. కార్మికుల భార్యలకు, వారి అక్షరాస్యతకు చదువుకు తగ్గట్టుగా ఆయాల వంటి అటెండర్ల వంటి ఉద్యోగాలు ఇచ్చేవారు. కాని ఇప్పుడు ఉద్యోగం వద్దంటే కొంత పెన్షను కింద మంత్లీ మానిటరీ బెనిఫిట్ సదుపాయాన్ని కల్గించారు. హక్కులే ప్రథమం అనే పాటలో వారి ప్రాణాన్ని లెక్క చేయడంలేదనీ ప్రమాదాలు జరిగేచోట పని చెప్పి శవాలుగా మార్చేస్తారనీ, శరీరానికి ధర కడుతారనీ భావించడం జరిగింది.

ప్రమాదం, రాజీ, కథలో సింగరేణి మండుతోంది, నల్ల వజ్రం నవలల్లో, గోఫ్ బండ కూలడం వంటి ప్రమాదాల గురించి చెప్పినా అధికార్లు పట్టించుకోవ్వలేదనీ, బాధపడతారు. కార్మికులు తమకు వృత్తిలో రక్షణ ఉండాలనీ, మేనేజ్మెంట్కు ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాల మీద లేదని భావిస్తారు. సింగరేణి మండుతోంది అనే నవలలో సర్దార్, ముఖద్దామ్ల యొక్క తప్పనిసరి తృప్తిని గలిగించిన గోఫ్ చెకింగ్ ప్రమాదాలకు దారి తీస్తోందని, ఓవర్మాన్లు మేనేజర్లు చెకింగ్ చేయరని, పట్టించుకోరని, సేఫ్టీ లాంపులు, సేఫ్టీ క్యాప్లు, బూట్లు తప్పనిసరిగా ఇవ్వరనీ భావించడం జరిగింది. డీ ఫిల్లరింగ్ వర్కుకు

అనుభవజ్ఞులను పంపించాలని లేకపోతే ప్రమాదాలు జరుగుతాయని 'బొగ్గు పొరల్లో' అనే కథలో వ్యక్తమవుతుంది.

'సింగరేణి మండుతోంది' అనే నవలలో డీ ఫిల్లరింగ్ పని కంటే బతుకు రక్షణ గురించే ఎక్కువగా ఆలోచించాలంటారు. సింగరేణి పాటలు మొదలైన వాటిలో సేఫ్టీ చర్యలు సరిగా లేదని కార్మికులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. యాజమాన్యం సేఫ్టీ వీకులు పెట్టి మైకులో అరుస్తారు కాని నిజంగా బండ కింద పట్టించుకోవాల్సిన రక్షణ చర్యలు చేపట్టడం లేదని భావిస్తారు. కార్మికులకు కావలసినవి డబ్బుకంటే ఖనిజం కంటే కూడా రక్షణ చర్యలు తీసుకునే వ్యవస్థ ఉండాలనీ భావించడం జరిగింది. గాలి నీరు దొరకక జబ్బులు వెంటబెట్టుకుని అనారోగ్యం పాలవుతున్నారనీ రెండు టబ్బులు నింపే సమయంలో ఆరు టబ్బులు నింపే శక్తిని కోల్పోతున్నారని అధికార్లు భావించాలనీ సేఫ్టీ నిబంధనలు పాటించకపోతే దొరలను ప్రశ్నించడం కార్మికుల విధ్యుక్త ధర్మమని చెప్పడం జరిగింది. బొగ్గు బావిలో పనిచేస్తున్న కార్మికుడికి లేని విలువ బొగ్గు బాయిలో పని చేస్తూ చచ్చిపోయినట్లయితే ఆ కార్మికుడికి విలువ ఉంటుందని, నష్ట పరిహారం వేలల్లో, లక్షల్లో ఉంటుందనీ చెబుతూ దానికి బదులుగా రక్షణ వ్యయం పెంచాలని సూచించడం జరిగింది.

సింగరేణి సాహిత్యం ప్రారంభం నుండి అంటే 1978 నుండి నేటి వరకు కూడా రక్షణ విషయాలపైన ఆందోళన చెందటం అర్థమవుతుంది. రక్షణ చర్యల విషయమై సంస్థాగత పట్టికలు పరిశీలించగా 1976లో 34 మంది, 1977లో 30 మంది చనిపోవడం, 1976లో 534 మంది, 1977లో 797 మంది తీవ్రంగా గాయపడడం గురించాల్సిన విషయమే. అందుకే ఆ తర్వాత వచ్చిన సాహిత్యంలో భాగంగా కార్మికుని యొక్క వృత్తికి సంబంధించిన జీవిత రక్షణను యాజమాన్యం పట్టించుకోటంలేదనే భావనతోనే కథలు వచ్చాయి. అలాగే 1978 నుండి 1986 వరకు ప్రమాదాలు ఎక్కువగా జరిగాయని రికార్డులు తెలుపుతున్నాయి. అటు బండ కూలి చనిపోయిన వారి సంఖ్యతో పాటు తీవ్రంగా గాయపడిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. యాజమాన్యం దృష్టిలో ప్రమాదాలు భూగర్భపు పొరల అమరిక వల్ల వచ్చిన ప్రమాదాలుగా భావించడం జరుగుతుంది. కాని ప్రమాదాల గణాంకాల పట్టిక చూస్తే మొత్తం మీద 1976 నుండి 1986 వరకు ప్రమాదాలు ఎక్కువగా జరుగడం ఆ తరువాత 1993 లో కొద్దిగా తగ్గుముఖం పట్టినా కూడా 1994లో అత్యధికంగా మరణాలు

రికార్డు కావడం జరిగింది. 1996, 1997, 1998, 2000 లో మరణాల సంఖ్య ఉత్పత్తి యొక్క నిష్పత్తిని బట్టి చూస్తే తక్కువనే చెప్పుకోవచ్చు. 1996 నుండి 2002 వరకు తీవ్రమైన గాయాల సంఖ్య కూడ తగ్గినట్లుగా సంస్థాగత పట్టిక చూపిస్తోంది. దాన్నిబట్టి కేవలం ప్రకృతి గత భూగర్భ పరిస్థితుల వల్లే ప్రమాదాలు జరుగవనీ, తీసుకునే రక్షణ చర్యల వల్ల కూడా ప్రమాదాలు తగ్గించవచ్చనీ, 1986 తర్వాత రక్షణ చర్యలు బాగా తీసుకోవడం చేతనే తీవ్రంగా గాయపడ్డ వారి సంఖ్య గణనీయంగా తగ్గిందనీ అర్థం అవుతోంది. కార్మికులు కూడా గనిలో ఉద్యోగపు స్వభావాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఒకవేళ పై అధికారులు పట్టించుకోకపోతే పిట్స్ సేఫ్టీ కమిటీకి విన్నవించుకొని రక్షణ చర్యల అవసరాన్ని పెంచుకోవటం చేయాలి. గనుల విస్తరణ వేగం పుంజుకున్న దశలోనూ, 1970 నుండి జాతీయ బొగ్గు విధానం అమలువల్లనో చాలా మంది గనులలో చేరడం, ఉత్పత్తి పెరగడంతో పాటు ప్రమాదాలు కూడా అదే నిష్పత్తిలో జరిగినట్లు సర్వేలోను, సంస్థాగత ప్రమాదాల పట్టిక వల్లనూ అర్థం అవుతోంది. అందుకే సింగరేణి మండుతోంది అనే నవలలో పని ప్రదేశాలలో ఉత్పత్తి ఫస్ట్ అని, ఆఫీసులో రక్షణ ఫస్టు అని అంటారని వ్యక్తం చేయడం జరిగింది. ఏది ఏమైనా ప్రకృతి సహజమైన నేల పొరల ఆధారంగా అనుకోని పరిణామాలలో ప్రమాదాలు జరగడం సహజమే అయినా, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడానికి తప్పనిసరి రక్షణ చర్యలతో పాటు, యాజమాన్యం పారిశ్రామిక మనస్తత్వాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ పని పరిస్థితులలో ఆ పని ప్రదేశంలో కార్మికులు పని చేయడానికి మొరాయించిన వారి మనస్తత్వాన్ని దానికి వెనకున్న జీవిత భద్రతకు సంబంధాలను వినియోగించుకొంటూ రక్షణ చర్యలు చేపట్టిన విధానాన్ని వారికి బాగా తెలియచేసి వాళ్లలో ఆత్మస్థైర్యాన్ని రక్షణ పట్ల అవగాహనను కలిగించగలగాలి. అయితే 1992లో మొదటిసారి బి.ఐ.ఎఫ్.ఆర్.లోకి వెళ్లినపుడు ఉత్పత్తిని పెంచడంలో ప్రమాదాలు కూడా బాగా పెరిగాయి. అయితే 1995 తర్వాత యాజమాన్యం రక్షణ చర్యలు ఎక్కువగా చేపట్టడం చేతనే ప్రమాదాలు తక్కువగా ఉండి ఉత్పత్తిని పెంచగలిగినట్లు సంస్థాగత పట్టిక వల్ల అర్థం అవుతోంది. ఏది ఏమైనా ఒక్క 1994లో జరిగిన ప్రమాదాలు మినహాయిస్తే 1986 తర్వాత జరిగిన ప్రమాదాల సంఖ్య తక్కువే. మిగిలిన పరిశ్రమల కంటే సింగరేణిలో 1995 వరకు ఉత్పత్తి భూగర్భ గనులలో ఎక్కువగా జరిగింది. 2000 నాటికి 65% బొగ్గును ఓపెన్‌కాస్టులో సాంకేతికత గల యంత్రాలతో

ఎక్కువగా బొగ్గును తీయగలగడం వల్ల ప్రమాదాలు తక్కువ కాగలిగాయి. 1992 నుండి 2001 వరకు, మహానది కోల్‌ఫీల్డ్‌లో ఒక్క మరణం మాత్రమే జరిగిందంటే అక్కడ రక్షణ చర్యలు బాగున్నాయని అర్థం అయినా దానితోపాటు వారు 95% ఓపెన్‌కాస్టులందు బొగ్గు ఉత్పత్తి చేస్తారని కూడా గ్రహింపుకు రాగలిగింది. ఎక్కువగా భూగర్భ గనుల్లో మానవులు పనిముట్లుగా ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగి యంత్రాల వాడుక వల్ల తగ్గగలిగితే ప్రమాదాలను మానవ తప్పిదాలుగా భావించవచ్చు. కార్మికులైనా యంత్రాల వాడకం అయినా కూడా భూగర్భ గనిలో పని ప్రదేశాలు ప్రమాదభరితాలే అని అనుకోక తప్పదు.

ప్రమాదరహితమైన ఉత్పత్తి చేసిన కార్మికులకు యాజమాన్యం ఉత్తమ కార్మికులుగా వారిని సన్మానించడం, 'దారులు' కథలో కనబడుతోంది. రక్షణ వారోత్సవాలలో యాజమాన్యం రక్షణ పాటించిన గనులకు బహుమతి ప్రధానం చేయడం చేస్తోంది. 2001లో ఫాటల్ యాక్సిడెంట్స్ 25గాను, సీరియస్‌గా గాయపడినవారు 115 మందిగా రికార్డు అయింది. అయితే ఈ మధ్య రక్షణ ఆడిట్ సెల్స్‌ని ఏర్పాటు చేయడం, మైనింగ్ సర్దారుకు సూపర్‌వైజరీ స్టాఫ్‌కు రక్షణకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలని ఏర్పాటు చేయడం పరిశీలించగా సింగరేణి సంస్థ ప్రమాద రహిత ఉత్పత్తిని ఆకాంక్షిస్తున్నట్లు అర్థం అవుతోంది. అంతేగాక రక్షణ విషయంలో జాగ్రత్త వహించని సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం అభినందించతగ్గ విషయం. హాలేజ్ రోడ్డు వే ద్వారా వెళ్లే కార్మికులను నియంత్రించడం కూడా జరుగుతోంది. ముందుగా కార్మికులు వారి రక్షణ విషయంలో వారే ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాలి.

రక్షణ విషయాలలో అధికార్ల నిర్లక్ష్యం ఎంతమాత్రం ఉండకూడదు. కార్మికులు గోఫ్ గురించి భయపడ్డప్పుడు ఆ ప్రాంతంలో పని ఆపించి మరి ఎక్కడైనా పని చూపించగలగాలి గాని, మస్టరు ఇవ్వాల్సి వస్తుంది కదా అని మనిషి ప్రాణాలను పట్టించుకోకపోవడం అభిశంసనీయం. సూపర్‌వైజరీ సిబ్బంది అప్రమత్తతో ఉండి గోఫ్‌ని బాగా చెక్ చేసి, పై అధికారులకు ఆ విషయాన్ని తెలియచేయాలి. అయితే వీలయినంత వరకు సంస్థలోని రక్షణ సంబంధాల విషయమై అధికార్లకు ప్రభుత్వ శాఖపరమైన శిక్షణ, అధికార్ల చెకింగ్, నిఘా కూడా అవసరం.

అధికార్లు, సూపర్‌వైజరీ సిబ్బంది కూడా 1957లో రూపొందించిన బొగ్గు గనుల నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని అమలు పరిచేవిధంగా ఉంటే

కొంతవరకు గోఫ్ ప్రమాదాలను తగ్గించవచ్చు. సీము యొక్క మందము, లోతూ, రూఫ్ స్వభావం, డిప్, పాయిల తొలగింపు, తగ్గింపు, విస్తరణ నిబంధనలలోని లెక్కల ప్రకారం చేయగలిగితే చాలా వరకు మానవ తప్పిదాల వలన జరిగే ప్రమాదాలను నివారించవచ్చు.

కార్మికులు ఒక్కొక్కప్పుడు హాలేజీ ద్వారా వెళ్లడానికి ప్రయత్నించడంతో వెడుతూ బెల్టు మీద పడిపోవడం చేత కూడా ప్రమాదాలు జరిగిన సంఘటనలు సింగరేణి చరిత్రలో ఉన్నాయి. అందుకనే కార్మికులు రక్షణపరమైన నిబంధనలను పాటించాల్సిన బాధ్యత ముందుగా వారిపైనే ఉంటుంది. క్రింద సీము కూలితే పై సీములో పనిచేస్తూ బ్లూ ప్రింట్ ప్లాన్‌ను సరిగ్గా ఫాలో కాకపోవడం చేస్తే కూడా ప్రమాదాలు జరుగుతాయి. అదేవిధంగా గనిలో గ్యాసు లీకేజి అయి చనిపోయిన వారున్నారు. కాబట్టి గ్యాస్ లీకేజీ, నీటికోత నీటి ప్రవాహాల విషయాల యందు తగిన సాంకేతిక, వైజ్ఞానికపరమైన ఉపసంహరణా కార్యక్రమాలు చేపట్టి ప్రత్యామ్నాయ మార్గాలలోను రక్షణ చర్యలు చేపట్టాలి. ఈ విషయాలలో అధికార్లు రక్షణ విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు.

కార్మికుల అనుభవాన్ని బట్టి తగిన పని ప్రదేశాలలో వారిని నియమించాలి. పని ప్రదేశాలలోని ప్రత్యేకతలను బట్టి తగిన శిక్షణను కూడా ఇవ్వాలి. పైగా కార్మికుల కుటుంబ సంక్షేమానికి సంబంధించిన వారి మానసిక స్థాయి కూడా పని ప్రదేశాలలో అజాగ్రత్తగా ఉండటంతో ప్రమాదాలకు కారణం అవుతోంది అనేది మనకు 'బొగ్గు పొరల్లో' కథల్లో స్పష్టమయింది. కాబట్టి కార్మిక కుటుంబ సంక్షేమ విషయాలలో కూడా యాజమాన్యం తగినవిధంగా చర్యలు చేపట్టాలి.

బ్యాడ్ రూఫ్ దగ్గర సరిపోయినన్ని దాట్లు అందుబాటులో ఉంటే కూడా ప్రమాదాలు నివారించబడతాయని సాహిత్యం తెలియచేస్తుంది. అన్ని విభాగాల పనితీరు బాగుండడం, చెక్క దాట్లు ఉన్నట్లు లెక్కలో వ్రాసి ఆ కలపను అధికార్ల ఇంటి ఫర్నీచర్‌కు వాడుకున్న సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికుల భావనతోను, కార్మికుల ఇంటి విస్తరణ నిర్మాణంలో కూడా దాట్లను వాడబడిన విషయం కూడా పరిశీలనలో తేలింది. ఇప్పుడు ఇనుప దాట్లను వాడడంతో ఆ సమస్య తగ్గినా పనిభారం పెరిగిందని కార్మికులు భావిస్తున్నారు. ఆ తరువాత కార్మికులకు తెలిసిన భాషలోనే అధికార్లు రక్షణ విషయాలను తెలియచేయాలి. రక్షణ విషయంలో అధికార్లు మానవ సంబంధాల దృష్ట్యాను మనస్తత్వ కోణం నుండి పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

కంపెనీ మల్టీ డిసిప్లెనరీ కమిటీలుగా, పర్యవేక్షిస్తూ, రక్షణ ఆడిట్ సెల్స్‌ని ఏర్పాటు చేస్తూ సేఫ్టీకి సంబంధించిన విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం గుణాత్మక పరిణామంగా భావించవచ్చు. అంతేకాక కంపెనీ స్థాయిలో ఏరియా స్థాయిలో, కార్మిక సంఘాలకు ప్రాధాన్యతనిస్తూ రక్షణ విభాగాలను ఏర్పరచి రక్షణ విషయంలో సూచనలు, సలహాలను తీసుకుంటూ చర్యలను చేపట్టడం మేనేజ్‌మెంట్‌కు కార్మికుల వృత్తి యందు రక్షణ విషయంలో తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలకు నిదర్శనం. 2002వ సంవత్సరంలో సింగరేణికి రక్షణ విషయంలో జాతీయ స్థాయిలో బహుమతి వచ్చింది. ఒకవేళ ప్రమాదాలు జరిగితే నష్టపరిహారం ఎక్కువగా ఉంటుంది. అందుకే సింగరేణి మండుతోంది అనే నవలలో పని స్థలంలో ఉన్న కార్మికుడి కంటే శవమైన కార్మికుడికి ఎక్కువ విలువ వుందని భావించడం జరిగింది. ఆ చెల్లింపులు సకాలంలో సక్రమంగా చెల్లించడానికి యాజమాన్యం బాధ్యత వహించడమే గాక, ఆ కార్మిక కుటుంబాలకు ఆయా విషయాలను తెలియచేయడానికి సింగరేణి సిబ్బంది మహిళా స్వచ్ఛంద సమితి 'సేవ' పేరుతో ముందుకు రావడం ముదావహం.

'నెలవు' అనే కథలో రాయలింగం గోఫ్ కూలినప్పటి నుండి ఆ శబ్దాన్ని వినడం చేత కార్మిక మరణాన్ని చూడడంచేత అతనికి మతి చలించడం స్పష్టమైనది. ఇది కథలోనే కాక సర్వేలో కూడా ఇలాంటి కేసు ఒకటి వెలుగు చూపింది. హాస్పిటల్ వైద్యంతో కూడా చికిత్సకు లొంగక ఆ కార్మిక కుటుంబం చిన్నాభిన్నం అవడంగా నెలవు కథ తెలియచేస్తుంది.

సింగరేణి తరంగాలు' అనే టెలిఫిల్మ్ రూపంలో యాజమాన్యం సింగరేణి సంస్థ అందలి సమాచార శాఖద్వారా బానూరి కృష్ణ మురళి గారి యమ కార్మిక లోకం అనే నాటకాల ప్రదర్శనల ద్వారా కూడా గని కార్మికుల రక్షణ గురించి తెలియచేసిన విషయాలు బహుళ ప్రజాదరణను పొందాయి.

కార్మికులు సేఫ్టీ గురించిన చర్యలలో భాగంగా యాజమాన్యం మైకులతో, కార్మిక వాడల్లో వృత్తి యందు రక్షణ విషయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ప్రచారం చేయడం. వాటిని ప్రయోగాత్మకంగా చూపించడం కోసం గనుల దగ్గర పని స్థలాలకు వెళ్లే ట్రావెలింగ్ రోడ్డు దగ్గర గ్యాలరీలను నిర్మించి రక్షణ శాఖాధికారుల్లోని నిపుణుల చేత, అనుభవజ్ఞులైన సూపర్‌వైజరీ సిబ్బంది చేత సపోర్టింగ్ సిస్టమ్‌ను గురించిన విషయాలను టింబర్‌మాన్‌లకు, సపోర్టుమాన్‌లకు కోల్‌ఫిల్లర్లకు, కోల్ కట్టర్స్‌లకు వివరింపచేయడం వినూత్న

పరిణామం. ఉత్పత్తి, ఉత్పాదకత కంటే కూడా రక్షణ ముఖ్యమనీ, రూఫ్‌ఫాల్స్, సైడ్ ఫాల్స్ వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టే విధంగా గ్యాలరీల ద్వారా తెలియచేయడం వల్ల కార్మికులలో రక్షణ చర్యలపట్ల పూర్తి అవగాహన ఏర్పడుతోందని యాజమాన్యం భావిస్తోంది. ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి జరిగినప్పుడు సంభవించిన ఫాటల్ (ప్రాణాంతక) ప్రమాదాలను (అంటే రూఫ్ పడి అక్కడికక్కడే చనిపోతే) తీవ్రంగా గాయపడిన వారిని పరిశీలించగలిగితే ప్రమాదాల నిష్పత్తి ఎక్కువగా ఉండక పోవచ్చు. కాని రక్షణ చర్యలు చాలా అవసరం . దానికి శిక్షణ ఇవ్వడం చాలా అవసరం.

4.7 యూనియన్లతోను, తోటి కార్మికులతోను సంబంధాలు :

పారిశ్రామిక సంబంధాలలో ట్రేడ్ యూనియన్‌లు ప్రధాన భూమికను వహిస్తాయి. సమస్యలను సామూహిక ఒడంబడిక రూపంలోకి తెచ్చి ఒత్తిడిని పెంచి కార్మికుల అభిరుచిని కాపాడుతుంటారు. ఒక్కొక్కరు ఉత్పాదకతను పెంచే ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరించడం చేస్తే మరికొంతమంది కార్మిక సంక్షేమ కార్యక్రమాలను అమలు పరచేటట్లు చూడడం చేస్తారు. ఒక్కొక్కసారి ఉత్పత్తి పంపకాలకై ట్రేడ్ యూనియన్ సామాజిక నియంత్రణ రూపంలో కూడా ఉంటుంది. అయితే ట్రేడు యూనియన్లు వారి వారి బల నిరూపణ సామర్థ్యాన్ని బట్టి శక్తియుక్తులను ప్రదర్శించి కార్మికుల కోసం యాజమాన్యానికి వ్యతిరేకంగా అధికారాన్ని కలిగియుండడం కూడా కలదు. పారిశ్రామిక సంబంధాలలో కార్మిక సంఘాలు ప్రధాన పాత్రవహిస్తాయి. ఎటువంటి ఆర్థిక ఫలాపేక్ష లేకుండా, కార్మికుల కోసం కార్మికులపై ఆధారపడి పనిచేస్తూ, వారి విధులను నిర్వహిస్తూ, యాజమాన్య విధాన నిర్ణయంలో కొన్నిసార్లు ప్రత్యక్షంగానూ, కొన్నిసార్లు పరోక్షంగానూ సంస్థ యాజమాన్యపు భాగస్వాములుగా ఉంటారు. సంస్థకు కార్మికుల వల్ల వచ్చే ఫలితాలపై కార్మిక సంఘాల ప్రభావం తప్పకుండా ఉంటుంది.

'సింగరేణి బతుకులు' అనే కథా సంపుటి యందు 'ఐక్యత-ఘర్షణ' అనే కథలోనూ, 'గుణపాఠం' అనే కథలోనూ కార్మికులకు యూనియన్ చందాలు కట్టమని చెప్పి వెళ్లిపోతారు. కార్మికులు తమ నమన్యలు తాము పరిష్కరించుకోవాలని, యూనియన్ మీద ఆధారపడకూడదని అనుకొని ఐక్యంగా పోరాడాలనుకుంటారు. 'గుణపాఠం' కథలో కార్మికులు సమైక్యంగా యాజమాన్యానికి గుణపాఠం నేర్పాలనుకుని అన్ని బావులు బంద్ పెడితే ఉత్పత్తికి

నష్టం జరుగుతుందనీ, ఆ విధంగా యాజమాన్యానికి గుణపాఠం నేర్పాలనుకుంటారు. ఈ కథలోనే గులాయి వెడల్పు లేనిచోట 8 మంది ఉండాల్సిన చోట పదిమందిని పెట్టేసరికి, చెమ్మాస్‌తో పని చెయ్యొద్దని భావిస్తూ వెంటనే సమ్మెకు దిగుతారు. నోటీసు యిచ్చి చర్చలు చేద్దామని యూనియన్ అంటే పరిష్కారం చేయకపోగా కాలహరణం అవుతుందని యూనియన్ నాయకులు యాజమాన్యంతో కుమ్మక్కు అవుతారనీ అంటారు. యూనియన్ నాయకులది పెట్టుబడి లేని వ్యాపారం అనీ చందాలు వసూలు చేయడానికి యూనియన్ ఉందనీ భావిస్తారు.

'తనకు తాకితే' అనే స్వగతంలోనూ లచ్చన్నను డిస్మిస్ చేసినందుకు కార్మికులు యూనియన్ మాటలు వినకుండా సమ్మె చేస్తారు. ఫాల్ బ్యాక్ మస్టర్ కావాలని సమ్మె చేసినపుడు లచ్చన్నకు చార్జిషీటు ఇచ్చారు.

'ఆయువు పట్టు' కథలో సింగరేణిలో 190 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ ఫిల్లర్లు 12,000 మంది ఉన్నా పర్మినెంటు చేయనందుకు బాధపడ్తారు. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం మొండి వైఖరితోనే ఉంది. ఆ సందర్భంలో కార్మికులు కంపెనీ వాళ్ళు యూనియన్ వాళ్ళు కలిసి లేబరోళ్ల ఆయువుపట్టును దొరికి పుచ్చుకున్నారని, యూనియన్ వాళ్లు కూడా అయిన దానికి కాని దానికి సమ్మెలు చేయిస్తున్నారని భావించి లేబరోళ్లు యూనియన్ వాళ్ల యొక్క, కంపెనీ వాళ్లయొక్క ఆయువును తెలుసుకొని దెబ్బ కొడితే చీటికి మాటికి సమ్మె చేయనక్కర లేదని భావిస్తారు. సమ్మె ఆఖరి ఆయుధం కావాలి గాని చిన్న చిన్న వాటికి సమ్మెలు చేయకూడదనీ ముఖ్య విషయాలలో సమ్మె చేయాలని భావిస్తారు.

'నివురు గప్పిన నిప్పు' స్వగతంలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించనిదే డ్యూటీలోకి దిగవద్దని భీష్మించుకోవడం, యూనియన్ నాయకులను ప్రశ్నించినందుకు నాయకులు పోలీస్‌లను పిలిపించి అరెస్టు చేయించినట్లు అర్థం అవుతుంది.

'సమ్మె' అనే కథలో గని ప్రమాదంలో కాలు నుజ్జయిన వెంకటేశానికి కంపెనీ డాక్టర్లు మూడో రోజే డ్యూటీకి ఫిట్ చేయడంతో వెంకటేశం తిరిగి ప్రశ్నించినందుకు పోలీసుల చేత అరెస్టు చేయించేసరికి కార్మికులు ఏకమై సమ్మె చేస్తారు. అయితే కార్మికులు చట్ట విరుద్ధమైన సమ్మె చేసినందుకు ఎనిమిది

రోజుల మస్టర్లు కోత పెట్టే అవకాశం ఉన్నందున కార్మికులు యూనియన్‌కు చెప్పుకుంటే యూనియన్ నిన్న జరిగిన సమ్మెకు తమకు సంబంధం లేదంటారు. అందుకే సమ్మె చట్టబద్దంగా చేయాలి గాని, ఒక వ్యక్తి విషయమై వెంటనే సమ్మెకు దిగితే యాజమాన్యానికి సమ్మె నివారణలో ఎక్కువ బలం ఉంటుంది.

'కొత్త ఎత్తు' కథలో ఎల్లయ్య అన్యాయాన్ని ఎదుర్కొన్నందుకు డిస్మిస్ చేసేసరికి ఉద్యోగం పోతుంది. లీడర్లు ఎవరూ తమ సమస్యలను పట్టించుకోలేదని బాధపడ్డారు. బావిలో జామ్‌ల సప్లయి లేక గనిలోపల అక్కడ యిక్కడ ఉన్నవి ఏరి తెచ్చుకుని డ్యూటీ చేయాలనుకుని వెదుకుతుందటే అధికార్లు ఆలస్యమయిందని తిడతారు. దానికి జామ్‌లు ఎందుకు సప్లై చేయలేదని చంద్రయ్య ప్రశ్నించేసరికి పోలీసులకు చెప్పి అతడ్ని అరెస్టు చేయించేసరికి కార్మికులు సమ్మె చేస్తారు. 14 రోజుల సమ్మె చేసిన తరువాత చంద్రయ్యను వదిలిపెట్టారు. ఆ తర్వాత 1981లో ఫిబ్రవరి 9 నుండి సింగరేణి కార్మికులు కొత్త చట్టానికి వ్యతిరేకంగా 56 రోజులపాటు సుదీర్ఘమైన సమ్మె చేసినా ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టి.యు.సి., సి.ఐ.టి.యు. యూనియన్లు మాత్రం సమ్మెను వ్యతిరేకించారు. ఆ వ్యతిరేకత వారిలో వారికి ఉండే పార్టీపరమైన స్పర్ధలే గాని, నిజంగా సంస్థ ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని చేసే నిర్ణయం కాకపోవడానికి వీలుంటుందని ఆలోచించాలి. కాని యిప్పుడు సమ్మె చేయమనడం కేవలం యూనియన్లు లెబరోళ్లలో పడిపోతున్న తమ పలుకుబడిని నిలబెట్టడం కోసం యూనియన్ వాళ్లు చేస్తున్న కొత్త ఎత్తు అని భావిస్తారు. యూనియన్లకు లేబరోళ్ల మీద ప్రేమ ఉంటే అక్రమంగా కార్మికులను డిస్మిస్ చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని అంటారు. కొత్త ఎమ్.డి. గారు వచ్చిన తరువాత లేబర్ సమ్మె చేయకుండా యూనియన్‌లు చేయలేనప్పుడు యూనియన్లు అడిగిన పనులను అధికారులు చేయాల్సిన అవసరంలేదని చెప్తారు. లీడర్లు మేనేజిమెంట్‌తో కలిసి చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా సమ్మె చేస్తే తుపాకులతో బెదిరించి పని చేయించాలనుకున్న కొత్త ఎత్తును ఎదుర్కోవాలనుకుంటారు. యూనియన్లు కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రాతినిధ్యం వహించే ఒక యంత్రాంగంగా ఉండాలి గానీ, తమ స్వంత ప్రయోజనాలను నెరవేర్చుకుంటూ యూనియన్ పేరుతో పనులు ఎగ్గొట్టి తిరిగితే ఆ యూనియన్ల మీద కార్మికులకు గౌరవం ఉండదనేది అర్థం చేసుకోవాలి.

పైగా సమస్యలు రాజకీయం చేయకుండా పారదర్శకతతో ఎప్పటికప్పుడు యాజమాన్యపు భావనలను కార్మికులకు తెలియచేయాలి.

'సింగరేణి మండుతోంది' నవలలో కార్మికులకు దొరలకు మీడియేటర్లు యూనియన్ నాయకులు అని భావించి కార్మికులు ఎవరికి వారే చైతన్యవంతులవుతారు. కార్మికులు చైతన్యంతో బంద్ చేస్తే అన్ని ఆగిపోతాయని, సంపద కిటుకును కార్మికులు కనిపెడితే కష్టమని, అందుకు అవసరమైతే యూనియన్ గుండాయిజానికి దిగుతుందని చెప్పడం కూడా జరుగుతుంది.

'అన్న' అనే కథలో రకరకాల ట్రేడ్ యూనియన్లు ఉన్నా కార్మికుల గురించి పట్టించుకునే వారు లేరని, జీతాల రోజు చందాలు కట్టించుకొని వెళ్లిపోతారని అంటారు. వివిధ పార్టీలకు చెందిన గుండాలు కూడా ఉన్నారని అర్థం అవుతుంది. వివిధ ట్రేడ్ యూనియన్లు కార్మికుల మీద పట్టుకోసం సమ్మెలు చేయిస్తుంటారని అర్థం అవుతోంది. అయితే యూనియన్లు వచ్చినప్పటి నుండి బొగ్గు బావుల్లో బావి బావికి తిరిగి వసూళ్లు చేసే గుండాలు తగ్గినట్లుగా కూడా అర్థం అవుతోంది.

శేషగిరి నవలలో శేషగిరి కార్మిక ఉద్యమ నిర్మాత అయితే శేషగిరికి వ్యతిరేకంగా బ్రిటీష్ కంపెనీ దొరలు కుహనా యూనియన్ నాయకులను పోటీగా పెట్టడం అర్థం అవుతుంది.

'బొగ్గు పొరల్లో' అనే కథలో 'లీడర్' కథలోను కాలరీ పనిలో తనని పెట్టడానికి తన దగ్గర డబ్బులు తీసుకున్న యూనియన్ నాయకుడు కోసం ఎదురుచూడడం కనబడుతుంది. పైగా యూనియన్ నాయకుడు దొరలు లంచాలు తీసుకుంటారనీ, లంచగొండితనం పోవాలంటే కాంగ్రేసు వాళ్లను దింపి కమ్యూనిస్టు వాళ్లను దింపి కమ్యూనిస్టు వాళ్లకు ఓట్లు వేస్తే పార్లమెంట్‌లో దేనినైనా మార్చగలరని చెప్తాడు. దీన్నిబట్టి యూనియన్ నాయకులు రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉంటూ సంస్థలో పని చేస్తూంటారనీ, బయట రాజకీయాల ప్రభావం కూడా కార్మిక జీవితాల మీద ఉంటుందనీ అర్థం అవుతుంది. పనిలో పెట్టించుకోకపోతే తమ పైసలు తమకిచ్చేయమని ప్రశ్నించినందుకు ఆ యూనియన్ నాయకుడు బీదవాళ్లకు పని యిస్తే తన మాట అసలే వినరని కూడా అనుకుంటాడు. అధికార్లు లీడర్లతో తన రెండో అమ్మాయి సంబంధానికి కట్నం ఇవ్వడానికి కష్టంగా ఉందంటే లీడరు ఆ విషయాన్ని తనకి వదిలి వేయమని అంటాడు. సమ్మె చేయించేది అసలు రాడికల్

పోరగాండ్లనీ, అటువంటి కార్మికుల్ని డిస్మిస్ చేస్తేనే బావి బాగు పడుతుందనీ లీడరు సలహా యిస్తాడు. బదిలీ ఫిల్లర్లకు చట్టం ప్రకారం లీవు ఇవ్వడానికి పై నుండి సర్క్యులర్ రాలేదని చెప్తారు. యూనియన్ నాయకులు అధికారులతో లాలూచీ పడుతున్నారని కార్మికులు భావించారు. సమ్మె కాలంలో జీతం కోత పెడతారు. లీడరేమో జీతం కోత చట్టం లేదని చెబుతాడు. సమ్మె అఖరి ఆయుధం కావాలనీ, ఎర్ర జెండా యూనియన్ నాయకులు కార్మికులు జీతాన్ని 30 పైసలు నుండి 30రూ॥ల వరకు పెంచినట్లు చెప్పి రాడికల్ మాట విని సమ్మె చేయవద్దని చెబుతాడు. కాని ఆచరణలో సమ్మె కాలంలో జీతం కోత అమలు చేసేసరికి కార్మికులకు యూనియన్ నాయకులంటే నమ్మకం లేకుండా పోతుంది. యూనియన్లు కూడా రాజకీయ పార్టీల కనుబంధంగా పని చేస్తుంటారని కమ్యూనిస్టులకు రాడికల్స్‌కి రాజకీయంగా ఉన్న వైషమ్యాలు సంస్థలోకి కూడా చొచ్చుకుని వచ్చి కార్మికుల మనస్తత్వాలపై ప్రభావం చూపించగలుగుతాయనీ అర్థం అవుతుంది.

సమ్మె జరిగిన రోజులకు జీతం కోత పెట్టడంతో చట్టానికి వ్యతిరేకంగా కార్మికులు ట్రేడ్ యూనియన్ నాయకుల మాటలు లెక్క చేయకుండా సమ్మె చేసి విజయం పొందుతారు. నల్లవజ్రం కథలో శంకరయ్య అతని బదిలీల కోసం లీడర్ల చుట్టు తిరుగుతూ వాళ్లు "రేపు రా, మాపు రా" అని తిప్పించుకోవడం కనబడుతుంది.

సింగరేణి రామాయణంలో బొగ్గు కథ వంటి ఒగ్గు కథలో లీడర్లు అధికార్లకు దాసోహం అంటారనీ, అధికార్లు లీడర్లను అడ్డు పెట్టుకుని కార్మిక చైతన్యాన్ని అణచివేస్తుంటారనీ భావిస్తారు.

శేషగిరి నవలలో కార్మిక ఉద్యమ నిర్మాతగా శేషగిరి కార్మికులలో చైతన్యం తెస్తున్న సమయంలో యాజమాన్యం ప్రతిగా తమకు అనుకూలంగా ఉండే యూనియన్‌ను తయారుచేయడం, అది అంతగా కార్మికుల మన్ననను పొందలేక పోవడం స్పష్టమవుతుంది.

'ఐక్యత-ఘర్షణ' అనే కథలోనూ గుణపాఠం కథలోనూ కార్మికులకు యూనియన్ నాయకుల మీద సదభిప్రాయం లేదనీ, యూనియన్ వాళ్లు చందాలకు ముందుకొస్తారు గాని, సమస్యలు పట్టించుకోరని, పై పెచ్చు యాజమాన్యంతో కుమ్మక్కు అవుతారని కూడా బాధపడ్డారు.

'తనకు తాకితే' అనే స్వగతంలో కార్మికుల సమస్యలు పట్టించుకోక పోగా వారి మాట విని సమ్మె విరమించుకోలేదనీ యూనియన్ నాయకులు చార్జిషీటు ఇప్పించారని కూడా ఆరోపించడం అర్థం అవుతుంది. పైగా యాజమాన్యం యూనియన్ అయువుపట్టును పట్టి ఆడిస్తుందనీ, దానిని గ్రహించిన కార్మికులు యాజమాన్యం యొక్క మరియు యూనియన్ యొక్క అయువుపట్టు పట్టుకోవాలని అనుకుంటారు. చీటికి మాటికి సమ్మె చేయకూడదని కూడా భావిస్తారు.

'అన్న', 'నివురు గప్పిన నిప్పు', 'సమ్మె' కథలలో కార్మికులు యూనియన్ నాయకులను ప్రశ్నించినందుకు కోపం వచ్చి యూనియన్ నాయకులు కార్మికులను అరెస్టు చేయించినట్లు అర్థం అవుతుంది.

కొత్త ఎత్తు అనే కథలో కార్మికులందరు 1981లో జరిగిన 56 రోజుల పాటు సుదీర్ఘమైన సమ్మె చేస్తే దానిని యూనియన్ వాళ్ళు వ్యతిరేకించారని ఆ తరువాత వాళ్ళు ఉనికిని పలుకుబడిని పెంచుకోవడానికి కార్మికులను సమ్మె చేయమంటున్నారని కార్మికులు అర్థం చేసుకుంటారు. అయితే సంస్థాగత యూనియన్ నాయకుల ఉద్దేశ్యాన్ని కార్మికులను అడ్డు పెట్టుకుని ఆ సుదీర్ఘమైన సమ్మె రాడికల్స్ ప్రభావంతో జరిగిందని అర్థం అవుతుంది. రాజకీయ పార్టీలతో అనుబంధం గల యూనియన్‌లు తమ పబ్బం గడుపుకుంటూ, అశ్రిత పక్షపాతులకు కావాల్సిన పనులు చేయించుకుంటూ ముడుపులు బాగా స్వీకరిస్తున్నారని 'నల్లవజ్రం' వంటి నవలలో కనబడుతుంది. పైగా యూనియన్ వాళ్ళు ఒక రాజకీయ పార్టీలకు అనుంబంధంగా పనిచేయడం వల్ల కార్మికుల సమస్యల పరిష్కారంలో రాజకీయాలు కూడా చోటు చేసుకుంటాయి అని అర్థం అవడంతోపాటు సమస్యలు మరింతగా సంక్లిష్టతను సంతరించుకుంటాయి అని కూడా తెలుస్తుంది.

సింగరేణి మండుతోంది అనే నవలలో యూనియన్లు కార్మికులకు దొరలకు మీడియేటర్లని కార్మిక చైతన్యాన్ని బంద్ చేస్తే అన్నీ ఆగిపోతాయనీ, సంపద కిటుకులను కార్మికులు కనిపెడితే యూనియన్లకు నష్టం అని భావిస్తారు.

"బొగ్గు పొరల్లో"ని లీడరు కథలో ట్రైనింగ్ అయిన వారిని పనిలో పెట్టించడానికని లీడర్లు పైసలు తీసుకోవడం తరువాత పట్టించుకోకపోవడం తో ఆ పైసలను తిరిగి ఇమ్మని అడిగిన సందర్భంలో ఆ లీడరు అటువంటి కార్మికులను ఉద్యోగంలో పెడితే తమ మాట అసలే వినరని భావించడం

జరుగుతుంది. అధికారుల వ్యక్తిగత విషయాలలోని ఆర్థిక ఇబ్బందిని అనువుగా చేసుకుని అధికారి యొక్క ఆడపిల్ల పెళ్లికి ఇచ్చే కట్నం విషయం తమకు వదలి పెట్టమని అధికారికి భరోసా ఇచ్చి లీడర్లు తమ పబ్బం గడుపుకోవడం, తమ కనుకూలమైన వర్గం వారి బాగోగులను పట్టించుకోవడం, ఆశ్రితుల వర్గం వారికి తేలిక పనులు కేటాయించేటట్లు చూడడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. ఇక్కడ కార్మికులు లీడర్ల దౌర్జన్యం నశించాలని నినాదాలు చేయడం గమనార్హం.

సింగరేణి రామాయణంలో నాటకాల్లోనూ నల్ల వజ్రాల పాటలలోనూ యూనియన్ నాయకులు అధికార్లకు దాసోహమవుతుంటారనీ అధికార్లు లీడర్లను అడ్డం పెట్టుకుని కార్మిక చైతన్యాన్ని అణచివేస్తుంటారని చెప్పడం జరుగుతుంది.

బొగ్గు కథ వంటి ఒగ్గు కథలో కార్మికులకు లీడర్ల గురించి సదభిప్రాయం లేనట్లు అర్థం అవుతుంది. మొత్తం మీద సింగరేణి సాహిత్యంలో కార్మికులకు యూనియన్ నాయకుల మీద సదభిప్రాయం లేదని అర్థం అవుతుంది.

అయితే పారిశ్రామిక సంబంధాలలో ట్రేడ్ యూనియన్‌ల పాత్ర ముఖ్యమైనది. వారికి 1926 నాటి చట్టం కొన్ని హక్కులను బాధ్యతలను ఇచ్చింది కాని ట్రేడ్ యూనియన్లలో మంచి లీడర్‌షిప్, చిత్తశుద్ధి మరియు ఒక యూనియన్‌కు మిగిలిన యూనియన్లతో సామరస్యం గాని లేకపోయేసరికి కార్మికుల దృష్టిలో యూనీయన్లంటే కేవలం చందాదారులనీ, స్వార్థ ప్రయోజనాల కోసం సమ్మె చేయిస్తారని భావించడం జరుగుతుంది. యూనియన్లు సంస్థ యొక్క అభివృద్ధికై బాధ్యతాయుతమైన పాత్ర నిర్వహించడానికి తగిన ప్రజాస్వామ్య స్ఫూర్తితో పాటు పారిశ్రామిక విధానం గురించిన అవగాహన ఏర్పరచుకోవడానికి తగిన విద్యను అభివృద్ధి చేసుకోవాలి. అంతేగాక కార్మికులతో రక్షణకు సంబంధించిన బొగ్గుగనుల నిబంధనలను, పారిశ్రామిక వివాద చట్టాలను గురించిన అవగాహనా సదస్సులను ఏర్పాటు చేసి, కార్మికులకు చైతన్యాన్ని, పని సంస్కృతిని, సంస్థ ప్రగతికి సంబంధించిన విషయాలను శిక్షణా కార్యక్రమాల ద్వారా తెలియచేయాలి.

దేశంలో మరి యే యితర కోల్ పరిశ్రమలలో లేకపోయినా 1998లో సింగరేణి సంస్థ పారిశ్రామిక శాంతికై గుర్తింపు సంఘం ఎన్నికలను రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా జరిపించడం ఒక గుణాత్మక పరిణామం.

1958 నాటి కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం గుర్తింపు పొందిన యూనియన్ మాత్రమే విధులను నిర్వర్తించగలగాలి. మిగిలిన యూనియన్లు వారి వారి

పరిధిలో ఉన్న విషయాలలో మాత్రమే వారు జోక్యం చేసుకునే వీలుంటుంది. గుర్తింపు సంఘంలో చర్చలు జరుపుతూ ఒప్పందాలు చేసుకోవడం ద్వారా పారిశ్రామిక శాంతి ఉంటుంది. బహుళ కార్మిక సంఘాల జోక్యం కారణంగానూ కార్మిక సంఘాల మధ్య అవాంఛనీయమైన పోటీతత్త్వ కారణంగానూ ఒక పద్ధతి ఒక విధానం లేకపోవడం వల్ల సమ్మెలు ఎక్కువగా జరుగుతున్నాయనీ యాజమాన్యం భావించడం జరిగింది. బహుళ కార్మిక సంఘాలు ఉంటే సమైక్యత దెబ్బతిని సంప్రదింపుల సామర్థ్యానికి విఘాతం కలిగే అవకాశం ఉందని కూడా భావించింది.

అన్ని కార్మిక సంఘాలు చట్ట పరిధిలోనే సమస్యలను పరిష్కరించుకోవాలనీ సమైక్య పరుచుకోవాలనీ, కార్మిక వాడలలో వారి వారి మెంబరు కార్మికుల, కార్మిక కుటుంబ సభ్యుల యొక్క వ్యక్తిగత, కుటుంబ సాంఘిక సమస్యలపై సలహాలు ఇవ్వాలనీ, కార్మికుల దురవాట్లను, వ్యసనాలను తగ్గించడానికి ప్రయత్నం చేయాలనీ, కార్మిక కుటుంబాలలో పొదుపు పై అవగాహన కలిగించాలనీ, సంక్షేమ కార్యక్రమాలను సమాలోచన చేసి గ్రీవెన్స్ ప్రొసీజరు ద్వారా యాజమాన్యానికి ప్రాతినిథ్యం చేయవచ్చని యాజమాన్యం భావించింది. వారి మెంబర్ టెర్మినేట్ చేయబడుతుంటే పారిశ్రామిక వివాదాల చట్టం ద్వారా వివాదాన్ని చేపట్టవచ్చునీ, చెప్పింది. అయితే 1958 కోడ్ ప్రకారం గుర్తింపు సంఘం యిచ్చిన సమ్మె నోటీసు మాత్రమే చెల్లుతుందనీ, గుర్తింపు సంఘాలతో మాత్రమే. త్రైపాక్షిక, ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకోవడానికి వీలవుతుందనీ యాజమాన్యం భావిస్తుంది.

యూనియన్ చందాల విషయంలో 76 యూనియన్లు ఉంటే కార్మికులకు జీతాలు రాగానే తలో పది రూపాయలు కట్టాల్సి వచ్చేసరికి చాలా యిబ్బంది అయ్యేదని, 'జీతం' అనే కథలో అర్థం అవుతుంది. అందుకే యాజమాన్యం మహానది కోల్ ఫీల్డులోవలె ఇక్కడ కూడా చెక్ ఆఫ్ సిస్టమ్ను ప్రవేశ పెడితే ముందుగా సింగరేణి సంస్థలో యూనియన్లు ఎదురు తిరిగాయి. ఈ విధానాలలో కార్మికులు తనకిష్టమైన ఒక యూనియన్కు చందాను లిఖిత పూర్వకమైన అభీష్టాన్ని వెల్లడి చేస్తూ తెలియచేస్తే జీతం నుండి ఆఫీసు వాళ్లు చెల్లింపు చేసే సౌకర్యాన్ని పెట్టి అన్ని యూనియన్ల చందాల బాధ నుండి కార్మికులను రక్షించడం హర్షణీయమైన విషయమే.

కార్మిక సంఘాల వారు తరచూ వేలెత్తి చూపించే సమస్యలు పని ప్రదేశాల గురించి పని పరిస్థితుల గురించి అనీ అర్థం అవుతుంది. ఈ విషయాలను కార్మిక సంఘాల వారు వ్యక్తిగత ప్రయోజనాలకో లేదా ప్రతిష్ఠ కోసమో ఉపయోగించుకోకూడదనీ, అధికార్లు, సూపర్‌వైజరీ సిబ్బందితో కలిసికట్టుగా ఆలోచించి కార్మికుల శ్రేయస్సుకు సంక్షేమానికి పాటుపడుతూ సమస్యలను పరిష్కరించుకోవాలని యాజమాన్యం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న అధికార్లలో 50% పైగా కార్మికుల పిల్లలే ఉన్నారనీ, వారికి సంస్థ పరిస్థితులపై అవగాహనతో పాటు కార్మికులతో కార్మిక సంఘాలతో పారిశ్రామిక బాంధవ్యం ఉందనీ, ఒకరికొకరు సహకరించుకునే విధంగానూ, ఒకరికి తెలిసినది మరి ఒకరికి తెలియచేయడంగాను, వారు మరొకరి అక్షరాస్యతకై పాటుపడే విధంగానూ కార్మిక సంఘాలు కార్మికులకు సహకారాన్ని అందిస్తే బాగుంటుందనీ యాజమాన్యం భావిస్తోంది.

యాజమాన్యం కూడా అక్షరాస్యతా కార్యక్రమాన్ని ముమ్మరంగా అమలు పరుస్తూ కార్మికులలో తామందరూ అక్షరాస్యులు కావాలనే ఆకాంక్షను పట్టుదలను కలిగిస్తున్న విషయాన్ని పత్రికలు పేర్కొనడం హర్షదాయకం.

పారిశ్రామిక సంబంధాలలో మూల కారకులైన కార్మిక సంఘాలను ప్రభావితం చేసే రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం కూడా పారిశ్రామిక శాంతికి దోహదం కాగలుగుతుందని భావించారు. కార్మికులు పని సామర్థ్యాన్ని పెంచుకునేటట్లు శిక్షణ ఇవ్వడం వారిని ఉన్నతులుగా బాధ్యతాయుతమైన కార్మికులుగా తయారీ చేయడంలో కార్మిక సంఘాల బాధ్యత కూడా ఉంటుంది. మంచి కార్మికులు సంస్థకు ఎలాగ ముఖ్యమో అలాగే కార్మిక సంఘాలకు కూడా మంచి కార్మికులకు ముఖ్యం. కార్మికులు పనిలో సమర్థవంతంగా ఉంటే యాజమాన్యం కార్మిక సంఘాల కార్యక్రమాలకు అంతే ప్రాధాన్యతనిస్తారు. కార్మిక నాయకులు విధులను నిర్వహించకపోతే ఉత్పత్తికై తోటి కార్మికుడి కష్టాన్ని దోచుకోవడం అని యాజమాన్యం భావించటంలో తప్పులేదు.

కార్మిక సంఘాలపై యాజమాన్యానికి ఎటువంటి అధికారం లేదనీ, కార్మిక సంఘాలు విధాన నిర్ణయాల పట్ల మంచి నాయకత్వ లక్షణాలతో బాధ్యత వహించాలని, కార్మిక సంఘాల వారికి కూడా సంస్థ మనుగడ, అభివృద్ధియే ధ్యేయంగా ఉండాలని, కార్మిక సంఘాల వారు కార్మికుల అవసరాలను తెలుసుకోవాలని యాజమాన్యం భావిస్తుంది. కార్మిక సమస్యలను యాజమాన్యం

దృష్టికి తీసుకువచ్చి సామరస్యపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని కూడా భావించింది. నాయకులు ముందుగా ఉత్పాదకతా ఆవశ్యకతను కార్మికులకు తెలియచేయాలని భావించింది. కార్మికులకు యాజమాన్యానికి మధ్య యూనియన్ నాయకులు వారధి వంటి వారనీ చిన్న చిన్న గ్రూపుల లాగా కార్మికులతో వ్యక్తిగత సంబంధాలు పెట్టుకొని కార్మికులను ప్రోత్సహిస్తూ పని సామర్థ్యం పెరిగేలా వారిలో మానసిక పరివర్తన తీసుకురావడానికి కార్మిక స్థాయిగల నాయకులు కృషి చేయాలని యాజమాన్యం భావిస్తుంది. కార్మిక నాయకులు తమ వ్యక్తిగత అభివృద్ధికి సంస్థ అభివృద్ధికి అవసరమైన నూతన విషయాలను తెలుసుకుని అమలుపరచడానికి అనుకూల వాతావరణం ఏర్పరచుకోవాలని, కార్మిక సంఘాలు, కార్మికులు తాము చేస్తున్న వృత్తి - ఉద్యోగంపై అంకిత భావం ఏర్పరచుకోవాలనీ, వ్యక్తిగత సామర్థ్యంతో పాటు సామూహిక సామర్థ్యం సంస్థ అభివృద్ధికి అవసరమనీ, సిబ్బంది యొక్క సమర్థత - సమైక్యత ఉంటే సంస్థ అభివృద్ధి జరుగుతుందని యాజమాన్యం భావిస్తోంది. శేషగిరి నవలలో నాయకుడిగా శేషగిరి నాయకత్వం కార్మికుల పని పరిస్థితుల గురించి, వారి జీత భత్యాల గురించి, వారి సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పోరాడినట్లు అర్థం అవుతోంది.

'పునరావాసం' కథలో యూనియన్ నాయకులు గోల్డన్ ఫారెస్ట్ స్కీములు నడిపి కార్మికులను ముంచినట్లు అర్థం అవుతుంది. ఇది వాస్తవం అని సమాజంలోని బాధితులగోడువల్ల అర్థం అయింది. కాబట్టి కార్మికులు కూడా యూనియన్ నాయకులలోని మంచి చెడులను ఆలోచించుకుంటూ ఎప్పటికప్పుడు తమ స్థితిగతులను అంచనా వేసుకుంటూ ఉత్పత్తిలో యాజమాన్యానికి సహకరిస్తూ అభివృద్ధిని సాధించాలి.

4.8 అధికారుల ప్రవర్తన :

పారిశ్రామిక సంబంధాలలో వర్గ స్వభావపు పోకడలు లేని సామాజిక సంబంధాలు అభివృద్ధి చెందినప్పుడే ఉత్పత్తి పెరుగుతుందనీ కార్మికులు బాధ్యతాయుతంగా ఉండగలరనీ నిపుణులు భావించారు.

'ప్రమాదం' కథలో రూఫ్ కూలిపోతుందన్న విషయం రెండు రోజులుగా కార్మికులు గమనించి అధికార్లకు పని పరిస్థితుల గురించి చెప్పినా అధికార్లు పట్టించుకోలేదనీ, కార్మికులు చెప్పినా చెక్ చేయడానికి వచ్చిన సేఫ్టీ ఆఫీసరు వినిపించుకోకుండా ఎంత తొందరగా వచ్చాడో అంత తొందరగా వెళ్లాడనీ,

అధికార్ల నిర్లక్ష్యమే బండ కూలడానికి కారణమని కార్మికులు భావించారు.

ప్రమాదంలో చనిపోయిన వారిని తీయడానికి అధికార్లు వస్తూ ముందు జాగ్రత్త చర్యగా పోలీసులకు ఫోన్ చేస్తారు. మేనేజ్‌మెంట్‌కు ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాల మీద లేదనీ, అధికార్ల దృష్టిలో టన్ను బొగ్గు కంటే కార్మికుల ప్రాణమే చులకన అయిపోయిందనీ భావించారు. మీట్ ది వర్కర్స్ ప్రోగ్రాంలో భాగంగా చైర్‌మెన్ మాట్లాడేటప్పుడు ప్రాణాన్ని ఫణంగా పెట్టి ఉత్పత్తి వద్దంటారు. కాని కొత్త డైరెక్టరు వచ్చిన తరువాత ఉత్పత్తితో పాటు ప్రమాదాలు బాగా పెరిగినట్లు కార్మికులు భావించారు.

మేనేజిమెంట్ బొగ్గు బావుల్లో ప్రమాదాలు చాలా సహజం అనీ ప్రమాదాలు ఒక్క సింగరేణిలోనే జరగడం లేదనీ, యితర పరిశ్రమలలో కూడా జరుగుతున్నాయనే ప్రచారం మొదలు పెట్టడంతో అధికార్ల పరస్పర విరుద్ధమైన ప్రకటనలు కార్మికులను ఆందోళనకు గురి చేస్తాయని భావిస్తారు.

'శత్రువు' అనే కథలో అధికార్లు పని పరిస్థితులను పట్టించుకోరని కార్మికులు బాధపడ్తారు.

'సమ్మె' కథలో కార్మికులు తమకు నీటి వసతి లేదనీ ఎన్నిసార్లు అర్జీ పెట్టుకున్న అధికార్లు పట్టించుకోకపోయేసరికి కార్మిక కుటుంబ స్త్రీలందరూ అధికార్లను రోడ్డు మీదనే అటకాయించేసరికి అధికార్లు వెంటనే స్పందించి నీటి వసతిని కలిగించారనీ తెలుస్తుంది.

'పోరుబాటల్లో' అనే కథలో పోలీసుల అండతో అధికార్లు కార్మికులతో ఆడుకుంటుంటే, కార్మికులు తాము అన్నల అండతో అధికార్లకు ఎదుర్కోవాలనుకుంటారు. ఓవర్‌మ్యాన్‌లు, సర్దార్‌లు లంచాలు తింటూ, ఇష్టమైన కార్మికులకు తేలిక పని యిస్తారనీ, వాళ్లను చితకొట్టించాలనీ, మేనేజర్లను సఫా చెయ్యాలన్నంత కోపం వచ్చినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయనీ, దాన్ని తట్టుకునే బలం తమకు లేదనీ భావిస్తారు. మేనేజిమెంట్ అణచివేతకు పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడాలనుకుంటారు.

'నీడ కోసం' కథలో రైలు కట్టకు అవతల కార్మికులు గుడిసెలు వేసుకుంటే కంపెనీ అధికార్లు పోలీసులతో కలిసి వారిచేత ఆ గుడిసెలను పీకేస్తే కార్మికులకు కోపం వచ్చి బాయి ఆవరణలో రేకుల షెడ్డు క్రింద వంట పొయ్యిలు పెట్టుకుని కుటుంబాలను ఏర్పరచుకుంటారు.

'బండ కింద బతుకుల్లో', 'పేనుకు పెత్తనం ఇస్తే' అనే శీర్షిక క్రింద కార్మికులు పనిచేసే చోట పరిస్తితి బాగాలేదని చెప్పినా సేఫ్టీ ఆఫీసరు, వెల్ఫేరు ఆఫీసర్లు పట్టించుకోలేదనీ, పైగా సేఫ్టీ ఆఫీసరు లేబరు మీద చేయి చేసుకుంటే సమ్మె చేసినట్టు అర్థం అవుతుంది. ఎర్ర సీమ కుట్టినట్టుగా సేఫ్టీ అధికారి చేసిన పనిని ఎవరూ గుర్తించలేదనీ, వెల్ఫేర్ ఆఫీసరు వచ్చి సేఫ్టీ ఆఫీసరుని సమర్ధించాడు గాని, కార్మికుల సంక్షేమం ఆలోచించలేదనీ అంటాడు. ఇటువంటి సంఘటన మహానది కోల్‌ఫీల్డులో జరిగింది. కార్మికులు పెన్‌డౌన్ స్ట్రైకు చేసినట్లునూ, ఆ అధికారి కార్మికులకు క్షమాపణ వేడినట్లునూ సర్వేలో అర్థం అయింది.అధికారులు సంయమనంతో ప్రవర్తించినప్పుడే ప్రారిశ్రామిక శాంతి ఉంటుందనే దానికి ఇదొక ఉదాహరణ.

'అన్న' అనే కథలో గ్రామాలలో ఉన్న దొరల ఆధిపత్యానికి, ఇక్కడ బాయి దొరల ఆధిపత్యానికి పెద్దగా తేడా లేదని కార్మికులు భావించారు. ఇష్టం లేకపోయినా బాయి దొరని 'దొర' అని పిలవాలనీ, అధికార్లు మాత్రం తమని 'పోరా, ఏరా'అంటుంటారనీ కార్మికులు బాధపడడం కనబడుతుంది.

సింగరేణి మండుతోంది' అనే నవలలో బంద్‌ల సమయంలో మాత్రమే అధికార్లు కార్మికుల కాళ్ల దగ్గరకు దిగి వస్తారనీ,మిగిలిన సమయంలో పట్టించుకోరనీ అభిప్రాయపడుతున్నారు. ఉత్పత్తికి ఢోకా లేకపోతే దొరలకు ఇబ్బంది ఉండదనీ, అధికార్లను ప్రశ్నించిన వారికి చార్జిషీటు ఇవ్వడం జరిగిందనీ స్పష్టమయింది. విష వాయువుల లీకేజీని అధికార్లు అలక్ష్యం చేయడం వల్ల కార్మికులు ఊపిరి పోగుట్టుకుంటారని అంటారు. అటువంటి దొరలపై విచారణ చేయించే స్థితికి కార్మికులు పెరిగినప్పుడే కార్మికులకు శాంతి ఉంటుందని అనుకుంటారు. సింగరేణి దొరలు మార్పును ఒప్పుకోరనీ, దొరలు బావుల్ని దోచుకుంటారే తప్ప కంపెనీని బాగు చేయరని భావిస్తారు. కన్సీలియేషన్ అనీ, గ్రీవెన్స్ ప్రోసీజర్ అనేవి గిమ్మిక్స్ వంటివని భావిస్తారు. ఇక్కడ సంస్థ ప్రగతి కంటే కార్మికుల చైతన్య స్థాయికి ప్రాధాన్యత నిస్తున్నట్లు అర్థం అవుతుంది. ఈ నవలలోనే అధికార్లని 'సింగరేణి నిజాం'లని భావిస్తారు కార్మికులు. బాయి మీద దొర తింటానికి మాత్రమే బాయి దగ్గరకు వస్తాడని, కార్మికుని కొడుకు సంస్థలో అధికారిగా వచ్చినా అతడు కూడ అలాగే ప్రవర్తిస్తాడనీ అక్కడ క్యాంటీన్ ఏర్పాటు దొరల దోపిడికి వీలును కల్పింస్తుందని భావిస్తారు. కంపెనీ నష్టాలకు కారణం దొరల భోగాలకై వసతులను కల్పించడమే గాక పలు కోణాలలో

దోచుకునే దొరలు ఉండడం చేతనేనని బొగ్గు అమ్మకంలోనూ, యంత్రాల కొనుగోళ్లలోనూ కమీషన్లు, ముడుపులు తీసుకుంటున్నారనీ, దొంగ మస్టర్లు వేయించి దొంగ డబ్బు సంపాదించే సింగరేణి దొరలున్నారనీ రచయిత భావించారు. ఉద్యోగాలు ఇస్తామని దొరలు డబ్బు తీసుకుంటే డబ్బు ఇచ్చిన వాళ్ళు వచ్చి యింటి ముందు వేచి ఉంటారనీ, గిరిజనులను అధికార్లు దోచుకుంటున్నారనీ భావించడం జరిగింది. ప్రభుత్వ అధికార్ల కంటే సింగరేణి అధికార్లే ఎక్కువ అవినీతిపరులని భావించడం జరిగింది. కార్మికులకు దొరలకు మధ్య దూరం ఉండాలని అధికార్లు ఆశిస్తారనీ, వారికి నమస్కారాలు నటనలే కావాలనీ వారిలో ఆత్మీయత మంచితనం ఉండదని భావించారు. అధికార్ల దృష్టిలో కార్మికులు వ్యక్తుల్లా కనబడకుండా శక్తుల్లా కనబడాలనీ కోరుకుంటారు. కంపెనీ దొరలకు కట్ల పాములాంటి బుద్ధి ఉంటుందనీ, దొరల నిర్ణయాలకు చాలామంది బలి అవుతున్నారనీ, దొరల భాష వేరు, కార్మికుల భాష వేరుగా వుంటే ఇద్దరి మధ్య అవగాహనకు అవకాశం ఉండడం లేదని భావించడం జరిగింది.

కార్మికుల అభ్యంతరాలను అర్థం చేసుకోకుండా బెదిరింపు స్వరంతో హెచ్చరించే లేబర్ ఆఫీసర్లు ఆడించేది దొరలేనని, సింగరేణి కార్మికులు సరిహద్దు సైనికుల్లా ప్రాణాలకు తెగించి పని చేయాలనీ లేబర్ ఆఫీసర్ అంటాడని అంటాడు. సింగరేణి అధికారుల మధ్య సంబంధాలు కూడా కార్మికుల మీద వాచ్ చేయడానికి అనీ ఎవరి యిండ్లకైనా పనికి పంపించేందుకు మాత్రమే వాళ్లు మాట్లాడుకుంటారనీ భావిస్తారు. గోఫ్‌ని గురించి సర్దార్ ముఖద్దామ్‌లు ప్రమాదాన్ని గుర్తించి కూడా ఆ అధికార్లతో చెప్పలేనితనం మానవ సంబంధాల్లో ఉందనీ, ఉత్పత్తి మాత్రమే ధ్యేయంగా ఉన్నవారు అలా మాట్లాడే చొరవను ఇవ్వరనీ భావిస్తారు. దొరలు పని స్థలానికి వచ్చి పని పరిస్థితులు తెలుసుకోవాలంటే ఉత్పత్తిని తగ్గించే బంద్ అనివార్యం అని భావించారు. సింగరేణి అధికార్లు కేంద్ర ప్రభుత్వం ముద్దు బిడ్డలనీ, ప్రభుత్వం తరుపున ఉన్న లేబర్ ఆఫీసర్లు కార్మికులతో 'ఇగ్గో వినండి' అంటూ పరస్పరం సంబంధం లేనట్లు వ్యవహరిస్తారనీ సింగరేణి మండుతోంది అన్న నవలలో రచయిత అధికార్ల జులుంను చాలా తీవ్రంగా విమర్శించారు. మొత్తం మీద ఈ అధికార్ల - కార్మికుల సంబంధాలలో మానవ సంబంధాలు ప్రముఖ పాత్ర వహిస్తాయనీ, మానవీయ కోణం అందరిలో ఉండాలనీ అర్థం అవుతుంది.

'బొగ్గు పొరల్లో' అనే కథలో మేనేజరుకు ఉత్పత్తియే ధ్యేయం కాబట్టి కూలబోయే బండ కింద పనులు చేయమనేసరికి కార్మికులు బాధపడ్డారు. దొరలు వాళ్లకు వీలయిన రూల్సు కార్మికులు మాట్లాడుతున్నారనీ భావిస్తారు. ఈ కథలో గోఫ్ దగ్గర పనిచేయమని కార్మికులను ఫోర్సు చేస్తూ, ఒకవేళ పని చేయకపోతే ఎంక్వైరీలో దాట్లు, టబ్బులు ఉన్నా కూడా పని చేయలేదనీ చెప్తానని కార్మికులను అధికారులు బెదిరించడం కనబడుతుంది. అనుభవం లేని పర్మినెంటు కాని బదిలీ కార్మికులను చట్ట విరుద్ధంగా అధికార్లు డీ ఫిల్లరింగ్ వర్కులో నియమిస్తుంటేనే ప్రమాదాలు జరుగుతున్నాయని బాధపడ్డారు.

నల్ల వజ్రం అనే నవలలో జనరల్ మేనేజర్ గారి ఆపరేషన్ సమయంలో శంకరయ్య రక్తం యిస్తే ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని చెప్పిన లేబర్ ఆఫీసర్ మళ్లీ ఆ విషయాన్ని పట్టించుకోనందుకు కార్మికులు తిట్టి సమ్మె చేయడానికి సిద్ధపడతారు.

సింగరేణి పాటలు, నాటకాలలో కూడా దొరలు కార్మికులను పట్టించుకోకుండా యూనియన్లతో కుమ్మక్కయి కార్మికులు సమ్మె చేస్తే వాళ్ల ఉద్యోగాలు తీసేస్తామని బెదిరిస్తారనీ, బావుల దగ్గర అధికార్లు సొంత సామ్రాజ్యాలను స్థాపించుకుంటారని అవినీతిపరులు అని కార్మికులు భావించడం కనబడుతుంది.

పారిశ్రామిక సంబంధాలలో వర్గ స్వభావం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అధికార వర్గం కార్మిక వర్గం అనే వేర్పాటుకు చోటు లేకుండా సామాజిక సంబంధాలతోను, మానవీయ సంబంధాలతోనూ అధికార్లు ప్రజాస్వామికంగా ప్రవర్తించగలిగినప్పుడే పని ప్రదేశంలో పని పరిస్థితులు క్లిష్టతతో కూడుకున్నా కూడా కార్మికులు ఉత్సాహంగా ఉత్పత్తికై పాటు పడగలుగుతారనేది వాస్తవం. కార్మికులతో మాట్లాడే విధానం దగ్గర నుండి, వాళ్లని సంబోధించే విధానం కూడా పారిశ్రామిక సంబంధాలలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. అందుకే 'సింగరేణి మండుతోంది' అనే నవలలో అధికార్లు కేంద్ర ప్రభుత్వం ముద్దు బిడ్డలనీ, వారు కార్మికులతో మాట్లాడేటప్పుడు వాళ్లని సాటి మానవులుగా భావించక ఇగ్గో, పోరా వంటి మాటలను ఉపయోగిస్తుంటారని వారికి ఆత్మగౌరవం, అభిమానం ఉంటుందనే విషయాన్ని విస్మరిస్తారని విప్పి చెప్పడం చేత పారిశ్రామిక సంబంధాలలో అధికార్లకు కార్మికులకు మధ్య పరస్పర అవగాహనకు చోటు లేదని అర్థం అవుతుంది.

'ప్రమాదం' కథలో అధికార్ల ప్రవర్తన, నిర్లక్ష్యం కారణంగానే బండ కూలి ప్రమాదం జరిగిందని భావించారు. శత్రువు కథలో అధికార్లు పని పరిస్థితుల గురించి పట్టించుకోవడం లేదని భావిస్తారు. సూపర్‌వైజరీ సిబ్బంది, అధికార్లు తమకిష్టమైన వారికి తేలిక పనులు ఇస్తుంటారనీ 'అన్న' అనే కథలో వెల్లడయింది. ఇందులో కొంత వాస్తవం ఉంది. ప్రతి అధికారి ముఖ్యంగా ప్రజాస్వామ్య దృక్పథంతో పారిశ్రామిక సంబంధాలలో శాంతిని నెలకొల్పగలగాలని భావించాలి. 'పోరుబాటల్లో' అనే కథలో కార్మికులు సమ్మెకు దిగేసరికి సమ్మెను గురించిన చర్చలు చేయకపోగా పోలీసులను పిలిపించి అరెస్టు చేయించడం, ఆ సమ్మె అన్ని విభాగాలకు విస్తరించడం, తద్వారా ఉత్పత్తికి నష్టం జరిగింది. ఇలాంటి విషయంలో కంపెనీ నష్టాలకు కార్మికుల కంటే అధికార్లే ఎక్కువ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

'బండ కింద బతుకులు' అనే స్వగతాలలో 'పేనుకు పెత్తనం ఇస్తే' అనే శీర్షిక క్రింద పని చేసే చోట పరిస్థితి బాగాలేదని చెప్పినా పట్టించుకోకపోగా సేఫ్టీ ఆఫీసరు లేబర్ మీద చెయ్యి చేసుకుంటే సమ్మె చేసినట్లు అర్థం అవుతోంది. మహానదీ కోల్ ఫీల్డులో కూడా మేనేజరు కార్మికుని మీద చెయ్యి చేసుకున్నందుకు స్ట్రైకు చేసేసరికి అదికారి కార్మికులకు క్షమాపణ చెప్పి సమ్మె విరమింప చేసినట్లు సర్వేలో అర్థం అయింది. 'అన్న' అనే కథలో గ్రామాలలో దొరల ఆధిపత్యానికి కంపెనీలో బాయి దొరల ఆధిపత్యానికీ తేడా లేదనీ, కార్మికులు అధికారులను దొరలని పిలవాల్సి వస్తోందనీ, వారు మాత్రం పోరా, ఏరా వంటి పదాలను ఉపయోగిస్తారనీ, చిన్నతనంగా భావించడం జరుగుతోందని వ్యక్తం చేశారు. ఇప్పుడు సింగరేణిలో ఆఫీసర్లను దొరలని పిలవడం తగ్గింది. వారు కూడా ఏరా, పోరా వంటి మాటలు తగ్గించుకోవడం కూడా స్పష్టంగా కనబడాలనుకుంటున్నారనీ, 'సింగరేణి మండుతోంది' నవలలో అర్థం అవుతుంది. కార్మికుల అభ్యంతరాలను అర్థం చేసుకోకుండా బెదిరింపు స్వరంలో మాట్లాడే వెల్ఫేర్ ఆఫీసర్లను ఆడించేది ఉన్నతాధికారులేనని భావిస్తారు. ఆఫీసర్లు ఆఫీసర్లని సమర్థించుకుంటారు గానీ, కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోరనీ బాధపడతారు.

బండ కింద బతుకులు అనే స్వగతంలోనూ 'సింగరేణి మండుతోంది', 'నల్లవజ్రం' అనే నవలల్లో, 'బొగ్గు పొరల్లో' అనే కథానికలోనూ అధికార్లు ఏమాత్రం కార్మికుల సంక్షేమం గురించి గాని, వృత్తి యందు రక్షణ గురించి గాని పట్టించుకోరనీ బాధపడ్డారు. పై పెచ్చు ఉత్పత్తిలో అనుభవం లేని వారిని డీ

ఫిల్లరింగ్ వంటి పనులను పురమాయించడం, ప్రమాదాలు జరగడానికి కారణమనీ, కార్మికులకు తెలిసిన భాషలో మాట్లాడుకోకపోయే సరికి వర్గ స్వభావం మరింతగా చోటు చేసుకోవడమే గాక రక్షణ చర్యలలో అవగాహనా రాహిత్యానికి అవకాశం ఎక్కువ ఉంటుందనీ, విష వాయువుల లీకేజీకి సంబంధించిన రక్షణ చర్యలను అలక్ష్యం చేయడానికి అవినీతి కారణమనీ, ముడుపుల కోసం అనవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తారనీ, కంపెనీని దోచుకోవడానికి దొరలున్నారనీ, వారు సింగరేణి నిజాంలనీ 'సింగరేణి మండుతోంది' అనే నవలలో విమర్శించడం కనబడుతుంది. సింగరేణి సాహిత్యంలోని నాటకాలలో, పాటలలోను, శత్రువు కథలోను అధికార్లు పని పరిస్థితుల గురించి పట్టించుకోవడం లేదని కార్మికులు భావిస్తారు. సూపర్‌వైజరీ సిబ్బంది, అధికార్లు తమకిష్టమైన వారికి తేలిక పనులు ఇస్తుంటారనీ 'అన్న' కథలో కూడా వెల్లడయింది ఇందులో కొంత వాస్తవం ఉంది. ప్రతి అధికారి ముఖ్యంగా ప్రజాస్వామ్య దృక్పథంతో పారిశ్రామిక సంబంధాలలో శాంతిని నెలకొల్పగలగాలని భావించాలి.

'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నట్లు పరిశ్రమ అంటే ముందుగా గుర్తుకు రావాల్సిన వారు శ్రామిక శక్తులైన కార్మికులేనని వారి ఘర్మ జలానికి ఖరీదు కట్టే షరాబు లేరని భావిస్తూ అధికార్లు కుటుంబ సంస్కృతిని అలవర్చుకోవాలి. కార్మికుల అసంతృప్తిని అవసరమైతే సిస్టమ్ అప్రోచెస్ ద్వారా కూడా అర్థం చేసుకోవాలి. లేకపోతే సమ్మె అన్ని విభాగాలకు విస్తరించే ప్రమాదం ఉందనీ బొగ్గు పొరల్లో అనే కథా సంపుటిలో అర్థం అవుతుంది. అందుకే ఇప్పుడు యాజమాన్యం పారిశ్రామిక సంబంధాల సమన్వయ కమిటీని వేసింది. వారు అన్ని బొగ్గు బావులను సందర్శించడం మీటింగులు పెట్టడం చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారాలు చూడడం పారిశ్రామిక సంబంధాల శాంతికై దోహదం చేసే ఒక గుణాత్మక పరిణామంగా భావించవచ్చు.

పారిశ్రామిక సంబంధాలలో ఆర్థిక-రాజనీతి చోటుచేసుకుంటే కార్మికులలో అసంతృప్తి ఉండడం అంతే సహజం. ముఖ్యంగా 'వర్గ స్వభావాన్ని తగ్గిస్తూ సామాజిక మానవ సంబంధాలలో కార్మికులు అధికారులు కలిసి మెలసి పని చేసినపుడే పారిశ్రామిక సత్సంబంధాలు విలసిల్లుతాయి. కార్మికుల శక్తినే గాక అధికార్ల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోగలిగితేనే సంస్థ అభివృద్ధి చెందుతుంది. అన్ని పని ప్రదేశాలు, పని పరిస్థితుల విషయంలో

అధికారులకు కూడా బాధ్యత ఉండాలనీ, సింగరేణి సంస్థ చైర్మెన్ గారి లేఖల సారాంశం వల్ల కూడా యాజమాన్యపు దృక్పథం అర్థం అవుతోంది.

అధికారుల పైన ఆరోపణలు, అభియోగాలు వాస్తవంగానూ, నిరూపించేవిగానూ, ఉండాలనీ, వారు కార్మికులైనా, అధికార్లు అయినా వేరు చేసి చూసే ప్రసక్తే లేదని, పని చేయని వారిని నయానో భయానో దారికి తెస్తూ పనిచేసే వారిని ప్రోత్సహిస్తూ ముందుకు సాగే మార్గాన్ని యాజమాన్యం అమలు చేయాలనుకోవడం యాజమాన్యం వారి యొక్క లేఖల ద్వారా అర్థం అవుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలలో అధికారులే యాజమాన్యం కాదనీ, ప్రభుత్వానికి కూడా సంబంధం ఉంటుందని యాజమాన్యం తెలియచేస్తుంది. కార్మికుల పిల్లలే అయినా లేదా కార్మికులే అధికార్లుగా ప్రమోషన్ వచ్చినా అధికార స్థానాన్ని వహించామనే స్పృహ రాగానే వారి మనస్తత్వాలలో మార్పు రావడం, తిరిగి కార్మికులను అవగాహన చేసుకోలేనితనం కూడా చోటు చేసుకోవడం జరుగుతునే ఉంటుంది. కాబట్టి అత్తా ఒకింటి కోడలే అన్న సామెత గుర్తుకు రాక తప్పదు.

'నీడకోసం' అనే కథలో కార్మికులకు గృహ వసతి కల్పించకపోగా వాళ్ళు కుటుంబ సంబంధాలకై ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకుంటే పోలీసుల సహాయంతో ఆ గుడిసెలను పీకించడం జరిగింది. ఇక్కడ చట్టం కంటే న్యాయం ముఖ్యం. వారు తమ సాటి వారేననే మానవ సంబంధాల దృక్కోణం లోపించడం చేత కార్మికులు అధికార్ల శత్రు సంబంధాలలోకి వెళ్లడం స్పష్టమవుతుంది. కావాలంటే దానిని ప్రభుత్వ శాఖల పరిధిలో పరిష్కరించుకోవాలి గానీ, వర్గ స్వభావపు పోకడను అధికారాన్ని చూపించకూడదు.

'అగ్గి' అనే కథలో కూడా హాస్పిటల్లో డాక్టర్లు అధికార్లకు ఒక రకంగానూ కార్మికులకు ఒక రకంగానూ ట్రీట్‌మెంట్ ఇస్తారనే వర్గ స్వభావాన్ని రేకెత్తించే విషయంగా సంక్షేమ కార్యక్రమాల అమలు ఉందని అర్థం అవుతుంది.

మహానది కోల్ ఫీల్డ్స్ పర్యటన సందర్భంగా అక్కడ అధికార్లు అవసరమైతే కార్మికులకు సారీ చెప్పి సమస్యలను పరిష్కరించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని అర్థం అవుతాయి.

4.9 కౌటుంబిక సామాజిక సమస్యలు :

పారిశ్రామిక సంబంధాలలో గని కార్మికుడు సామాజిక సంబంధాలతో పాటు సాంఘిక భద్రతను కూడా కోరుకుంటాడు. తనకూ, తనపై ఆధారపడి ఉన్న కుటుంబ వ్యక్తుల జీవన ప్రమాణ స్థాయి బాగుండాలని కోరుకుంటాడు. కార్మికుల యొక్క కార్మిక కుటుంబ సంక్షేమం ఉత్పత్తిపై బాగా ప్రభావం చూపుతోందని నిపుణులు నిర్ణయించారు. దీనికోసం ప్రభుత్వం 1923 వర్క్‌మెన్ కాంపెంజేటరీ చట్టం (కార్మిక నష్ట పరిహార చట్టం) 1948 రాష్ట్ర భీమాచట్టం, 1952 నాటి సిబ్బంది భవిష్య నిధి చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. వృత్తిలో జరిగే ప్రమాదాల నష్టాలను ఆర్థిక - మానవ సంబంధాల దృక్కోణం నుండి ఆలోచించి సాంఘిక భద్రతకై చట్టాలు చేయడం జరిగింది. గ్రాట్యుటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్‌లను ప్రవేశపెట్టాయి.

మానవ శక్తి అన్నిటికన్నా విలువైనది. మానవ శక్తిని సంరక్షించుకుంటూ సద్వినియోగం చేసుకోకపోతే అది ఆ వ్యక్తికి, కుటుంబానికి, పనిచేసే సంస్థకు మంచిది కాదు. కార్మికుల కుటుంబ సంక్షేమమే సంస్థ యొక్క శ్రేయస్సుగా భావించి ఉచిత గృహ వసతి, కరెంటు, నీరు, హాస్పిటల్ వంటివి ఏర్పాటు చేశారు. అప్పుడే తాము పని చేసే సంస్థ తమదిగా భావించి కార్మికుడు బాధ్యతాయుతంగా పనిని నిర్వహించగలుగుతారు.

సంక్షేమ కార్యక్రమాలు అంటే గని పని ప్రదేశాలలో రక్షణ, ఆరోగ్యం, సలహా సహకారాలు అందించడంతో పాటు పరిశ్రమకు బయట గల కార్మికుని వ్యక్తిగత జీవితానికి లేదా కుటుంబ సంక్షేమానికై విద్య, వైద్యం, గృహ వసతి, రవాణా, వినోదం వంటి వాటిని కూడా పట్టించుకోవడం, బొగ్గు పరిశ్రమల ద్వైపాక్షిక సంయుక్త సంస్థ (జెబిసిసిఐ) జాతీయ బొగ్గు వేతనాల ఒప్పందముకై బొగ్గు పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు వేతనాల నిర్ణయంతో పాటు తదితర కార్మిక సంక్షేమ కార్యక్రమాల గురించి కూడా నిర్ణయాలు చేస్తుంది. 1998 వరకు కార్మికులు చనిపోయినా, ఆరోగ్యరీత్యా అసమర్థత చోటుచేసుకున్నా స్వచ్ఛందంగా రిటైర్ అయినా వాళ్ల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం చేసేవారు. 1998 తర్వాత సంస్థాగత సిబ్బంది కుదింపు చర్యలో భాగంగా స్వచ్ఛంద రిటైర్‌మెంట్ అయిన కార్మికుని కుటుంబ వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వడం మానివేశారు.

ఒకవేళ కార్మికుడు ప్రమాదంలో చనిపోతే ఉద్యోగం ఇవ్వడం ఎప్పుడూ ఉంది. 1952 మైన్స్ చట్టం మహిళలకు గని ఉద్యోగంలో ప్రవేశార్హత లేకుండా

చేసింది. అయితే 2000 వరకు చనిపోయిన కార్మికుల భార్యలకు సర్వీసు ఉద్యోగాలు ఇచ్చేవారు అయితే ఇప్పుడు ప్రపంచీకరణ ప్రభావంలో భాగంగా కంపెనీ మహిళా కార్మికులు అదనంగా ఉన్నారని యాజమాన్యం భావించేసరికి, కుదింపు చర్యలో భాగంగా ఉద్యోగాలు పోతాయేమోనని మహిళ కార్మికులు ఆందోళన చెందడం జరుగుతోంది. అయితే సంస్థ వారికి హామీని ఇచ్చింది. మహిళా కార్మికులను తొలగించే బదులు దక్షిణాఫ్రికా దేశంలోవలె వారికి కూడా భూగర్భ గనులలో తట్టా చెమ్మాస్ ఇచ్చి ఉత్పత్తిలో పాలు పంచుకునేటట్టు చేయవచ్చు. లేదా సర్వీసు ఉద్యోగాలలో నియమించిన పురుష కార్మికుల స్థానంలో మహిళా కార్మికులకు శిక్షణను ఇప్పించి పనిని కల్పించవచ్చు. మహానది కోల్ ఫీల్డులో మహిళా కార్మికులకు వి.ఆర్.ఎస్. స్కీమును పరిచయం చేయాలనుకుంటూనే అదనంగా మహిళా కార్మిక కుటుంబంలోని కొడుకుకు ఉద్యోగం ఇవ్వాలనుకోవడం తిరిగి పితృస్వామ్యాన్ని సంరక్షించుకునే చర్యగా స్పష్టమవుతుంది. దానికంటే కూడా మహిళా కార్మికులకు భూగర్భపు పనులను చూపించడమే మేలు. లేదా తక్కువ నైపుణ్యం గల పనులలో వారికి శిక్షణను ఇచ్చి ప్రోత్సహించవచ్చు. సిబ్బంది కుదింపు చర్యలో భాగంగా ఇప్పుడు నెలవారీ ఆర్థిక సౌకర్యం కల్గించారు.

ప్రతి కుటుంబానికి ఇదివరకు బొగ్గును సప్లయి చేసేవారు. వాతావరణ కాలుష్య నివారణలో భాగంగా ఇప్పుడు గ్యాస్ సిలిండరు ఉచితంగా ఇస్తున్నారు. కార్మికులకు ఉచిత గృహ వసతి చేయాలనే క్రమంలో ఇప్పటి వరకు 30 శాతం మంది కార్మికులకు గృహ వసతి కల్పించగలిగారు. ప్రతి ఇంటిలో ఉచిత కరెంటు, పంపు, ఫ్యాను ఇచ్చేవారు. కాని ఈ మధ్య కార్మికుల ఇండ్లకు టైమర్లను అమర్చి కరెంటు వృధా కాకుండా నియంత్రించాలని అనుకుంటున్నారు. అయితే గృహ వసతిని ఇవ్వని వారికి కేవలం 30/60 రూపాయలు హెచ్.ఆర్.ఎ.గా ఇచ్చిన వారి ఇండ్లకు ఉచిత కరెంటు ఇచ్చేవారు. ఇప్పుడు దానిని రద్దు చేసే సరికి కార్మికులు అసంతృప్తికి లోనవుతున్నారు. గనిలో కష్టపడ్డ కార్మికుడు ఇంటిలో హాయిగా గాలి పీల్చుకొని నిద్రపోవాలంటే వారి వసతికై ప్రైవేట్ ఇళ్లలో నివసించినవారికి కొన్ని యూనిట్ల వరకు కరెంటు విషయంలో ప్రత్యామ్నాయంగా కొంత డబ్బుని ఇవ్వాలి. సంస్థ సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా ఉచిత వైద్య సౌకర్యాలను, సూపర్‌బజారుని, క్రీడారంగాలలో సౌకర్యాలను కల్పించారు.

'రాజీ' అనే కథలో ఆఫీసర్ల కోసం వారి పెండ్లాములకోసం లక్షలు ఖర్చు పెడతారు గాని, కార్మికులకు గుడిసెలు లేవనీ, నీళ్లు దొరకక ఇబ్బంది పడుతున్నారని, బొగ్గు తీసేది తామే అని, సొమ్ము ఒకడిది సోకు ఒకరిది అని కార్మికులు భావించడం అర్థమవుతుంది.

'రాజీ' కథలోనే సాయిలు రోగిష్టుడైన తల్లిని, భార్యను బతికించుకోవాలని కొత్తగూడెం ఆస్పత్రిలో వైద్య సౌకర్యం ఉంటుందని భావించి ట్రాన్స్‌ఫర్ అడిగితే చేయలేదు. తల్లి, భార్య కొత్తగూడెం నీళ్లకు అలవాటుపడ్డారు. సాయిలుకు గోదావరిఖనికి ట్రాన్స్‌ఫర్ అయితే వెళ్లాడు. కాని అక్కడ తల్లికి, భార్యకు ఆ వాతావరణం పడక తిరిగి కొత్తగూడెం ట్రాన్స్‌ఫర్‌కు అడిగితే చేయలేదు. ఆ సాయిలు తల్లి, భార్య చనిపోయారు. చేతికొచ్చిన కొడుకు అటువంటి పరిస్థితులలో రాజీ పడలేనంటూ, లొల్లి ఉంటుందని చెప్పడం చేత ఎంత కష్టపడి పనిచేసినా కార్మిక కుటుంబాలలో నీళ్లకు కరువు ఉంటుందని చెప్పబడుతుంది.

నల్లవజ్రం అనే నవలలో రోజు త్రీసీము మెట్ల మీద నుండి ఫిల్లరోళ్లు ఎక్కుతూ, దిగుతూ, కష్టపడి ఇంటికి వెళ్లేసరికి నిర్వీర్యంగా ఉన్న భర్తను భార్యలు వదిలివేసారనేది హాస్య సంభాషణలలో భాగంగా చెప్పుకున్నా అంతర్గత భావం, శ్రామిక కుటుంబ సంబంధాలలోని క్లిష్టత అర్థం అవుతుంది.

గొడుగు కథలో కృష్ణయ్య అనే ఎలక్ట్రీషియన్ భార్య అయిన శ్యామల పిల్లల్ని ఇంగ్లీషు చదువులు చదివించాలనుకుంది. కాని వానాకాలంలో యూనిఫారం తడవకుండా వెళ్లడానికి గొడుగు కోసమని చెప్పినా కొనలేని భర్తయొక్క అసమర్థతకు తన నిరసనను తెలియచేస్తుంది. భర్త ఆదర్శభావాలున్న అలసిపోయి వచ్చిన అతను ఇంటి విషయాలు పట్టించుకోవడంలేదని బాధపడుతుంది. భర్త మీద కోపం పిల్లల మీద చూపిస్తుంది. తన కాలు మీద వేడినీల్లు పడినా పట్టించుకోలేదని బాధపడుతుంది. ఇంతలో గొడుగులు బాగు చేసేవాడు వస్తే ఇంట్లో పాత గొడుగునే బాగు చేయిస్తుంది. ఆ బాగుచేసే అతని ద్వారా ఇంగ్లీషు మీడియం చదువు చదివిన అతని కొడుకులు ఉద్యోగం రాక కాఫీ కప్పులు కడుగుతున్నారనీ, తెలిసి అవగాహన చేసుకొని ఆకాశం పడిపోతున్నా కూడా నిజాయితీ కలవాడు కాబట్టి తన భర్త లాంటి వాళ్ళు దాన్ని పడిపోకుండా కాపాడుతున్నారని భావించింది.

నీళ్ళ తగవు అనే కథలో కార్మిక కుటుంబ వాడలలో కార్మికులు ఉండేచోటులో ఒక్క పంపు కూడా లేదు. తెల్లారి లేస్తూనే కుండలు పట్టుకుని

బయలుదేరి కంపెనీ క్వార్టర్స్‌కి వెళ్ళి పట్టుకొస్తారు. ఆలస్యంగా లేచిన సమ్మక్క దూరంగా ఉన్న క్వార్టర్‌కి వెళ్లి తొందరగా నీళ్లు తేవాలనుకుంది. కాని ఆ ఇంట్లో వాళ్లు తోటకు నీళ్ళు పెడితే ఆ ట్యూబు తీసి నీల్లు పట్టుకున్నందుకు గొడవ అవుతుంది. దానితో మాట మాట పెరిగి అధికార వర్గం, కార్మిక వర్గంగా చీలిపోతారు. అప్పటికే నీటికోసం ఎన్నిసార్లు అర్జీ పెట్టినా నీళ్ళ వసతి పట్టించుకోలేదని కార్మికులు భావించగా కార్మిక కుటుంబ స్త్రీలు అదే దారిలో పోతున్న ఆఫీసు దొరలను నినాదాలతో ఘెరావు చేస్తారు. ఆ అధికారులు వెంటనే వీరికి నీళ్ళవసతి కల్పించడం విశేషం.

'నీడకోసం' కథలో నారాయణ తన తండ్రికున్న ఒక గదియే గల గుడిసెలో ఉంటూ తన భార్యను కాపురానికి తీసుకురాలేని అశక్తత తనలో ఉందని అసహనంతో ఉంటాడు. తండ్రి వీరయ్య 20 ఏళ్ళు నుండి పని చేస్తున్నా ఇల్లును పెద్దది చేయలేకపోయాడు. తోటి కార్మికులతో చర్చిస్తాడు. నీడకోసం ఇల్లులేని కార్మికులందరు కలిసి కట్టకవతల స్థలంలో ఇల్లు వేసుకుంటారు. నారాయణ కూడా ఇల్లువేసుకుని భార్య అయిన చంద్రని ఇంటికి తెస్తాడు. హాయిగా కాపురం చేసుకుంటుంటారు. కాని ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోలీసులను పంపించి ఆ ఇల్లను పీకి పారేయడంతో దానికి ప్రతీకారంగా ఆ కుటుంబాలన్నీ కలిసి బొగ్గు బావి దగ్గర ఉన్న కార్యాలయం దగ్గరగా రేకుల షెడ్లు వేసుకుని వంటలు చేసుకోవడం చేస్తారు. వీళ్లని అధికార్లు ఏం చేయలేకపోయారు.

నెలవు అనే కథలో రాయమల్లు భార్య రాజేశ్వరికున్న పెద్ద ఇల్లు, భూములను అనుభవించాలనే కలలు పండడంకోసం భార్యను తీసుకొని కాలరీ ఉద్యోగానికి వస్తాడు. డబ్బును కూడపెట్టుకుని నాలుగు ఎకరాల పొలం కొనుక్కుని తిరిగి పల్లెటూల్లో వ్యవసాయం చేసుకోవాలనుకుంటుంది. కాని పిల్లల ఖర్చులు పెరిగి జీతం సరిపోదు. కాలరీ ఉద్యోగం అంటే యిష్టం లేని భర్త సిగరెట్లకు తాగుడుకు బానిస అవుతాడు. గోఫ్ పడ్డ చప్పుడుకు భయం వేసి భర్త (కార్మికుడు) మనసు చెదిరిపోయి మానసిక రోగి అవుతాడు. సిక్ లీవు జీతం కూడా అయిపోతుంది. హాస్పిటల్‌లో ఉన్న మందులతో తగ్గలేదు. అందరి సలహా మీద పల్లెటూరికి తీసుకువెళితే రాయమల్లు ఆరోగ్యం బాగవుతుంది. తిరిగి కాలరీ ఉద్యోగానికి వెడదామంటే ససేమిరా అంటాడు. కాని భర్తను వదిలిపెట్టి అయినా తాను వెళ్లి కాలేరు దగ్గర పని చూసుకుంటాననంటుంది. ఈ రకమైన కౌటుంబిక సమస్యల నుండి దూరం అవడానికి రాయమల్లు బాగా

త్రాగి, చచ్చిపోతాడు. దాంతో ఆ కుటుంబం విచ్ఛిన్నమవుతుంది. బావి పని ప్రమాదం కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపిస్తుందనేది సర్వేలో కూడా వాస్తవ విషయమని అర్థమయినది.

'ప్రస్థానం' అనే కథలో మాధవయ్య రాఘవయ్యతో 'కాలేరు' (కాలరీస్) పని కష్టమని చెబుతాడు. అతని భార్య సుగుణ 'కాలేరు'(కాలరీస్) బతుకు బాగుంటుందను కుంటుంది. కాని ఇలా పంపు నీళ్ళ దగ్గర కాళ్ళు పీక్కుపోయేట్లు నిలబడడం, రాళ్ళతోటి బొగ్గు కొట్టి కొట్టి చేతులన్నీ నాశనమవుతన్నాయని, చుట్టూ పందులు తిరిగే గుడిసె లోపలికి పోవాలన్న, బయటకు రావాలన్నా, వంగి వెళ్ళాలని, పశువుల కంటే హీనంగా తన బతుకు ఉందని వాపోతుంది. ఇదే కథలో రాజలింగం తన జీతంలో చాలా భాగం సారాయికి పోతుందనీ, డ్యూటీ నుండి ఇంటికి వచ్చి రెస్టు తీసుకుందామనుకుంటే ఇంటి చుట్టు మురుగు కాలవల్లో దోమల బెడదలకు కునుకు పట్టదని, సారా తాగితే ఒళ్ళు మరచి నిద్రపోతానని అంటాడు. ఆ మాటలు విన్న క్రిష్ణయ్య అంతకు ముందు కార్మికులు తాగుబోతులనీ, బాధ్యత లేకుండా ప్రవర్తిస్తారని అనుకున్నాడు కాని వీళ్ళ కష్టానికి, మనశ్శాంతికై తాము అనుభవించే దుర్భర కష్టపూరిత జీవితాలకు తాత్కాలికంగానైనా ఆ కష్టాన్ని మరచిపోవడానికి కార్మికులకు తాగడం తప్పనిసరి అవుతుందని ఇప్పుడు అర్థం చేసుకుంటాడు. దీనిలో కొంత వాస్తవముందని కార్మిక వాడలకు వెడితే అర్థం అవుతుంది. అన్ని రకాల కాలుష్యాల మధ్య కార్మికులు పని చేస్తున్నారని భావించి ప్రజల దుర్భర జీవితాలు ప్రస్థానంతో గాని పూర్తి గావని అది మహా ప్రస్థానంగా మారాలి అనుకుంటాడు కృష్ణయ్య.

'అగ్గి' అనే కథలో సైరన్ కూయగానే బొగ్గు పొయ్యిలు అంటించి స్త్రీలు పంపు నీళ్ళ కోసం పరుగులు తీసేవిధంగా కార్మిక స్త్రీలతో ఆ వాడంతా హడావుడిగా ఉంటుంది. మల్లమ్మ పొయ్యి వెలిగించి అన్నం వండి దించి భర్తను లేపి గుడిసెయొక్క తడక దగ్గరగా వేసి తను పంపు నీళ్ళు తెచ్చే లోపల కుక్క అన్నం తినేస్తుంది. మళ్ళీ అన్నం పొయ్యి మీద పడేసి భర్తను చూడమని చెప్పి పంపు దగ్గరకు వెళ్ళి నీళ్ళ బిందెతో తిరిగి వస్తుంటే ఆ పొగ చిమ్మిన వాతావరణంలో మురుకు కాలువల మధ్య తిరుగుతున్న పందులు అడ్డు పడడంతో ఆమె అడుగు తప్పి క్రింద పడుతుంది. ఆ కాలుకి ఫ్రాక్చర్ అయ్యేసరికి వైద్యం చేయించడం కోసం భర్తకు సెలవు లేక డ్యూటీకి వెళ్ళి మస్టరు వేయించుకొని, ఆఫీసరును అడిగి యింటికి వచ్చి భార్యను ఆసుపత్రికి తీసుకొని వెడతాడు. కాని అక్కడ డాక్టరు పరీక్ష చేస్తూనే మధ్యలో ఆపి అక్కడకు వచ్చిన ఆఫీసరు

దగ్గరకు వెడతాడు. అతడు బజారుకు అని వెళ్లి స్కూటరు ప్రమాదంలో కాలికి దెబ్బ తగిలిన ఒక ఆఫీసరు. అతడు వస్తే అతనికి వెంటనే డాక్టరు వైద్యం చేయాలనుకోవడం జరిగింది. పైపెచ్చు ఈమెకు చేస్తున్న వైద్యాన్ని మధ్యలో ఆపి మరీ ఆఫీసరుకు వైద్యం చేయడం గమనించగా సంక్షేమ కార్యక్రమాల అమలులో కూడా ఎంత వర్గ స్వభావం ఉంటుందో తెలిపే కథగా కనబడుతుంది. ఇలాంటి పరిస్థితులను చక్కబెట్టాల్సిన అవసరం, బాధ్యత అందరిపైనా ఉంది. పైగా కార్మిక కుటుంబంలో సౌకర్యాలు లేకపోతే కుటుంబ వ్యక్తులు అనారోగ్యానికి గురి అయితే వాళ్లు ఉత్పత్తి రంగంలో పాల్గొనలేని స్థితి స్పష్టమై కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు సరిగా లేక ఏర్పడిన ఆ కుటుంబ సమస్యలు ఉత్పాదకత పై ప్రభావం చూపించగలవని కూడా అర్థం అవుతుంది.

శత్రువు అనే కథలో బదిలీ వర్కరైన లింగయ్య త్రీ ఎ సీములో వంగి తట్ట మోసే పని చేసి చాలా అలసిపోయి ఇంటికి వస్తాడు. ఎదురుచూస్తున్న భార్య సుగుణ భర్త రావడం ఆలస్యమయ్యే సరికి ఇంట్లో దోమలు కుట్టడంతో నిద్ర పట్టక అసహనంగా ఉంటుంది. భర్తకు పెట్టకుండా అన్నం తినాలని కూడా అనిపించదు ఆమెకు. ఇంటికి రాగానే ఆలస్యమయిందేమని అడిగిన సుగుణతో లింగయ్యకు మాట్లాడాలనిపించలేదు. స్నానానికి కూర్చుంటే భార్య వచ్చి వీపు రుద్దితే రాపిడి తట్టుకోలేక మంట పుట్టి భార్యను విసుక్కుంటాడు. అన్నం పెడితే చల్లారిందని విసుక్కుంటాడు. అలిసిన భర్త వెంటనే పడుకునే సరికి అంతవరకు భర్తకోసం ఎదురుచూసిన సుగుణ నీరుకారిపోతుంది. గుడిసెలో నిద్రపట్టక, బయట వెన్నెల్లో కూర్చుని, తాము పల్లెటూళ్ళలో సహజ వాతావరణంలో గడిపిన తమ కుటుంబాన్ని తన భర్తకు, తనకు మధ్యనున్న ఆనాటి ప్రేమానుబంధాలను తలచుకుంటుంది. కాని దోమలు కుడుతుంటే నిద్రపట్టని భర్త వెన్నెలలో ఒంటరిగా కూర్చున్న భార్య మీద అనుమానం తెచ్చుకుని ఆమెను జుట్టు పట్టి ఈడ్చుకు వచ్చేసరికి మనస్సులను శత్రుపూరిత సంబంధాలలోని తీసుకుని వెళ్లినట్లు అర్థం అవుతుంది. అంతేకాక ఈ కథలో మిగిలిన కార్మికులు కూడా గని పని కష్టం నుండి విముక్తికై తాగొచ్చి భార్యలను చావబాదడం, భార్యల్ని అనుమానించి అవమానించడం కార్మిక వాడలో ఉండే సహజ విషయంగా అర్తం అవుతుంది. ఈ సందర్భంలో సింగరేణి సంస్థ గ్యాస్‌ని డోర్ డెలివరీగా సప్లై చేయడం ఈ కథలోని బొగ్గు తెచ్చుకునే సమస్యకు పరిష్కారంగా అర్థం అవుతుంది. మహానది కోల్ ఫీల్డులో గ్యాస్ డోర్ డెలివరీ లేదని చెబుతూ కార్మికులు తమ ఇబ్బంది వెల్లడి చేశారు.

రాక్షసులు అనే కథలో కూడా గనిలో పనిచేసే కార్మికులు త్రాగడం, జీతాల రోజున తాగి ఇంటికి వచ్చి భార్యలను చావబాదడం, భార్య ఇంటి ఖర్చులకు డబ్బులు అడిగినా కొట్టడం వంటివి కార్మిక కుటుంబాలలో భార్య, భర్తల సంబంధాలను శత్రుపూరిత సంబంధాలుగా మారుస్తున్నాయి. తల్లిదండ్రులు అలా పోట్లాడుకుంటుంటే ఇంట్లో కొడుకులు తండ్రిని రాక్షసుడిగా భావించడం కనబడుతుంది. అంతేకాక నీళ్ల పంపు దగ్గర స్త్రీలు కూడా శత్రుపూరిత సంబంధాలలోకి వెళ్లడంగాను, స్పష్టమవడం చేత పారిశ్రామిక సంబంధాలలోని సంక్లిష్టతలు ఇటు మానవ సంబంధాలను ఎలా శత్రుపూరిత సంబంధాలుగా మారుస్తున్నాయో కూడా అర్థం అవుతుంది.

అంతర్మథనం అనే కథలో కూడా ఇలాగ బొగ్గు పొరల మధ్య మృత్యువుతో పోరాడి పోరాడి బయటకు వచ్చేసరికి మనస్సు కర్కశంగా మారి తండ్రి తల్లిని తిట్టటంగా అర్థం చేసుకుంటాడు కొడుకు. అందుకే జీవితంలో మానవతా దృష్టితో శ్రమను అర్థం చేసుకుంటేనే ఆనందం ఉంటుందని అనుకుంటాడు.

పెండ్లి అనే కథలో తండ్రి డ్యూటీ నుండి దిగి ఆ వచ్చిన డబ్బులతో పిల్లకు ఖర్చు పెట్టి పెళ్ళి చేయడం, పెళ్ళికొడుకు తల్లి ఇంట్లో సామానంతా లాంఛనాల క్రింద తీసుకునిపోతే అతనికది దోపిడిగా అనిపించడం, అది గనిలో కార్మిక శక్తిని దోపిడి చేసుకోవడం కంటే కూడా ఎక్కువే అని పిచ్చి వీరయ్య చెప్పడం కనబడుతుంది. గని ప్రమాదంలో వీరయ్య కాలు విరిగి కుంటివాడయితే ఆ సందర్భంలో అతని భార్య అతన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతే వీరయ్య పిచ్చివాడిగా మారిపోతాడు. ఇలాగే గని పని కష్టం కుటుంబ సంబంధాలను ప్రభావితం చేసి కుటుంబ సమస్యలకు కారణం అవుతుందని తెలుస్తూంది. ఇక్కడ పితృస్వామ్యపు పోకడలకు అధికార వ్యవస్థ గల పారిశ్రామిక సంబంధాలకు ఉన్న సామ్యాన్ని సామాజిక- సాంస్కృతిక నంబంధాల సమ్మేళనంగా పారిశ్రామిక ఆర్థిక సంబంధాలు అర్థం అవుతాయి.

సింగరేణి మండుతోంది అనే నవలలో సంక్షేమ కార్యక్రమాల అమలు సరిగ్గా లేకపోగా కార్మికులు కౌటుంబిక సమస్యలతో సతమతమవుతుంటే అతడే విధంగా ఉత్పత్తిని సంతృప్తికరంగా తీయగలడని ప్రశ్నకు పెట్టడం జరిగింది. కార్మికులకు గుహల వంటి గృహ కల్పన, వీధి దీపాలు, మంచి నీటి సౌకర్యం, డ్రైనేజీ నిర్మాణం లేకపోయేసరికి కార్మికులు దీన పరిస్థితులలో ఉండడం చేత వారికి మనశ్శాంతి కరువవుతోందని, అది ఉత్పత్తి మీద ప్రభావం

చూపించుతుందని కార్మికుల మనశ్శాంతియే పారిశ్రామిక శాంతి అని నిర్దేశించడం కనబడుతుంది. కార్మికుల ఇంటి దగ్గర మురుగు పోయే సౌకర్యం లేక దోమకాటుతో జ్వరం ఎక్కువయ్యేసరికి డ్యూటీకి నాగాలు ఎక్కువయ్యాయని నిరూపించుతూ అధికార్ల ఇంటి ముందు ఉద్యానవనాల పెంపకానికి కార్మికులు చెమటోడ్చితే వచ్చిన డబ్బుని ఖర్చు చేయడానికి మేనేజిమెంట్ వెనకాడడం లేదని బాధపడడం కూడా కనబడుతుంది. ఆసుపత్రిలో దొరలకున్న సౌకర్యాలు కార్మిక కుటంబాలకు లేవని బాదపడ్డారు. కార్మికుడు చనిపోతే వచ్చిన డబ్బును తల్లికి కొడుకులను, కొడుకులకు తల్లులను శత్రువులుగా చేసి డబ్బివ్వకుండా తిప్పుకుంటూంటే మానవ సంబంధాలకు హాని కలుగుతుందనీ బాధపడడం జరిగింది. కంపెనీ స్కూళ్లలో విద్యార్థుల విషయంలో టీచర్లు వర్గ స్వభావం చూపించడం చేత పిల్లలకు చదువంటే ఏహ్యత కలుగుతోందని చెప్పడం జరిగింది. డీపిల్లరింగ్ వర్కు దగ్గరున్న కార్మికుడికి వృత్తి రక్షణ కరువు అవడమే గాక ఇంటి దగ్గర పిల్లవాడికి వచ్చిన జ్వరానికి కూడా కంపెనీ హాస్పిటల్‌లో వైద్యం సరిగా చేయకపోవడం మరియు ప్రైవేటు వైద్య ఖర్చులు గుర్తుకు వచ్చి కార్మికుడికి మనశ్శాంతి కూడా కరువు అవుతుంటే ఉత్పత్తి పై దాని ప్రభావం ఉంటుందనేది స్పష్టం చేయడం జరిగింది.

నల్లవజ్రం అనే నవలలో శంకరయ్య దగ్గరలోనున్న బొగ్గు బావికి బదిలీ అడిగినా ఒప్పుకోకపోతే దూరమైన గనిలో ఉద్యోగం చేయాల్సిరావడం రోజు తన గుడిసె నుండి వెళ్లి రావడంతోనే కాళ్లు గుంజడంతో డ్యూటీ చేయలేక నాగాలు పెట్టడం, జీతం కోతలో ఇంటి ఖర్చులకు డబ్బు సరిపోకపోవడం అవన్నీ వెరసి కుటుంబ సమస్యలుగా పరిణమించడం కనబడుతుంది.

పురుడు అనే కథలో ఓదేలు తన కొడుకును సింగరేణి కంపెనీ బడిలో వేద్దామని వెడితే సీట్లు లేవని చెబితే గవర్నమెంట్ బడిలో చేరుస్తాడు. మిగిలిన బళ్లలో ఫీజులు కట్టలేక ఆ పని చేస్తే 10వ తరగతి ఫెయిల్ అయి ఆగం ఆగం అయితే ఓదేలుకు కొడుకంటే అసహ్యం వేసిందని చెబుతాడు. సింగరేణి మండుతోంది అనే నవలలో, బొగ్గు పొరల్లో సమ్మె వంటి కథలలో కార్మికుల పిల్లలకు ఒక పట్టాన సింగరేణి బడిలో సీటు రాదనీ, దొరల పిల్లలే ఆ స్కూళ్లల్లో చదువుకుంటున్నారనీ కార్మికులు బాధపడ్డారు. అయితే ఇలాంటి సంక్షేమ విషయాలను గ్రీవెన్స్ సెల్‌లో పెడితే సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుందని భావించవచ్చు. దీనికి చిత్తశుద్ధి చాలా అవసరం.

బొగ్గు పొరల్లో అనే కథలో వసతి లేని కార్మికులు గుడిసెలో నీళ్ల పంపు దగ్గర తగాదాలు చూస్తే ఎంత బావి పని చేసినా తాగడానికి నీళ్లు ఉండవని కార్మికులు భావిస్తారు. గని పనిలో శరీరం అంతా పచ్చి పుండు అవుతుందనీ, గుడిసెలో సౌలత్ ఉంటే బాగుంటుందనీ, మురుగు కాలువల మీద దోమల బెడదతో ఉడకపోతకి నిద్రపట్టక తాగి పడుకుంటామని చెప్పడం జరిగింది. కార్మికులు సారాయికి అలవాటు పడడానికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకీ సంబంధం ఉందనీ అర్థం అవుతుంది. అంతిమంగా శక్తి నిర్వీర్యమై నాగా పెట్టినా, నిద్ర పోయినా, దాని ప్రభావం ఉత్పత్తి ఉత్పాదకత పైనే గాక, ప్రమాదాలు మానవ తప్పిద గని ప్రమాదాలు సంభవించి అటు పారిశ్రామిక, ఇటు మానవ సంబంధాలు కూడా మంట కలిసిపోయే అవకాశం ఉందని భావించాలి.

బండ కింద బతుకుల్లో అనే స్వగతంలో తప్పు చెయ్యని గాడిద ఎవడు అనే శీర్షిక కింద కార్మికులు ఇంట్లో బొగ్గుకై డ్యూటీ నుండి సైకిల్ మీద పెట్టుకుని బొగ్గు పెళ్ళని తీసుకుని వెడితే చార్జిషీటు ఇవ్వడాన్ని నిరసిస్తాడు. వంట చెరుకుకై వారానికి ఒకసారే ఇచ్చే బొగ్గు బస్తా సైకిల్ మీద పెట్టుకుని తెచ్చుకోలేనితనం శత్రువు కథలోను స్పష్టమవుతుంది.

నల్లవజ్రాలు అనే సింగరేణి పాటలలోను, నాటకాలలోనూ కార్మికులకు కుటుంబ సంక్షేమం కరువైందనే అసంతృప్తుల జ్వాలలు స్పష్టమవుతాయి.

నిర్ణయం కథలో తమ కుటుంబాలకు కావాల్సిన కనీస సౌకర్యాలు లేవని బాధపడ్డారు.

రాజీ, బొగ్గు పొరల్లో, నీళ్ల కోసం, అగ్గి రాక్షసులు అనే కథలలోనూ, సింగరేణి మండుతోంది నవలలోనూ కార్మిక కుటుంబాలు మంచినీటి సౌకర్యం లేక ఎంత ఇబ్బంది పడ్డారో అర్థం అవుతుంది.

'రాజీ' అనే కథలో ఆఫీసర్ల పెళ్ళాల కోసం స్విమ్మింగ్ పూల్స్ కొరకై లక్షలు ఖర్చు పెడతారు గానీ, బొగ్గును తీసి కష్టపడే కార్మికుల కుటుంబాలకు నీళ్ల వసతి లేదని పేర్కొంటారు. బొగ్గు పొరల్లో, ప్రస్థానం, రాక్షసులు కథలలో, పంపునీళ్ల దగ్గరకు వచ్చేసరికి కార్మిక కుటుంబ స్త్రీలు శత్రు సంబంధాలలోకి వెళుతున్నారనేది అర్థం అవుతోంది. ఈ విషయం మానవ సంబంధాల అభివృద్ధికి గొడ్డలి పెట్టువంటిదని మంచినీళ్ల సమస్య తీరిస్తే మానవ సంబంధాలు పటిష్టం కాగలుగుతాయనే స్పృహ కలగక మానదు. నీళ్ల కోసం కథలో కార్మిక కుటుంబ స్త్రీలందరూ కలిసి కట్టుగా ఉద్యమించి అధికార్లను ఘెరావ్ చేసి మరీ పంపులను

వేయించుకోవడం, కార్మికుల యొక్క చైతన్యమే కాక కార్మిక కుటుంబ స్త్రీల చైతన్యం కూడా పారిశ్రామిక సంబంధాలపై ప్రభావం చూపగలుగుతుందని అర్థం అవుతోంది.

అగ్గి అనే కథలో నీటి వసతి లేక, ఆమె బజారు పంపుకు వెళ్ళి నీళ్ళు తెచ్చుకోవడానికి తెల్లవారు జామున పొగమంచులో వెళ్లడం. పారిశుధ్య వసతి లేని గుడిసెల సందులో తిరిగే పందులు కాలికి అడ్డం రావడంతో కార్మిక కుటుంబ స్త్రీలు పడిపోవడం, ఆమె వైద్యానికై కార్మికుడు డ్యూటీలో మస్టరు వేయించుకున్నా పని చేయలేక భార్య కాలును గురించిన ఆందోళనపడి ఇంటికి వచ్చి హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాలనుకోవడంగా స్పష్టమవుతుంది. అతను ఉత్పత్తిపై దృష్టి నిలకపోవడానికి కుటుంబ విషయం కారణం అయింది. కాబట్టి కార్మిక కుటుంబ సంక్షేమం కూడా పారిశ్రామిక ఉత్పత్తిపై పరోక్ష ప్రభావం చూపుతుందనేది స్పష్టమవుతోంది.

సింగరేణిలో మొత్తం 7 హాస్పిటల్స్‌లో కలిపి 1020 బెడ్ల సౌకర్యం ఉండగా 43 అల్లోపతి వైద్య విధాన శాఖలలోను, 2 ఆయుర్వేదిక హాస్పిటల్స్ ద్వారాను సింగరేణి సిబ్బందికి సంస్థ వైద్య సౌకర్యం అందిస్తుంది. అంతేగాక ఆరోగ్య విద్య ప్రచారంలో భాగంగా పారిశుధ్యం పరిశుభ్రత, మలేరియా, ఎయిడ్స్ వంటి వ్యాధి నిరోధక చర్యలను కార్మిక వాడలలో చేపట్టడం, గుణాత్మక పరిణామం. సింగరేణిలో మందులు హాస్పిటల్‌లోనే ఇవ్వడం పరిపాటి. కాని మహానది కోల్ ఫీల్డులో హాస్పిటల్స్‌లో అందుబాటులో లేని మందులు డబ్బులు పెట్టి వెచ్చించి బయట కొనుక్కుంటే సంస్థ డబ్బు చెల్లిస్తుంది.

నీడకోసం అనే కథలో కార్మికులకు గృహ వసతి లేకపోవడం, భార్య, భర్త సంబంధాలకు అనుకూలమైన కుటుంబ వాతావరణం గల నిర్మాణానికి వీలుగా వసతి లేకపోవడం. దానికోసం వారు ఖాళీ చోట గుడిసెలు వేసుకుంటే పోలీసుల సహాయంతో అధికార్లు పీకించడం జరుగుతుంది. దానికి బాధపడి కార్మికులు ప్రాథమిక అవసరాలు తీరకపోతే పారిశ్రామిక సంబంధాలలో కార్మికులు అశాంతికి లోను అవుతారని ఆ అశాంతియే ఉద్యమాన్ని రేకెత్తిస్తుందని స్పష్టం చేయడంగా అర్థం అవుతుంది.

గొడుగు కథలో కృష్ణయ్య ఇంట్లో కొత్త గొడుగు కొనుక్కోవడానికి తగిన ఆర్థిక వ్యవస్థ లేకపోయేసరికి అతని భార్య శ్యామల అతనిని ఒక తెలివి తక్కువవాడిగా భావించడం, కుటుంబ సంబంధాలలో కార్మికుల ఆర్థిక స్థితిగతులు

కార్మికులను అశాంతికి గురిచేయడంగా అర్థం అవుతుంది.

'ప్రస్థానం', 'బొగ్గు పొరల్లో', 'నల్ల వజ్రం', 'శత్రువు' వంటి కథలలో కార్మిక వాడలలో మురుగు నీరు పోయే సౌకర్యం లేక దోమల బెడద ఎక్కువై నిద్ర లేకపోయేసరికి వారికి గనిలో పనిచేయడం ఎంత కష్టంగా ఉంటుందో అర్థం అవుతుంది. అంతేగాక బొగ్గు పొరల్లో అనే కథలో ఎల్లారెడ్డి నిద్రలేక తూగుతూ గని పనిలో పరాకుగా ఉండడం చేతనే అతడు ప్రమాద సూచనను వినలేక ప్రమాదానికి గురి అవడం స్పష్టం అవుతుంది. సింగరేణి మండుతోందని అనే కథలో సింగరేణి బడులలోని టీచర్ల వర్గ స్వభావాన్ని చూపించటంతో కార్మికుల పిల్లలు చదువుకోలేక పోతున్నారనేది వ్యక్తం చేయడం ఆలోచించాల్సిన విషయం. విద్యా సౌకర్యాల విషయంలో జెబిసిసిఐలో 5వ వేతన ఒప్పందం ప్రకారం 8 కోట్ల కేటాయింపు ఉన్నప్పటికీ అస్తవ్యస్తత చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఉంటుంది. దీనికై అవగాహన ముఖ్యం. అత్యంత పక్షపాతంతో కూడిన వర్గ స్వభావపు పోకడలో కార్మికుల పిల్లల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయనే భావన కార్మికుల్లో అశాంతిని కల్పించకమానదు. కార్మికులు తాము చదుకోకపోయినా తమ పిల్లలైనా చదువుకుని అధికార స్థాయి ఉద్యోగాలు చేయ్యాలని ఆశించడం సహజం.

పురుడు అనే కథలో కంపెనీ బడిలో తన కొడుకుకు సీటు రాకపోయేసరికి ప్రయివేటు బడిలో చదివించలేక ప్రభుత్వ బడిలో పెడితే ఆగం ఆగం అయినట్లు చెప్పడం, 'పోరుబాట'లో కథలో కూడా కార్మికుల పిల్లలతో సింగరేణి స్కూల్సులో ప్రవేశం తక్కువగా ఉన్నదని భావించడం జరిగింది. ప్రభుత్వ సహాయం ఉన్నా, లేకపోయినా సంస్థలో కార్మికులు, అధికార్ల యొక్క సంఖ్యా నిష్పత్తిని పట్టి వారి పిల్లలకు సింగరేణి విద్యా సంస్థలలో సీట్లు కేటాయించగలిగితే ఈ అపోహ కొద్ది వరకు తగ్గుతుంది. బండకింద బతుకులు అనే స్వగతంలో తప్పు చెయ్యని గాడిద ఎవరు అనే శీర్షిక కింద, శత్రువు కథలోనూ కూడా కార్మికులు వంట చెరుకుకై బొగ్గు పెళ్లను సైకిల్ మీద పెట్టుకుని వస్తే తప్పని, చార్జిషీట్లు కూడా ఇచ్చినట్లని అర్థం అవుతోంది. వారికి ఒకసారి బస్తా బొగ్గును సైకిల్ మీద తీసుకొచ్చి పెట్టుకోవడానికి, డ్యూటీ చేసిన కార్మికులకు ఇబ్బందిగా ఉందనీ అధికార్లకు లాగా కార్మిక వాడలో ఇళ్ళకు సప్లై చేసినా బాగుండేది. ఇలా కార్మికులు అసంతృప్తికి లోను కావడం కనబడుతుంది. అయితే ఇప్పుడు ఇంటింటికి గ్యాసు సప్లై ఉండడంతో ఆ సమస్య తీరిపోయింది.

నల్లవజ్రం అనే కథలోను, సింగరేణి పాటలలోను, నాటకాలలో, సింగరేణి మండుతోంది నవలలో కార్మిక కుటంబ సంక్షేమం కరువవుతోందని ఆవేదన వెల్లడించారు. సింగరేణి మండుతోంది అనే నవలలో కార్మికులు కౌటుంబిక సమస్యలతో సతమతమవుతుంటే అతడే విధంగా ఉత్పత్తిని తీయగలడని ప్రశ్నకు పెట్టడం జరిగింది. గృహ కల్పన, వీధి దీపాలు, మంచి నీటి సౌకర్యం, డ్రయినేజి నిర్మాణం లేకపోయేసరికి కార్మికులు వాళ్ల కుటుంబాలు దీన స్థితిలో ఉండడం తత్ఫలితంగా కార్మికులకు మనశ్శాంతి లేకపోవడమో పారిశ్రామిక అశాంతికి కారణభూతమౌతుందని చెప్పడం జరిగింది. సింగరేణి సాహిత్యంలో కార్మిక కుటుంబ చిత్రణ జరిగిన చోటల్లా అరకొర సౌకర్యాలలో ఇబ్బంది పడుతున్న కార్మిక జీవితాలు అర్థం అవుతాయి. కార్మిక సంక్షేమ కార్యక్రమాలకు చట్టబద్ధత లేకపోయినా కార్మికుల యొక్క మరియు కార్మిక కుటుంబాల సంక్షేమం సంస్థ శ్రేయస్సనే భావనతో యాజమాన్యం వారికి తగిన సౌకర్యాలు కల్పించాలి. దానివల్ల ఉత్పత్తి వల్ల తాము సౌకర్యాలు పొందుతామనే భావన వస్తుందని లేకపోతే ఉత్పత్తియే పరాయిదయినట్లుగా భావించితే కార్మికులు పరాయీకరణ భావాలతో సంస్థను ఆలోచిస్తే కార్మిక భాగస్వామ్యమనే పదానికి అర్థ మారి, కార్మిక సామర్థ్యం కుంటుపడితే సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని గ్రహించాలి.

ముఖ్యంగా మానవీయ సంబంధాలతో ఆలోచించి కార్మిక సంక్షేమ కార్యక్రమాలను సజావుగా అమలు జరిగేలా చూడాలి. కార్మిక సంక్షేమంతో కూడిన ఉత్పత్తి పెరుగుదలయే సంస్థ అభివృద్ధిగా భావింపబడుతుంది.

సింగరేణి కార్మికులు సింగరేణి సాహిత్యంలో తమ అసంతృప్తులను వెల్లడి చేసుకోగలిగే స్థాయిలో చైతన్యం వచ్చినందుకు, యాజమాన్యం కూడా సంక్షేమ దిశగా ముందడుగు వేసిందని చెప్పక తప్పదు. మొత్తం లక్షా 16వేల మంది కార్మికులున్నారు. వారు ఇప్పుడు 2002 నాటికి 96,000లకు కుదించబడ్డారు. మహానది కోల్‌ఫీల్డ్సులో 60 శాతం కార్మికులకు గృహవసతి కల్పించగా సింగరేణి మాత్రం 46శాతం గృహ వసతి సౌకర్యం కల్పించగలిగింది. ఇంకా 104 నిర్మాణంలో ఉన్నాయని అర్థం అవుతుంది. నీటి సరఫరా విషయంలో 46వేల వ్యక్తిగత పంపులు, 4550 కమ్యూనిటీ పంపులు, 523 బోర్‌వెల్స్, 130 కమ్యూనిటీ ట్యాంకులు 2858 ప్రయివేటు ఇండ్లకు పంపు కనెక్షన్లు యిచ్చినట్లు నివేదికలు తెలియచేస్తున్నాయి. 42,755 మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. సింగరేణి సహకార సంఘాలు ప్రతి బొగ్గుబావి దగ్గర ఏర్పడడం జరిగింది.

ఒక అప్పర్ ప్రైమరీ, 16 సింగరేణి స్కూళ్లు, ఒక డిగ్రీ కాలేజి, ఒక జూనియర్ కాలేజీ, ఒక యం.సి.ఏ. కాలేజి నిర్వహణకు సుమారుగా సాలుకు 8 కోట్ల రూపాయలను సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా కేటాయింపును సంస్థ నిర్ణయించింది. వీటిల్లో కొన్నింటికి ప్రభుత్వ గ్రాంటు లభిస్తుంది. మహానది కోల్‌ఫీల్డ్స్ ఏరియాలో రెండు కేంద్రీయ విశ్వ విద్యాలయాలు, ఎనిమిది డి.ఎ.వి. స్కూల్సు, 23 ప్రయివేటు స్కూల్సు ఉన్నాయి. సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌తో 23 స్కూళ్లని ఒరిస్సా స్టేట్ గవర్నమెంట్ ప్రభుత్వ విద్యాలయాలుగా తీసుకోవడం జరిగింది. మహానది కోల్‌ఫీల్డ్స్ సంస్థ మేనేజ్‌మెంట్ గ్రాంటు కింద 34లక్షల రూపాయలు స్కూళ్లకి ఇస్తుంది. అయితే 60శాతం పైగా మార్కులు తెచ్చుకున్న వారికి జనరల్ స్కాలర్‌షిప్ రూపంలో నెలవారి స్కూలు ఫీజులు కట్టడం అక్కడ ఉన్నది. 1 నుండి 200 ర్యాంకుల లోపు తెచ్చుకున్న విద్యార్థులకు స్కూలు చదువుల కింద 200 రూపాయల చొప్పున డిగ్రీ కోర్సుల వారికి 250 రూపాయల చొప్పున, ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులకు 350 చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. సింగరేణి విద్యా సంస్థలను కూడా ప్రభుత్వానికి అప్పగించగలిగితే సంస్థపై కొంత భారం తగ్గుతుందనేది స్పష్టం.

అయితే యీ కేటాయింపుల కంటే కూడా కష్టించి పనిచేసే సింగరేణి కార్మికులు ఎంతమంది ఆ సౌకర్యాలను వినియోగించుకుంటున్నారనేది ప్రత్యేకంగా ఆలోచించాల్సిన విషయం.

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు మెడిసిన్, ఇంజనీరింగ్ సీట్లను పొంది మంచి ర్యాంకులు పొందితే ఏడాదికి ఆరువేలు ఇస్తున్నారు. బంగారు పతకాలను కూడా ఏర్పాటు చేశారు. అంతేగాక అక్షరాస్యతా కార్యక్రమాలను అటు కార్మికులకు, ఇటు కార్మిక కుటుంబాలలోని మహిళలకు ఏర్పాటు చేసి అక్షరాస్యతను అభివృద్ధి చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. మహానది కోల్‌ఫీల్డ్స్‌లోని కార్మికులలో 75 శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు. ఇంకా కార్మికులను కూడా సంక్షేమ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేసేందుకు సింగరేణి సేవా సమితిని ఏర్పాటు చేశారు. అంతేగాక ప్రత్యేక సంక్షేమ సదుపాయాల కార్యక్రమాలకై స్వాప్ (స్పెషల్ వెల్ఫేర్ ఎమినిటీస్ ప్రోగ్రాం) కింద 1997 నుండి అభివృద్ధికర కార్యక్రమాలను చేపట్టడం యాజమాన్యానికి కార్మిక సంక్షేమం పట్ల ఉన్న దృక్పథానికి నిదర్శనం. స్వాప్ కార్యక్రమాల క్రింద రోడ్లు, వీధి దీపాలు, నీటి సరఫరా, పారిశుధ్యం, సులభ కాంప్లెక్సు నిర్మాణం, స్నానాల గదుల నిర్మాణం

పాడైన తలుపులు కిటికీలు స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను ఈ స్వాప్ చేపడుతుంది. దీనికోసం 1997-98 సంవత్సరానికి 4,55,036, 98-99 నాటికి 37,329, 99-2000కు 1150.00 లక్షలు, 2001-2002కి 24 కోట్లుగా అంచనా వేశారు. అంతేగాక సింగరేణి సంస్థ సంక్షేమ కార్యక్రమాల క్రింద మొత్తం 250 కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది.

మహానది కోల్ ఫీల్డ్స్‌లో 22వేల సిబ్బందికి గాను సంక్షేమ కార్యక్రమాల క్రింద 50 కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని అర్థం అయింది.

యాజమాన్యం ఒక ప్రక్క నష్టాల ఒడిదుడుకుల నుండి బయట పడుతూనే మరొక ప్రక్క సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేయడం నిజంగా అభినందనీయమైన విషయం. పైగా మీట్ ది జి.యం. కార్యక్రమాలు చేపట్టి మరీ కార్మికుల సమస్యలను, కుటుంబ సంక్షేమం పరిశీలించాలనుకునే యాజమాన్యపు ప్రయత్నాలు సంస్థ ఉత్పత్తిపై ఒక గుణాత్మక ప్రభావాన్ని చూపించుతాయి అనడంలో సందేహంలేదు.

శత్రువు కథ చాలా ఆలోచింపచేస్తుంది. కార్మికులకు పని భారం ఎక్కువైతే ఇంటికి వచ్చి భార్యను విసుక్కోవడం, భార్య చిన్నబుచ్చుకోవడం, కుటుంబ సంబంధాలలో ముఖ్యంగా భార్యాభర్తల సంబంధాల విషయంలో కూడా కార్మికుడు పనిలో పడ్డ శ్రమ ప్రభావాన్ని చూపడం అర్థం అవుతుంది. అంతేగాక ఉత్పత్తి తమకు పరాయిదూనట్లు ఇంట్లో భార్య కూడా పరాయిదేపోతుందన్న భావంతో అనుక్షణం మానసిక ఒత్తిడికి గురి అవుతుంటే పిత్రుస్వామ్య సంసక్కృతి ప్రభావం ఎక్కువై కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమవడానికి ఎక్కువ ఆస్కారముంటుంది.

5. యాజమాన్యం - సమస్యలు

సింగరేణి సాహిత్యంలో కార్మికులు, కార్మికేతరులు స్వీయానుభవాలను లేదా కార్మికుల అనుభవాలను తమ అనుభవంలోకి తెచ్చుకుని కార్మికుల సమస్యలకు అద్దం పడుతూ సాహిత్య సృష్టి జరుగుతూనే ఉంది. కార్మికులు తమ పని ప్రదేశాల గురించి, తోటి కార్మికులతో సంబంధాల గురించి, యూనియన్ తోటి సంబంధాల గురించి, యాజమాన్యంతో ఉన్న సంబంధాలలోని అసంతృప్తులను గురించి నిరసనను తెలియచేస్తూ సమ్మెలను ఆయుధంగా చేసుకోవడం సింగరేణి సాహిత్య ప్రక్రియలో అన్నింటా స్పష్టమైది. అయితే అదే విషయాలలో యాజమాన్యానికి ఉన్న ఇబ్బందులను కూడా అర్థం చేసుకోవడానికి, పారిశ్రామిక సంబంధాలలో యాజమాన్యానికి కార్మికులతో ఉండే సాధక బాధకాలను సింగరేణి యాజమాన్యం తరపున వచ్చిన ఎమ్.డి. గారి సమాచార లేఖలను పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రపంచీకరణ సందర్భములో ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా బడ్జెట్ నిధులు శూన్యం అవుతున్న తరుణంలో సంస్థ ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ప్రకృతి ప్రసాదించిన కష్టాలతో పాటు, లోతయిన బొగ్గు గనులలో బొగ్గు మరింత లోతుగా ఉండడం, ఉన్న బొగ్గు నాణ్యత తక్కువగా ఉండడం, ఉత్పత్తి శ్రమ ఖర్చు అధికంగా ఉంటుందనే భావన సింగరేణి యాజమాన్యానికి ఉన్నది.

ప్రభుత్వ రంగ సంస్థలలో యాజమాన్యం - కార్మికులు వేరు కాదు. అందరూ ఉద్యోగులే. యాజమాన్యం అధిక పని భారం మోపుతున్నదనీ, ఉక్కు పాదం మోపుతున్నారనీ, హక్కులను హరిస్తోందనీ కార్మికులు అపోహ పడుతున్నారు, గానీ చట్టపరంగా సంస్థలో ప్రతి ఒక్కరికీ సంక్రమించిన హక్కులను ఎవరూ చట్ట విరుద్ధంగా హరించలేరనీ, హక్కులతో పాటు, బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరు విధిగా గుర్తుంచుకొని నిర్వహించాలనీ యాజమాన్యం భావిస్తోంది. రక్షణ సెల్‌తో పాటు ఉత్తమ కార్మికులతో రక్షణ అవగాహన సదస్సులు నిర్వహించాలని భావిస్తోంది. సంస్థల యాజమాన్యపు సభ్యులతోను వివిధ కార్మిక సంఘాల సభ్యులతోనూ కూడుకున్న బొగ్గు పరిశ్రమల ద్వైపాక్షిక సంఘం ఏర్పాటు చేసుకున్న జాతీయ బొగ్గు వేతన ఒప్పందాలను ముందుగా సింగరేణి సంస్థ అమలు చేయడంతో పాటు సింగరేణిలోని ప్రత్యేక పరిస్థితులలో అక్కడ చేసుకున్న ఇతర ఒప్పందాలను కూడా సింగరేణిలో మాత్రమే అమలుపరుస్తూ

అదనపు సౌకర్యాలను కల్గిస్తోంది. బొగ్గు నిల్వలు అయిపోగానే నూతనంగా గనులు ప్రారంభించకుంటే సంస్థకు ప్రగతి లేదు, దానికై ఆర్థిక సామర్థ్యం కావాలి. కొత్త గనులు ప్రారంభించినప్పుడు మాత్రమే ఉద్యోగాలకు భద్రతను కలిగించుకోవడంతో పాటు కొత్తగా ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. సంస్థలో జాగాలు లేకుండా ఉద్యోగంలోకి తీసుకుంటే ఒక కుటుంబం బాగుపడుతుంది. గాని లక్ష కుటుంబాల మీద దెబ్బ పడుతుందని యాజమాన్యం భావిస్తుంది. సక్రమంగా పని చేస్తున్న కార్మికులతోపాటు పని చేయని కార్మికుని కూడా ఒకే రకంగా చూడడం సమానత్వం కాదనీ, పనిచేసే వాళ్ల శోషణ పీడన అవుతుందని భావించింది. కార్మికులలో వ్యక్తిగత నైపుణ్యం పెరిగితే అవసరమైన యంత్రాల విడి భాగాలైన డ్రిల్ బిట్ల వంటి వాటిని సంస్థే తయారు చేసుకోవచ్చని భావించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక నైపుణ్యంతో ఉత్పాదకత సాధిచగలగడమే కాక ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ మార్కెట్ పోటీని తట్టుకోవచ్చని కూడా భావించింది. ఏ ఇతర బొగ్గు పరిశ్రమలలో లేని హెల్పర్‌లు కావాలనీ, పని భారం అంటూ సమ్మెకు దిగడం అన్యాయమని భావిస్తోంది. (మహా నది కోల్ ఫీల్డ్స్‌లో ఇటువంటి హెల్పర్లు లేరని సర్వేలో అర్థం అయింది.) కార్మిక సంఘాలు చర్చలు జరుపుతూ ఒప్పందాలు చేసుకోవడం ద్వారా పారిశ్రామిక శాంతికి సహకరించాలని భావిస్తూ కార్మికుల సమస్యపై గ్రీవెన్స్ ప్రొసీజర్ ద్వారా యాజమాన్యానికి ప్రాతినిథ్యం చేయాలని భావిస్తోంది. యాజమాన్యం త్రైపాక్షిక, ద్వైపాక్షిక ఒప్పందాలను గుర్తింపు పొందిన యూనియన్‌లతోనే చేసుకుంటూ సమస్యల పరిష్కార దిశగా వెళ్లాలని శాంతియుత పారిశ్రామిక సంబంధాలను కోరుకుంటుంది.ప్రభుత్వ రంగసంస్థలు అనుబంధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటూ ఉత్పత్తిని పెంచటమేకాక ఉపసంస్థల ద్వారకూడా ఉత్పత్తులను పెంచుకొని లాభాలబాటలో నడవాల్సివస్తుంది.

బావుల యొక్క ఉత్పత్తి సామర్థ్యం, పని పరిస్థితులు మొదలైన అంశాలన్నింటినీ, క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడ ఎంత మందిని సర్దుబాటు చేయడానికి అవకాశం ఉంటుందనీ అంతమందినీ అవకాశం మేరకూ బదిలీలు చేయడం, వంటి సర్దుబాట్లు చేస్తోంది. అదనపు సిబ్బంది ఉండడంచేత స్వచ్ఛంద పదవీ విరమణ స్కీములను ప్రవేశపెట్టింది. ఒక సంవత్సరంలో 190/240 మస్టర్లు ఉన్న బదిలీలను పర్మినెంటు చేస్తుంది. సంక్షేమ కార్యక్రమాలకు బడ్జెటును వీలయినంత వరకు కేటాయిస్తూనే ఉంది.

సమ్మె చేయడం కార్మికుల హక్కుగా చెబుతున్నా కార్మిక సంఘాలు కార్మికుల పనిచేసే హక్కును అడ్డుకోవడం సరి కాదన్నది యాజమాన్యపు భావన. కార్మికులు యాజమాన్య విధానాలను అర్థం చేసుకుని సంస్థ అభివృద్ధికి పాటుపడాలని భావించింది. ఉత్పాదకతా పెంపునకు ఖర్చుల నియంత్రణతోపాటు, రక్షణ కొరకై మల్టీ డిసిప్లినరీ టీముల వంటివి ఏర్పాటు చేసి యాజమాన్యం కార్మికులను చైతన్య పరిచే చర్యలను తీసుకుంటుంది. అయితే వాటిని యూనియన్లు వ్యతిరేకించడం అంటే పాలనలోని పారదర్శకతను అడ్డుకొని కార్మికులను తప్పుదోవ పట్టించడమే అని భావించింది. చట్ట పరిధిలోని సమస్యలను డిమాండ్లను చట్టం మరియు ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి పరిష్కరించవలసి ఉంటుందనీ, కోర్టు జడ్జిమెంట్‌లకై వేచియున్న సమయంలో చేసే డిమాండ్లు సింగరేణి పరిధిని దాటి ఉంటాయని అవి యాజమాన్యం తెలియచేసింది. అవి సింగరేణి సంస్థ యాజమాన్యపు పరిధిలో పరిష్కరించబడవని కార్మికులు అర్థం చేసుకోవాలని యాజమాన్యం భావించింది. జె.బి.సి.సి.ఐ. ప్రకారం నిర్ణయించిన పని ప్రమాణాలను కార్మిక సర్వీసుకు సంబంధించి మార్గదర్శక సూత్రాలకు నిర్ణయాలను యాజమాన్యం విలువనిస్తుందనీ, శాస్త్రీయపరంగా అధ్యయనం చేసి రూపొందించిన పని ప్రమాణాలను ఖచ్చితంగా అమలు జరగాలని యాజమాన్యం భావిస్తుంది. 1971లో జరిగిన ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ తీర్మానించినట్లుగా కార్మిక సంఘాలు కార్మికుల వ్యక్తిగత అభివృద్ధికి గానీ, అతని కుటుంబ సభ్యుల అభివృద్ధి కొరకు కొన్ని చర్యలు చేపట్టే అభివృద్ధికర దిశగా కార్మిక సంఘాల పాత్ర ఉండాలని నిర్ణయించింది. ఐ.ఎల్.ఒ. నిర్ణయించినట్టుగా కార్మికులు పని నైపుణ్యం పెంచుకునేటట్లు శిక్షణ యిప్పిస్తూ బాధ్యతాయుతమైన కార్మికులుగా కూడా తయారు చేయడం కార్మిక సంఘాల బాధ్యత అని యాజమాన్యం భావిస్తోంది. సిబ్బంది కంపెనీ స్టాండింగ్ ఆర్డర్స్‌ను చక్కగా అవగాహన చేసుకోవాలని పని సంస్కృతికి పెద్ద పీట వేస్తూ పని నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఆశిస్తోంది. రెండవ లేబర్ కమీషన్ రిపోర్టు కూడా దీన్నే సమర్థిస్తూ పని నైపుణ్యం పెంచుకొనని వాళ్లని ఉద్యోగం నుంచి తీయమని కూడా సిఫార్సు చేసింది.

5.1 ప్రభుత్వ విధానం :

1977 నుండి కార్మికులు తమ సమస్యలను వివిధ కథా సాహిత్య ప్రక్రియా రూపాలలోను, పత్రికాముఖంగాను వెల్లడించగలిగారు. అయితే పారిశ్రామిక సంబంధాలలో కార్మికులకే కాక యాజమాన్యానికి కూడా కొన్ని

సమస్యలుంటాయి. కార్మికుల సమస్యలను యాజమాన్యం సదవగాహన చేసుకోవడంతో పాటు కార్మికులు కూడా యాజమాన్యానికి ఉన్న ఇబ్బందులను తెలుసుకోవడానికి ప్రయత్నించగలగాలి. పారిశ్రామిక సంబంధాలలో కార్మికులు, సిబ్బంది, అధికార్లు కలిసికట్టుగా సంస్థ యాజమాన్యంలో భాగస్వాములు కాగలగాలి. ప్రతి స్థాయిలోను తమ వంతు సహకారాన్ని అందించి సంస్థలో కుటుంబ సంస్కృతిని అభివృద్ధి పరచుకోవాలి. పని సంస్కృతికి పట్టం కట్టాలి. లేకపోతే 1985 నాటి ఖాయిలా పరిశ్రమల చట్ట ప్రకారం ఆర్థిక పునర్ వ్యవస్థీకరణ పరిధిలోనికి వెళ్లిందంటే పరిశ్రమ అటునుండి అటే ప్రయివేట్ వ్యక్తుల చేతులలోనికి వెళ్లడం ఖాయం. పరిశ్రమ నిల్వలు పెట్టుబడులూ నికర నిల్వల కంటే తగ్గిపోతే అప్పుడది ఖాయిలా పడ్డ పరిశ్రమ గా బి.ఐ.యఫ్.ఆర్. పరిధిలోకి వెడుతుంది. కంపెనీ నికర మూల ధనంలో 50 శాతం పైగా తరుగుదల ఏర్పడిన కారణంగా మొదటిసారి ఖాయిలాపడే ప్రమాదం ఉన్న కంపెనీగా లెక్కింపబడినా కూడా సింగరేణి సంస్థలోని సమష్టి కృషితో సాధించిన లక్ష్యాల ఫలితంగా 1995లో బి.ఐ.ఎఫ్.ఆర్. నుండి బయటపడింది. కాని మళ్లీ 1995 - 96 సంవత్సరంలో ఉత్పత్తిపై 10 కోట్లు నష్టం రావడంతో పాటు 5వ వేజ్‌బోర్డు జీతాలు ఇవ్వాల్సి రావడంతో 825 కోట్లకు ఆ నష్టం పెరిగింది. 1996-97లో మరొక 276 కోట్ల నష్టం రావడం జరిగి దానిని సరాసరి రోజుకు ఒక కోటి రూపాయల నష్టంగా అంచనా వేయడం జరిగింది. ఈ పరిస్థితుల్లో జీతాల చెల్లింపు కూడా కష్టమైంది. 1995-96 సంవత్సరంలో సుమారు రూ॥ 33 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిలో సమ్మెల వలన నష్టం ఏర్పడింది. ఉత్పత్తి వ్యయం కూడా పెరిగింది. దానికి తగ్గట్టు ధరలు పెంచవలసిన అవసరం ఏర్పడింది. రాయల్టీ బకాయిలుగా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించవలసి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఋణాలపై వడ్డీ చెల్లింపులు తాత్కాలికంగా నిలుపుదల చేసినప్పటికీ లోటు బడ్జెటు ఉండడం జరిగింది. దానికోసం సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రయత్నాలు చేసి కేంద్ర ప్రభుత్వం నుండి 2006 వరకు మారిటోరియమ్‌ను సాధించి తాత్కాలికంగా గట్టెక్కింది. దేశంలో ఇప్పటివరకు ఖాయిలా పడిన పరిశ్రమలన్నింటికీ సమ్మెలే కారణం అని యాజమాన్యం భావిస్తే మిస్‌మేనేజ్‌మెంట్, అస్తవ్యస్త నిర్వహణ అనీ, కేవలం 2% కేసుల్లోనే కార్మికులు కారణమని రిజర్వ్ బ్యాంక్ చెప్పిందని కార్మికులు భావిస్తున్నారు.

భారతదేశంలో 1991వ సంవత్సరంలో మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణం, ప్రైవేటీకరణం

ప్రభావం చూపినందువల్ల ఆర్థిక రంగంలోనూ, పారిశ్రామిక రంగంలోనూ చాలా మార్పులు వచ్చాయి. బొగ్గు పరిశ్రమ మీద దాని ప్రభావం ఉంది. ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సరళీకృత విధానం వలన ప్రభుత్వం సమకూరుస్తున్న ఋణ సహాయము తగ్గుముఖం పట్టింది. కాబట్టి కొత్త బొగ్గు ప్రాజెక్టులకు కావలసిన పెట్టుబడి వనరులను బొగ్గు పరిశ్రమలే సమకూర్చుకోవాల్సి వచ్చింది. ఒకసారి కొన్న యంత్ర సామాగ్రి నిర్ణీత కాలము పనిచేసిన పిదప మరల వాటి స్థానంలో క్రొత్త యంత్రాలు కొనడానికి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాల్సి వచ్చేసరికి, ఉత్పత్తికి సంబంధించిన అన్ని రకాల వ్యయాలపై పొదుపు పాటించాలని భావించడం జరిగింది. పెరుగుతున్న అవసరాలకనుగుణంగా బొగ్గుకు డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి దానికి తగ్గట్టు అధిక ఉత్పత్తిని సాధించి సమస్యలను పరిష్కరించుకోవాడానికి సమ్మెలే సాధనమని తలంచక సామరస్య విధానాలలో పరిష్కరించుకోవాలని కార్మికులను తమ లేఖల ద్వారా చైతన్యపరచగలిగింది యాజమాన్యం. బొగ్గు రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయనీ, మార్పులను గమనించి వాటికి తట్టుకుంటూ ఆ మార్పులనీ తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తేనే సంస్థలు గాని వ్యక్తులు గానీ పురోగమించగలరనీ, విద్యుత్ ఉత్పాదకతను బొగ్గు ప్రాధాన్యత ఉన్నా ఇప్పుడు అణు ఇంధనం మీద ఆధారపడి విద్యుత్ ఉత్పాదకతకు స్వాగతిస్తున్నారని యాజమాన్యము కార్మికులకు తెలియచేస్తుంది.

భారత ప్రభుత్వం మౌలిక రంగాలలో తీసుకువస్తున్న మార్కెట్ విధానాల ప్రభావం వల్ల బొగ్గు రంగంలో మార్పులు వస్తున్నాయనీ ఈ తరుణంలో 1970వ దశకంలో మొదలుపెట్టిన బొగ్గు రంగంలో చేపట్టిన జాతీయకరణ విధానం వల్ల గత 25 సంవత్సరాల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు రంగంలో కూడా ప్రైవేటు యాజమాన్యానికి ప్రవేశం కలిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానితో బొగ్గు ఉత్పత్తిలో గుత్తాధిపత్యం ఉన్న సింగరేణి ప్రభుత్వ సంస్థ వ్యూహాన్ని ఏర్పరచుకోవాల్సి వచ్చింది. బొగ్గు రంగంలో ప్రైవేటీ సంస్థల ప్రవేశం జరిగితే బొగ్గు యొక్క ప్రధాన వినియోగదారులైన విద్యుత్ సంస్థలు, సిమెంట్, స్టీలు సంస్థలు ఏ బొగ్గు ఉత్పత్తిదారుడి దగ్గర సరుకు ధర బాగుంటుందో అక్కడే కొనుగోలు చేస్తారు కాబట్టి సింగరేణి సంస్థకు కూడా మార్కెట్ పోటీకి తగ్గట్టుగా నాణ్యత ప్రమాణాలను పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కాబట్టి విదేశీ బొగ్గు కొనుగోలు చేయగల పోటీ మార్కెట్ కూడా ఏర్పడే అవకాశం ప్రపంచీకరణ వల్ల ఏర్పడింది. అంతేగాక దిగుమతులు, పొదుపు దృష్టిలో పెట్టుకుని దీనికి

తోడు కేంద్ర బడ్జెట్‌లో నాన్ కోలింగ్ బొగ్గు (ఇది విద్యుత్, సిమెంట్ సంస్థలలో వాడే బొగ్గు) పై కస్టమ్స్ సుంకాన్ని 10శాతము తగ్గించినందుకు ఆస్ట్రేలియా, ఇండోనేషియా, దక్షిణాఫ్రికాల నుండి దిగుమతి ఎక్కువగా అయ్యే అవకాశం ఉందనీ భావించింది. పైగా ఆ విదేశీ బొగ్గు తక్కువ యాష్ కలిగి ఉండి ఎక్కువ క్యాలరీల వేడిని ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. కాబట్టి ఆ కంపెనీల బొగ్గు వెల ఎక్కువైనా విద్యుదుత్పాదన వ్యయం తగ్గించుకోవడానికి వీలుగా ఉంటుందని విదేశీ బొగ్గుకు ఆహ్వానం పలికితే స్వదేశీ బొగ్గు విలువ తగ్గుతుందనీ, యాజమాన్యం భావించింది. కోల్ ఇండియా అనుబంధ సంస్థలకు డిమాండ్ లేకపోవడంతో ఉత్పాదన సామర్థ్యం ఉన్నా ఉత్పాదకతను ఐచ్ఛికంగా తగ్గిస్తున్నారు. 2000 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 663 కోట్ల ఋణాల చెల్లింపుపై మారిటోరియం ప్రకటించడం సింగరేణిని కాస్త ఊపిరిని పీల్చుకోనిచ్చింది.

భారత ప్రభుత్వం కూడా ఆర్థిక పారిశ్రామిక రంగాలలో మార్పులు చేసింది. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ప్రభుత్వంతో సమానంగా సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ దేశంలోని ఇతర వర్గాల అభివృద్ధికి దోహదపడాలని, ఇతర వర్గాల వారికి కావలసిన వనరులను అభివృద్ధి చేయాలని భావించడం జరిగింది. దానికోసం సింగరేణి బొగ్గు గనుల పరిసర ప్రాంతాల అభివృద్ధికై రోడ్లు వేయడానికి, యిత్యాదులకు సింగరేణి సంస్థ కొంత నిధిని కేటాయించవలసి వచ్చింది.

నేడు ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలు ఎదుర్కొంటున్నాయి. ప్రజల అవసరాల అభివృద్ధికై ప్రభుత్వం తన పెట్టుబడులను తగ్గించడం లేదా పెట్టకపోవడం జరుగుతోంది. నేడు బొగ్గు సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల నుండి బయట పడాలంటే సంస్థ అభివృద్ధిని గురించి యాజమాన్యం కంటే ప్రజా ప్రతినిధులే ఎక్కువగా ఆలోచించాలని యాజమాన్యం భావించింది. ప్రజా ధనంతో నిర్వహింపబడుతున్న సంస్థతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఆలోచించి, కార్మికులలో సరియైన అవగాహన కల్పించి కార్మికులను బాధ్యతాయుతంగా తయారు చేయాలనీ ఉత్పాదక వ్యయం పెరుగుతోందనీ, విద్యుత్ ఖర్చును యంత్ర సామాగ్రిని, విడి భాగాలు రిపేర్లకు ప్రేలుడు పదార్థాల సరఫరా వంటివాటికి వేలాది చిన్న చిన్న వస్తు వినియోగానికి ఖర్చు అవుతోందనీ, యాజమాన్యం భావించింది. ఇదివరకు విద్యుత్ సంస్థ సింగరేణి సంస్థకు ఇవ్వవలసిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం రాయితీ సర్దుబాటు ఉండేది. కాని ఇప్పుడు దానిని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. పైగా

ప్రభుత్వానికి రాయల్టీ క్రింద నెలకు, 20 కోట్లు (సాలీనా 240 కోట్లు) బ్యాంకులు, ఓవర్ డ్రాఫ్టులు మొత్తం 13.75 శాతము వడ్డీ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. 1996లో 20% పెరిగిన వేతనాల వల్ల ఖర్చు పెరిగింది. పబ్లిక్ రంగంలో సంస్థకు లాభాలు వస్తే సంస్థకే ఉపయోగపడతాయనీ, డివిడెంట్లు చెల్లిస్తే ప్రభుత్వానికి వెడుతుందనీ, కార్మికులు గుర్తించాలనీ యాజమాన్యం భావించింది. అందుకే కార్మికులు నూతన ఆర్థిక విధానం, సరళీకృత విధానం, ప్రపంచీకరణ విధానాలకు ఉన్న రాజకీయాలను ఎదుర్కోవడానికి పోరాటం నూతన రూపం పొందాలంటున్నారు. దీనిలో భాగం పరిశ్రమల యెడల పరిశ్రమ భద్రత - ఉద్యోగ భద్రత అనే సమస్యలు పరిశ్రమకు, యాజమాన్యానికి సంబంధించినవే కాకుండా అవి ప్రభుత్వ పాలసీలకు సంబంధించినవి కూడా అని భావించాల్సిన అవసరం ఏర్పడింది.

భారత దేశం ప్రపంచ దేశాలతో పాటు అప్పటి కాలంలో ఉన్న వనరులతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందకపోవడం జరిగింది. కాని జపాన్, అమెరికా, జర్మనీ, చైనా, రష్యా వంటి దేశాలు ముందుగా పారిశ్రామిక విప్లవాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అలా ఆనాడు కోల్పోయిన అవకాశాన్ని తిరిగి ఇప్పుడు సింగరేణి సంస్థ పొందే అవకావం వచ్చిందని యాజమాన్యం భావిస్తోంది.

ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ రంగ సంస్థలను కూడా ఒక సామాజిక బాధ్యతతో అభివృద్ధి పరుస్తున్నాయి. అందరికీ సమాన న్యాయం జరిగేలా ఇతర వర్గాల అభివృద్ధికి దోహదపడేలా వనరులను అభివృద్ధి చేయాలి. దేశ ఇంధన అవసరాలలో బొగ్గు పరిశ్రమ ముఖ్యమైనది. కాబట్టి సింగరేణి సంస్థ కూడా ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడానికనీ అవసరమైతే పోటీని తట్టుకోవడానికి పని నైపుణ్యాన్ని ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకోవాలనీ భావించింది. అలా వీలు కాకపోతే అవసరమైతే ప్రయివేటీకరణ ప్రయోగాన్ని ప్రారంభించాలనుకునేసరికి కార్మికులు అడ్డుకున్నారు. అసలు కేంద్ర ప్రభుత్వమే బొగ్గుగనులన్నింటిని ప్రయివేటీకరించే బిల్లులను ప్రవేశపెట్టాలని కూడా ఆలోచిస్తుంది. ఈ స్థితిలో మళ్లీ బొగ్గుగనుల జాతీయాకరణ విధానానికి వెనుకటి రోజులు వచ్చే అవకాశముంటుంది కాబట్టి కార్మికులు సమ్మెలకు స్వస్థి పలికి ఉత్పత్తిపై దృష్టిని పెట్టాలి. కోయగూడెం ఓ.సి. పనులను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారనే కార్మికుల ఆందోలనకు, అపోహకు ప్రతిగా మహానది కోల్ ఫీల్డ్స్ సర్ఫేస్ మైనర్‌ను అప్పగించి ఉత్పత్తి పెంచగలుగుతున్నారనేది గ్రహించగలగాలి. కాబట్టి సింగరేణిలో

కూడా అటువంటి బండ ప్రదేశాలు ఉన్న చోట అవసరమైతే సర్ఫేస్ మైనర్‌ని కొని, సింగరేణి కార్మికులకు శిక్షణ ఇస్తే బొగ్గు ఉత్పత్తిని పెంచడమే కాక అటు ప్రయివేటు వ్యక్తులకు ఇచ్చే డబ్బును కూడా తగ్గించుకోగలిగి కార్మికుల యందు ఉన్న అపోహను తొలగించేటట్లు చేసి ఆందోళనను విరమింపచేస్తే బాగుంటుంది.

మార్కెట్ :

1991వ సంవత్సరంలో మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఏర్పడిన సరళీకృత ఆర్థిక విధానమే ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ. దీని ప్రభావం వల్ల ఆర్థిక పారిశ్రామిక రంగాలలో వచ్చిన మార్పులు బొగ్గు పరిశ్రమల మీద కూడా సహజంగానే ప్రభావం చూపెట్టాయి. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, చైనా వంటి దేశాలలో బొగ్గు పరిశ్రమలలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుతున్నారు. పోటీ మార్కెటును తట్టుకోవాలంటే ఉత్పాదకతను పెంచుకోవడంతోపాటు, నాణ్యమైన ఉత్పత్తితో పాటు దుబారాను తగ్గించడం చేయాల్సివచ్చింది. పని సంస్కృతిని పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పని విధానాలలో మార్పులు వచ్చాయి. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరికరాలను అందుబాటులోనికి తెచ్చుకొని ఉపయోగించాల్సి వచ్చింది. సంస్థ అభివృద్ధి చెందకపోతే సంస్థ మనుగడ ప్రశ్నార్థకమయ్యే రోజులు వచ్చాయి. 1995 వరకు పారిశ్రామిక ఉత్పత్తుల అభివృద్ధికి తగ్గట్టుగా బొగ్గు పరిశ్రమల విస్తరణ వేగం పుంజుకుంది. అయితే ఉత్పత్తి అయిన బొగ్గును ఎప్పటికప్పుడే కొనుక్కోవడానికి సిద్ధంగా మార్కెట్ ఉండేది. నాణ్యత గురించి కూడా అంత పట్టించుకునేవారు కాదు. బొగ్గు గనులకు దగ్గరలో పరిశ్రమలకు వెళ్తే రవాణా సౌకర్యం ఉంటుందని, పరిసరాలలో ఉత్పత్తి అయిన బొగ్గునే కొనుక్కునేవారు. అయితే 1995-96 వరకు బొగ్గు రంగం అమ్మకందారుని మార్కెట్‌గా ఉండడంతో ఏ గ్రేడు అని యాజమాన్యం నిర్ణయిస్తే అదే గ్రేడుగా ధర చెల్లించుకొని తీసుకునే విధంగా డిమాండ్‌కు అవకాశం ఉండేది. కాని 1995 తరువాత మహానది కోల్‌ఫీల్డ్ వారు రవాణా ఖర్చులు పెట్టుకుని మరీ 4 మార్కెట్ శాఖలను ఆంధ్రప్రదేశలో పెట్టుకొని, విద్యుత్ స్టేషన్‌లతో ఒప్పందాలు కుదుర్చుకొన్నారు. పై పెచ్చు ధర తక్కువగా కూడా ఉండడంతో అందరూ దానినే కొనడం జరిగింది. వాళ్లు అలా చేయడానికి ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండడమే కారణం, అందరూ దానినే కొనడం కూడా జరిగింది. వాళ్ళు అలా చేయడానికి ఉత్పత్తి వ్యయం వారికి తక్కువగా ఉండడమే అయినా

దాని ప్రభావం సింగరేణి మార్కెటుపై పడింది. పైగా అడ్వర్‌టైజ్‌మెంట్ కూడా చేసుకునే సరికి బొగ్గు మార్కెట్ కొనుగోలుదారుని మార్కెట్‌గా మారిపోయి వారు నాణ్యత, తూకం, ధరలను గురించి అడిగే స్థితికి చేరుకుంది. కాబట్టి ముఖ్యంగా సింగరేణి సంస్థ బొగ్గు నాణ్యత గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి పై నిర్లక్ష్యం చూపించుటలో మార్కెట్ దెబ్బతిని నష్టాల బాట పట్టవచ్చును. 1995లో బి.ఐ.ఎఫ్.ఆర్. పరిశీలనలోకి వెళ్ళడానికి ఇదొక కారణం.

సింగరేణి బొగ్గులో నాణ్యత తగ్గిందని సిమెంట్ ఫ్యాక్టరీల వారు వారి బంకర్లు పాడవుతున్నాయనే విమర్శ చేసిన సందర్భాలు దూరదర్శన్ ద్వారా తెలిసిన విషయమే. కాబట్టి ఉత్పాదక శక్తిని పెంచుకుని పొదుపుగా బొగ్గు ఉత్పత్తిని చేసి బొగ్గు నాణ్యతకు ప్రాధాన్యమిచ్చి మార్కెట్ పోటీలో బొగ్గును అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందనీ, మహానది కోల్‌ఫీల్డ్ కంపెనీ నుండి విజయవాడ విద్యుత్ స్టేషన్‌కు తదితర పరిశ్రమలకు బొగ్గు సరఫరా అవుతుంటే రామగుండం ఎన్.టి.పి.సి. వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ నుండి తెప్పించుకోవాలని అనుకుంటోందని. బొగ్గు వినియోగదారులలో కంపెనీ తగిన పరపతిని పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందనీ యాజమాన్యం భావించింది. ఆస్ట్రేలియా దేశం తాము ఉత్పత్తి చేసే బొగ్గు ధరను 8 శాతం తగ్గించిందనీ, సరళీకృత ఆర్థిక విధానం మూలంగా తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గును విదేశాల నుండి దిగుమతి చేసుకుంటే కె.టి.పి.యస్., ఎన్.టి.పి.సి. అటు మొగ్గు చూపించే పరిస్థితి వచ్చిందని యాజమాన్యం భావించడం జరిగింది. తమ ఉత్పత్తికి మార్కెట్ ఏర్పరుచుకునేక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు బొగ్గుమార్కెట్ శాఖలను ఏర్పాటుచేసి పోటీపడటం ఆలోచించాల్సిన విషయం.

ఇది వరకు ప్రతి బావి సి.ఎస్.పి. నుండి ఫలానా నాణ్యత గల బొగ్గును సరఫరా చేస్తామని నిర్ధారించి కోల్ కంట్రోల్ అనుమతి పొందడం జరిగేది. కాని ఇప్పుడు ఒప్పందం ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే అపరాధ సుంకాలు చెల్లించవలసి రావడమే కాక బొగ్గు మార్కెట్‌ను కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. బొగ్గు మార్కెట్‌లో బొగ్గు కొరత తీవ్రంగా ఉండే సమయంలో నమ్మె అనే పదునైన అస్త్రాన్ని వాడే ప్రయత్నం చేసి వినియోగదారులకు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోతే దూరంగా ఉన్న ఇంకొక ఉత్పత్తిదారుడి దగ్గరకు వినియోగదారులు వెళ్ళే ప్రమాదం ఉందనీ బొగ్గు నాణ్యత,

ధర న్యాయమైనదైన ఉత్పత్తి సకాలంలో వినియోగదారునికి అందించకపోతే మార్కెట్ పోతుందనీ కాబట్టి ముందుగా నాణ్యమైన ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్‌ను పెంచుకోవాల్సిన పరిస్థితులు బొగ్గురంగంలో ఉందని యాజమాన్యం భావించాలి.

పరిశ్రమలలో ప్రత్యమ్నాయాల ఇంధనాల వినియోగం కూడా బొగ్గు మార్కెట్‌పై ప్రభావం చూపిస్తుంది. ఈ మధ్య బొగ్గు నుండి డీజిల్, పెట్రోల్ తీయవచ్చనే భావన వచ్చినా, అది ఖర్చుతో కూడుకున్న విషయం కాబట్టి ప్రస్తుతం దానిని వాయిదా వేయడం జరిగింది. కాని ఉత్పత్తి వ్యయం తక్కువ గల మార్గాన్ని అన్వేషించగలిగి, ధరను తగ్గించగలిగితే బొగ్గుకు గిరాకీ పెరుగుతందని యాజమాన్యం భావించింది. అయితే గోదావరి ఖని ఎన్.టి.పి.సి. 7వ యూనిట్ బి.పి.ఎల్., కె.టి.పి.యస్. ఆరోదశ మణుగూరు ఎన్.టి.పి.సి. యూనిట్స్ కూడా ప్రారంభిస్తే యేటా 100 లక్ష టన్నుల బొగ్గు కావలసి యున్నది. ఇప్పుడు అనగా 2000 సం॥లో సింగరేణి 36 లక్షల టన్నుల బొగ్గును మాత్రం ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి మార్కెట్‌కు తగ్గట్టుగా బొగ్గు గనుల విస్తరణకై ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే వ్యూహ రచన చేయాల్సిన అవసరం ఏర్పడిందని, దేశంలో పొరుగు రాష్ట్రాల నుండి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు మార్కెట్‌ను కూడా సింగరేణి ఎదుర్కోవాల్సి ఉంటుందని వెస్టన్ కోల్ ఫీల్డ్స్ 8-29%, మహానది కోల్‌ఫీల్డు 51-91% అమ్మకం ధరలు ఉంటున్నాయని యాజమాన్యపు భావనగా అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానం వల్ల దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో పాటు విదేశాల నుండి బొగ్గు దిగుమతికి వీలుగా ఆంధ్ర రాష్ట్రంలో కాకినాడ రేవును, గుజరాత్‌లో కాండ్ల రేవును ఓడల ద్వారా దిగుమతి చేసుకోవడానికి వీలుగా రేవులను అభివృద్ధి పరుస్తుంటే విదేశీ పరిశ్రమల మార్కెట్ పోటీ కూడా ఉంటుందనీ యాజమాన్యం భావించింది. పోటీ ప్రపంచంలో ధరలు తగ్గించాలంటే ముందుగా ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవాలి. ఎక్కువైతే సంస్థకే నష్టాలు వస్తాయని అందరికీ తెలిసిన విషయమే. ఈ సందర్భంలోనే ఆస్ట్రేలియా తాము ఉత్పత్తి చేసే బొగ్గు ధరను 8% తగ్గించిందనేది గుర్తించాలని అన్నది.

సింగరేణి ఉత్పాదకత తగ్గించినపుడు పొరుగున ఉన్న వెస్టన్ కోల్ ఫీల్డ్స్‌లో 530 కోట్ల లాభాలు మహానది కోల్‌ఫీల్డు వాళ్ళు 300 కోట్ల రూపాయల

లాభాలను గడించగలిగారనే విషయాన్ని సింగరేణి సంస్థలో అందరు తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం.

5.2 వాణిజ్య విధానంలో మార్పు :

1990లో సరళీకృత ఆర్థిక విధానం పారిశ్రామిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. దానిలో భాగంగా బొగ్గు పరిశ్రమలను ప్రయివేటీకరణం చేయడం, విదేశీ బొగ్గుపై దిగుమతి సుంకాన్ని తగ్గించడం, బొగ్గు ధరలపై ఇదివరకు ఉన్న నియంత్రణను క్రమేపి తగ్గించి 2000 సంవత్సరం నాటికి పూర్తిగా ఎత్తివేయడం వంటి చర్యలతో పాటు బొగ్గు కంపెనీలకు కావలసిన పెట్టుబడులను అవే సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

1997లో బొగ్గు పరిశ్రమకు సంబంధించిన భారత ప్రభుత్వం ప్రకటించిన సరళీకృత ఆర్థిక విధానాల వల్ల బొగ్గు మార్కెట్ రంగంలో గట్టి పోటీ ఏర్పడింది. భారత దేశం ప్రపంచ మార్కెట్ లోనికి అడుగు పెడుతున్నందువల్ల బొగ్గు రంగంలో కూడా విదేశాలతో పాటు దేశీయంగా కూడా పోటీ తప్పనిసరి అవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికి ఉత్పత్తులను అమ్మి సంస్థను అభివృద్ధి చేయడానికి సింగరేణి సంస్థ కూడా ఒక ప్రయివేట్ సంస్థవలె పోటీ మార్కెట్‌లో పోరాడవలసి వస్తుంది. దానికై కొత్త బొగ్గు విధానాల వల్ల సింగరేణి సంస్థ 1997లో 40% బొగ్గు ధరను పెంచడం జరిగింది. దానివల్ల లాభాలు వచ్చాయి. కాని ఇంకా ఇలా పెంచితే వినియోగదారులు పారిపోతారనీ, ధరలు పెంచకుండా లాభాలు రావాలంటే ఉత్పత్తి పెరిగి, వ్యయాన్ని తగ్గించుకొని ఉత్పాదకతను పెంచుకోవాలని యాజమాన్యం భావించింది. కోల్ ఇండియా సంస్థకు అనుబంధంగా కొన్ని బొగ్గు పరిశ్రమలు నష్టాలు వచ్చి మూత పడుతున్నాయి. లాభాలలో కొంత శాతం క్రొత్త బావుల త్రవ్వకానికి కేటాయిస్తూ యితర బొగ్గు కంపెనీలలో అమలు అవుతున్న జీతభత్యాలను ప్రమాణికంగా తీసుకుంటూ సింగరేణి ముందుకు సాగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

విద్యుత్ సంస్థలు వారికి కేటాయించిన బొగ్గు బ్లాకులను ఒక ప్రయివేట్ కంపెనీ ద్వారా మైనింగ్ చేయించుకుంటూ తక్కువ ధరకే ఎవరి ఉత్పత్తి వారే చేసుకునే పరిస్థితులు వచ్చాయని బెంగాల్, పంజాబ్ ఎంటా కోల్ అనే రెండు మైనింగ్ సంస్థలు విద్యుత్ సంస్థలకు బొగ్గును తక్కువ ధరకు ఉత్పత్తిని చేస్తున్నారని యాజమాన్యం భావించింది.

పోటీని ఎదుర్కొవడానికి సమర్థవంతంగా ఉత్పాదకశక్తి పెంచుకొని పొదుపుగా బొగ్గు ఉత్పత్తి చేసుకోవటంతోపాటు, బొగ్గు నాణ్యతకు ప్రాధాన్యతనిచ్చి పెరగనున్న మార్కెట్ పోటీలో బొగ్గును అమ్ముకోగలగడం పైననే కంపెనీ ఉనికి ఆధారపడి ఉన్నది. కొత్త గనులు తెరవాలంటే ప్రభుత్వం నిర్దేశించిన ఆర్థికపరమైనవాటిలోను, అటవీభూములన్నింటిలోను సమస్యలను ఎదుర్కొంటూ కాంపిటీటివ్ బిడ్డింగ్‌లో ప్రభుత్వరంగ బొగ్గు కంపెనీ నిలబడాలి.

5.3 లైసెన్స్‌లో జాప్యం :

నిబంధనల ప్రకారం ఐ.ఆర్.ఆర్. (ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్) శాతం సరిగా లేకపోవడం, 16 శాతం దాటని ప్రాజెక్టుల విషయంలో ఆర్థిక వనరులు లేకపోవడం చేత సింగరేణి సంస్థకు క్రొత్త ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అందువల్ల క్రొత్త ప్రాజెక్టులకు అంతర్గత నిధులను సింగరేణి సంస్థయే సమకూర్చుకోవాలి. అలా చేయలేకపోతే బొగ్గు నిల్వలు అయిపోతున్న కారణంగా సుమారు 12 గనులు మూతపడితే 2001 నాటికి 8500 మంది అవసరానికి మించిన సిబ్బంది ఉంటారని యాజమాన్యం భావించింది. వీరికి ఉపాధికై కొత్త గనులు తెరవాలని ప్రభుత్వం నిర్దేశించినా ఆర్థిక పరమైన కొలబద్దకు దిగువున ఉన్న కారణంగానూ, అటవీ భూములకు కావలసిన క్లియరెన్స్‌లలో ఎదుర్కొంటున్న సమస్యల వల్లనూ కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడానికి వీలుపడడం లేదని యాజమాన్యం భావించింది. అలా వీలుపడనప్పుడు సిబ్బంది కుదింపు చర్యలో భాగంగా వి.ఆర్.యస్. ను కూడ ప్రవేశపెట్టింది

కొత్త ప్రాజెక్టుల అనుమతి పొందాలంటే స్వయం సమృద్ధిని సాధించాలి. దానికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ప్రస్తుతమున్న ఆర్థిక విధానాలననుసరించి ఆర్థిక సహాయాన్ని అందించలేమని స్పష్టం చేస్తున్నాయని సింగరేణి యాజమాన్యం భావించింది.

సింగరేణి బొగ్గు సంస్థలో పెట్టుబడి ప్రజల నిత్యావసర వస్తువుల సరుకులపై పన్ను రూపేణా కట్టే ప్రతీ పైసా నుండి పెట్టుబడిగా వస్తుంది. అది ప్రజల సొమ్ము. కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థకు లాభాలు వస్తే వాటిని తిరిగి సంస్థ అభివృద్ధికి పెట్టుబడి పెట్టడం, తోటి ప్రజల కార్మిక సంక్షేమానికి ఖర్చు చేయడంతో ఆర్థిక వనరులను పెంచుకోవడం కూడా కష్టంగా ఉంటోందని కూడా యాజమాన్యం భావిస్తోంది.

5.4 యాజమాన్యం - కార్మికులు :

ఒక బావిలో పని చేసే కార్మికులందరూ ఒకే లక్ష్య సాధనకు పనిచేయాలని, ఒక యంత్రం ఆగిపోయినప్పుడు వేరే యంత్రం దగ్గర కార్మికులను పనిచేయమంటే సంతోషంగా బాధ్యతలను నిర్వహించాలని యాజమాన్యం భావించింది. మేనేజ్‌మెంట్‌లో కూడా కొన్ని స్థాయిలలో కార్మికులను శాంతపరిచి సమస్యలకు సమాధానం సాధించడం కంటే ప్రిస్టేజి ఎక్కువగా పరిగణిస్తున్న సంఘటనలు చెదురుచెదురుగా ఉన్నాయని యాజమాన్యం తమ తప్పులను అంచనా చేస్తూ ఆత్మ శోధనతో ముందుకు సాగుతుంది. కార్మికుల ఉత్పాదకతా సామర్థ్యాన్ని బట్టి ఉత్పత్తి తత్ఫలితంగా సంస్థ అభివృద్ధి జరగాలంటే అవి పరస్పర పోషకాలుగా ఉంటాయి. 1991-92లలో రికార్డు స్థాయిలో 475 సమ్మెలు జరుగడంతో ఉత్పత్తిపై ప్రభావం పడుచూ, కంపెనీ నష్టాలకు కారణం అయి బి.ఐ.ఎఫ్.ఆర్.లో వెళ్ళడం జరిగింది. 1996 నాటికి 1219 కోట్ల రూపాయల నష్టం పేరుకుపోయింది. వీటన్నింటికి కారణం కార్మికులకు సంస్థపై అవగాహన లోపం అని భావించి ఆ అవగాహనను పెంచేదిశగా యాజమాన్యం అడుగులు వేయడం అభినందించతగ్గ విషయం.

ఉత్పాదకత అనేది ముఖ్యంగా కార్మిక సామర్థ్యంతోనూ, పెట్టుబడులు, వస్తు వినియోగం, కార్మికుల వ్యక్తిగత విలువలతోనూ, సంబంధం కలిగి ఉంటుంది. కార్మిక సామర్థ్యం అనేది మానవ శ్రమను పూర్తి స్థాయిలో వినియోగించడం, వ్యక్తిగత సామర్థ్యం నాణ్యత గల ఉత్పత్తి పై దృష్టి కలిగి అన్ని రకాల పనులలో నైపుణ్యాన్ని పెంచుకోవడం. పనిచేయాలనే దృఢ సంకల్పం మొదలగు వానిపై ఆధారపడి ఉంటుంది. వృధాని అరికట్టాలని, కార్మికుల వ్యక్తిగత విలువలు అతడి పని నైపుణ్యాన్ని పెంచుకొనేటట్లుగా పనిచేసే విధానాలపై ఆధారపడి ఉంటుందని పని సమయాలు చక్కగా పాటించాలని యాజమాన్యం కోరుకుంటున్నది. కార్మికులు నాణ్యతపై అవగాహన పెంచుకోవాలనీ, పని జరుగుతున్న విధానం పరికరాల రవాణా సందర్భములో పని ప్రదేశాలలో వివిధ స్థాయిలలో జరిగే దుబారాను అరికట్టాలని భావించింది. యాజమాన్యం సమస్యకు సమ్మె మరో సమస్య అవుతుందని తెలియచేస్తోంది. కార్మికుల రక్షణ కొరకు ప్రజా ప్రతినిధులతో కూడిన చట్ట సభలు, అనేక చట్టాలు రూపొందించడంలో భాగస్వామ్యం ఉండడమే గాక ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును, అధ్యయనం చేయడం కొరకు ప్రజా ప్రతినిధులతో కూడిన కమిటి

అన్ పబ్లిక్ అండర్ టేకింగ్ లాంటివి ఉంటాయనీ వాటిని కార్మికులు అవగాహన చేసుకోవాలనీ, ప్రజా ప్రతినిధులు సంస్థ అభివృద్ధిని గురించి యాజమాన్యం కంటే ఎక్కువగా ఆలోచిస్తారనీ కార్మికులకు తెలియచేసింది యాజమాన్యం. భూగర్భ బొగ్గు గనులు 59% ఉండడంతో సర్ఫేస్ ఉద్యోగాలకు తక్కువ అస్కారం ఉంటుందని గ్రహించాలనీ, సూపర్‌వైజర్లు పని స్థలాల అభివృద్ధి విషయంలో అధికారులతో కలిసి మెలసి పని ప్రదేశాలలో అవసరమైన సదుపాయాలను కల్పించడంలో బాధ్యతగా ఉండాలనీ, యాజమాన్యం పని ప్రదేశాలను మెరుగు పరచడానికి అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు తీసుకుంటుందని తెలియచేయడం జరిగింది.

పారిశ్రామిక సంబంధాలలో మూల కారకులైన కార్మిక సంఘాలను ప్రభావితం చేసే రాజకీయ పార్టీల ప్రతినిధులు పారిశ్రామిక శాంతికి ఎంతగానో తోడ్పడగలరని ఆశాభావాన్ని యాజమాన్యం వెల్లడి చేసింది. ఉన్నత, మధ్య, క్రింది స్థాయి యాజమాన్యపు బాధ్యతను నిర్వహించే అధికారులు వారి క్రింది స్థాయి ఉద్యోగులతో కార్మికులతోనూ ఎల్లప్పుడు నేరుగా సంబంధాలు కలిగి ఉండాలి. వారికి సంస్థను గురించిన వాస్తవాలను తెలియచేస్తూ సంస్థను కాపాడుకోవడానికి గానీ, అభివృద్ధిని గానీ, కార్మికుల బాధ్యతా కర్తవ్యాలను ఎప్పటికప్పుడు తెలియచేస్తేనే కార్మికులకు యాజమాన్యం పై పూర్తి నమ్మకం ఏర్పడుతుందని, తప్పుదోవ పట్టకుండా సంస్థ అభివృద్ధికి పాటు పడతారని భావించింది.

గ్రీవెన్స్ ప్రొసీజర్‌కి వ్రాతపూర్వకంగా గానీ, మాట మాత్రంగా గాని మైన్ లెవెల్ సమస్యలను తెలియచేసి పరిష్కరించుకోవడం చేయాలనీ, అవసరమైతే కార్పొరేట్ నుండి 15 రోజుల లోపల ఆదేశాలు అందుకోవాలనీ కూడా యాజమాన్యం భావించింది.

5.5 సంస్థ ఆర్థిక స్థితి - సాంకేతికత :

సాంకేతికత అంశాలకు వస్తే గత 10 సంవత్సరాల నుండి ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల ఉత్పత్తి అవుతున్న బొగ్గు సింగరేణి మొత్తం ఉత్పత్తిలో 60 శాతానికి ఉంటుంది. మిగిలిన కోల్ ఇండియా సంస్థలలో ఉత్పత్తి 75 నుండి 78% వరకు ఉంది. మహానది కోల్ ఫీల్డులో 92 శాతం ఉంది. ఓపెన్ కాస్ట్ మైన్స్‌లో అధికంగా యంత్రాల వాడకం వలన గనుల్లో బొగ్గు వెలికి తీసే ఖర్చు హ్యాండ్ సెక్షన్ మైన్ కంటే తక్కువ ఉంటుంది. అందుకే కోల్ ఇండియా

నూతన సాంకేతికతతో అధిక బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు. మెకనైజేషన్ ద్వారా ఉత్పాదకత పెంచుకుంటున్న కోల్ ఇండియాకి చెందిన మహానది కోల్ ఫీల్డులో ఓపెన్ కాస్టులలో తొలగించాల్సిన మట్టి ఓవర్ బర్డన్ కూడా చాలా తక్కువ స్థాయిలో ఉండడమేగాక బొగ్గు పొరలు చాలా మందంగా ఉండే ప్రకృతి సహజమైన వనరులు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితులు సింగరేణిలో సంస్థకు చెందిన బొగ్గు గనుల ప్రాంతాలలో ప్రతికూలంగా ఉన్నాయి.

సింగరేణి సంస్థలో అండర్ గ్రౌండ్ హ్యాండ్ సెక్షన్ గనులలో ఉత్పాదకత ప్రమాణాలు 1985-86లో తలసరి ఉత్పత్తి 0.81 టన్నులలో ఉంటే 1996-97కు 0.55కు తగ్గింది. పోటీని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకోకపోతే కార్మికులు, కార్మికుల కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిపోతుంది. సంస్థ మనుగడకై మస్టర్ వేయించుకున్నందుకు తగినంత పని చేయడంతో పాటు లెక్క ప్రకారం 8 గంటల కాలం పూర్తిగా పని చేయగలగడం కూడా అవసరమనీ కార్మికులకు ఏ రకమైన ప్రమాదాలు సంభవించకుండా భద్రతతో పనిచేయడం, అధికార వర్గం పూర్తి సమయాన్ని సంస్థ పురోగతికి వెచ్చించడం అనవసరమైన కొనుగోళ్లు చేయకుండా చూడడం, ఖరీదైన యంత్రాలు సరిగా పనిచేసేటట్లు చూసుకోవడం, యంత్రాల విడి భాగాల కొనుగోళ్లలో పొదుపు పాటించడం వంటివి చేయగలగాలని యాజమాన్యం భావిస్తోంది. అవసరమైతే యంత్రాల వినియోగిత విలువలను పెంచే దిశగా ఏడు రోజుల పనదినాలను పెట్టాలనికూడ యాజమాన్యం ఆలోచిస్తుంది. వినియోగదారులను దీర్ఘకాలం చూపించాలని కూడా భావించాలి. పనిలో శ్రద్ధ చూపించిన వారు ప్రోత్సహింపబడాలి. కాబట్టి యాజమాన్యం ఉత్తమ అధికార్లను, ఉత్తమ కార్మికుని ఎంపికచేసి స్వాతంత్ర్య దినోత్సవం నాడు వారిని సన్మానించడం, ఆ కార్మిక కుటుంబమంతా ప్రశంసించబడటంగా అర్థం అవుతుంది. కార్మికులు, అధికారులు ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడం గాని, సంబంధం లేని విషయంలో సమ్మె చేయడం గాని, యాజమాన్యాన్ని దూషిస్తూ కార్మికుల మీద పట్టు పెంచుకునేతత్త్వం కాని సంస్థను నష్టాల బాటలలోకి తీసుకుని వెడతాయి అన్న విషయం అందరికీ అర్థమయ్యే విషయమే.

ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగా సంస్థయే అంతర్గత నిధులను సమకూర్చు కోవలసిన అవసరం ఏర్పడింది దానికై రిజర్వ్‌బ్యాంక్ అనుమతితో సంస్థాగత సిబ్బందికి ఆదాయపు పన్ను రాయితీని కల్పించే వీలుగా సింగరేణి

బాండ్లను అమ్మకానికై ప్రవేశపెడితే బాగుంటుందేమో ఆలోచించాలి.

సింగరేణిలో అండర్‌గ్రౌండ్ బావులలో కొన్నింటి యందు ఉత్పత్తి వల్ల 10వాతం లాభం వస్తుంటే కొన్నింట్లో నష్టాలు వస్తున్నాయి. 31-03-1997 నాటికి ఈస్టర్న్ కోల్ ఫీల్డ్సుతో పోల్చిచూస్తే వారికి మానవ వనరులు 1,51,000 ఉంటే సింగరేణి సంస్థ 1,14,504 మంది ఉన్నారు. ఓపెన్‌కాస్ట్‌లు వారికి 22 ఉంటే సింగరేణికి 11 గనులు ఉన్నాయి. వారి ఉత్పాదకత 0.83 ఉంటే సింగరేణిది 1.09 ఉన్నా అర్జిత నష్టాలు వారికి 1187 కోట్లుంటే మనకు 1219 కోట్లుగా ఉన్నాయి. అయితే సింగరేణిలో సమ్మెలు తగ్గేసరికి 1998-99కి లాభం 122 కోట్లు, 1999-2000కి రూ॥ 302 కోట్లు, 2000-2001కి రూ॥ 85 కోట్లు రూపంలో ఉత్పత్తి లాభం ఉంది. 2001 సంవత్సరం నుండి వరుసగా సింగరేణి సంస్థ లాభాలదిశగానే ప్రయాణం చేయటానికి కారణం సంస్థలో సమ్మెలు తగ్గి పారిశ్రామిక సత్సంబంధాలు ఏర్పడటమే అని అర్థమవుతుంది.

80వేల మంది పనిచేసే భూగర్భ గనులలో వ్యయం 1996-97లో టన్నును 0.53గా ఉంటే 2000-01కి 0.71కి పెరిగింది. మానవులు చేసిన ఉత్పత్తి కంటే కూడా యాంత్రిక ఉత్పత్తి వల్ల లాభాలు గడించవచ్చును. భూగర్భ గనులు ఉపయోగించే సాంకేతిక యంత్రాలు చాలా ఖరీదు పెట్టి కొనుటం జరుగుతోంది. ప్రమాదరహితంగా ఉత్పత్తి తీయవచ్చని గ్రహించి లాంగ్‌వాల్ వంటి ఖరీదయిన యంత్రాలు కొనుగోలు చేస్తున్నారు. అయితే వాటిని ఉపయోగించే విషయంలో సాంకేతిక పరిజ్ఞానం లోపించడంతో సమస్యలు వస్తున్నాయి. దాన్ని నిర్వహణ వినియోగ విషయంలో కార్మికులకు, సూపర్‌వైజరీ స్టాఫ్‌కి శిక్షణను ఇవ్వాలి. కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన భారీ యంత్ర సామాగ్రి యొక్క సమర్థ వినియోగం ఓ.సి.లలో 96-97లో కేవలం 55 శాతం ఉంటే 2000-2001 నాటికి 75 శాతం పెరిగింది.

1978-79 సంవత్సరం నుండి సమ్మెలు విపరీతంగా పెరిగి ఉత్పత్తి తగ్గింది. అయితే 79-80 నుండి 1984-85 వరకు సమ్మెల సంఖ్య విపరీతంగా పెరగడంలో తదనుగుణంగానే మాన్‌డేస్‌లాస్ట్‌తో ఉత్పత్తి కూడా అదే నిష్పత్తిలో తగ్గింది. అయితే 1989-90లో చేసిన సమ్మెల వల్ల ఉత్పత్తి నష్టం ఎక్కువగా జరిగేసరికి సింగరేణి సంస్థ మొదటిసారిగా బి.ఐ.ఎఫ్.ఆర్.లోనికి వెళ్ళిందని అర్థం అవుతోంది. ఆ తర్వాత కొంత తగ్గినా మళ్ళీ 1995-96వ సంవత్సరంలో

సమ్మెల సంఖ్య తగ్గినా కూడా మ్యాన్‌డేస్ లాస్ట్ అధికంగా ఉండి ఉత్పత్తి తక్కువగా ఉండడంచేత, మూలధనంలో సగం కంటే ఎక్కువ నష్టాలు వచ్చేసరికి మళ్లీ సింగరేణి రెండవ సారి బి.ఐ.ఎఫ్.ఆర్.లోకి వెళ్లిందనేది నివేదికలు తెలియచేస్తున్నాయి.

2000 నుండి సమ్మెలు తగ్గుముఖం పట్టి ఉత్పత్తి పెరిగి లాభాల బాటలో నడవడం సంతోషదాయకమైన విషయమే ఐనా కార్మికుల అబ్సెంటిజమ్ 30 శాతం ఉండడం కారణంగా ఉత్పత్తి కుంటు పడుతోంది. అదే మహానది కోల్ ఫీల్డులో అయితే కేవలం 15శాతం అబ్సెన్టిజమ్ మాత్రమే ఉన్నట్లు తెలిస్తోంది.

1995-96 నుండి చేపట్టిన సంస్కరణల వల్ల సమ్మెలు తగ్గుముఖం పట్టి ఉత్పత్తి పెరగడం చేత సింగరేణి నష్టాల బాట నుండి నెమ్మదిగా బయటకు వచ్చి 2002 మార్చి నాటికి నష్టాలను పూడ్చుకోగలిగింది. నేడు లాభాల బాటలో పయనిస్తోంది. దానికి మూలకారణం కార్మికులు చీటికి మాటికి సమ్మెలు చేయకుండా ఉండాలనుకోవడం ప్రధాన కారణంగా భావిస్తున్నారు. అయితే ఉత్పత్తి నష్టానికి సమ్మెలు 36 శాతం కారణంగా గుర్తించడం జరిగింది. మొత్తం మీద ఉత్పత్తి నష్టానికి కారకులుగా పవర్ షార్టేజ్ 4.94 శాతం కాగా సమ్మెలు 36.42 శాతం కాగా అబ్సెంటిజమ్ 30.86 శాతం, బ్రేక్‌డౌన్స్‌లు 15.43, లే అఫ్స్ 12.35గా గుర్తించడం జరిగింది. యాజమాన్యం కార్మికులు పరస్పర విరోధ శత్రు వర్గంగా ఉండక ఉమ్మడి లక్ష్యంతో పనిచేయాలి. పని నైపుణ్యాన్ని పట్టి శ్రద్ధను పట్టి వేతనము ఉద్యోగ భద్రతా ఉంటుందని రెండవ లేబర్ కమీషన్ సూచించింది. అంతేకాక సమ్మెను నిర్వహించాలంటే గుర్తింపు సంఘం 51 శాతం రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ తీసుకురావాలి. అలా కాకుండా చేస్తే చట్ట విరుద్ధంగా సమ్మె చేసినట్లుగా కార్మిక సంఘాల గుర్తింపు కూడా రద్దు అవుతుందని కూడా కమీషన్ సూచించింది.

మహానది కోల్‌ఫీల్డ్స్‌లో ఉత్పత్తి 44.8 మిలియన్ టన్నులు లక్ష్యంగా పెట్టుకోగా సింగరేణి 32.5 మిలియన్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా చేసుకొంది. మహానది కోల్‌ఫీల్డ్స్ 600 కోట్ల లాభాలతో నడవడానికి కారణం అక్కడ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండడమే కాక ఓపెన్‌కాస్ట్‌ల ఉత్పత్తి 95 శాతంగా ఉండడమును హ్యాండ్ సెక్షన్ ఉత్పత్తి కేవలం 5%గా ఉండడమే. మహానది కోల్ ఫీల్డ్‌లో మొత్తం 11 గనులలో 9 ఓపెన్‌కాస్ట్‌లు ఉండగా 2 మాత్రమే హ్యాండ్ సెక్షన్ గనులు. ఆ గనుల యాజమాన్యమంతా కేంద్ర ప్రభుత్వం కిందనే ఉండగా

సింగరేణి సంస్థ యాజమాన్యం మాత్రం దేశం మొత్తం మీద ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం అజిమాయిషీలో నడుస్తుంది. సింగరేణి సంస్థ క్రింద ఓపెన్‌కాస్ట్‌లు 11 ఉండగా 55 హ్యాండ్ సెక్షన్ మైన్‌లు ఉన్నాయి. హ్యాండ్ సెక్షన్‌లో కూడా మిషన్ మైనింగ్ 10.06%గా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వాటా 51.096% ఉండగా కేంద్ర ప్రభుత్వం వాటా 48.902% కాగా ప్రయివేటు వ్యక్తులకు వాటా 00.002%గా ఉంది. 1990 లో అది పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో గవర్నమెంటు కంపెనీగా మారింది. 30-6-2001 నాటికి మానవ వనరులు 1,05,389 ఉండగా వారిలో 2380 మంది అధికారులను మంత్లీ పెయిడ్ సిబ్బంది 17,454 మరియు పీస్ రేటెడ్ మాత్రం 53,565 ఉండగా బదిలీ ఫిల్లర్స్ 5137 మంది బదిలీ వర్కర్సు 312 మందిగా ఉన్నారు. అవుట్‌పుట్ ఫర్ మ్యాన్ షిఫ్టు అండర్ గ్రౌండ్ గనులలో 0.83 ఉండగా ఓపెన్ కాస్టులలో 8.18 ఉంది అండర్ గ్రౌండ్స్‌లో ఉంది ఓపెన్ కాస్టులో 13.98గా అవుట్ గ్రౌండ్స్‌లో ఓ.ఎం.ఎస్. 1.03 కాగా ఓ.సి.లలో అది 8.02గా ఉంది మొత్తం మీద 2.25గా అభివృద్ధి చెందింది.

ప్రస్తుతం సింగరేణిలో 2002 నాటికి అదనపు సిబ్బందికి తగిన ఉద్యోగ భద్రతకై చేపట్టిన సింగరేణి గనుల విస్తరణలో భాగంగా మణుగూరులోను ఖైరగుర లోను ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ తీసుకొని ఫారెస్టు విభాగపు క్లియరెన్సు కోసం ఎదురుచూస్తోందని అర్థం అవుతుంది. దీని ప్రకారంగా గనుల విస్తృతి జరుగుతుంది. అంతేగాక 60 లక్షల టన్నుల నుండి 100 లక్షల టన్నుల బొగ్గు అవసరం విద్యుత్ సంస్థలలో పెరగడం చేత కూడా 2007 నాటికి మళ్లీ తిరిగి సింగరేణిలో ఉద్యోగాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా చేస్తున్న సర్వేను పత్రికాముఖంగా అర్థం అవుతోంది. కాంట్రాక్ట్ లేబర్ చట్టపు పరిధిలోనే పనులు ఎక్కువగా చేయించుకోవడం ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే సూచనగా అర్థం అవుతుంది. మహానది కోల్ ఫీల్డ్స్‌లో 35 శాతం ఖర్చుమాత్రమే ఉండగా సింగరేణిలో 51 శాతం ఖర్చు పెట్టడం జరుగుతోంది. సింగరేణి సంస్థ నుండి వెలువడే సింగరేణి అనే పత్రికలో యాజమాన్యం ఉత్పత్తి ఉత్పాదకతకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు కార్మికులకు తెలియచేస్తుంది. యంత్రాల వినియోగం కూడా పూర్తి స్థాయిలో చేయలేకపోయింది. సాంకేతిక నైపుణ్యం తక్కువ స్థాయిలో ఉన్నా కూడా బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లుతుంది. భూగర్భ గనులు సాంకేతిక వినియోగంలో 95-96లో 116 లక్షల టన్నులుకాగా,

2002 నాటికి 200 లక్షల టన్నులకు పెరిగింది.

ఏది ఏమైనప్పటికి అన్ని స్థాయిలలో జరుగుతున్న అవినీతిని అడ్డుకుంటే తప్ప సంస్థ యొక్క అభివృద్ధి నిలకడగా ఉండదు. ముఖ్యంగా సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా కార్మికుల ఇండ్ల విషయంలో డ్రైనేజి తదితర నిర్మాణాలలో కూడా అవినీతి ఎక్కువగా చోటు చేసుకుని అభివృద్ధి అనుకున్నంత స్థాయిలో జరగటంలేదని తెలుస్తోంది.

6. పరోక్ష పారిశ్రామిక సంబంధాలలో కార్మిక కుటుంబ స్త్రీలు

పరిశ్రమలలో ఉత్పత్తి శక్తులు కార్మికులు. ఆ కార్మికులను ఉత్పత్తి చేయగలగడమే కాక వారికి ఆయా శక్తి యుక్తులను పరిపుష్టం చేయగలవారు కూడా కార్మిక కుటుంబ స్త్రీలే. సైరన్ మోతకు ముందే లేచి నాస్తా పెట్టి అన్నం అమర్చి, పనికి పంపించే క్రమంలో కార్మిక కుటుంబ స్త్రీలు కూడా పరోక్ష పారిశ్రామిక సంబంధాలలో భాగస్వాములు అవుతారు.

మౌలికంగా పారిశ్రామిక సంబంధాలు యాజమాన్యం కార్మికుల మధ్య ఉండేవి. అయినా వాటి ప్రభావం ఆయా ప్రాంతాల యందలి కార్మిక కుటుంబ స్త్రీల జీవితాలను కూడా ప్రభావితం చేయగలిగి ఉంటాయి అనేది పరిశీలనలో అర్థం అయింది.

ఉత్పత్తికై ఉత్పాదకతా సామర్థ్యం పెరగాలంటే కార్మిక సంక్షేమం అవసరమని గుర్తించగల సంస్థలు ముందుగా పారిశ్రామిక సత్సంబంధాలను కోరుకుంటాయి. కాని అప్పుడప్పుడు కార్మిక సంక్షేమం కంటే ఉత్పత్తి లక్ష్యమైనప్పుడు పారిశ్రామిక వివాదాలు ఏర్పడుతుంటాయి. శ్రమ శక్తిని అమ్ముకునే సందర్భంలో మానవ సంబంధాలలోని సమస్యల రూపంలో ప్రస్ఫుటం అయ్యేటటువంటివి ఈ పారిశ్రామిక సంబంధాలు, కేవలం పని ప్రదేశమునందే కాక అతని వ్యక్తిగత జీవితం కూడా సంక్షేమంగా ఉండేటట్లయితేనే పారిశ్రామిక సంబంధాలు బాగుంటాయి అనే దానికి అతని మానసిక స్థాయియే నిదర్శనంగా తెలియచేస్తుంది. ఇతరకార్మికులకంటే గనికార్మికుల పని స్వభావం అత్యంత క్లిష్టదాయకమైనది. పని పరిస్థితులు బాగుండకపోవడం, అదనపు శ్రమకు గురి కావడం, తమ శ్రమకు తగ్గ ఫలితం పూర్తిగా తాము పొందలేక పోతున్నామనే భావన, శ్రమ శక్తి ఫలాలైన ఉత్పత్తి తమకు దూరమవుతున్నదనే భావన, అధికారుల సహచర్యంలో వర్గ స్వభావపు పోకడలు మొదలగునవి అన్నీ వెరసి కార్మికులు తాము పరాయీకరణ చెందుతున్నామనే భావనకు గురి అవుతారు. ఆ భావన ఎక్కువైన కొద్దీ అంతగా కోపిష్టులుగా మారడమో, లేదా ఆ పరాయీకరణ భావన నుండి పలాయనం చిత్తగించాలుకుని తాగుడుకు బానిస కావడమో జరుగుతూ ఉంటుంది. ఆ కోపిష్టితనం, తన ఉనికిని తాను మరిచిపోయేంతగా

వ్యసనపరత్వం కలిసి వెరసి అమానుష ప్రవర్తనకు దారి తీస్తాయి. అంచెలంచెలవారీ అధికార సంబంధాలకు, పితృస్వామ్యానికి ఉన్న అవినాభావ సంబంధం వల్ల తన అమానుష కృత్యాలకు అనువైన చోటుగా ఇంటిని భావించడంతోపాటు, గృహ కార్మికులైన కార్మిక కుటుంబ స్త్రీల పైన అతడు తననొక అధికారిగా భావించుకోవడం జరుగుతూ ఉంటుంది. సాధారణంగా అన్ని ఇళ్లలో ఉండే పితృస్వామ్యమే, గని కార్మికుని విషయంలో కూడా ఉండి సంక్లిష్టత గల పని స్వభావపు రీత్యా మరింతగా పితృస్వామ్యం కార్మిక కుటుంబాలలో పరాకాష్ట స్థితిని పొందుతుంది. అంతిమంగా పరోక్ష పారిశ్రామిక సంబంధాల ప్రభావం వల్ల కార్మిక కుటుంబ స్త్రీలే కుటుంబ హింసకు గురి కాబడిన బాధితులుగా అర్థమవుతారు.

ప్రకృతిని అధీనంలోకి తెచ్చుకుంటూ ఉత్పత్తిని సృష్టించగల కార్మికుడికి సృజనాత్మకత అనేది ఉంటుంది. దానితో పనిచేస్తూ పాటలు పాడుకోవడం, శ్రమ ఫలాన్ని తోటివారితో పంచుకోవాలనే స్వభావం ఉండడంచేత తమ అనుభవాలను కథల రూపంలో పంచుకోవడంతో కార్మికులే రచయితలుగా సింగరేణి సాహిత్యం వచ్చింది. కవిత్వం వచ్చింది. కార్మిక శ్రమకు స్పందించగల కార్మికేతర రచయితలు వ్రాసిన సాహిత్యం కూడా వచ్చింది. ఆ సాహిత్యాన్ని కార్మికుల జీవన విధానంతో పోల్చిచూసి పరిశీలించిన వారికి ఈ సాహిత్యంలో వాస్తవికత స్పష్టం అవుతుంది. పారిశ్రామిక సంబంధాలలో ఉన్న కార్మికుల జీవితాలలోని ఒడిదుడుకులు పరోక్ష పారిశ్రామిక సంబంధాలలోని కార్మిక కుటుంబ స్త్రీల జీవితాలపై ప్రభావితం చూపగలుగుతాయి.

వ్యాపార నాగరికత పైన మోజు వల్ల గానీ, పట్న వాసంపైన యిష్టం కలగడం చేత గానీ, భర్త కాలరీలో పనికి కుదిరితే బాగుంటుందని భావించడంతో ఆ పల్లెటూరి నుండి బయట పడాలనుకోవడంతో పాటు వ్యక్తిగత కుటుంబ సంబంధాలలోనికి రావాలనుకోవడం కూడా జరిగింది. అయితే సొంత ఊరిలో పొలం అమ్మి ఆ డబ్బును దళారులకు పెట్టి కాలరీలో ఉద్యోగం సంపాదించే సందర్భంలో ఆ భూమి మీదనే పుట్టి పెరిగి సాగు చేస్తూ పొలం పండించుకుని మనవళ్ల వరకు అభివృద్ధిని పొందిన ఆ ముసలి అవ్వ చివరకు మనవడి కాలరీ ఉద్యోగం కోసం తాను నమ్ముకున్న భూమిని అమ్ముతుంటే అది తనకు పరాయిగా అయిపోతుందని బాధపడుతుంది. ఆ బాధను తట్టుకోలేక ఆ మట్టిని కరచి ప్రాణాలు వదులుతుంది. భూదేవి కథలో అవ్వ తన మనవడు కాలరీలో అంటే పారిశ్రామిక సంబంధాలలోకి కాలు పెట్టడానికి కావాల్సిన ముడుపులకై పొలం

అమ్మడం, ఆఖరికి కష్టపడి పండించిన పొలాన్ని వదులుకుంటున్న బాధను భరించలేక ముసలి అవ్వ చనిపోవడం భూదేవి అనే కథలో స్పష్టం అవుతుంది. చచ్చిపోతూ "నేను కష్టపడి సాగు చేసిన భూమి నా భూమి. దీని మీద ఎవరికి హక్కు లేదు" అంటుంది. కాని మనవడి కంపెనీ ఉద్యోగం ముందు ఆ హక్కు హుళక్కి అనేది పాఠకులకు అర్థం అవుతుంది. కంపెనీ ఉద్యోగానికై చోటుచేసుకున్న అవినీతి ప్రక్రియ పరోక్షంగా భూదేవి జీవితంపై ప్రభావితం చూపించిందని అర్థం అవుతుంది.

పల్లెటూళ్లలో పెత్తందారీతనం, తమకు దున్నుకునే భూమి తక్కువగా ఉండడం, కుటుంబ స్త్రీలు పట్నవాసంలో వ్యక్తిగత కుటుంబాలలోకి రావాలనుకోవడంగానూ, వెరసి నెలవు కథలో రాయమల్లు లాంటి కార్మికులు తనకు ఇష్టం లేకపోయినా కాలరీ ఉద్యోగంలో చేరడం జరిగిందని అర్థం అవుతుంది. అతని భార్య రాజేశ్వరి మొదట్లో ఐదారేండ్లు ఉద్యోగం చేసి డబ్బు జాగ్రత్త చేసి, ఆ డబ్బుతో ఒక సొంత యిల్లు ఏర్పాటు చేసుకుని పొలం కొనుక్కొని బ్రతకవచ్చు అనుకుటుంది. కాని ఆమె కాన్పుల ఖర్చుకై రెండేళ్లు జాగ్రత్త చేసిన డబ్బు ఖర్చు అయిపోతుంది. అంతేకాక భర్త ఆ ఉద్యోగం చేయడంలోని కాయ కష్టాన్ని మరిచిపోవడానికి తాగుడుకు బానిస అవుతాడు. అసలు అతనికి ఆ పని యందు అభిరుచి లేకపోవడం ప్రధాన కారణంగా స్పష్టం అవుతుంది. పల్లెటూళ్లలో పైరు పొలాల మధ్య జీవించిన అతనికి ఆ గాలి, వెలుతురు లేని చోట ఉద్యోగం చేయవలసి రావడం, ఆ పని యందు ఇష్టం లేకపోవడం, ఆ పని స్వభావం అతనిని బాధకు గురి చేస్తుంది. అన్నింటికంటే తాను పని చేస్తున్న చోట తన కళ్ల ముందే గోఫ్ (పెద్ద బొగ్గు బండ) పడడం వల్ల తోటి కార్మికుడు చనిపోవడం అతనిని మనసులో భయాందోళనలను కలుగచేయడంతో అతడు మతి స్థిమితం లేనివాడుగా తయారవుతాడు. ఇంట్లో పిచ్చి పిచ్చిగా పాటలు పాడుతుంటాడు. ఇంటి విషయాలు ఏమీ పట్టించుకోడు. దానితో సిక్కు లీవులో వచ్చే సగం జీతంతో అతని భార్య కుటుంబ బాధ్యత నిర్వహించుకు వస్తూంటుంది. దానిలో భాగంగా ఒకరోజు కూరల కోసం ఎర్రని ఎండలో బయలుదేరి రావడం, మార్గ మధ్యలో పోకిరి తాగుబోతుల బాధకు గురి అవడం జరుగుతుంది. పరుల సలహా మీద పల్లెటూరికి తీసుకొని వెళ్లగానే అతనికి తిరిగి స్వస్థత కుదురుతుంది. తిరిగి ఆమె కాలరీ ఉద్యోగానికి వెడదామంటే అతను రానంటాడు. పొలంలోన పడుకుంటే అతడిని తండ్రి వెతికి తీసుకుని వస్తాడు. ఈ లోపల అత్తా, కోడలు ఆ విషయమై గొడవపడడం, భార్యగా ఆమె తనకున్న పట్నవాసం మీద ఉన్న

మోజుతో తన భర్త కాలరీ ఉద్యోగం చేయాలనే ఆకాంక్ష పడడం, తల్లిగా కొడుకుకు ఇష్టంలేని ఉద్యోగం కదా అని భావించి అత్త కోడలిని చీవాట్లు పెట్టడమే కాక బూతులు తిట్టుకునే స్థాయిలో అత్తా కోడళ్ళు శత్రు సంబంధాలలోకి వెళ్లడం జరుగుతుంది. దున్నడానికి భూమి తక్కువగా ఉండడం, జరుగుబాటు లేక, పిల్లలను చదివించుకోలేని స్థితి ఉండడంతో భర్తకు ఇష్టం లేకపోయినా రాజేశ్వరి కాలరీ ఉద్యోగం చేసుకుంటే డబ్బు సరిపోతుందనుకుంది. ఆ కాలరీ ఉద్యోగం అంటే ఇష్టం లేని భర్త ఆ బాధ నుండి పలాయనం చిత్తగించాలనుకొని అధికంగా సారా త్రాగేసి చివరికి చనిపోవడం జరుగుతుంది. ఆ రకంగా రాజేశ్వరి అనాథగా మిగులుతుంది. కాళ్లకు చెప్పులు కొనుక్కోవాలనే ఆమె కోరిక కూడా తీరకుండానే పోయిందని కథా సందర్భంగా అర్థమవుతుంది.

ఇక్కడ కాలరీ ఉద్యోగం కొడుకుకి నచ్చకపోవడానికి కారణంగా గని ప్రమాదాల భయమని ఆ భయమే మతి స్థిమితం లేకుండా చేసిందని దీనికంతటికి కారణం కోడలికి గల పట్న వాసంపై మోజు అని భ్రమకు లోనుకావడంతో అంతిమంగా అత్తాకోడళ్లు శత్రు సంబంధాల్లోకి రావడంతోపాటు, భర్త చనిపోవడంచేత రాజేశ్వరి అనాథగా మారడం. పిల్లలను ఎలా పెంచగలననే భయం, ఆందోళన రాజేశ్వరిలో కలగడం సహజమైన పరిణామ విషయమే. ఇక్కడ పారిశ్రామిక సంబంధాల పరోక్ష ప్రభావం కార్మికుల కుటుంబ స్త్రీలపై ఉంటుందనేది స్పష్టమవుతుంది.

కార్మిక కుటుంబ స్త్రీలు త్రాగుబోతులైన భర్తలతో బాధలు పడడానికి ప్రధానంగ కారణంగా కార్మికులు తమ కాయకష్టాన్ని మరచిపోవాలనుకోవడానికి త్రాగుడును అలవాటు చేసుకోవడం అని అర్థం అవుతుంది. సర్వేలోను ఇదే అర్థమవుతుంది. పారిశ్రామిక సంబంధాలలో లాభాల దృష్ట్యా ఉత్పత్తి ధ్యేయంగా ఉండే యాజమాన్యపు ధోరణికి విరక్తి పుట్టి త్రాగుడుకు బానిస అయినట్లుగా భావింపబడే సంఘటనలు కూడా కలవు.

కార్మికులకు తాము ఉత్పత్తి చేసే సరుకు తమకు పరాయిగా మారడం, పనిచేసే చోట తన భావనకు, ఆలోచనకు ప్రాముఖ్యత లేకుండా తన శరీరం, తన అభిరుచి యాజమాన్యము యొక్క నిర్ణయానికే తలొగ్గడం వంటి విషయాలు వెరసి, కార్మికుడు తన భార్య కూడా తనకు కాకుండా పోతుందనే మనస్తత్వానికి లోనవడంతో భార్యాభర్తల సంబంధాలు శత్రుపూరిత సంబంధాలలోనికి ప్రవేశించినట్లుగా శత్రువు అనే కథలో అర్థం అవుతుంది. లోతుగా ఉండే స్త్రీ ఏ

సీములో బొగ్గు వెలికి తీసుకు రావడం చాలా కష్టమైన విషయం. అక్కడ పనిచేయడానికి గ్యాంగ్ ఇష్టపడడం లేదు. బదిలీ ఫిల్లర్ అవడం చేత ఇష్టం లేకపోయినా లింగయ్య మరొక వ్యక్తితో పాటు పని చేయడానికి ఒప్పించబడతాడు. అయితే ఇంట్లో భార్య అతని కోసం అన్నం వండి ఎదురుచూస్తూ ఉంటుంది. లింగయ్య రాగానే అన్నం వడ్డిస్తుంది. కాని అది చల్లారిపోయిందని భార్య మీద విసుక్కుంటాడు. అతడు డ్యూటీ నుండి ఆలస్యంగా రావాల్సి రావడంచేత టైం ప్రకారం వండే అన్నం చల్లారి ఉంటుందనే అవగాహన విసుగు వల్ల లోపిస్తుంది. పని చేసిన చోట అతడు పడిన కష్టం అతనికి యిష్టంలేని ఆ పని చేయాల్సిరావడంతో అతని మనస్సులోని బాధ అంతా విసుగు రూపంలో మారి భార్య మీద చూపించడం అంతిమంగా భార్య చిన్నబుచ్చుకొని బాధపడడం జరుగుతుంది. కష్టపడి ఇంటికి వచ్చిన భర్త అన్నం తినగానే మంచం మీద పడి ఒళ్లు తెలియని నిద్రపోతాడు. అంతవరకూ ఒంటరిగా గడిపిన భార్యకు భర్తతో గడపాలని కోరుకుంటుంది. భర్తను పలకరించినా పట్టించుకోకుండా పడుకుంటాడు. దానితో బాధపడి ఆలోచనలతో భారంగా ఉన్న ఆమె గాలిలేని ఆ ఇరుకు గదిలో ఉక్కపోస్తుంటే భరించలేక బయట పరుచుకున్న వెన్నెల్లో కూర్చుంటుంది. తన భర్త గని పనిలోకి రాకపూర్వం పల్లెటూళ్లో తామిద్దరు కలిసి ఆడుతూ పాడుతూ పొలం పని చేసుకోవడం గుర్తుకు వచ్చి బాధపడుతుంది. భర్త ఈ కాలరీ ఉద్యోగంలోకి వచ్చినప్పటి నుండి తమ మధ్య సాన్నిహిత్యం తగ్గడమే గాక ప్రణయ స్నేహ సంబంధాలు కూడా తగ్గినాయని బాధ పడుతుంది. పల్లెటూళ్లలో అందరితో సహజీవనం ఉండేది. కాని ఇక్కడి క్వార్టర్‌లలో ఇరుగుపొరుగు స్త్రీలతో కూడా కలిసి ఉండే అవకాశం లేదనీ తోటి కార్మిక కుటుంబ స్త్రీ అయిన ప్రక్కింటి ఆమెతో మాట్లాడాలనుకుంటే అసలు ఆమె తలుపు తీసి బయటికి రాని పరిస్థితులు ఉన్నాయని భావిస్తుంది. ప్రక్కింటి ఆమె భర్త ఆమెను ఎక్కడికి పోకూడదనీ ఎవరితో మాట్లాడకూడదనే ఆంక్షలు పెట్టాడని తెలియడంతో తోటి కార్మిక కుటుంబ స్త్రీల యొక్క బాధ కూడా గుర్తుకు వచ్చింది. మరొక కార్మిక కుటుంబ స్త్రీని ఆమె భర్త చీటికి మాటికీ కొట్టడంతో ఆమె బాధలు గుర్తుకు వచ్చి తోటి కార్మిక కుటంబ స్త్రీలు కూడా ఎవ్వరూ సుఖపడడం లేదనీ, అర్థమయి తన తోటి కార్మిక కుటుంబ స్త్రీలు కుటుంబ సంబంధాలలో బాధలకు గురి అవుతున్నారని గ్రహించగలుగుతుంది. కాని ఇంతలో లింగయ్య నిద్రలేచి ఆరుబయట ఒంటరిగా కూర్చున్న భార్యపై అనుమానాన్ని పెంచుకోవడం జరుగుతుంది. దానితో కోపం వచ్చి నానా మాటలు అనడం జరిగి, భార్యకు

కోపం రావడం తత్ఫరిణామంగా ఇద్దరి మధ్య మాటామాటా పెరగడం, లింగయ్య తనకున్న ఆధిక్య భావనతో ఆమె జుట్టు పట్టి యీడ్చుకుంటూ ఇంట్లోకి తీసుకెళ్లడంతో కథ ముగుస్తుంది.

'శత్రువు' కథలో కార్మికులు బావి పనిలో వేడిమికి, పొగకు చికాకు కలిగి రక్తంలో అనుశ్రుతంగా వస్తున్న పితృస్వామ్యపు సంస్కృతి భావాలతో భార్య శీలం మీద అనుమానం ఏర్పరచుకోవడం, భార్య వీధి ముఖం చూడకూడదని ఆంక్షలు పెట్టడం, ఆఖరికి తోటి కార్మిక స్త్రీలతో మాట్లాడినా కూడా అనుమానించడం, బావి పని నండి ఇంటికి తాగి రావడం, జీతం డబ్బులు ఇవ్వకపోవడం, మాంసం వండలేదంటూ భార్యని కొట్టడం, ఇలా భార్యాభర్తలు బద్ధ శత్రువులుగా మారడాన్ని గమనించవచ్చు.

సాధారణంగానే భార్యను అనుమానించడం అనేది పితృస్వామ్య లక్షణం. అయితే ఇక్కడి ఇంట్లో బొగ్గుబావి పనిలో పడ్డ కష్టంతో భర్త ఇంటికి వచ్చి భార్యని పట్టించుకోకపోవడం, తోటి కార్మిక స్త్రీలతో కలిసి మెలసి ఒంటరితనాన్ని పోగొట్టకోగల వాతావరణం కూడా లేకపోవడం. గాలి రాని, కరెంటు లేని యిరుకు గదిలో దుర్భరమైన జీవితం గడపడం, ఇవన్నీ కలిసి కార్మిక కుటుంబస్త్రీగా ఆమెను బాధకు గురి చేస్తే, బాధతో అరుబయట వెన్నెల్లో సేద తీరాలనుకున్న ఆమె మనస్తత్వాన్ని పట్టించుకుని అవగాహన చేసుకునే నేర్పు, ఓర్పు లేని భర్త, భార్యను పితృస్వామ్య సంస్కృతికి అనువైన శీల నేరారోపణ పద్ధతిలో బాధించడం కథలో అర్థం అవుతుంది. అంతిమంగా భార్యాభర్తలు శత్రుపూరిత సంబంధాలలోకి వెళ్లడంగా కూడా స్పష్టమవుతోంది. ఈ కథలో ముఖ్యంగా పని భారంతో విసుగు చెందిన లింగయ్య యొక్క మనస్థాపానికి కారణం క్లిష్టతతో కూడుకున్న బావి పని అని స్పష్టమవుతుంది. అంతేగాక తోటి స్త్రీల జీవితాలు కూడా ఇంచుమించుగా ఇదే పద్ధతిలో ఉన్నాయంటే తోటి కార్మికుల ప్రవర్తన కూడా యించుమించు లింగయ్య లాగానే ఉందనీ, అలా ఉండడానికి కారణం పరిశీలిస్తే కార్మికులు తాము చేసే పనిలోని కష్టంతో పాటు తమ శ్రమ శక్తికి ఫలమైన ఉత్పత్తి తమకు పరాయిదైపోతుందనే భావనతో ఉండడంతో వారు కూడా పరాయి వారవుతున్నారనే భయంతో పితృస్వామ్య సంస్కృతి కంటే కూడా అదనంగా స్త్రీలపై ఆంక్షలు పెడుతూ పగటి పూట కూడా పక్కింటి కార్మిక కుటుంబ స్త్రీలతో సైతం మాట్లాడకూడదనే ఆంక్షలు పెట్టడంగా అర్థం అవుతోంది.

'ప్రమాదం' అనే కథలో పెళ్లి కుదిరిన కార్మికుడు గని ప్రమాదంలో చనిపోవడం వల్ల చేసుకోబోయే ఆ అమ్మాయి ఆశలు అడియాశలు కావడం, ఆ అమ్మాయి జీవితం మీద ముద్రపడడం కూడా మనం అర్థం చేసుకోవచ్చు. అంతేగాక ఆ కార్మికుడి యొక్క అక్క భర్త బావి ప్రమాదం వల్ల చనిపోతే ఆ అక్క పిచ్చిదై తిరుగుతుందని చెప్పడం చేత గనిలో పనిచేయడం చాలా ప్రమాదంతో కూడుకున్నదనీ, జీవితాలకు రక్షణ లేదని, ఆ జీవితం మీద ఆధారపడిన ఆ కార్మికుడి కుటుంబ సభ్యుల జీవితాలు నిరాధారమవుతాయని తెలుస్తోంది. ముఖ్యంగా ఆ కార్మికుడి భార్య మతి స్థిమితం కోల్పోవడంతో పారిశ్రామిక సంబంధాలలో రక్షణ లేనితనం యొక్క ప్రభావ పరంపర అంతిమంగా కార్మిక కుటుంబ స్త్రీల జీవితాలకు బాధాకరంగా పరిణమించడంగా అర్థం అవుతుంది.

ఈ విధమైన కార్మికుడి మనస్తత్వాన్ని కార్మిక కుటుంబ స్త్రీల మనోగతాన్ని ఇంటర్వ్యూ చేయడం ద్వారా అది జీవిత వాస్తవం అని తేలింది.

'నీడ కోసం' అనే కథలో కార్మికులు తమ ప్రాథమిక అవసరాలు తీరుతాయనే ఆశతో ఉన్న ఊరు వదిలిపెట్టి కాలరీ ఉద్యోగంలోకి వస్తారు. కాని బావి పనిలోని క్లిష్టతను మరిచిపోవడానికి సారా త్రాగడాన్ని అలవాటుగా చేసుకోవడమే గాక, సంపాదించిన జీతంతో ఉండడానికి రెండు గదులు ఉన్న గుడిసె వేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్కటే గదిగా గల గుడిసెలోనే కుటుంబం అంతా ఉండడంతో కాలరీలోనే పనిచేస్తున్న కొడుకుకి పెళ్లి జరగడంతో కొడుకు భార్యను తెచ్చుకోమని చెప్పినా కొడుకు తెచ్చుకోలేకపోవడం ఈ కథలో కనబడుతుంది. పరిశ్రమలో పని చేయడానికి వచ్చిన కార్మికులకు పనిచేసే పరిస్థితులలో గాలి, వెలుతురు లేని చోట రోజు 8 గంటలు పని చేస్తారు. అయితే మనిషి అంతగా కష్టపడ్డందుకు తిరిగి మళ్లీ గనిలోకి వచ్చి ఉద్యోగం చేయాలంటే అతనికి 6,8 గంటలు మంచి నిద్ర అవసరం. అప్పుడే అతడు 8 గంటల కాలం జాగ్రత్తగా గనిలో పనిచేయగలడు. అందుకని అతడు తనకు కనీస ప్రాథమిక సంబంధాలలోకి ప్రవేశించినపుడు ఆ గని ప్రాంతంలో అతనికి ఉండడానికి ఒక ఇల్లు అవసరం అవుతోంది. కార్మికునికి నివాస గృహం కట్టించి ఇవ్వడానికి ఉత్పత్తి లాభాలలో కొంత భాగాన్ని కేటాయించడానికి గాను జెబిసిసిఐలో ఒప్పందం కుదిరింది. అయితే అమలులోని లోపాల వల్ల జాప్యం వల్ల ఆ యాజమాన్యం కార్మికులకు ఆ వసతిని అందించలేకపోయినప్పుడు కార్మికుడి యొక్క వ్యక్తిగత జీవితం బాధకు గురి అవడమే కాక కార్మిక కుటుంబ

స్త్రీల కుటుంబ సంబంధాలకు కూడా అవరోధంగా తయారవుతుందని అర్థం అవుతుంది.

నీడ కోసం కథలోనే తండ్రి వీరయ్య కాలరీ ఉద్యోగం చేసినా జీతం మిగలక కేవలం ఒక్క గదియే గల గుడిసెలో ఉంటున్నాడు. కొడుకు నారాయణ కూడా గనిలోనే ఉద్యోగంలో చేరాడు. అతనికి ఆ వీధిలోనే ఉండే మరో కార్మికుడి యొక్క కూతురుతో పెళ్లి అవుతుంది. ఆ కార్మికుడికి ఉన్నది ఒక గది గుడిసెయే. దానితో నారాయణకు పెళ్లి జరిగినా భార్య భర్త సంబంధాలలో ఉండలేని స్థితి ఏర్పడుతుంది. కార్మికుడు తన భార్యను తెచ్చుకోలేని నిస్సహాయ స్థితికి బాధపడడం, దానితో రాత్రిపూట నిద్రపట్టక పాన్ కొట్టుకు వెళ్లి పాన్ తీసుకోవడం, రాత్రి పూట వీధిలో పిచ్చిగా తిరగడం చేస్తుంటాడు. దానికి బాధ చెందిన తండ్రి తోటి కార్మికులతో చర్చిస్తాడు. చాలా మంది కార్మికులు తమకు కూడా వసతి సౌకర్యాలు కరువవడంతో బాధపడి కొత్త ఆలోచనలు చేస్తారు. దాని ఫలితంగా రైలు కట్ట వెంబడి ఉన్న ఖాళీ స్థలంలో మర్నాటికల్లా కొందరు పాకలు వేసుకుంటారు. ఆ క్రమంలో నారాయణ తన భార్యయైన చంద్రిని తెచ్చుకోగలుగుతాడు. అయితే కొన్నాళ్లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కంప్లయింట్‌తో పోలీసు బలగం వచ్చి ఆ గుడిసెలు పీకేస్తారు. అక్కడున్న స్త్రీలు అడ్డుకోగా వారిని అరెస్ట్ చేస్తారు. ఆ తర్వాత స్త్రీలు అందరూ కూడా కార్మికులతో పాటు తమ వంతు సహకారంగా ఉద్యమంలో భాగస్వాములవుతామంటూ ఆ మర్నాడు గనుల వద్ద ఉన్న చిన్న రేకుల షెడ్లు వేసుకుని అక్కడే స్త్రీలు పొయ్యిలు వెలిగించి వంట చేస్తుంటే కార్మికులు తమ ఏర్పాటు చేసుకుని వసతి గృహాలను ధ్వంసం చేసినందుకునూ నిరసన తెలియచేస్తారు. తమకు వసతి గృహ నిర్మాణాలకై కంపెనీ పూనుకోవాలనీ పట్టుపడతారు.

పారిశ్రామిక సంబంధాల మెరుగుకై జెబిసిసిఐలో సంక్షేమ పథకాల అమలు ఒప్పందంలో భాగంగా వసతి గృహాల కల్పన చేపట్టక పోయేసరికి కార్మికుడు వ్యక్తిగత జీవితంలో భార్యతో గడపలేని పరిస్థితులు ఏర్పడటంతో కుటుంబ నిర్మాణపరంగా సంబంధాలు సరిగా లేకపోవడం అనేది అంతిమంగా బాధితులు కార్మిక కుటుంబ స్త్రీలనని అర్థమవుతుంది.

'నీళ్ల తగవు' అనే కథలో కార్మికులకు ప్రాథమిక అవసరాలు తీరాలంటే సంక్షేమ పథకాలలో భాగంగా కార్మిక వాడలలో నీటి అవసరాలు తీర్చాల్సిన

స్థితిని మెరుగు పరచాలి. దానిలో భాగంగా కనీసం నాలుగు ఇండ్లకొక పంపునయినా వేయగలగాలని కార్మికులు నీటి వసతికై ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టినా అధికారులు పట్టించుకోలేదు. కార్మికులు రైలు కట్ట అవతల చిన్న గుడిసెలో ఉండడం, వీరి ఎదురుగా పై స్థాయి ఉద్యోగాల అధికారుల క్వార్టర్స్ ఉండడంతో కార్మిక కుటుంబ స్త్రీలు ఎలాగో ఒకలాగ ఆ ఇండ్లలోని పంపు నీరు తెచ్చుకుంటారు. కాని ఒక కార్మిక కుటుంబ స్త్రీ తనకు దగ్గర ప్రాంతంలో ఉన్న ఒక అధికారి క్వార్టర్‌కి నీళ్లకోసమై వెళ్లినపుడు వర్గ స్వభావంలో భాగంగా నీళ్లు పట్టుకోనివ్వరు. అయితే ఆ ఇంట్లో పంపు నీళ్ళను కూరగాయల స్థలంలోనికి వెళ్లేవిధంగా పంపునుండి ట్యూబు అమర్చి పెట్టబడి ఉంటుంది. దానిని తీసి కింద పడేసి కార్మిక కుటుంబ స్త్రీ కుండ నింపుకోబోయే సమయంలో ఆ ఇంట్లో కుర్రాడు వచ్చి కుండ పగులకొడతాడు. మాటా మాట పెరిగి గొడవ పెద్దదయి రెండు పక్షాలుగా విడిపోతారు. వర్గ స్వభావ పోకడతో కార్మిక స్త్రీల వర్గం, అధికారుల కుటుంబ స్త్రీల వర్గంగా అంటు రెండు వర్గాలుగా ఏర్పడుతారు. అప్పుడు ఆ కార్మిక కుటుంబ స్త్రీలు తమ అవసరాలను గుర్తించగలిగి చైతన్యాన్ని తెచ్చుకుంటారు. వెంటనే మర్నాడు కార్మిక కుటుంబ స్త్రీలు అందరు కలిసి రోడ్డు మీద నిలబడి, గనికి పోయే దారిలో గని ఏజెంటు స్థాయి అధికారులను అడ్డగిస్తు రాస్తా రోకో చేయడంతో అధికారులు దిగివచ్చి మర్నాడికల్లా ఆ వాడలో పంపులు వేయడానికి సన్నద్ధం అవుతారు. కార్మిక కుటుంబ స్త్రీలు కార్మికుని ఇంటి పరిస్థితుల మెరుగుకై ఉద్యమించడం అనేది పరోక్ష పారిశ్రామిక సంబంధాలలో సంబంధం కలిగి యుండటంగా భావించవచ్చు. అలా జరిగినందుకు కార్మికులు సంతృప్తిని పొందడంగా కనబడుతుంది. 'ఫ్రీడమ్ ఈజ్ ది రికగ్నిషన్ ఆఫ్ నెససిటిస్' అని ఏంగిల్స్ చెప్పిన మాట వాస్తవంగా కనబడుతుంది.

'నీళ్ల తగవు' అనే కథలో స్త్రీలు తాము నీళ్ల కోసం దూరం వెళ్లి బిందెలు మోసి మోసి భుజాల మీద కాయలు కాసి రవికలు చినిగినట్లు చెప్పాడు. రాక్షసుడు కథలో కార్మికులు ఆ బావి పని చేసి చేసి ఎముకలు తీరుగా అయి ఆ బావి పని కష్టం నుండి విముక్తికై తాగుడు తాగి ఇంటికి రావడం, పెళ్లాలను తిట్టడం, కొట్టడం, దాని పరిణామంగా కార్మిక కుటుంబాలలో భార్యాభర్తలిద్దరూ బద్ధ శత్రువులుగా ఉంటారనే విషయాన్ని అవగాహనచేసుకుంటాడు.

సంక్షేమ పథకాల అమలు సజావుగా ఉంటే పారిశ్రామిక సంబంధాలు మెరుగుపడతాయి. పారిశ్రామిక సంబంధాలు మెరుగు పడితే ఉత్పత్తి, ఉత్పాదకత

పెరుగుతుంది. సంక్షేమ పథకాల అమలు సరిగా లేకపోతే ఉత్పాదకతపై ప్రభావం చూపించబడుతుందని తెలియచేయగల కథ 'అగ్ని' ఈ కథలో భార్య సైరన్ కూతకు ముందే లేచి బొగ్గు పొయ్యి అంటించి భర్తకోసం అన్నం వండి గిన్నెను దించి పెట్టి భర్తను లేపి, తాను మంచినీళ్లు తేవడానికై ఆ వీధి చివరలో ఉన్న పంపు దగ్గరకు వెడుతుంది. లేటుగా వెడితే పంపు బంద్ అవుతుంది. అందరూ వంట కోసం బొగ్గు పొయ్యిలు అంటించడంతో ఆ ప్రాంతమంతా పొగతో నిండి చీకటిగా ఉండడం, ఇంటి చుట్టు డ్రయినేజి సౌకర్యం లేకపోవడంతో మురుగు కాలువలను త్రవ్వుతున్న కుక్కలు, పందులు తిరుగుతూ ఉన్న ఆ వీధిలో ఆమె నీళ్లు తేవడానికి వెళ్లి వచ్చేసరికి రాత్రి డ్యూటీ నుండి వచ్చి పడుకున్న భర్త నిద్ర లేవడానికి బద్ధకిస్తాడు. భర్తను లేపిన భ్రమలో ఆమె గుడిసె తడిక దగ్గరగా వేసి నీళ్లకోసం వెళ్లి వచ్చేసరికి ఆ అన్నాన్ని కుక్క తినేస్తుంది. చేసేది లేక భర్తను తిట్టడం, ఇద్దరూ కాసేపు మాటా మాటా అనుకొన్న తర్వాత మళ్ళీ అన్నం పడేసి ఆమె మళ్ళీ మరో బిందె నీళ్ల కోసం వెళ్లి వస్తూ కాలనీలోని మురుగు కాలువ వద్ద పంది అడ్డం పడడంతో ఆమె కింద పడేసరికి ఆమె కాలు బెణుకుతుంది. దానితో నడవలేకపోతుంది. దానితో అతడు భార్యను ఆసుపత్రికి తీసుకొని పోవాలనుకొని డ్యూటీకి హాజరు వేయించుకొని చెప్పివద్దామని వెళ్ళి మళ్ళీ వచ్చి హాస్పిటల్‌కి తీసుకుపోవడం జరుగుతుంది. అక్కడ డాక్టరు కూడా బయట స్కూటరు ఒరిగిపోవడంతో కింద పడి కాలుకు దెబ్బ తగిలితే వచ్చిన ఒక అధికారి విషయానికి ప్రాధాన్యతనిచ్చాడు గానీ అంతకంటే ముందు వెళ్ళి చూపించుకున్న ఆ కార్మిక కుటుంబ స్త్రీకి వైద్య విషయంలో జాప్యం చేయడం జరిగింది. ఇవన్నీ కార్మికుడి యొక్క వ్యక్తిగత జీవితం మీద దెబ్బ తీయడమే కాక పారిశ్రామిక సంబంధాలలో భాగంగా సంక్షేమ పథకాలు సరిగా అమలు చేయకపోతే అంతిమంగా బాధకు గురి అయ్యేది కార్మిక కుటుంబ స్త్రీలే అని అర్థం అవడంతో పాటు ఆ కార్మికుడు కూడా హాజరు వేయించుకున్నా గాని బొగ్గును ఉత్పత్తి చేయలేకపోవడం అంతిమంగా పారిశ్రామిక ఉత్పతి ఉత్పాదకతల పైన ప్రభావం చూపిస్తున్నదని అర్థమవుతుంది.

'అగ్ని' కథలో స్త్రీలు పంపు నీళ్ళు తెచ్చుకొనేటప్పుడు పడే కష్టాలను ప్రమాదాలకు గురి అవడాన్ని రచయిత వర్ణించినపుడు పంపు నీటి వసతి లేకపోవడం చేత కార్మికుడు మస్టరు వేయించుకున్నా ఉత్పత్తిలో పాలు పంచుకోకపోవడం తద్వారా కార్మిక కుటుంబ స్త్రీల స్థితిగతులు పారిశ్రామిక

ఉత్పత్తులపై ప్రభావం చూపించుతాయి అనే విషయం స్పష్టమై పరోక్ష పారిశ్రామిక సంబంధాలలో స్త్రీల భాగస్వామ్యం అర్థం అవుతుంది.

సింగరేణి సంస్కరణలలో భాగంగా 'సేవా' సింగరేణి ఎంప్లాయిస్ వైఫ్స్ అసోసియోషియన్ అనే స్వచ్ఛంద సంస్థ యొక్క ఏర్పాటు కార్మిక కుటుంబ సభ్యులైన వారికి మిక్కిలి ఉపయోగకరంగా ఉంటున్నది. ఈ సేవా సమితి ద్వారా భర్తలు ప్రమాదవశాత్తు చనిపోతే వారికి వచ్చే డబ్బును గురించి నెలనెలా వచ్చే పెన్షను సౌకర్యాన్ని తెలియచేయడం జరుగుతుంది.

గత కాలంలో భర్త గని ప్రమాదంలో చనిపోతే ఆమెకు భవిష్యత్తు అంధకారంగా ఉండడం జరిగేది. ఆమె తెలియని తనాన్ని సొమ్ము చేసుకొనేవిధంగా కార్మికులు కొందరు ఆమెకు అండగా ఉండే నెపంతో దగ్గరవడం, ఆమెకు కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగం ఇస్తే, ఆమె డబ్బుకై ఆశపడి పితృస్వామ్య ప్రయోజనాలలో భాగంగా వివాహేతర (చిన్న యిల్లు) వంటి సంబంధాలను ఏర్పరచుకోవడం, తద్వారా ఆమె పిల్లలకు తల్లిపైన ఏర్పడే నిరసన భావాలు, తల్లిని చంపాలనుకొన్న తనయుల కథలు, సింగరేణి ప్రాంతంలో బాహాటంగా వెలికి రాకపోయినా పరిశీలనలో అర్థమైన విషయం. వితంతువులయిన కార్మిక కుటుంబ స్త్రీలను ఆర్థిక దోపిడీకి గురిచేస్తూ, ఆమె దగ్గర మరణించిన భర్త తాలూకు డబ్బు అయిపోయిన తర్వాత ఆమెను హింసకు గురిచేయడం కూడా పారిశ్రామిక వాడలలో వాస్తవమైన విషయాలుగా స్పష్టమవడమేగాక బహు భార్యత్వపు సంస్కృతికి ఆనవాల్లుగా కనబడతాయి.

అయితే నేటి కార్మిక కుటుంబ స్త్రీలు చైతన్యవంతులయ్యారు. ఏ రకంగానైనా ప్రమాదం సంభవిస్తే, ఆటుపోట్లకు తట్టుకుంటూ, పిల్లలను చదివించి, పెద్ద చేసుకోగల నేర్పును పెంచుకున్నారు. సిబ్బంది భార్యలైతే కాస్తో కూస్తో చదువుకోగలిగిన స్థాయిలో ఉండడంతో ఉద్యోగంలో చేరడం వంటివి జరుగుతున్నాయి. సింగరేణి సంస్థ, సింగరేణి మహిళా కళాశాలను ఏర్పాటు చేయడంతో స్త్రీలు కాస్త చదువుకోగలిగిన విషయం తేటతెల్లమే. వితంతువుల పెన్షన్‌స్కీం వల్ల వితంతువుల పై ఆర్థిక దోపిడీకి అడ్డుకట్ట పడింది.

సింగరేణి సేవా సమితి స్త్రీల అక్షరాస్యతను అభివృద్ధి పరచడం, కార్మిక కుటుంబ స్త్రీలకు వారి కుమార్తెలకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, వంటివి కార్మిక వాడల్లో చెప్పుకోదగ్గ అభివృద్ధికర పరిణామాలు.

సింగరేణి సంస్థ బ్యాంకు ద్వారా జీతాల చెల్లింపు పద్ధతి వచ్చిన తరువాత కార్మికులు డ్యూటీ నుండి వచ్చి బ్యాంకుకు వెళ్లే పనిని తగ్గించడానికి గానీ, పొదుపును అభివృద్ధి చేయడానికి గాని స్త్రీలు స్వయంగా బ్యాంకులకు వెళ్లి జీతాలు డ్రాచేసి, తీసుకురావడం, స్త్రీలను సామాజిక సంబంధాలలో భాగస్వాములుగా చేయగల పరిణామంగా కనబడుతుంది. తద్వారా వారిలో ఒక సామాజిక బాధ్యత అభివృద్ధి చెందడం అనేది విశిష్ట పరిణామంగా భావించవచ్చు.

'సింగరేణి మహిళా కళాశాల' స్థాపనతో చాలా మంది కార్మిక కుటుంబాలలోని అమ్మాయిలు చదువుకోగలగడం, తిరిగి సింగరేణి సంస్థలోని తమ సేవలను అందించడం మహిళా ప్రగతికి మైలు రాయిగా చెప్పుకోవచ్చు. అయితే సింగరేణి సంస్థలో ఉద్యోగినులు కొంతమంది తమ బాధలలో భాగంగా లైంగిక వేధింపులకు గురైనటువంటి ఒకటి రెండు సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆఫీసులో లేడీస్‌కి ప్రత్యేకంగా టాయిలెట్ల సౌకర్యం లేక ఇబ్బందికి గురైనట్లు సర్వేలో వెల్లడయింది.

చిట్టీలని, వాయిదాల పద్ధతి మీద వస్తువులిస్తారని చెప్పి మోసం చేసే వ్యక్తుల బారి నుండి కార్మిక కుటుంబ స్త్రీలను కాపాడే దృష్టితో సింగరేణి సమాచార శాఖ అటువంటి విషయంలో కార్మిక కుటుంబ స్త్రీలు చైతన్యవంతులయ్యే విధంగా సింగరేణి తరంగాల వంటి టెలిఫిల్మ్‌ల ద్వారా తెలియచేయడం జరుగుతుంది. సింగరేణి ఏర్పాటు చేసిన సమాచార శాఖ నిర్వాహకత్వం మహిళలకు ఒక కర దీపికలుగా కనబడుతుంది. అంతేగాక కార్మికుల ఇంట్లో విద్యుత్ దుబారాను తగ్గించడం, ఒకరకంగా పరోక్షంగా కార్మిక కుటుంబ స్త్రీలు సంస్థ యొక్క అభివృద్ధిలో పాలు పంచుకోవడంగా అర్థం చేసుకోవచ్చు.

'దారులు' కథలో ఒక కార్మికుడు వాళ్ళ నాన్న సింగరేణిలో పనిచేసినప్పుడు కూడా అతని తల్లి ఎప్పుడు ఖాళీగా ఉండలేదనీ దగ్గరలో ఉన్న పొలం పనులకు వెళ్ళిందనీ, అతని నాన్న మోకాలు కలుకులకు జీడితో గీతలు గీసుకుంటూ డ్యూటీ సరిగా చేసేవాడు కాదని చెప్పడం చేత కార్మిక కుటుంబ స్త్రీలు తమ భర్త పని కష్టంతో మోకాలు బాధ నొప్పి ఎక్కువై డ్యూటీ చేయకపోవడంతో జీతం కోత ఏర్పడి తక్కువ జీతం తీసుకోవడంతో డబ్బు సరిపోక భార్య పొలం పనులు చేసుకొని ఇల్లు గడపడంగా కార్మిక కుటుంబ స్త్రీల స్థితి అర్థం అవుతుంది.

"విస్తరణ" అనే కథలో గని పనిలోకి వెళ్ళకుండా బందు వెనుక బందు పెడితే జీతం కోత ఉంటుంది కాబట్టి చిట్టీ పైసలు ఎలా కట్టాలని రాజయ్య ఆలోచిస్తుంటే అతని భార్య "మందేమో స్ట్రయిక్ చేస్తాంటే నువ్వు చేతులు ముంగట పెట్టుకొని చిట్టీకోసం చిక్కిపోతున్నావు. తన్నినా, గుద్దినా నోరు మూసుకుని పని చేస్తే సరిపోతుంది మరి స్ట్రయిక్ ఎందుకు మొదలు పెట్టారని" అంటు నిష్ఠూరమాడుతుంది. భార్య తనకు రాజకీయాలు నేర్పుతోందని ఆమెను విసుక్కున్నాడు. 'విజయం మనదే' కథలో స్త్రీలు పోలీసుల దాడిని ఎదుర్కోవడం కనబడుతుంది.

శేషగిరి నవలలో స్వాతంత్ర్యానికి పూర్వపు స్థితిలో భాగంగా స్త్రీలు, పురుషులు, కాంట్రాక్టర్ల దగ్గర కూలీలుగా చేరి గనులలో పని చేసేందుకు కుదిరే వారని, భర్త బొగ్గు తీసి, భార్య తట్ట ఎత్తి టబ్బులో పోసేది అని అర్థం అవుతుంది. అవివాహితురాలయిన జుట్టు 'పోషం' అనే ఆమెను ముఖద్దామ్ రాజీరు ఆమెను గనిలో బొగ్గు తవ్వి ఖాళీ చేసిన డిప్ దగ్గరకు తీసుకెళ్లి లైంగిక సంబంధాలు పెట్టుకున్నప్పుడు బ్లాస్టింగ్ చేయడం చేత బండ కూలి దాని కింద వాళ్లిద్దరూ మరణించినట్లు అర్థం అవుతుంది. స్త్రీలు బొగ్గుగనులలో పనిచేసేవారనే దానికి ఇల్లెందులో ఉంటున్న ఆనాటి మహిళా కార్మికురాలు గోపమ్మ సజీవ ఉదాహరణ.

ఆ రోజులలో శేషగిరి అక్క వితంతువు అయిన కామమ్మ నెల్లూరు నుండి యాత్రికులతో వచ్చి ముందుగా పూటకూళ్ల ఇల్లు పెట్టి స్వశక్తితో నిలబడడం కనబడుతుంది. పెద్ద మనిషిగా చెలామణి అవుతున్న లాల్ సేట్ ద్వారా శేషగిరిని ఉద్యోగంలో వేయిస్తుంది. లాల్‌సేట్ కామమ్మ గారిని గూర్చి మాట్లాడుతూ 'ఆడదై పుట్టింది గానీ లేకుంటే అందరినీ మింగేసే తెలివి ఆమెకుంది' అని అనడం ఆనాటి వ్యవస్థలో కామమ్మ లాంటి స్త్రీ స్వయం సహాయక గ్రూపుకు లీడరుగా వ్యవహరించడం అంటే అభినందించదగ్గ విషయం. ఈ నవలలో పర్నా సత్యనారాయణ అనే వ్యక్తి చెప్పినట్లుగా స్త్రీల యొక్క శక్తి వినబడుతుంది అనేది సత్యం. తాళ్ళ పోషమ్మ, ఆమె భర్త గనిలోనే పని చేస్తారు. దొర ప్రశ్నించేసరికి ఆమె భాష అర్థం కాకపోయేసరికి దొర ఆమెను పెద్దగా అరిచాడు. దానికి ఆమె "ఇదేం నీ ఇంట్ల పని కాదు, నేను నీ పెండ్లాన్ని కాదు, నీవు అరచినట్లు పడడానికి అంతగా కోపం ఉంటే నీ యింటికి పోయి నీ పెండ్లాం మీద అరువు, ఇక్కడ ఎవరూ పడరు. మాకెవరూ పుణ్యానికి కూలి ఇవ్వడం లేదు. నీ లెక్కన గాలి

పిట్ట వోలే కర్ర వూపుకుంటూ తిరిగితే కూలి ఇవ్వడం లేదు" అని ఆమె అరిచేసరికి ఆయనకు భయం వచ్చింది. భర్త వచ్చి సముదాయించినా ఆగలేదు. దొరకు కోపం వచ్చిందని ఆమెను కార్మికులు ప్రక్కకు తీసుకెళ్లారు. "ఆమె పని దొంగ కాదని, సన్నగా ఉన్నా కూడా మగోని కంటే ఎక్కువ పని చేసేదనీ, ఎవరికీ భయపడదనీ, దొరలే ఆమెకు భయపడాలి" అని రచయిత పేర్కొనడం స్త్రీ శక్తి బొగ్గు లోని దహన శక్తితో పోటీ పడగల దనడానికి ఉదాహరణగా భావించవచ్చు.

శేషగిరి నవలలోనే పర్సా సత్యనారాయణ అనే వ్యక్తి స్త్రీ(మహిళా) కార్మికులయొక్క అద్భుతమైన పోరాటానికి మచ్చుతునక అయిన సంఘటనగా గారె మల్లమ్మను పేర్కొంటాడు. ఇంక్లైన్‌లో మల్లమ్మ అనే వ్యక్తి పనిచేసి దిగిపోయిందని గతంలో యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం అర్థాంతరంగా దిగిపోయిన కార్మికులకు రావలసిన పైసల విషయమై హెడ్ ఆఫీసుకు పోతే అక్కడ కన్నాభిరామ్ అనే అధికారి అడ్డు తగిలి సాయంత్రం ఇంటికి వస్తే పైసలు అక్కడ ఇప్పిస్తామని బొంకాడు. దాంతో ఆ అమాయకురాలు దొర గారింటికి వెడితే అక్కడ ఆమెను ఆపి కన్నాభిరామ్ చెయ్యి పట్టుకొని నానా హంగామా చేస్తే ఆమె పారిపోయి వచ్చినట్లు గడుసు పుల్లమ్మతో చెప్పింది. మర్నాడు పొద్దున్న స్త్రీలంతా హెడ్ ఆఫీసు ముందు గుమిగూడారు. కన్నాభిరామ్ గారి కారు రావటం చూసి ఆయన కారుకు అడ్డం వెళితే వారు ఏదో సమస్య అడుగుతున్నారనుకొని ఆ అధికారి కారు ఆపి కాలు బయట పెట్టాడో లేదో మల్లమ్మ పీతి బకెట్‌తో తీసి మెడకి వేసింది. చీపుళ్ళు, చెప్పులు పట్టుకొని అపర కాళికల్లా ఉన్న స్త్రీలను చూసి భయపడి కాళ్లా వేళ్లా పడ్డారు. మల్లమ్మ కాళ్లకు మెడలోని పీతి బకెట్‌తో వున్న అధికారితో మూడు సార్లు దణ్ణం పెట్టించారు. ఆ తర్వాత పోలీసులు వచ్చినా వాళ్ళని ఏమీ చేయలేకపోయారు. ఆ తర్వాత నుంచి ఏ అధికారి స్త్రీలను అవమానపరచలేదు. ఒక్కొక్కసారి పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ చొరవతో పోరాటాలలో ముందు భాగాన ఉంటున్నారనీ వాళ్ళ తెగింపు చూస్తుంటే రాత్రి పొద్దు పోయేవరకు రికాము లేని పనులతో పిల్లల సంరక్షణతో సతమతమయ్యే అమాయక స్త్రీలేనా వీరు అని అనిపిస్తుందని పర్సా సత్యనారాయణ అనే వ్యక్తి ఒక పాత్రగా శేషగిరి నవలలో పేర్కొంటాడు.

ఉద్యమకారులైనవారికి తన ఇంట్లో అన్నం పెట్టిన దారా కనకమ్మ వంటి వారిలో స్త్రీల చైతన్యాన్ని ఉద్యమ స్వభావాన్ని శేషగిరి చూడడం నవల ద్వారా అర్థం అవుతుంది.

చాకలి ఎల్లమ్మ ద్వారా మోహన్ సింగ్ అనే కాంట్రాక్టరు యొక్క ఉంపుడుగత్తె పుల్లమ్మ శేషగిరి వాళ్ల మీటింగును గూర్చి మోహన్‌సింగ్‌కు చెప్పింది. ఆ విధంగా ఉద్యమనిర్మాత అయిన శేషగిరి కదలికలు కనిపెట్టి పోలీసుల సహాయంతో శేషగిరిని చంపడానికి సాధనాలుగా చేసుకోబడ్డ స్త్రీలు కూడా శేషగిరి నవలలో ఉన్నారు. అయితే ఆ స్త్రీలు అలా ప్రవర్తించడానికి కారణమయిన ఆర్థిక విషయాలను కూడ ఆలోచించడంతో పాటు పుల్లమ్మ ప్రవర్తనకు అసలు ప్రేరణ పితృస్వామ్య సంస్కృతి అని కూడా అర్థం చేసుకోవాలి.

"అన్న" అనే కథలో వివిధ పార్టీలకు చెందిన గూండాలు యూనియన్ నాయకులుగా చలామణి అవుతూ స్త్రీలను మానభంగం చేసిన వారిని ఎవరూ ఎదుర్కొనలేక పోయారన్న విషయం అర్థం అవుతుంది. ఇదే కథలో "అన్న" అనబడే అతను కార్మిక వాడలలోని స్త్రీలతో చర్చించి వాళ్ల సమస్యలను తెలుసుకునేవాడనీ, అతని మరణం కార్మిక వాడల స్త్రీలలో బాధ కలిగించిందని అర్థం అవుతుంది.

భూ నిర్వాసితులు కథలో చల్లా కనకమ్మ పోలీసుల ముందుకు వచ్చి భూములు పోయిన వారు ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించే చైతన్యశీలిగా స్పష్టమవుతుంది.

నల్ల వజ్రం నవలలో పంపు దగ్గర స్త్రీలు అంతవరకు వదిన అని పిలుచుకున్నవాళ్ళు కూడా "నువ్వెంత అంటే నువ్వెంత" అని తిట్టుకుంటూ పంపు నీళ్ల వసతి లేకపోవడం చేత శత్రు సంబంధాలలోకి వెళ్తున్నారని అర్థం అవుతుంది. ఈ కథలోనే రెడ్డి బావి పని కష్టం అంటే రెడ్డి భార్య వెనుకటి కాలంలో ఆడోళ్లు కూడా బాయిపని చేసేవారి అనడం స్త్రీల యొక్క ఒకానొకప్పటి పారిశ్రామిక సంబంధాల భాగస్వామ్యం అర్థం అవుతోంది.

శేషగిరి నవలలోని బొగ్గు గనుల్లో మగవారితో పాటు సమానంగా పనిచేస్తూ అధికారుల కాంట్రాక్టర్ల జులుంకు బలై శారీరకంగా ఆర్థికంగా అణిచివేతకు గురైన స్త్రీ కార్మికుల కన్నీళ్లను తుడిచి బాధలు పంచుకున్న అన్నగా శేషగిరి అర్థం అవుతాడు.

"సింగరేణి" అనే నివేదికలో 1978లో బెల్లంపల్లిలో పర్సనల్ ఆఫీసర్ కొడుకు ఒక కార్మికుని భార్యపై అత్యాచారం జరిపి హత్య చేయగా కంపెనీ అధికారులు, ప్రభుత్వం కలిసి హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తే

బెల్లంపల్లిలో స్త్రీలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి దోషిని శిక్షించాలని డిమాండుతో ఊరేగింపు చేసినట్లుగా ఆ నివేదిక వెల్లడి చేస్తోంది.

నీళ్ల తగవు అనే కథలో అధికార వర్గం కుటుంబ స్త్రీలకు, కార్మిక వర్గం కుటుంబ స్త్రీలకు, నీళ్లు పట్టుకోవడం విషయమై ఘర్షణ ఏర్పడి తగాదాగా మారితే స్త్రీలు చైతన్యవంతులుగా రాస్తారోకో చేస్తూ ఆ దారినే వెడుతున్న దొరలను స్థంబింపచేయడంతో వెంటనే నీటి పంపులను వేయించడం జరిగింది. ఇక్కడ కార్మిక కుటుంబ స్త్రీలు తమ అవసరాలను గుర్తించగలిగి చైతన్యం తెచ్చుకొని సాధించుకోవడం చాలా గొప్ప విషయం.

నీడ కోసం అనే కథలో ఒక కార్మికుడికి పెళ్లయినా తండ్రికున్న ఒకే గది గల గుడిసెలోకి భార్యను కాపురానికి తీసుకురాలేకపోయేసరికి ఆ భార్య పుట్టిల్లు మీదే ఆధారపడడం చేత వియ్యపురాళ్లు ఇద్దరు శత్రుపూరిత సంబంధాలకు వెళ్ళడంగా అర్థం అవుతుంది.

'జీతం' కథలో ఇంటికి వచ్చిన భర్త తాగినాడని తెలుసుకొని కాంతం తిట్టడం, తిడుతున్న చప్పుడు చేయకుండా తిట్లన్నీ భరిస్తూ పడుకోవడం శత్రుపూరితమైన భార్యాభర్త సంబంధాలకు ప్రతీకగా ఉన్న కుటుంబ వ్యవస్థకు ఆ కథ అద్దం పడుతోంది.

'ప్రస్థానంలో' సుగుణ తన 'కాలేరు బతుకు' బాగుంటుందని అనుకుంది కాని ఇలా నీళ్ల దగ్గర కాళ్లు పీక్కుపోయేలా నిలబడడం, రాళ్ల వంటి బొగ్గు కొట్టి కొట్టి సేతులన్నీ నాశనం అవుతుండడం, పంది ఎత్తుగల గుడిసెల్లో లోపలికి రావలెనన్నా, బయటకు పోవాలన్నా దేవుని గుళ్ళోకి వలె వంగి వంగి వెళ్ళాలనీ, పశువుల కంటే హీనంగా తమ బతుకు ఉందని వాపోతుంది.

'రాజీ' కథలో పిట్‌లో అడపాదడపా బొగ్గు పెళ్లలు కార్మికుల మీద పడి చనిపోతే, కార్మిక కుటుంబ స్త్రీలకు భర్త డ్యూటీ నుండి ఇంటికి వచ్చేవరకు గుండెలు పీచుపీచుమనే ఆందోళన ఉంటుందని చెప్పడం జరిగింది.

'బొగ్గుపొరలు' కథలో సైరన్ కూయగానే కార్మిక స్త్రీలు గబగబా లేచి పోయి వెలిగించి అన్నం వండటం, పెట్టడం చేస్తారు. టిఫిను కట్టి యిస్తారని చెప్పడం పరోక్ష పారిశ్రామిక సంబంధాలలో స్త్రీల భాగస్వామ్యం స్పష్టమవుతుంది.

'అన్న' అనే కథలో వివిధ పార్టీలకు చెందిన గూండాలు ఉంటారనీ,

వాళ్ళనెవరు ఎదిరించలేరనీ, వాళ్ళు ఒక అమ్మాయిని మానభంగం చేసినా శవాన్ని చూసి వచ్చారు గాని వాళ్ళనెవరు ఎదుర్కోలేరని అర్థం అవుతుంది.

'శత్రువు' కథలో డ్యూటీలో అలసిపోయి వచ్చిన భర్త యింటికి వచ్చి భార్యతో బద్ధ శత్రువుగా ప్రవర్తించడం, తత్ఫలితంగా భార్యాభర్త సంబంధాలు పాడయిపోవడం, భర్త ఆఖరి ఆయుధంగా భార్య శీలాన్ని అనుమానించే నీచ స్థాయికి దిగజారడంగా అర్థం అవుతుంది. అంతేగాక ఇరుగు పొరుగు కార్మికులు కూడా తమ భార్యలను ఇలాగే అనుమానిస్తారనీ, ఆఖరికి తోటి ఆడవాళ్లతో కూడా మాట్లాడనీయరని అర్థం అవుతుంది. తాగుడుకు బానిసయి ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వకపోగా అది లేదు ఇది లేదనీ అకారణంగా భార్యలను ద్వేషించి చావగొడుతుంటారని అర్థం అవుతుంది. బాయి పని సంస్కృతిలోని అధికార సంబంధాలు, కుటుంబ సంస్కృతిలో పితృస్వామ్యంగా ప్రతిఫలించడం అర్థం అవుతోంది. పల్లెటూళ్లలో ఉండేటప్పుడు చేసే పద్ధతితోనే తాను భర్త వీపు రుద్ది నీళ్లు పోయాలనుకొని వెళ్లేసరికి సీములో వంగి వీపు మీద తట్టను మోయడంతో పుండులాగ ఉండి, భార్య చేతి రాపిడి తగలగానే అతడు విసుక్కోవడం, సుగుణ చిన్నబుచ్చుకోవడం ఇలా గని పని భార్యాభర్తల మధ్య ఉన్న సున్నిత సంబంధాలను బాధించడమే కాక స్త్రీల ఆత్మాభిమానాన్ని కూడా కష్టపెడుతోందని అర్థం అవుతోంది. ఆ విసుగులోనే అన్నం చల్లారిందనీ భర్యని విసుక్కోవడం జరుగుతుంది. చివరకు అలసిపోయిన భర్తతో తన వైవాహిక జీవితంలోని లైంగిక సంబంధపు కోరికలు కూడా తీరడం లేదని, తన బ్రతుక్కు అర్థం లేదని వాళ్ళు చెప్పడం కనీసం కార్మిక కుటుంబ స్త్రీలకు చిన్న చిన్న కోరికలు కూడా తీరడం లేదని అర్థం అవుతోంది. కథలో సుగుణను జుట్టుపట్టుకొని కొట్టుకుంటూ ఇంట్లోకి తీసుకురావడం, మహిళా జాతికే అవమానంగా భావింపక తప్పదు. దీనికంతా కారణం కార్మికులకు పని భారం వల్ల కలిగిన విసుగుగా అర్థం అవడం చేత కార్మిక కుటుంబ స్త్రీల మీద వున్న పరోక్ష పారిశ్రామిక సంబంధాల ప్రభావంగా అర్థం అవుతుంది.

'పెండ్లి' కథలో కొడుకును కన్న తల్లిగా అత్తగారు అధికార సంబంధాలలో భాగంగా పెళ్ళి సమయంలో ఆడపిల్లవైపు కుటుంబంలోని వ్యక్తులను అధికారికంగా మాట్లాడడం, దోచుకోవడం, గనిలో కార్మికుల శక్తిని దోచుకోవడంగా భావించడం జరుగుతుంది. ఇక్కడ పితృస్వామ్యానికి, రాజ్యాధికారానికి ఉన్న పోలికలు ఇక్కడ స్పష్టం. గని ప్రమాదంలో వీరయ్య కాలు విరిగి కుంటి వాడయితే వీరయ్య భార్య

అతనిని వదిలి వెళ్లిపోయేసరికి వీరయ్య పిచ్చివాడయిన విషయం అర్థం అవుతుంది. గనులలో ప్రమాదం వల్ల గాయపడడం, కుంటి వాళ్లవడం, లేదా చనిపోవడం వంటివి జరిగినపుడు కుటుంబ సంబంధాలు దెబ్బతినడమే కాక, ఒక్కొక్కప్పుడు వితంతువులకు వచ్చిన నష్ట పరిహారపు డబ్బుకై గాలమేస్తూ, వారిని వివాహం చేసుకోవడం ఒకటికి రెండు కుటుంబాలను నిర్వహించడంగా పరిణమించి అంతిమంగా బహు భార్యత్వపు సంస్కృతిని అమలు చేయగల విషయంగా కూడా గని ప్రమాద ప్రభావం అర్థం అవుతుంది.

సింగరేణి మండుతోంది నవలలో వీధి కులాయిల దగ్గర కార్మిక కుటుంబ స్త్రీల తగాదాలు దొరల దొంగాటలా ఉందని భావించడం జరిగింది.

'బొగ్గు పొరల్లో' కథలో ఎల్లారెడ్డి భార్య పంపు నీళ్ల తగాదాలు పడలేక, ఎక్కువ పంపుల సౌకర్యం కల్గించడానికి వెంకట్రావు పల్లెలో లాగా కుండలు పెట్టుకుని రోడ్డు మీద ధర్నా చేస్తే బాగుండునని ప్రతిఘటనా చైతన్యాన్ని తెచ్చుకోవడం కూడా పారిశ్రామిక వాడలలో కార్మిక కుటుంబ స్త్రీలు కూడా పరోక్షంగా పారిశ్రామిక సంబంధాలలో భాగమైనట్లు అర్థం అవుతుంది.

'పునరావాసం' కథలో నాలుగేండ్ల క్రితం వరకు ఇచ్చిన స్త్రీల డిపెండెంట్ ఉద్యోగపు అవకాశాన్ని హరించివేసిందని చెప్పడం జరిగింది. ఇప్పుడు కంపెనీలో స్త్రీలకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా మంత్లీ మానిటరీ కాంపెన్సేషన్ కింద డబ్బు ఇవ్వడం జరుగుతోంది.అలా ఇవ్వటం ఆర్థికంగా కొంత ఆదుకున్నట్టుగా కనిపించిన స్త్రీలు ఉద్యోగం చేయటం వల్ల పొందే సామాజిక స్థాయిని ఆత్మవిశ్వాసాన్ని తగ్గిచటంగానే అర్థం అవుతుంది.

'చీకటి కడుపున కాంతి' అని పేరు గల అముద్రిత నాటకంలో పరోక్ష పారిశ్రామిక సంబంధాలలో కార్మిక కుటుంబ స్త్రీల భాగస్వామ్యం వారి అభివృద్ధి ప్రస్తానాన్ని చిత్రీకరించడం జరిగింది.

ఈ విధంగా సింగరేణి సాహిత్యంలో స్త్రీలు పరోక్ష పారిశ్రామిక సంబంధాలలో భాగస్వాములుగా ఉండడమే గాక పారిశ్రామిక సంబంధాల ప్రభావం కూడా స్త్రీల జీవితాలపై ప్రభావితం అవుతూ ఉంటుంది. గని పనికి వెళ్లిన భర్త డ్యూటీ నుండి క్షేమంగా తిరిగి వచ్చేంతవరకు ఏ రోజుకారోజు నిరంతర ఆందోళనకు గురి అవుతూ కార్మిక కుటుంబ స్త్రీలు ఉండడం అనేది కేసు స్టడీలలో వెల్లడి అయిన వాస్తవాలు. అంతేగాక సంస్థ సంక్షేమ కార్యక్రమాలను

సజావుగా అమలు చేయగలిగి కార్మిక కుటుంబ స్త్రీలు ఆరోగ్యవంతులుగా ఉండి సకాలంలో కార్మికునికి అన్నపానాదులను అమర్చి కార్మికుని ఆరోగ్యాన్ని పట్టించుకుంటూ డ్యూటీకి సకాలంలో వెళ్లగలిగేటట్లు చేయగలుతారనీ అర్థం అయి కార్మిక కుటుంబ స్త్రీలు పరిశ్రమలలోని ఉత్పత్తి ఉత్పాదకతలలో పరోక్ష భాగస్వాములని అనడంలో అవాస్తవం లేదు.

ఈ మధ్య సింగరేణి తరంగాలు అనే సమాచార శాఖ వారి టి.వి. కార్యక్రమాలలో మీట్ ది డయల్ యువర్ జి.యం. అనే కార్యక్రమంలో కార్మిక కుటుంబ స్త్రీలు తమకు అందుబాటులో లేని సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం ప్రత్యక్షంగానే జి.యం. గారికి తెలియచేయడం హర్షణీయం. ఒక నూతన చైతన్యం.

సాహిత్యాంశములు

సాహిత్య ప్రక్రియలలో ఉపయోగించే భాష మనుషుల హృదయాలలో నుండి వచ్చినట్లయితే ఆ భావాలు పాఠకుల మనస్సులో మరింతగా హత్తుకుంటాయి. సింగరేణి సాహిత్య సృష్టికర్తలు కొంతమంది స్వీయానుభవాలను వెల్లడి చేసినవారు కాబట్టి వాస్తవికతకు అద్దం పట్టడంతో హృదయాంతరాళములోని భావాలను తెరచిన పెట్టె వంటిదిగా ఈ సాహిత్యం అర్థం అవుతుంది. భాష పుట్టుకే శ్రమ జీవనంలోంచి అభివృద్ధి చెందినది. కోల్ బెల్ట్ ఏరియా అంతా తెలంగాణా ప్రాంతానికే చెందడం చేత కార్మికులు రచయితలు వారి అనుభవాలను కథలు, కవితలు, నవలలు, పాటలు వంటి సాహిత్య ప్రక్రియలలో అభివ్యక్తం చేస్తున్నప్పుడు హృదయాల లోతుల్లోని, భూగర్భపులోతులలోని శ్రమజీవనం అభివ్యక్తం కావటాన్నే ఇక్కడ కావ్య సౌందర్యంగా భావించాలి. నుడులు, నానుడులతో, సామెతలతోను భాష ముఖ్యంగా తెలంగాణా మాండలికంతో ముడిపడి ఉన్నది. అంతరాంతరాలలోని అనుభవాలను చెప్పేటప్పుడు, ఆత్మీయమైన భాష కూడా అనుసరించే ఉంటుంది. అందుకని సింగరేణి సాహిత్యంలో తెలంగాణా భాష, సామెతలు చోటు చేసుకోవడం జరిగింది. సందర్భానుసారంగా సింగరేణి సాహిత్యంలో నుడికారం నిండి ఉన్నా ముఖ్యంగా 'బండ కింద బతుకులు' అనే స్వగతాల సంపుటులలో కైతికాల పోశెట్టి వ్యక్తీకరించిన అసంతృప్తులు తెలుగువారి, ముఖ్యంగా తెలంగాణా ప్రజల యొక్క ఆత్మను తాకే విధమైన ఆత్మీయమైన భాషలోనే వ్యక్తం కాగలిగాయి. ఆ పుస్తకాలలో ప్రతి స్వగతానికి నుడికారంతో, సామెతలతో కూడిన శీర్షికలే ఉంటాయి. ఒక్కొక్క శీర్షిక క్రింద మరెన్నో నుడికారాలు, ఆ నుడికారాలన్నీ గని పని శ్రమ జీవనం నుండి పుట్టినవి. శ్రమ, భాష పరస్పరం కలిసి శ్రమైక జీవన సౌందర్యంతో సింగరేణి సాహిత్యం సత్య సుందరంగా స్పష్టమవుతుంది. కైతికాల పోశెట్టి స్వగతాలను ప్రత్యేకించి భాషా శాస్త్ర పరిధిలో పరిశీలించాల్సిన విషయం. ఈ పుస్తకంలోని నుడికారాన్ని అర్థం చేసుకోవాలంటే పాఠకులు కూడా తెలంగాణా మట్టిలో నుండి పైకొచ్చిన వారయితేనే మరింతగా ఆ భాషా సౌందర్యంలోని శ్రమ సౌందర్యాన్ని తెలుసుకోగలుగుతారు. అయితే అక్షరాల గవాక్షలలోకి తొంగిచూస్తూ శ్రమ తాలూకు అనుభూతుల అక్షరాకృతిగా వాటిని భావించాలి. తెలంగాణా ప్రజల జీవన విధానాలలోని సంస్కృతి, ఆచారపు అలవాట్లకు

కౌటుంబిక జీవిత వ్యవస్థను అద్దం పడుతుంది ఈ సాహిత్యం. కౌతికాల పోశెట్టి స్వగతాలలో అడ్వాన్సు కోసం సమ్మె చేస్తే డిస్మిస్ లెటర్ని ఇచ్చిన సందర్భాన్నే "కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక పోయిందని" వ్యక్తం చేయడం జరిగింది. జీతాలు పెరిగినా ధరలు ఎరగడం చేత జీవన ప్రమాణ స్థాయి పెరగలేదని "ఏనుగు తిన్న వెలక్కాయ" చందంగా పెరిగిన జీతాలలో ఏమీ మిగలలేక పోయామని భావించాడు. పని స్థలం బాగా లేదని చెప్పిన కార్మికుల మీద సేఫ్టీ ఆఫీసరు చేయి చేసుకుంటాడు. సేఫ్టీ ఆఫీసరు కార్మికుల మీద చేయి చేసుకోవడాన్ని "పేనుకు పెత్తనం" ఇచ్చినటువంటిదని, అటువంటి వాళ్ళు ఆఫీసర్లుగా ఉంటే కార్మికులు సమ్మెచేయక తప్పదని చెప్పడం జరిగింది. ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి పాటుపడడంలేదని, భద్రాచల రాముని పెళ్ళికి ఎన్ని బస్సులైనా వేయగలిగింది. దానిని గురించి "పెద్దోడు పెండ్లికి ఏడిస్తే సిన్నోడు పిల్లలకేడ్సిండని" అంటూ చెప్పడం జరిగింది.

కొత్త లీడర్ల గురించి, వేజ్‌బోర్డ్ జీతాల గురించి, ఇన్సెంటివ్‌ల గురించి, అభివృద్ధి గురించి, వాడిగా వేడిగా హృదయాలకు తగిలేటట్లు చెప్పిన కైతికాల పోశెట్టి భావాలను అర్థం చేసుకుంటే కార్మికుల జీవితాలెంత సుడిగుండాలలో చిక్కుకుని ఉన్నాయో అర్థం అవుతుంది. అయితే చాలా నిజాయితీగా, నిర్భయంగా వెల్లడి చేసిన భావాలు కాబట్టి అంతే నిజాయితీతో అర్థం చేసుకోవాలి.

సాహిత్యంలో రసానుభూతి ప్రధానం. ఈ సాహిత్యంలో కార్మికుల శ్రమానుభూతుల అసంతృప్తులు పారిశ్రామిక సంబంధాలలోని సంక్లిష్టతలు పాఠకుల హృదయాలను అశాంతికి గురిచేస్తాయి. ఇది కేవలం శాంత రసానికి విరుద్ధమైనది. సహనం శాంత రసానికి స్థాయీ భావం అయితే ఇందులో కార్మిక జీవితాలలోని అసహనం స్థాయీ భావంగా ఉండడంతో పాఠకుల మనసులలో అశాంతిని రేకెత్తించగలదు. అయితే ఆ అశాంతి బుద్బుదప్రాయమైన అనుభూతులను కల్గిస్తూ ఆలోచనలను రేకెత్తించగలిగి అంతిమంగా వారి సమస్యల పరిష్కార దిశగా సాగి సంతృప్తిని ఇవ్వగలిగినపుడు మాత్రమే అది శాంత రస స్థాయిలో నిలబడగలుగుతుంది. అప్పుడే సాహిత్య శాస్త్రం చెప్పే రసానంద సిద్ధి కలుగుతుంది.

సింగరేణి సాహిత్యం ఏక నాయకత్వం కాదు. ఇది బహుజన కార్మిక నాయకత్వం. సంపన్నుల నాయకత్వం అంతకంటే కాదు, సంపద శక్తుల నాయకత్వం. శ్రామికులందరిదీ శారీరక, బౌద్ధిక, అనుభూతులొక్కటే,

అసంతృప్తులొక్కటే, సమ్మెకు సిద్ధమవడమే, సామూహిక తీర్పు నాయకత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

సాహిత్యంలో స్రష్టలు వేరు, ద్రష్టలు వేరు. కాని ఈ సాహిత్యంలో ద్రష్టలైన స్రష్టలు ఈ సాహిత్యాన్ని సృజించినట్లుగా అర్థం అవుతుంది. అయితే సింగరేణి సాహిత్యంలో రచయితలు సమ్మె చేయడమే సమస్య పరిష్కారంగా భావిస్తారు. కానీ కారకులు మాత్రం సమ్మె చివరి అస్త్రం కావాలని ఆ సమస్యల మనో విజ్ఞానంతోనూ, మానవ సంబంధాల దృష్టితోనూ, సామాజికంగానూ, ఆర్థికాంశాల దృష్టితోనూ, ఆలోచించగలిగితే వారి సమస్యలకు పరిష్కారం ఉంటుందని భావించగలిగే అవకాశం ఉంటుంది. శ్రమించడం సమస్య అయితే దాని పరిష్కారం మాత్రం శ్రామిక జీవన సౌందర్యం కావాలి. వివిధ సాహిత్య ప్రక్రియలలో ఉన్న గని సాహిత్యం సాహిత్య శాస్త్రాంశాల పరిపక్వత కన్నా, శ్రామిక జీవుల అంతరాంతరాల అసంతృప్తులకే పెద్ద పీట వేసింది ఈ సింగరేణి సాహిత్యం. పారిశ్రామిక సంబంధాల యమగోలలో సమత, మమతలు ఆధిపత్యం వహిస్తే శాంతికి తప్ప అశాంతికి చోటు ఉండదు. అంతటా శాంతి, శాంతి, శాంతి.

8. పారిశ్రామిక పరోక్ష ప్రభావం - సమాజం

'భూనిర్వాసితులు' కథలో బొగ్గుగనుల పనిలోకి రాకుండానే బొగ్గు గనుల ప్రాంతాలలోని నివాసితులపై బొగ్గు గనుల పరోక్ష పారిశ్రామిక సంబంధాలపై ప్రభావం చూపించడంచేత ప్రజలు నిర్వాసితులైన విషయాన్ని భూ నిర్వాసితుల కథ అర్థం పడుతుంది. మల్లయ్యకున్న రెండెకరాల భూమిని గోదావరిఖని ఓ.పి. ప్రాజెక్టు కోసం ప్రభుత్వానికి ఇవ్వాల్సి వచ్చింది. భూమిని అప్పగించి ఎనిమిది సంవత్సరాలైనా నష్ట పరిహారం చెల్లించనందుకు, బాయిలు వచ్చి తమ బతుకులను నాశనం చేసాయని బతికుండగానే బొంద పెట్టారని, మల్లయ్య బాధపడ్డాడు. ఈ కథలోనే చల్లా కనకమ్మ ముందుకు వచ్చి భూములు పోయినవారు ఎలా బ్రతకాలని, ఎక్కడికి పోవాలని ప్రశ్నించడం జరిగింది. దీనినే రాజేశం కూడా అడిగేసరికి పోలీసు ముందుకు వచ్చి ఆమెను తోయడమే కాక రాజేశాన్ని కొట్టి పోలీసులు తమతో తీసుకెళ్లిపోయినందుకు రాజేశం తల్లి ఆత్మహత్య చేసుకొంటుంది.

ఓపెన్‌కాస్ట్ బ్లాస్టుల వల్ల పక్క గ్రామాలలో దాలాలు బీట్లు వారడమే కాక, కరెంటు స్తంభాలు అడ్డం వచ్చాయని పీకడంతో ఆ గ్రామానికి కరెంటు కూడా లేకుండా చేయడం జరిగింది. కలెక్టరు వచ్చి కంపెనీ అధికారులు నష్టపరిహారాన్ని ఇస్తారని చెప్పారు. కంపెనీ ఏమో భూములను ఖాళీ చేస్తే ఉద్యోగాలు ఇస్తామంటుందని భావిస్తారు. కంపెనీ ఇప్పటికే అదనపు సిబ్బంది అంటూ ఉద్యోగాలు ఇవ్వడం లేదనీ, కోర్టులకు వెళ్లి ఖర్చు పెట్టుకోలేక గ్రామస్తులు చివరకు అటు భూమిని పోగొట్టుకొని, ఇటు ఉద్యోగం రాక చివరకు తమ బతుకులు నాశనం అయిందంటూ బాధపడడంగా స్పష్టమవుతుంది. ఇటీవల భూపాలపల్లి గనుల పక్కన ఉన్న గ్రామస్తులు ఈ కథలో వలె బాధపడ్డ విషయం వాస్తవమని పత్రికాముఖంగానూ, దూరదర్శనంలోనూ వచ్చిన వార్తల వల్ల అందరికీ తెలిసిన విషయమే.

'ఇద్దె' అనే కథలో ఓపెన్‌కాస్ట్ కోసం ప్రభుత్వం పంట పొలాలను తీసుకొని ఊరిని మాత్రం వదిలేసింది. ఊరిని తీసుకొంటే ఆ ఇళ్లకు వాల్యూయేషన్ డబ్బు ఎక్కువగా ఉంటుందని భావించడం జరిగింది. కాపీ గనుల కోసం సాగుభూమి పోయి, ఉద్యోగాలు లేక నిరంతర బ్లాస్టింగ్‌ల వల్ల దుమ్ము ధూళిలోనూ, యంత్రాల రణగొణ ధ్వని మధ్యన బ్రతకలేక కొంత మంది ఊరిని ఖాళీచేసేసరికి, ఆ ఊరిలో ఉన్న బడులు సరిగా నడవకపోవడంతో ఆ ఊరి పిల్లలకు చదువులు సాగలేదు. అందుకనే కథలోని రాజయ్య తమ భూములలో సంపద ఉండడం

తప్పయినదనీ, తమను బలి పశువులను చేశారని ఊళ్ళో వాళ్ళు మంచినీళ్లకై వంద గజాలు లోతు తీసినా గొంతు తడుపుకోవడానికి చుక్క నీళ్లు రావడం లేదనీ బాధపడతారు. బలి యిచ్చే ముందు మేకపోతు నోట్లో నీళ్లు పోస్తారు కాబట్టి ఆ ఊరి ప్రజల కంటే బలి పశువే అదృష్టవంతురాలని భావించడం జరిగింది.

'నీళ్ళకోసం' కథలో వెంకట్ కొడుకు సాయిలు ఇదివరకు బొగ్గుబావిలో ఉద్యోగం ఇస్తామంటే ప్రాణ భయంతో చేరనన్నాడు. కాని ఇప్పుడు ఉద్యోగం కావాలంటే రెండు లక్షల ముడుపులు చెల్లించాలి. యాజమాన్యం కొత్త రిక్రూట్‌మెంట్ లేదని చెప్పింది కాని, కార్మికులు ఉత్పత్తిని రెట్టింపు చేసినా లాభాలు లేకపోవడానికి కారణాలు విశ్లేషిస్తూ ఎవరికి అందినకాడికి వాళ్ళు దోచుకుంటున్నారనీ, కమీషన్‌లకు ఆశపడి అధికారులు మొంచుతుంటే రాయల్టీల కింద వడ్డీల కింద ప్రభుత్వం ప్రతి సంవత్సరం వందల కోట్లు మింగుతోందని భావించడం జరిగింది. బొగ్గు కొని ప్రయివేటు వ్యక్తులు బాగుపడుతున్నారని, పనికిరాని యంత్రాలు పంపి విదేశీయులు దోచుకుపోతున్నారని కథలో చెప్పడం జరిగింది. ఈ కథలోనే గోదావరిఖనిలో లాంగ్‌వాల్ సిస్టమ్ కోసం 250 కోట్లు పెట్టుబడి పెట్టగా 200 కోట్లు నష్టం వచ్చిందని ఒక బాయి మీద 400 కోట్ల రూపాయలు నష్టం రావడానికి కార్మికుల పాత్ర కారణం కాదని, పెద్ద అధికారులు విదేశీయులతో చేతులు కలిపి మన గనులకు అనుకూలం లేని టెక్నాలజీని కొంటున్నారని భావించడం జరిగింది. అంతేకాక శాసన సభాసంఘం వాళ్ళు ఎంక్వయిరీ చేసి 200 కోట్లు పెడితే నడిచే ప్రాజెక్టుకు 800 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని తేల్చారని చెప్పడం జరిగిందని ఈ కథలో చెప్పటం జరిగింది.

'పునరావాసం' కథలో మారేడుపాక గ్రామస్తులు భూములను కోల్పోయి 6,7 సంవత్సరాలు దాటినా నష్ట పరిహారం వారికి చెల్లించలేదని, ఆకలి చావులు ఎక్కువయ్యాయని, మెకనైజేషన్ పేరున బహుళ జాతి సంస్థతో మిలాకత్తై భారీ యంత్రాలను దిగుమతి చేసుకోవడంతో ఉద్యోగాలు కూడా రావడం లేదని బాధపడడం జరిగింది.

'దొంగ' అనే కథలో ఓపెన్‌కాస్ట్ గనులు వచ్చి భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లించకపోగా ఉద్యోగాలు ఇవ్వకపోయేసరికి వారు దొంగలుగా తయారయి గనులలో పడేసి ఉంచిన పాత ఇనుప సామాను (స్క్రాప్) దొంగిలించుకుంటూ బ్రతకటాన్ని అదొక న్యాయమైన దొంగతనంగా భావించడం జరిగింది.

9. ప్రపంచీకరణ నేపథ్యంలో సింగరేణి సంస్థలోని మహిళా ఉద్యోగినులు

'ప్రపంచీకరణం' అనేది ప్రధానంగా ఆర్థిక వ్యవస్థల మధ్య అంతరాలు తగ్గి, అంతర్జాతీయ మార్కెట్ శక్తుల ఆధిపత్యపు ఆవిర్భావం జరగడంగా భావించవచ్చు. దీనికై అన్ని దేశాల వారు తమతమ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మాణం చేసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తూ ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ఋణాలివ్వడానికి తన సంసిద్ధతను వ్యక్తం చేసింది. సరళీకరణ పేరిట దిగుమతి సుంకాలు తగ్గించేసరికి విదేశీ సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలల్లో తమ ఉత్పత్తి రంగాలను నెలకొల్పుకునే వెసులుబాటు అధికమైనది. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వరంగాలలో అత్యధికశాతం పెట్టుబడులు ప్రయివేట్ వ్యక్తులను అప్పగించాలనుకోవడం జరుగుతుంది. తద్వారా ప్రైవేట్ వ్యక్తుల లాభార్జనలో భాగంగా సిబ్బంది కుదింపు చర్యలకు పూనుకోవాల్సివచ్చింది. ప్రభుత్వరంగాలు కూడా వ్యయాన్ని తగ్గించుకుంటూ ఉత్పత్తిని పెంచుకునేందుకై సాంకేతికతను ప్రవేశపెట్టుకోవాల్సిన స్థితి ఏర్పడింది. సరళీకరణ సహాయంతో సాంకేతిక వస్తువులను తక్కువ సుంకంతో దిగుమతి చేసుకునే వీలు కల్పించడంతోపాటు అభివృద్ధి చెందిన దేశాలు వారివారి సాంకేతికతను, యంత్ర పరికరాలను అభివృద్ధి చెందుతున్న ఇండియా వంటి దేశాలతో అమ్ముకోవడానికి ప్రపంచీకరణ బాగా తోడ్పడింది. తత్ఫలితంగా లాభార్జన ధ్యేయంగా గల మార్కెట్ శక్తుల ఆవిర్భావం జరిగింది. ఇదివరకు దేశాల ఆర్థిక శక్తి పునాదిగా ఉపరితల అంశాలైన రాజకీయ, సాంస్కృతిక, సామాజిక అంశాలు సమాజాన్ని ప్రభావితం చేశాయి. ఇప్పుడు ప్రపంచ మార్కెట్ శక్తుల చేతిలో రాజకీయాలు ఉండటం, రాజ్యం అంతర్జాతీయ మార్కెట్‌కు అనుకూలమైన సంస్కృతిని ప్రవేశింపజేయడం జరుగుతోంది. అసమ సామాజిక సంస్కృతి నేపథ్యంలో అనాదిగా వెనుకబడిన మహిళలు చైతన్యంతో ముందడుగు వేస్తున్న ఈ రోజుల్లో ప్రపంచీకరణ మహిళల పాలిటి అశనిపాతంగా తయారయింది. ప్రపంచీకరణలో భాగంగా ధరలపై నియంత్రణ తగ్గి బొగ్గు ధర పెంచుకొని లాభాల బాటపై నడుస్తున్న బొగ్గు సంస్థలు బహుళజాతి సంస్థలు వెసలుబాటుతో బొగ్గు దిగుమతి ఎక్కువై ధరలు తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేకపోతే కంపెనీలకు నష్టం వచ్చే ప్రమాదం

ఉంది. కంపెనీ లాభాలతో నిలదొక్కుకోవాలంటే వ్యయాన్ని క్రమబద్ధీకరించుకోవాల్సి వస్తుంది. దానికై ఉద్యోగుల కుదింపు చర్య ప్రధానంగా చేపట్టడం జరుగుతుంది. ఆ చర్య ముందుగా మహిళలపై పడుతుండటం సహజం. ఎందుకంటే పెరిగిన సాంకేతికతకు అనువుగా శిక్షణను చేపట్టే పరిజ్ఞానం పెంపొందించుకునే అవకాశాలు మహిళకు తక్కువ. ఎందుకంటే మహిళలకు ఇంటి పని, పిల్లల బాధ్యత ప్రధానంగా ఉండడంతో వారు నూతన సాంకేతిక విధానానికి అనుగుణంగా విద్యను గానీ, శిక్షణను గానీ పొందే అవకాశాలు తక్కువ. సింగరేణి వంటి సంస్థలలో మహిళా ఉద్యోగినులు తక్కువ. సింగరేణి సంస్థలో సుమారు 2800 మంది మహిళా ఉద్యోగినులు ఉంటే వారిలో 80 మంది మహిళలు అధికారులుగాను, వివిధస్థాయిలలో పనిచేస్తున్న క్లర్కులుగాను సర్సులు, స్వీపర్లు మరియు మజ్దూర్లుగాను పనిచేస్తున్నరు. ఒకానొకప్పుడు మహిళాకార్మికులు గనులలో బొగ్గు తిసినట్లు సింగరేణి చరిత్ర తెలియజేస్తుంది దానికి సజీవసాక్షిగా నేటికి ఉన్న శ్రీమతి గోపమ్మ గొప్ప ఉధాహరణ ఆ తరువాత మహిళలను గనిఉపరితల విధులకు మాత్రమే పరిమితం చేసారు. 1952లో చేసిన గనుల చట్టం మహిళల ఉద్యోగానికి ప్రాధాన్యత యివ్వలేదు. భూగర్భ గనులలో బొగ్గు ఉత్పత్తి జరిగే ప్రదేశాలలో మహిళా ఉద్యోగాలు ఈ చట్టంతో నిషేధింపబడినవి. అయితే బొగ్గు గనుల ఉపరితలంపై ఉదయం 6.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు మహిళలను నియమించవచ్చని చెప్పింది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ వాళ్ల క్రింద బొగ్గు గనులు ఉన్నప్పుడు ప్రైవేట్ కాంట్రాక్టర్ల పిలుపుతో ముందుకొచ్చి బొగ్గు బావులలో మహిళలు భర్తతో కలిసి జంటగా బొగ్గు నింపి తట్టలెత్తగల పని చేస్తూండేవారు. ఆనాడు అలా బొగ్గుగనులలోకి దిగి తట్టలెత్తిన మహిళా కార్మాకురాలుగా నేటికి సజీవమై ఇల్లందులో తన అనుభావాలను పంచుకోవటం ఈనాటి వాస్తవం కాని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గనుల చట్టం నిషేధించడంతో బొగ్గు బావిలో మహిళలు పనిచేయడంలేదు. అయితే ఆ ఉపరితలంపై అటెండర్ పనికై, జనరల్ మజ్దూర్‌లుగా, ఆఫీసుల్లోను, హాస్పిటల్స్‌లోనూ, కారుణ్య నియామక పద్ధతిలో నిరక్షరాస్యులు, తక్కువ చదువు చదువుకున్న మహిళలకు ఉద్యోగాలివ్వడం జరిగింది. చదువుకున్న మహిళలైతే వారికి తగినట్టుగా కనీసం క్లరికల్ ఉద్యోగాన్ని యిచ్చేవారు సింగరేణి హాస్పిటల్స్‌లో మహిళా డాక్టర్లను, నర్సులను నియమించడం జరిగింది. అయితే సాంస్కృతిక పరదాలను వదిలించుకోని స్త్రీలు, ఇంటిపని, బాధ్యత ఉండడంతోనూ, కొడుకు గానీ, అల్లుడు గానీ ఆమె బదులుగా ఉద్యోగంలో చేరేవారు. అయితే

సింగరేణి బొగ్గు గనుల శతాబ్దోత్సవాల సందర్భంగా సింగరేణి ఆఫీసుల్లో తక్కువ నిష్పత్తిలో అయినా మహిళా క్లర్కులను, అధికారులను నియమించడం జరిగింది. అయితే 1991 తరువాత వచ్చిన నూతన పారిశ్రామిక విధానం వల్ల సిబ్బంది కుదింపు చర్య సింగరేణి చేపట్టింది. స్వచ్ఛంద పదవీ విరమణ పద్ధతిని ప్రవేశపెట్టింది. మహిళల విషయంలో కారుణ్య నియామకాలు జరిపే పద్ధతిలో కొన్ని మార్పులు చేపట్టడం జరిగింది. గని ప్రమాదంలో మరణించిన కార్మికుని భార్యకు ఉద్యోగం గానీ లేదా నెలకు 4000 రూపాయల చొప్పున ఆమెకి 60 సం॥లు వచ్చే వరకు నెలవారీ పెన్షను ఇవ్వడం గానీ లేదా ఒక్కసారిగా 3 లక్షలు ఒకేసారి అందచేయడం గానూ జె.బి.సి.సి.ఐ. ఒప్పందం కుదిరింది. అయితే కార్మికుడు రోగగ్రస్థుడైనా లేదా గని పని యందు గాక మరి యే యితర కారణంచేత గానీ మరణించిన సందర్భాలలో కేవలం నెలకు రూ॥ 3000/- మాత్రమే పెన్షను కింద మంజూరు అవుతుంది గానీ ఆ మహిళకు ఉద్యోగం ఇవ్వడానికి అవకాశం లేని విధంగా ఒప్పందం కుదిరింది. పైగా గని ప్రమాదంలో మరణించిన గని కార్మికుని భార్య చదువుకు తగ్గ ఉద్యోగం గాక, జనరల్ మజ్దూర్‌గా మాత్రమే నియమించబడటం జరుగుతోంది. ప్రపంచీకరణం తరువాత చేసుకున్న ఈ ఒప్పందం గని ప్రాంతాలలో ఉండే మహిళలకు, కార్మిక కుటుంబ స్త్రీల పాలిటి అశనిపాతంగా తయారైన విషయాన్ని యూనియన్లు ఆలోచించకపోవడం ఆశ్చర్యకరం. సాంకేతికత పుణ్యమా అని కొత్త సాంకేతికతకు అనువుగా మహిళలు శిక్షణ పొంది నైపుణ్యాన్ని పెంచుకోగలిగితేనన్న అవకాశం ఉంటుంది. అయితే కుటుంబ బాధ్యతల వల్ల నైపుణ్యం పెంచుకోలేకపోయేసరికి మహిళలకు నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలివ్వలేక పోవడమే గాక ఉన్న మహిళలు కూడా అదనంగా భావించి తొలగించబడే ప్రమాదం కూడా ఉంది. లేదా వారిపై స్వచ్ఛంద పదవీ విరమణ చేయవలయుననే ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. మహానది కోల్ ఫీల్డులో కారుణ్య నియామకంలో ఉద్యోగంలో చేరిన మహిళలను స్వచ్ఛంద పదవీవిరమణ చేయగలిగితే ఆమె కొడుకును ఉద్యోగంలోకి తీసుకుంటామని ఆశ చూపించే విధానాన్ని నిర్ణయించడం బొగ్గుగనులలో మహిళా ఉద్యోగులకు ఆహ్వానం లేకపోవడమే. ముఖ్యంగా భూగర్భ గనులలో మహిళా ఉద్యోగాలను నిషేదించడం శోచనీయం. ఎందుకంటే బరువైన సున్నపు ముగ్గు తట్టను నెత్తిమీద పెట్టుకుని వీధివీధిలో తిరిగి అమ్ముకోగలిగిన మహిళ గనిలో బొగ్గు తట్టలను నింపి ఎత్తి టబ్బులో పోయలేకపోవడం అనేది ఉండదు. అంతేగాక ప్రపంచీకరణం వల్ల సాంకేతిక విధానాలను అమలుపరుస్తున్నా కూడా మహిళలకు ఉద్యోగాలు ఇవ్వవచ్చు. ఈ రోజుల్లో ఆడపిల్లలు కూడా

మగపిల్లలతో సమానంగా మెకానికల్ ఇంజనీరింగును చదివినప్పుడు మహిళలుగా గనిలో కూడా ఆ యాంత్రికతను పర్యవేక్షించగలరనీ భావించవచ్చు. అంతేగాక నేటి మహిళ లారీ నడపడంలోనూ, ట్రాక్టరు నడపడంలోనూ తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకోగలిగినప్పుడు భూగర్భ గనుల యందు గానీ, వర్క్‌షాపుల్లో గానీ, యంత్రాలను వినియోగించడం, ఓపెన్ కాస్టులలో డంపర్‌లను, షావెల్స్‌ను కూడా నడపగలదనుటలో ఎంత మాత్రం సందేహం లేదు. కాబట్టి మహిళా ఉద్యోగాలకు అనువుగా గనుల చట్టాలను మార్చుకోవలసిన అవశ్యకత ఏర్పడింది. అలా జరిగినప్పుడు మాత్రమే మహిళా ప్రగతిని సంస్థ ప్రగతిని దర్శించవచ్చు.

మహిళా కాంట్రాక్ట్ కార్మికులు : ప్రపంచీకరణ విభాగంగా జరిగిన ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ప్రైవేటీకరణను ప్రోత్సహించింది. ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకుంటూ అభివృద్ధి సాధించాలని ఖర్చులు తగ్గించుకునే క్రమంలో సిబ్బంది కుదింపుచర్య అనివార్యం అయినా శ్రమ అవసరం తప్పనిసరి. అందుకని కాంట్రాక్టు లేబర్ గల అవుట్‌సోర్సింగ్ విధానం అమలులోకి వచ్చింది. అంతగా నైపుణ్యం అవసరంలేని పనులకు తక్కువ వేతనాలతో వచ్చి మహిళా కార్మికులు ఎక్కువమంది లభ్యమవుతారు. పెరుగుతున్న ధరలకు తగ్గట్లుగా ఆదాయం లేక కుటుంబ పోషణార్థమై ఇంట్లో మహిళలు కూడా బయటకు వచ్చి కార్మికులుగా అసంఘటిత రంగాలలో సేవా రంగాలలో పనిచేస్తున్నారు. దాంతో ఈ చర్య లేబర్ మార్కెట్‌లో మహిళాకార్మికులు అందుబాటులో ఉండటంతో తక్కువ వేతనాలకు పనులు చేయించకలు. ఒక పురుష కార్మికులున్నా అదే వృత్తి చేస్తున్న వారికి వీరికిని వేతన వ్యత్యాసం ఉంటుంది అదేమంటే మగవాళ్ళు 8 గంటలు పై చిలుకు ఉండి పనిచేస్తారు. ఆడవాళ్ళయితే 8 గంటలు పూర్తిగా ఉండక మునుపే ఇంటికి పోవాలనుకుంటారని కారణంగా చెప్పటం జరుగుతుంది. అయితే స్త్రీల యొక్క గృహనిర్వహణ, శిశు సంరక్షణ, పునరుత్పత్తి బాధ్యతలకు ఆర్థికవిలువలునివ్వగలిగి పరోక్షంగా మగవాళ్ళ పని నిర్వహణ పెరుగుతుందని భావించినపుడు మహిళాకార్మికులకు సమానవేతనం కాగలదు. కాంటాక్టు లేబరు చట్టాలు అమలు పకడ్బందీగా ఉంటే ఉద్యోగ భద్రతతో పాటు, కార్మికశ్రేయస్సేకదా ధ్యేయంగా ఉండాలి అంతేగాని మహిళాకాంట్రాక్టు లేబర్ పనులు చేయగలరని వారి మానసిక స్థాయిని భర్తలు ప్రశాంతంగా ఉండేటట్లు చేయాలి. ఆర్థిక సాంస్కృతిక విధానం అవటం, భార్యకు పనులకు పంపించిన భర్త కర్తగా తనిని తాను భావించుకొని ఆ కర్మఫలితాలు తనకే చెందాలనుకోవటం, తాగుడుకు

ఖర్చుపెట్టడం కన్పడుతుంది. అదేమని ప్రశ్నిస్తే అనుమానం పడుట, అక్రమ సంబంధాలు అంటగట్టి కుటుంబ సంబంధాల్లో చికాకు తేవటం కన్పడుతుంది. ఈ ప్రపంచీకరణ వల్ల ఇంటి చాకిరి ఒక షిఫ్ట్ కాగా, బయటిపని మరొక షిఫ్ట్ భర్త ఒక కాంట్రాక్టు కార్మికుడైతే అతనికి సకాలంలో అన్ని వండిపెట్టటం అందరి మహిళలు మహిళాకాంట్రాక్టు లేబర్‌కి మొదటి షిప్టు పనిగాఉంటోంది. మహిళాకార్మికులు రెండు షిఫ్టులు చేయగా సింగరేణి సంస్థలో సేవలందిస్తూ కాంట్రాక్టు మహిళా కార్మికుల జీవితం సింగరేణి ప్రాంతంలో స్పష్టమవుతోంది.

ఉపయుక్తమైన పుస్తక సాహిత్యం

నల్లకలువల్లో కథలు - కోల్‌బెల్ట్ కథలు 1988 - అబంపి పబ్లికేషన్స్ కరీంనగర్

1. భూదేవి - అల్లం రాజయ్య
2. ఇంటర్వ్యూ - రవి
3. జీతం - మేరు రవీందర్
4. ప్రస్థానం - కాలువ మల్లయ్య
5. ప్రమాదం - గోపిచంద్
6. నిరసన - ఆకిరెడ్డి శ్రీనివాస రావు
7. అగి - వేల్పుల నారాయణ
8. బ్రతకనేర్చినవాడు - పి.రాజేశ్వరరావు
9. శత్రువు - ఎస్.ఆర్. ప్రసన్నకుమార్
10. పురుడు - బండిశేరాలు
11. రాక్షసులు - యం. ప్రదీప్
12. అంతర్మథనం - రామశంకర్
13. పెండ్లి - తుమ్మేటి రఘోత్తమరెడ్డి
14. దారులు - మొగరం గట్టయ్య
15. తనకు తాకితే - ఆకుల సమ్మయ్య
16. ఆయువు పట్టు - బి. విజయ చందర్
17. ధీరుడు - ఎ. చైతన్య

బొగ్గు పొరల్లో - కరీంనగర్ బుక్ ట్రస్ట్ 1983

1. రాజీ - అల్లం రాజయ్య
2. బొగ్గు పొరలో - కార్మిక
3. లీడరు - కార్మిక
4. సమ్మె - కార్మిక
5. నిర్బంధం - కార్మిక
6. విస్తరణ - కార్మిక
7. విజయం మనదే - కార్మిక
8. ఇంధనం - కార్మిక

బండకింద బతుకులు - కైతికాల పోశెట్టి

(అల్లంరాజయ్య-తుమ్మేటి రఘోత్తమ రెడ్డి)

1. శేషగిరి నవల - పి.చంద్ 2002
2. సింగరేణి మండుతోంది - జాతశ్రీ

3. నల్లవజ్రం - (ఎన్.ఆర్.పవన్‌కుమార్ - తుమ్మేటి రఘోత్తమ రెడ్డి) 1987 అబంపి పబ్లికేషన్స్ కరీంనగర్

కాలువ మల్లయ్య కథలు (తెలుగువచనం ప్రచురణలు - కరీంనగర్)

1. ప్రస్థానం
2. అన్న

1977 - బంగారయ్యే పాట - మొదట వచ్చిన సాహిత్య

1978 రాజీకథ - అల్లం రాజయ్య

"సింగరేణి" (తెలంగాణా బొగ్గు గనుల వాస్తవ పరిస్థితిపై నివేదిక)

ఎం.డి. మునీర్, అన్వర్ అనే జర్నలిస్టుల కృషి (పర్‌స్పెక్టివ్స్ - హైద్రాబాద్ 2000)

1986 నుండి 'కోల్‌బెల్ట్' పత్రిక

సింగరేణి రామాయణం బొగ్గు కథ గసికంటి రాజలింగం-నాటకం (నల్లవజ్రం) -2000

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య హైద్రాబాదు

1985 - పోరుబాటల్లో - కార్మిక (అరుణతార)

1. సింగరేణి బతుకులు - హుస్సేన్ - పాటలు 1981-అరుణతార
2. బదిలీ ఫిల్లర్లు 1981-అరుణతార
3. సింగరేణి కార్మికులు - సూర్యం 1981-అరుణతార
4. 'నెలవు' - కార్మిక (అరుణతార) తుమ్మేటి రఘోత్తమ రెడ్డి
5. నీడకోసం - కార్మిక (సృజన) - తుమ్మేటి రఘోత్తమ రెడ్డి
6. సింగరేణి కార్మికుల గుండెచప్పుళ్ళు - (విమర్శ)
7. నీళ్ళ తగవు - తుమ్మేటి తుమ్మేటి రఘోత్తమ రెడ్డి (సృజన)
8. 'సింగరేణి బతుకులు - (అరుణతార) - మూట శంకర్ (వి.యన్.విద్యాసాగర్)
9. నివురుగప్పిన నిప్పు - సముద్రుడు - అరుణతో
10. గొడుగు - మురళీధర్ - సృజన
11. సింగరేణి పాటలు - ఎ.ఏక-సృజన - విమర్శ
12. కొత్తఎత్తు - సృజన
13. నాపాత స్నేహితుడు - పి.శశిధర్ - సృజన
14. భూనిర్వాసితులు కథాసంపుటి- పి. చంద్

The Singareni Collieries Company Limited
(A Government Company)

INJURY RATES OF S C C L FROM 1976-2002(upto Feb)

Production in MT	No.of persons		INJURY RATE PER					
			Millions tonnes of production		3 Lakh manshifts worked		1000 persons employed	
	Killed	Seriously Injured	F	S	F	S	F	S
7.34	34	534	4.28	67.27	0.88	13.88	0.80	12.67
8.79	30	797	3.41	90.69	0.72	19.01	0.76	20.21
9.04	22	597	2.43	66.02	0.53	14.48	1.54	14.60
9.52	23	841	2.31	88.33	0.49	18.73	0.50	19.02
9.85	21	742	2.13	75.39	0.49	17.42	0.51	18.04
11.18	20	586	1.79	52.39	0.47	13.89	0.50	14.69
12.29	28	485	2.28	31.46	0.61	10.51	0.63	11.01
12.53	21	595	1.67	47.49	0.42	11.91	0.44	12.48
12.65	33	611	2.61	48.31	0.59	10.91	0.57	10.50
14.63	39	506	2.66	34.58	0.54	8.28	0.65	8.43
16.22	46	663	2.83	40.85	0.70	10.09	0.69	10.03
17.64	26	329	1.47	18.65	0.37	4.72	0.28	3.58
16.70	17	244	1.02	14.61	0.23	3.36	0.17	2.49
17.98	17	261	0.94	14.52	0.23	3.53	0.17	2.54
17.71	24	317	1.35	17.89	0.31	4.14	0.23	3.08
19.53	19	310	0.97	15.86	0.22	3.72	0.18	2.96
21.16	27	278	1.28	13.14	0.32	3.30	0.26	2.67
24.70	31	270	1.26	10.93	0.34	2.95	0.30	2.60
24.52	50	254	2.04	10.36	0.55	2.78	0.48	2.46
25.50	21	191	0.82	7.49	0.26	2.38	0.20	1.85
29.37	29	147	0.99	5.01	0.32	1.62	0.28	1.42
29.15	35	125	1.20	4.29	0.41	1.45	0.34	1.22
27.96	36	103	1.29	3.68	0.45	1.30	0.36	1.03
30.24	27	106	0.89	3.50	0.32	1.26	0.27	1.05
29.49	33	90	1.12	3.05	0.42	1.14	0.33	0.9
31.00	25	114	0.80	3.68	0.33	1.50	0.25	1.15
5.50	6	13	1.09	2.36	0.49*	1.07*	0.37	0.8

* Provisional

F=Fetalities
S=seriously Injured

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

(ప్రభుత్వ రంగ సంస్థ)

INDUSTRIAL RELATIONS

YEAR	No.of Strikes	Mandays Lost	Production Lost (In Tonnes)
1973-74	120	144,541	161,684
1974-75	87	105,711	116,815
1975-76	19	20,406	24,399
1976-77	12	35,387	41,791
1977-78	73	171,131	197,283
1978-79	185	837,687	774,204
1979-80	376	641,251	702,757
1980-81	360	626,874	682,636
1981-82	212	697,636	779,181
1982-83	453	1,245,129	1,491,635
1983-84	460	1,424,072	1,409,796
1984-85	406	1,828,023	1,686,580
1985-86	128	207,762	193,139
1986-87	217	568,038	570,984
1987-88	354	2,147,571	2,383,167
1988-89	378	763,209	944,383
1989-90	435	3,223,544	2,455,490
1990-91	445	3,419,209	2,784,166
1991-92	475	1,422,159	1,353,120
1992-93	430	888,878	841,242
1993-94	214	417,670	410,989
1994-95	268	552,123	527,310
1995-96	191	3,679,892	3,302,740
1996-97	310	1,004,021	961,759
1997-98	355	908,015	776,742
1998-99	124	1,884,483	1,579,194
1999-2000	98	1,318,554	1,580,840

Blank Page

ఆనాటి గని కార్మికురాలు

సింగరేణి 'సేవా' లో కార్మిక కుటుంబస్త్రీలు